
'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 169

సోమవారం 9-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గతంకంటే ఘనంగా...
పారాలింపిక్స్‌లో భారత్‌కు 18వ స్థానం. 29 పతకాలతో ముగింపు. -14లో



మెరుగైన పెన్షన్ కావాలంటే?
విశ్రాంత జీవనానికి పక్కా ప్లానింగ్ అవసరం -15లో



పీఓకే ప్రజలారా భారత్‌లో కలవండి
కశ్మీర్‌లో అభివృద్ధిని చూసి పీఓకే ప్రజలు సైతం భారత్‌తో కలిసిపోతే బాగుంటుంది అని అనుకుంటారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
వివరాలు 6లో ▸



ఐఏఎస్ హోదా నుంచి ఊస్టింగ్
పూజా ఖేడ్కర్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సివిల్స్ రాసి దివ్యాంగుల కోటాలో తెచ్చుకున్న 'ఐఏఎస్' హోదాను కేంద్రం రద్దుచేసింది.
వివరాలు 6లో ▸



యూట్యూబ్ చూస్తూ శస్త్రచికిత్స
బిహార్‌లో నకిలీడాక్టర్ యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ బాలుడికి శస్త్రచికిత్స చేయబోయి అతని ప్రాణాలు తీశాడు.
వివరాలు 6లో ▸



నిర్భయంగా శ్వాసించండి!
దేశవ్యాప్తంగా పలు నగరాల్లో గాలి నాణ్యత మెరుగుపడుతున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలియజేసింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'ఫిరాయింపు'లపై నేడు తీర్పు



రాజీనామా చేయకుండానే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం, కడియం శ్రీహరి,తెల్లం వెంకట్రావును అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌ను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించనుంది.
- వివరాలు 3లో▶

నలిమెలకు కాళోజీ పురస్కారం



బహుభాషావేత్త, కవి, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత నలిమెల భాస్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పురస్కారం ప్రకటించింది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందజేయనుంది.
- వివరాలు 5లో▶

రేపు ముఖ్యమంత్రితో 16వ ఆర్థిక సంఘం భేటీ



రాష్ట్ర పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా నేతృత్వంలోని బృందం మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశం కానుంది.
- వివరాలు 2లో▶

దీప్తి జివాంజీకి రూ.కోటి.. గ్రూప్-2 ఉద్యోగం



పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న అథ్లెట్ దీప్తి జివాంజీకి రూ.కోటి నగదుతో పాటు గ్రూప్-2 ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థలం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.
- వివరాలు 12లో▶



మళ్లీ ముంపు!



వణికిపోతున్న మున్నేరు వరద బాధితులు

- పరీవాహక ప్రాంతాలను వదలని భారీ వర్షాలు.. ఉప్పొంగి ప్రవహిస్తున్న మున్నేరు, ఆకేరు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికార యంత్రాంగం
- ఇంకొన్ని రోజులు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలంటూ హెచ్చరికలు
- ఈనెల 1న విరుచుకుపడిన వరదతో పాలేరు, ఖమ్మం, మధిర నియోజక వర్గాల్లో విధ్వంసం
- ఉన్నదంతా ఊడ్చుకుపోవడంతో కట్టుబట్టలతో మిగిలిన బాధితులు
- తాజా వరద పరిస్థితులు, వర్షాలు కొనసాగుతాయనే హెచ్చరికలతో సర్వత్రా ఆందోళన



ఆదివారం ఖమ్మం కాల్వొడ్డు బ్రిడ్జి వద్ద మున్నేరు ప్రవాహం. (ఇన్‌సెట్లో) మున్నేరు ముంపు ప్రాంత ప్రజలను శనివారం అర్ధరాత్రి 12గంటలకు అప్రమత్తం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం

మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలను ముంపు భయం వెంటాడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలోనూ శనివారం నుంచి వర్షం కురుస్తుండడం, వర్షాలు మరో రెండురోజుల పాటు కొనసాగే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనలతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆకేరు, మున్నేరుల్లో పెరుగుతూ తగ్గుతున్న వరద కలవరపరుస్తోంది. కనీవిని ఎరుగని కుండపోత నేపథ్యంలో ఈనెల 1న మున్నేరు, ఆకేరు ఉప్పొంగి ప్రవహించిన సంగతి తెలిసిందే. అకస్మాత్తుగా విరుచుకుపడిన వరద ప్రధానంగా ఖమ్మం నగరంలోని 50 కాలనీలు, ఖమ్మం రూరల్ మండలంలోని 20 కాలనీలను ముంచెత్తి వేలాది మందిని నిరాశ్రయులను చేసింది. కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు వరద పరిస్థితులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శనివారం సాయంత్రం 8.25 అడుగులుగా ఉన్న మున్నేరు నీటిమట్టం అంతకంతకు పెరుగుతూ అర్ధరాత్రి 12 గంటలకు 14.80 అడుగులుగా
మిగతా 2వ పేజీలో ▶

రెండ్రోజులు భారీ వర్షాలు!
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- రాష్ట్రంపై వాయుగుండం ప్రభావం

2లో

ధంసలాపురంలో వరదల్లో ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి



రాకాసి తండాకు అండగా ఉంటాం

తండాను చూసి రమ్మని ప్రధాని చెప్పారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ముంపునకు గురైన పంట పొలాలు, ఇళ్లు పరిశీలన

తిరుమలాయపాలెం: ఆకేరు వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సర్వం కోల్పోవడంతో ఇక్కడ ఉండలేమంటున్న ప్రజల ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో ప్రాంతంలో ఆవాసాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాడైన భూములు మళ్లీ సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆకేరు వరదతో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో జరిగిన నష్టం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి వచ్చిందని తెలిపారు. స్వయంగా తండాను చూసి రావాల్సిందిగా ప్రధాని తనకు చెప్పారని వెల్లడించారు. ఆదివారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి రాకాసి తండాను సందర్శించారు. ముంపునకు గురైన
మిగతా 2వ పేజీలో ▶

నష్టపోయిన అందరినీ ఆదుకుంటాం

మాది ప్రజాప్రభుత్వం..ప్రజల కోసం పనిచేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

పునరావాస కేంద్రాలు, ముంపు ప్రాంతాల్లో పర్యటన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'వరదతో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం..ఎంత ఖర్చయినా పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాది ప్రజా ప్రభుత్వం... ప్రజల కోసం పనిచేస్తుంది'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో ఆయన ఖమ్మం నగరం, మధిర నియోజకవర్గాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ముంపు బాధితులతో మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సౌకర్యాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో వరదలతో నష్టపోయిన బాధితులను పరామర్శించడంతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాలు ఇంకా ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అర్ధరాత్రి ఖమ్మం చేరుకొని..

ఆకేరు, మున్నేరు వరద మళ్లీ పెరుగుతోందన్న సమాచారంతో డిప్యూటీ సీఎం భట్టి శనివారం అర్ధరాత్రి ఖమ్మం చేరుకున్నారు. కాల్వొడ్డు వద్ద ప్రజలతో మాట్లాడి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున పునరావాస కేంద్రాలకు వెళ్లాలని చెప్పారు. ఆ తర్వాత కాల్వొడ్డులో మున్నేరు బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. అక్కడి నుంచి స్వర్ణభారతి కల్యాణ మండపం, మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మం అర్బన్ మండలం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించిన భట్టి.. బాధితులతో మాట్లాడి తాగునీరు, ఆహారం, వైద్యం, మందులు అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. ఎక్కడా సౌకర్యాల కల్పనకు వెనక్కి తగ్గొద్దని, బాధితులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన వెంట వచ్చిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌ను ఆదేశించారు.

మధిర నియోజకవర్గంలో పర్యటన

మధిర నియోజకవర్గంలోని ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర మండలాల్లో డిప్యూటీ సీఎం భట్టి పర్యటించారు. వరదతో దెబ్బతిన్న
మిగతా 2వ పేజీలో ▶



ఖమ్మం స్వర్ణభారతి కల్యాణ మండపంలో పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న భట్టి

స్థల పత్రాన్ని జేఎన్‌జే సొసైటీ ప్రతినిధులకు ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలోమంత్రులు పొంగులేటి, పొన్నం, ఎంపీలు చామల, అనిల్‌కుమార్, వేంనరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దేవులపల్లి అమర్



నిజమైన పాత్రికేయులకు అండగా ఉంటాం

- అర్హులకు ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం: సీఎం రేవంత్ రెడ్డి
- జేఎన్‌జే సొసైటీకి పేట్ బషీరాబాద్‌లోని స్థలపత్రాల అప్పగింత
- దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సొసైటీకి 70 ఎకరాల భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: నిజమైన పాత్రికేయులను అగౌరవపరిచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని.. వారికి అన్నివేళలా అండగా ఉంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వ్యవస్థపై నమ్మకం పెంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి కేటాయించిన 38 ఎకరాల భూపత్రాలను ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన 'ప్రజాప్రభుత్వంలో పాత్రికేయులు' కార్యక్రమంలో
మిగతా 3వ పేజీలో ▶

రైతుల పట్ల యమపాశం

ప్రభుత్వంపై హరీశ్ ధ్వజం

- కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ నిబంధనతో రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య
- రుణమాఫీని ఎగ్గొట్టడానికే 31 సాకులు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలన అన్నదాతల పట్ల యమపాశంగా మారిందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ నయవంచనతో రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ అని తెలిసి సురేందర్ రెడ్డి మేడ్చల్‌లో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు లేఖ రాసి పెట్టి మరీ ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. రైతు రుణమాఫీ ఆంక్షలతో
మిగతా 12వ పేజీలో ▶

హైడ్రా దూకుడు

- సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో మూడు భవనాలు, ఒక గోడౌన్, 20 గుడిసెల తొలగింపు
- ఒంటిపై కిరోసిన్ పోసుకొని గుడిసెవాసుల ఆందోళన

కూల్చివేతల్లో హైడ్రా స్పీడ్ పెంచింది. ఆదివారం ఒక్కరోజే చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో చేపట్టిన నిర్మాణాలను హైడ్రా అధికారులు భారీ బందోబస్తు నడుమ తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు చోట్ల పలు భవనాలు, 10 విల్లాలు, 20 గుడిసెలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అక్కడక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



5లో

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అక్రమంగా నిర్మించిన ఇంటిని కూల్చేస్తున్న హైడ్రా అధికారులు

జనావాసాల జోలికి వెళ్లం



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టీకరణ


- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నా.. వాణిజ్యపరమైనవే కూల్చేస్తున్నాం.. నిర్మాణదశలో ఉన్న భవనాలపైనే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి
- ఆదివారం పలు అక్రమ నిర్మాణాల కూల్చివేత

- వివరాలు 5లో▶

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం 194 కి.మీ!

వికారాబాద్ జిల్లాలోకి వచ్చేలా అలైన్‌మెంట్ మార్పు

- ఎన్‌హెచ్‌ఏఐ ప్రణాళిక ప్రకారం 189.25 కిలోమీటర్లే
- రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనలో దక్షిణంతో పాటు ఉత్తర భాగం విస్తీర్ణంలోనూ పెరుగుదల



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ప్రగతిపై ఎంతో ప్రభావం చూపించే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మారుతోంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రణాళిక ప్రకారం దక్షిణ భాగం రింగ్‌రోడ్డు విస్తీర్ణం 189.25 కిలోమీటర్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రాథమికంగా రూపొందించిన ప్రతిపాదన ప్రకారం దాని విస్తీర్ణం 194 కిలోమీటర్లకు పెరిగింది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం (సంగారెడ్డి-తూప్రాన్-చౌటుప్పల్) 158 కిలోమీటర్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం 194 కిలోమీటర్ల వరకు పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాను కూడా కలుపుతూ దక్షిణ భాగం అలైన్‌మెంట్ రూపొందించినట్లు స్పష్టమవుతోంది. కొత్తగా కొన్ని గ్రామాలను కలపడం వల్ల విస్తీర్ణం పెరిగినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ కార్యక్రమం కూడా దాదాపు పూర్తయింది. త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది. కాగా దక్షిణ భాగం వైపు ఎన్‌హెచ్‌ఏఐ క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి 189.25 కిలోమీటర్ల విస్తీర్ణంలో రహదారికి సంబంధించిన మ్యాప్‌లను సిద్ధం చేసింది. వాటిని ప్రభుత్వ ఆమోదానికి పంపించాల్సిన సమయంలోనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. ఈలోపు రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భాగం ఆర్‌ఆర్‌ఆర్‌ను తామే నిర్మించుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. అంతేకాక దక్షిణ భాగం ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ పేరిట ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఏఐ రూపొందించిన అలైన్‌మెంట్‌లో పేర్కొన్న పలు గ్రామాలు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మ్యాప్ ప్రకారం రహదారి బయటకు వెళ్లగా, కొన్ని గ్రామాలు లోపలికి వచ్చాయి. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తే ఇందులో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఎడమ కాలువకు ఎన్ని తూట్లో..!

సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం చెరువు వద్ద దాదాపు 100 మీటర్ల పొడవున నాగార్జునసాగర్ ఎడమ కాలువ దెబ్బతింది. అందులో సగం వరకు కట్ట కోతకు గురైంది. భారీగా ప్రవాహం వస్తే ఎప్పుడు కట్ట తెగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ముప్పారం 30/2వ కిలోమీటర్ వద్ద 50 మీటర్ల వరకు ఎడమ కాలువ లైనింగ్ పోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు తెగిపోతుందో తెలియదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితారామచంద్రపురం వద్ద కుంగిపోయిన వెంపలబోడు తూము. అధిక ప్రవాహం వస్తే ఎప్పుడు తూము తెగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇప్పటికే మూడుచోట్ల గండి

- చాలాచోట్ల దెబ్బతిన్న సాగర్ కాలువ లైనింగ్
- 2009లో పనులు చేపట్టినా అంతటా పూర్తి చేయకుండా వదిలేసిన వైనం
- భారీగా నీరొస్తే ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి


అన్నపరెడ్డిగూడెం ఎల్12 తూము వద్ద కోతకు గురైన ఎడమ కాలువ


ముప్పారం 30/2వ కిలోమీటర్ వద్ద 50 మీటర్ల వరకు దెబ్బతిన్న లైనింగ్

నాగార్జునసాగర్ ఎడమ కాలువ దుస్థితికి ఇవి కేవలం మూడు ఉదాహరణలు మాత్రమే. నల్లగొండ నుంచి సూర్యాపేట మీదుగా ఖమ్మం జిల్లా వరకు 172 కిలోమీటర్ల పొడవున అనేక చోట్ల ఇలాంటి ప్రమాదకర పరిస్థితులే నెలకొన్నాయి. ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొంది. 2022లో నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం వద్ద ఎడమ కాలువకు గండిపడటంతో వందల ఎకరాల్లో పంటలు పాడైపోయి రైతులు నష్టాలపాలయ్యారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు 25 రోజుల పాటు నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పంటలకు నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

నిర్లక్ష్యం కారణంగానే మళ్లీ గండ్లు

ఎడమ కాలువకు నిడమనూరు వద్ద గండి పడినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం ఆ ప్రాంతంలో మాత్రమే గండిపూడ్చి వదిలేసింది. నీటిపారుదల శాఖ కాలువ పొడవునా లైనింగ్ దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలని రూ.44 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. 2009లో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.4,444 కోట్లతో ఎడమ, కుడి కాలువల ఆధునీకరణ (లైనింగ్, మరమ్మతులు) పనులు చేపట్టారు. అందులో ఎడమ కాలువ పనులను చేపట్టినా చాలావరకు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో అవి మరింతగా దెబ్బతిన్నాయి. ఈనెల 1వ తేదీన నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రంగులవంతెన వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పాలేరు వెనుక జలాల కారణంగా గండ్లు పడ్డాయి. రెండు చోట్ల 50 నుంచి 70 మీటర్ల పొడవునా కాలువ కట్ట కొట్టుకుపోయింది. పాలేరు వాగు నీటితోపాటు ఈ కాలువ నీరు కలిసి నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం, వల్లాపురం, అనంతగిరి మండలం చనుపల్లి, పాలారం, కిష్టాపురం, కొత్తగూడెం, గోండ్రియాల, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మండడి నర్సయ్యగూడెం, చీతిలితండా, రాజపేట, ఈశ్వరమాదారం గ్రామాలను నీరు ముంచెత్తింది. వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

ఎడమ కాలువ పొడవునా పలుచోట్ల లైనింగ్, కోతకు గురైన కాలువ కట్టలతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో తెలియన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. యాద్గార్‌పల్లి మేజర్ పరిధిలోని మిర్యాలగూడ మండలం ఐలాపురం, వేములపల్లి మండలంలోని అన్నపరెడ్డిగూడెం మధ్య దాదాపు 3.5 కిలోమీటర్ల పొడవునా లైనింగ్ దెబ్బతింది. నడిగూడెం మండలం రామాపురం, చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల సమీపాన కాలువ కట్టలు దెబ్బతిన్నాయి. నిడమనూరు మండలంలోని 32/2 వద్ద కాల్వ కరకట్ట లైనింగ్ పూర్తిగా తొలగిపోయి మట్టి పూర్తిగా కాల్వలోకి జారి ప్రమాదకరంగా మారింది. ముప్పారం బ్రిడ్జి వెంట లైనింగ్ పూర్తిగా ధ్వంసమై కట్ట బలహీనంగా మారింది. 30/4 కిలో మీటర్ వద్ద కాల్వ లైనింగ్ పూర్తిగా ధ్వంసమైంది. 29/6 కిలోమీటర్ వద్ద గుంటికగూడెం మేజర్ కాల్వ తూముకు ఇరువైపులా కాల్వ కట్ట లైనింగ్ పాడైపోయింది. ముకుందాపురం–దుగ్గెపల్లి బ్రిడ్జి వెంట లైనింగ్ పూర్తిగా దెబ్బతింది. గరిడేపల్లి మండలం వెలిదండ సమీపంలో ఎడమ కాలువ కట్ట దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో కాలువ నీటిని వాగులు, చెరువుల్లోకి మళ్లించే ఎస్కేప్ కెనాల్స్ (నీటిని మళ్లించేవి)ను పట్టించుకోకపోవడం, పైగా వాటిని ఓపెన్ చేయరాకుండా వెల్డింగ్ చేసి పెట్టడంతో గండ్లు పడుతున్నాయి.

క్లుప్తంగా...

నేడు సీఎం చేతులమీదుగా ఐఐహెచ్‌టీ ప్రారంభం

నేతన్నకు చేయూత కింద 36,133 మందికి రూ. 290 కోట్లు విడుదల


సాక్షి, హైదరాబాద్: చేనేత రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. అలాగే నేతన్నకు చేయూత పథకం కింద 36,133 మంది లబ్ధిదారులకు రూ. 290 కోట్లు విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఐహెచ్‌టీలో ఏటా 60 మంది విద్యార్థులు చేనేత, జౌళి సాంకేతికతలో మూడేళ్ల డిప్లొమా కోర్సును అభ్యసించడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ డిప్లొమాతో ప్రభుత్వరంగ జౌళి సంస్థలతోపాటు ప్రైవేటు టెక్స్‌టైల్, అపెరల్ ఇండస్ట్రీస్, ఫ్యాషన్ సెక్టార్‌లలో ఉత్పత్తి, క్వాలిటీ కంట్రోల్, మార్కెటింగ్ విభాగాలలో విద్యార్థులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

వరద బాధితులకు అండగా బీజేపీ

బాధితులకు ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో ఏర్పడిన వరదల్లో నష్టపోయిన వారికి బీజేపీ అండగా నిలిచింది. ఇందులో భాగంగా సిద్ధం చేసిన నిత్యావసర సరుకుల వాహనాలను శనివారం బీజేపీ శాసనసభ్యుడు పైడి రాకేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీ నాయకత్వం పర్యటించిందని, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో వరద బాధితులకు ఆహార పంపిణీ, ఇతర సహాయ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. 10 వేల మందికి నిత్యావసర సరుకులు, ఆహార పంపిణీతో పాటు ఇతర సహాయ కార్యక్రమాలు అందించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. బియ్యం, బెడ్ షీట్స్, పప్పు, చింతపండు, దుప్పట్లు ఇతరత్రా సామగ్రి నాలుగు ట్రక్కుల్లో పంపించామని చెప్పారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్లలో లేని విపత్తు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జరిగిందన్నారు. ఆ జిల్లాల్లోని బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్ దళ్, వీహెచ్‌పీ, హిందూవాహిని ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా అనేక సహాయ కార్యక్రమాలు చేపట్టి వరద బాధితులకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు.

వరద రాజకీయం చేస్తున్న ప్రభుత్వం: బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వరదను కూడా రాజకీయం చేస్తూ ఖమ్మం ప్రజలను పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి పొంగులేటిని మున్నేరు వరద బాధితులు అడ్డుకున్నారని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరించినా.. రేవంత్ పట్టించుకోలేదని, ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఖమ్మంలో పర్యటిస్తే కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడిందన్నారు.

మళ్లీ ముంపు!

▶ మొదటి పేజీ తరువాయి

నమోదైంది. ఆదివారం 15.75 అడుగులకు చేరుకుని తర్వాత కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ నేపథ్యంలోనే అధికారులు అప్రమత్తమయ్యారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, ఈనెల 1నాటి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా శనివారం రాత్రి నుంచే ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. బాధితులు కూడా ఇటీవలి భయానక పరిస్థితిని తలుచుకుంటూ బెంబేలెత్తిపోతున్నారు.

అక్కడ భారీ వర్షం.. ఇక్కడ భయం

ఖమ్మం జిల్లాకు ఎగువన మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు ఉన్నాయి. అక్కడ ఏ ప్రాంతంలో భారీ వర్షం పడినా ఆకేరు, మున్నేరు పరీవాహక ప్రాంతాలకు వరద పోటెత్తుతుంది. ఆ విధంగానే ఈ నెల 1న భారీయెత్తున వరద ముంచెత్తింది. ఖమ్మం జిల్లాలోని పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లో విధ్వంసం సృష్టించింది. వందలాది ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లలో ఉన్న నిత్యావసరాలు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, కార్లు కూడా కొట్టుకుపోయాయి. మున్నేరు పరీవాహక ప్రాంతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 16 మండలాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 మండలాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్‌లో భారీ వర్షాలు కురిస్తే ఖమ్మం జిల్లాలోని 11 మండలాలు వరద తాకిడికి గురవుతున్నాయి. ఇక ఆకేరు పరీవాహకంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 మండలాలు, ఖమ్మం జిల్లాలో రెండు మండలాలు ఉంటాయి. ఆకేరు వరద మున్నేరులోకి చేరుతుండటంతో మున్నేరు ఉధృతి మరింత తీవ్రమై ఖమ్మంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

పరీవాహక ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్

ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా ఆకేరు, మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని మండలాల్లో గత పది రోజులుగా అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. మహబూబాబాద్ జిల్లాలో గత నెల 31న, ఈనెల 1న పలు ప్రాంతాల్లో 40.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే ఖమ్మం జిల్లాలోనూ ఈ రెండు రోజుల్లో సగటు వర్షపాతం అన్ని మండలాల్లో కలిపి 20 సెం.మీ. పైగా నమోదు కావడం గమనార్హం. ఈ స్థాయి వర్షం ఈ రెండు ఏర్ల పరీవాహక ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేదని అధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయి వర్షాల నేపథ్యంలోనే వరద ఉప్పెనలా పోటెత్తి లోతట్టు ప్రాంతాల్లో తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఈ రెండు వాగుల వేగ ఉధృతి కూడా గతంతో పోలిస్తే పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగానే ఎన్ని గంటల్లో లోతట్టు ప్రాంతాలకు వరద చేరుతుందో అధికారులు కూడా అంచనా వేయలేకపోతున్నారు. ఇటీవలి వరదలతో ఖమ్మం నగరంలో రామన్నపేట, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, సారథినగర్, మామిళ్లగూడెం, బొక్కలగడ్డ, కాల్వొడ్డు, నయాబజార్, మంచికంటి నగర్, మోతీనగర్, పెద్దమ్మతల్లిగుడి రోడ్డు, ప్రకాశ్‌నగర్, ధంసలాపురం కాలనీ.. ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి, సాయిగణేష్‌నగర్, కరుణగిరి, పెద్దతండా ప్రాంతాలు, చింతకాని, ముదిగొండ, మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగింది.

నాటి వరదతో అప్రమత్తం

మున్నేరు, ఆకేరు వరదలు అధికార యంత్రాంగాన్ని షాక్‌కు గురి చేశాయి. ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. శని, ఆదివారాల్లో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య.. వరద ముప్పు ఉన్నందున ప్రజలు పునరావాస కేంద్రాల్లోనే ఇంకొన్ని రోజులు ఉండాలంటూ సూచించారు. శనివారం రాత్రి కాలనీల్లో మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. అర్ధరాత్రి ముంపు ప్రాంతాల ఇళ్లల్లో ఉన్న వారందరినీ మళ్లీ పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆ తర్వాత ఆయా కేంద్రాలను డిప్యూటీ సీఎం భట్టి పరిశీలించారు. ఆదివారం కొందరు బాధితులు పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లి శుభ్రం చేసుకుని రాత్రికి తిరిగి వచ్చారు. మరోవైపు అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగిస్తున్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున నిత్యావసరాలు, మందుల పంపిణీని వేగవంతం చేశారు.

రాకాసి తండాకు అండగా ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

పంటపొలాలు, కొట్టుకుపోయిన ఇళ్లను పరిశీలించారు. తండా వాసులతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు.

అక్విడెక్ట్‌తోనే గ్రామం నాశనం!

ఆకేరుపై నిర్మించిన సీతారామ ప్రాజెక్టు అక్విడెక్ట్‌తోనే తమ గ్రామం సర్వనాశనమైందని, పచ్చని పంటపొలాల్లో రాళ్లు, ఇసుక మేటలు వేశాయని స్థానికులు తెలిపారు. ఇక్కడ తాము ఉండే పరిస్థితి లేనందున మరోచోట స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఆదుకోవాలని వేడుకున్నారు. ఇళ్లు, ఆస్తులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తమకు దిక్కెవరంటూ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సమకూర్చిన గ్యాస్ స్టౌలు, రగ్గులను కిషన్‌రెడ్డి వారికి అందజేశారు.

జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలి: మంత్రి పొంగులేటి

రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అనేక జిల్లాలు జలమయమైనందున జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. రాకాసి తండాలో జరిగిన నష్టాన్ని ఆయన కేంద్రమంత్రికి వివరించారు. కేంద్రమంత్రులు ముంపు ప్రాంతాల్లో పర్యటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాల్సిందిగా ఇప్పటికే కిషన్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వం నివేదిక పంపలేదు: కిషన్‌రెడ్డి

ఖమ్మం వన్‌టౌన్: వరద నష్టంపై కేంద్రానికి ఏపీ ప్రభుత్వం ఇంకా నివేదిక పంపలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని వరద ముంపు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. 16వ డివిజన్ ధంసలాపురంలో వరద బాధితులను పరామర్శించి మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు సాయం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమయంలో ఓ జర్నలిస్టు ఏపీ ప్రభుత్వం నివేదిక పంపిందా అని అడగ్గా పంపలేదన్నారు.

రెండ్రోజులు భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- రాష్ట్రంపై వాయుగుండం ప్రభావం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. పశ్చిమ, మధ్య, పరిసర వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఉత్తర–వాయవ్య దిశగా కదులుతూ కళింగపట్నంకు తూర్పున 280 కిలోమీటర్ల దూరంలోని గోపాలపూర్ వద్ద కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా ఉత్తర ఒడిశా పశ్చిమ తీరం వైపు కదులుతూ బలపడి సోమవారం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ తర్వాత పశ్చిమ – వాయవ్య దిశగా కదులుతూ ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాన్ని పూరి– దిఘా మధ్యలో సోమవారం రాత్రికల్లా తీరం దాటే అవకాశం ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, ఉత్తర ప్రాంత జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, ఖమ్మం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ, ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఏడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం

నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు 62.31 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఆదివారం నాటికి 88.45 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 42 శాతం అధికంగా వర్షాలు కురిసినట్లు రాష్ట్ర ప్రణాళిక విభాగం గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్, సిద్దిపేట, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలు అత్యధిక వర్షపాతం నమోదైన జాబితాలో ఉన్నాయి. ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా మిగిలిన జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు రాష్ట్రంలో సగటు వర్షపాతం కంటే 325 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, వర్షాలతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంతో పోలిస్తే 5 డిగ్రీల సెల్సియస్ మేర తక్కువగా నమోదయ్యాయి.

నష్టపోయిన అందరినీ ఆదుకుంటాం

▶ మొదటి పేజీ తరువాయి

పంటపొలాలు, రోడ్లు, కట్టలు తెగిన చెరువులు, కూలిన ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించి ఓదార్చారు. గండ్లు పడిన చెరువులు, దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిల పునర్నిర్మాణానికి అంచనాలు వెంటనే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ఆరుగురు మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెక్కులు అందజేశారు. దెబ్బతిన్న పాఠశాలల్లో బురద తొలగించి త్వరగా పునఃప్రారంభం అయ్యేలా చూడాలని చెప్పారు.

రేపు సీఎంతో 16వ ఆర్థిక సంఘం భేటీ

డిప్యూటీ సీఎం భట్టితో కలిసి చర్చల్లో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి

- రాష్ట్రానికి కేంద్ర నిధుల పంపిణీపై కీలక సూచనలు చేసే అవకాశం
- నేడు స్థానికసంస్థల ప్రతినిధులు, వ్యాపార, రాజకీయ పార్టీలతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం బృందం ఆదివారంహైదరాబాద్ చేరుకుంది. చైర్మన్ అరవింద్ పనగరియా నేతృత్వంలోని ఈ బృందంలో అజయ్ నారాయణ్ ఝా, యానీ జార్జి మ్యాథ్యూ, మనోజ్ పాండా, డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ సభ్యులుగా ఉన్నారు. సోమవారం ఉదయం ప్రజాభవన్‌లో పట్టణ స్థానికసంస్థల ప్రతినిధులు, గ్రామీణ స్థానికసంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్/సభ్యులు, అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించనుంది. ఆ తర్వాత వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంఘాలు, సంస్థలతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో విడివిడిగా సమావేశం కానుంది. రాత్రి 8 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఈ బృందానికి విందు ఇవ్వనున్నారు.

రేపు సీఎంతో సమావేశం..

మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఆర్థిక సంఘం బృందం సమావేశం కానుంది. రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్తున్న ఆదాయంతో పోలిస్తే రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న కేటాయింపులు తక్కువగా ఉంటున్నందున వాటిని పెంచేలా కేంద్రానికి నివేదించాలంటూ 16వ ఆర్థిక సంఘానికి సీఎం విజ్ఞప్తి చేసే అవకాశం ఉంది. అభివృద్ధిలో పురోగమిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు నిధుల కేటాయింపులు పెంచితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వృద్ధి చెందుతుందని.. తద్వారా కేంద్ర, రాష్ట్రాలకు ఆదాయం పెరుగుతుందని ఆయన సూచించనున్నట్లు తెలిసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంతో పాటు 16వ ఆర్థిక సంఘం నుంచి ఆశిస్తున్న సహకారంపై ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, పురపాలక శాఖలు ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నాయి. అనంతరం ప్రజాభవన్‌లో అరవింద్ పనగరియా బృందానికి భట్టి విక్రమార్క విందు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు అరవింద్ పనగరియా బృందం మీడియా సమావేశంలో తమ పర్యటన వివరాలను వెల్లడించనుంది. 11న ఉదయం 16వ ఆర్థిక సంఘం తిరిగి వెళ్లిపోనుంది. 2025–26 నుంచి 2030–31 మధ్య కేంద్రం, రాష్ట్రాల మధ్య జరగాల్సిన నిధుల పంపకాల విషయంలో 16వ ఆర్థిక సంఘం చేయనున్న సిఫారసులు కీలకం కానున్నాయి. 2025 అక్టోబర్ 31 నాటికి నివేదిక సమర్పించాల్సి ఉండగా 2026 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. రాష్ట్రాల ఆర్థిక వనరులను అంచనా వేసి ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా ఉన్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు అదనపు నిధులను సమకూర్చడానికి తీసుకోవాల్సిన చర్యలనూ సిఫారసు చేయనుంది.

పీహెచ్‌సీని సందర్శించనున్న 16వ ఆర్థిక సంఘం

16వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ్ ఝా మంగళవారం మధ్యాహ్నం ప్రజాభవన్‌లో పురపాలక శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. 15వ ఆర్థిక సంఘం కింద జీహెచ్‌ఎంసీకి మంజూరైన నిధుల వినియోగంపై సంస్థ అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత ఆయన మధ్యాహ్నం 3 గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనంతారం గ్రామాన్ని సందర్శించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పనితీరును, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య రంగానికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగాన్ని పరిశీలించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు.

8 శాఖలు.. రూ.339.46 కోట్లు

ఖమ్మం జిల్లాలో వరద నష్టంపై ప్రాథమిక అంచనా

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలతో ఎనిమిది శాఖల పరిధిలో ప్రధానంగా నష్టం ఎదురైందని అధికార యంత్రాంగం గుర్తించింది. ఆయా శాఖల పరిధిలో రూ. 339.46 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసింది. మొత్తంగా 15,201 ఇళ్లు దెబ్బతినగా అందులో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ. 6,500, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ. 8 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని లెక్కగట్టింది. రెవెన్యూ, పశుసంవర్థక శాఖ, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ, మత్స్య శాఖల పరిధిలో నష్టంపై ప్రభుత్వానికి యంత్రాంగం నివేదిక పంపింది. ముఖ్యంగా 53,528 మంది రైతులకు సంబంధించి 79,914 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల రూ. 111.87 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా వరదలతో 76 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయని ప్రభుత్వానికి నివేదించారు. అలాగే 45 చెరువులకు గండ్లు పడ్డాయని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారంపై బాధితులు మండిపడుతున్నారు. వరద ఉధృతికి ఇళ్లు కొట్టుకుపోయిన తమకు ప్రభుత్వం అరకొర సాయం చేస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు.

వరద సహాయక చర్యల్లో ప్రైవేటు సంస్థలు భాగస్వాములు కావాలి: మంత్రి శ్రీధర్‌బాబు

హైసియా, నిర్మాణ డాట్ ఆర్గ్ ఆధ్వర్యంలో సామగ్రి అందజేత


వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వం వరద బాధితుల కోసం చేపట్టిన సహాయ, పునరావాస కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీల సంఘం(హైసియా), నిర్మాణ డాట్ ఆర్గ్ ముందుకొచ్చి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల వరద బాధితుల కోసం రూ.కోటి విలువైన సామగ్రిని అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌లతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం సచివాలయంలో వెయ్యి సంచులతో కూడిన సామగ్రిని తరలిస్తున్న తొలి వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెండ్ల, మాజీ అధ్యక్షుడు భరణి కుమార్, నిర్మాణ, ఐఎస్‌బీ, తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల 2 నెలల వేతనం

సాక్షి, హైదరాబాద్: భారీ వరదలతో అతలాకుతలమై సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారులు తమ రెండు నెలల వేతనాన్ని వరద బాధితులకు విరాళంగా ఇవ్వనున్నట్లు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని ఆదివారం సచివాలయంలో తనను కలసిన మీడియా ప్రతినిధులకు వెల్లడించారు.

విరాళాల వెల్లువ


సీఎంకు రూ. 5 కోట్ల చెక్కు ఇస్తున్న రవి రహేజా


సీఎం రేవంత్‌కు రూ. 5 కోట్ల చెక్కు అందిస్తున్న జీవీకే రెడ్డి

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి/ఇబ్రహీంపట్నంరూరల్: భారీవర్షాలు, వరదల నేపథ్యంలో సహాయక చర్యలకు చేయూత అందించడానికి పలువురు వ్యాపార, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు సీఎం సహాయ నిధికి విరాళాలు అందజేస్తున్నారు.


సీఎంకు చెక్కు ఇస్తున్న ఎన్‌సీసీ ఎండీ రంగరాజు, డైరెక్టర్ సూర్య


సీఎంకు చెక్కు ఇస్తున్న కేఎన్‌ఆర్ ఎండీ నరసింహారెడ్డి, ఈడీ జలంధర్‌రెడ్డి

రహేజా, జీవీకే, కేఎన్‌ఆర్, ఎన్‌సీసీ, క్రెడాయ్‌ల వితరణ

ప్రముఖ వ్యాపారవేత్తలు రవి రహేజా రూ.5 కోట్లు, జీవీకే.రెడ్డి రూ.5కోట్లు, కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ కంపెనీ ఎండీ నరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డి రూ.2 కోట్లు, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ రంగరాజు, డైరెక్టర్ సూర్య రూ.కోటి, క్రెడాయ్ ప్రతినిధులు రూ.కోటి జూబ్లీ హిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు.


సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

టీజీఎఫ్‌డీసీ విరాళం రూ.2 కోట్లు

సీఎం సహాయనిధికి విరాళంగా రూ.2 కోట్ల చెక్కును సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు టీజీఎఫ్‌డీసీ చైర్మన్ పోదెం వీరయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్, జనరల్ మేనేజర్ డాక్టర్ స్కైలాబ్, డీఎఫ్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు విట్ రూ. 3 కోట్లు

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా రూ. 3 కోట్లు అందజేసింది. విజయవాడలో ఏపీ సీఎం చంద్రబాబుకు విట్ వ్యవస్థాపకుడు, వీసీ డాక్టర్ జి.విశ్వనాథన్ రూ.1.57 కోట్ల డీడీ అందజేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి రూ.1.50 కోట్ల డీడీని అందించారు. ఈ కార్యక్రమంలో విట్ ఉపాధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.


సీఎంకు డీడీ అందిస్తున్న విట్ వీసీ విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు శంకర్

చిన్న పిల్లల పెద్ద మనసు: చిన్నారులకు పెద్ద ఆలోచన వచ్చింది. అమ్మానాన్నలు ఇచ్చిన పాకెట్‌మనీని సీఎం సహాయ నిధికి ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు రూ.2,722 హెచ్ఎం పరమేష్‌కు అందజేశారు. ఆయన సీఎంఆర్‌ఎఫ్ నిధిలో జమ చేశారు.



ఖైరతాబాద్ మహాగణపతికి సీఎం పూజలు

గతేడాది పార్టీ అధ్యక్ష హోదాలో.. ఈసారి సీఎం హోదాలో దర్శించుకున్నా: రేవంత్

ఖైరతాబాద్/సాక్షి, హైదరాబాద్: ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా దర్శించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి సీఎం రేవంత్ తొలి పూజలు నిర్వహించారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ రాష్ట్రం పాడిపంటలతో కళకళలాడాలని.. ప్రశాంత వాతావరణం నెలకొనాలని వినాయకుడిని పూజించినట్లు చెప్పారు. గత సంవత్సరం పార్టీ అధ్యక్షుడి హోదాలో మహాగణపతిని దర్శించుకుంటే ఈ సంవత్సరం ముఖ్యమంత్రి హోదాలో మహాగణపతిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వినాయక పూజలో సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కుటుంబ సభ్యులతోపాటు నూతన టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ దంపతులు పాల్గొన్నారు. మరోవైపు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఖైరతాబాద్ గణేశుని శనివారం మధ్యాహ్నం దర్శించుకొని పూజలు చేశారు.

గత సర్కార్ 20.84 లక్షల మందికి మాఫీ ఎగ్గొట్టింది

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పాలనలో రుణమాఫీ, వడ్డీ రాయితీపై మాట్లాడే ధైర్యం ఆ పార్టీ నేతలకు లేకపోయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విమర్శించారు. రాష్ట్రానికి, రైతాంగానికి ద్రోహం చేసిందెవరో... రుణమాఫీ పేరుతో వంచన చేసిందెవరో ప్రజలకు తెలుసని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో రుణమాఫీ అమలుకు కూడా కుటుంబమే యూనిట్‌గా అమలు చేశారని... కుటుంబ నిర్ధారణకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకున్నారని.. అందులోనూ 20.84 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టారని మంత్రి ఆరోపించారు. రుణమాఫీలో తర్వాత 2.26 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 1,419 కోట్లు ప్రభుత్వ ఖజానాకు తిరిగి వచ్చినా వాటిని రైతులకు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతుభరోసాపై స్పష్టమైన విధానంతో ముందుకెళ్తుందన్నారు. గత ప్రభుత్వం నాలుగు వాయిదాల్లో అరకొరగా రుణమాఫీ చేస్తే తమ ప్రభుత్వం కేవలం ఏకమొత్తంగా రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందని చెప్పారు. ఆగస్టు 15కల్లా ఇచ్చిన మాట ప్రకారం సరైన వివరాలు ఉన్న రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేశామని తుమ్మల పేర్కొన్నారు.

అసెంబ్లీలో కీలక కమిటీల ప్రకటనపై జాప్యమెందుకు?

మీడియా చిట్ చాట్‌లో హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గత అసెంబ్లీ సమావేశాల్లోనే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ, అంచనాల కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయినా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం లేదని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగిసి 38 రోజులు అవుతున్నా ఈ కమిటీలపై ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేత వేణుగోపాల్ పీఏసీ చైర్మన్‌గా ఉన్నారని, అక్కడ ఒక రూల్.. తెలంగాణలో మరో రూలా? అని అడిగారు. రాజ్యాంగం చేతిలో పట్టుకుని రాహుల్‌గాంధీ తిరుగుతున్నారని, మరి ఆ రాజ్యాంగం తెలంగాణకు వర్తించదా? అని హరీశ్ ప్రశ్నించారు. మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి పేరు ఇచ్చి 40 రోజులు అవుతోందని, దానిపై కూడా నిర్ణయం తీసుకోలేదన్నారు. విద్యావంతుడైన శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ, అంచనాల కమిటీ, మండలిలో ప్రతిపక్ష నేత నియామకాలపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాహుల్ గాంధీకి ఈ విషయమై ట్వీట్ కూడా చేస్తానన్నారు.

‘సాక్షి’కి సలాం..

సర్వం కోల్పోయిన రాకాసితండా వాసులపై వరుస కథనాలు

కదిలొచ్చి అండగా నిలుస్తున్న దాతలు.. ‘సాక్షి’కి బాధితుల కృతజ్ఞతలు

తిరుమలాయపాలెం: ఆకేరు వరదతో సర్వం కోల్పోయిన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండా ప్రజల కష్టాలపై ‘సాక్షి’లో వచ్చిన కథనాలతో పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ప్రజలు కదలివస్తున్నారు. బాధితులకు వస్తువులు, దుస్తులు, నిత్యావసరాలు, ఆహారం అందిస్తూ ఔదార్యం చాటుకుంటున్నారు. ఈ నెల 3న ‘ముంచిన రాకాసి అలలు’ శీర్షికన జిల్లా ఎడిషన్‌లో, ‘భూమి రాళ్లపాలు.. బతుకు రోడ్డుపాలు’ శీర్షికన ఈ నెల 6న సాక్షి ప్రధాన సంచికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ట్రస్ట్‌లు, ప్రజలు, సేవా సంస్థలు, ఉద్యోగులు వంట సామగ్రి, బియ్యం, బట్టలు, ఆహారం, పండ్లు, బ్రెడ్లు ఇతర సాయం అందజేస్తున్నారు. ‘సాక్షి’లో తమ ఆవేదనను ప్రచురించడంతోనే నష్టం బాహ్య ప్రపంచానికి తెలిసిందని.. తద్వారా దాతలు చేయూతనివ్వడమే కాక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు వచ్చారని పలువురు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



దుప్పట్లు పంపిణీ చేసిన ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి కృషి అభినందనీయం ...



వరదలతో ఇళ్లు, వస్తువులు, పంట పొలాలు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన మా గ్రామస్తుల కష్టాలను ‘సాక్షి’పత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. మా ఇక్కట్లను ఈ కథనాలు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లగలిగాయి. దీంతో చాలా మంది మా గ్రామానికి వచ్చి సాయం చేస్తున్నారు. – గుగులోత్ మోహన్, రాకాసితండా

‘సాక్షి’ ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్నా..



ఆకేరు వరద ప్రభావంతో సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజల కష్టాలను ‘సాక్షి’పేపర్‌లో చూశా. కట్టుబట్టలతో మిగిలి కళ్లెదుటే పంటలు కొట్టుకుపోయి నష్టపోయిన ప్రజలకు సాయం చేయాలని భావించా. అందుకే నా తండ్రి మదార్ సాహెబ్ పేరిట ఉన్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. లక్ష విలువైన దుప్పట్లు, లుంగీలు, టవళ్లు అందించా. ఇక్కడి ప్రజలకు ఎంత చేసినా తక్కువే.
– సయ్యద్ ఇమామ్, మదార్ సాహెబ్ ట్రస్ట్ చైర్మన్

కష్టాలు తెలుసుకొని ఆహారం అందిస్తున్నాం..



వరదల కారణంగా కట్టుబట్టలతో మిగిలిన రాకాసి తండా వాసుల కష్టాలు ‘సాక్షి’పత్రికలో వస్తున్న కథనాలతో తెలిశాయి. బాధితులకు సాయపడాలనే ఉద్దేశంతో గ్రామస్తులకు రెండు పూటలా ఆహారం అందించాం. నలుగురికి అన్నంపెట్టే రైతన్న నేడు సర్వం కోల్పోయిన పరిస్థితులు నా హృదయాన్ని కలిచివేశాయి.
– పైళ్ల సోమిరెడ్డి, లక్ష్మీసాయి స్టోన్ క్రషర్స్

నిజమైన పాత్రికేయులకు అండగా ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

సొసైటీకి సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జేఎన్‌జే సొసైటీలో సభ్యులు కాని ఇతర జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో న్యాయం చేస్తామని చెప్పారు. ఈ సిటీ నిర్మాణంలో పాత్రికేయులు భాగస్వామ్యం కావాలని కోరారు. మీడియా అకాడమీకి ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రకటించారు.

పాత్రికేయులకు స్వేచ్ఛ

యాజమాన్యాల విధానాలు ఏ విధంగా ఉన్నా, పత్రికల్లో పనిచేసే పాత్రికేయులను అర్థం చేసుకొని, వారికి సంక్షేమం అందించడంలో ముందుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గతంలో అసెంబ్లీ సమావేశాల కవరేజీకి అనేక ఆంక్షలుండేవని, తమ ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని తెలిపారు. ఈ మార్పు సమాజానికి నష్టాన్ని, తమకు కష్టాన్ని తెచ్చేలా ఉండకూడదన్నారు. పత్రికా సమావేశాల్లో ఆ ట్యూబ్... ఈ ట్యూబ్ అంటూ నిజమైన పాత్రికేయులకన్నా వారే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు. ఏమన్నా అంటే పత్రికలపై దాడి అని అల్లరి చేస్తున్నారని, వారు ఏం అడుగుతారో.. ఏం చెప్పాలో తెలియడం లేదన్నారు. ఎవరిని జర్నలిస్టుగా చూడాలో పాత్రికేయులే చెప్పాలన్నారు. పాత్రికేయుల ఆరోగ్య భద్రత కార్డులు, అక్రిడిటేషన్ ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కొత్త విధానాలు రూపొందించాలని మీడియా అకాడమీని సీఎం ఆదేశించారు. కొంతమంది పాత్రికేయులు విలువల్లేకుండా రాజకీయ పార్టీల యజమానులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని, భాష విషయంలోనూ కొన్ని పత్రికలు గీత దాటుతున్నాయని, ముఖ్యమంత్రి హోదానూ అవమానపరిచేలా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం నడుపుతున్న పత్రికల పోకడలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. ఉన్మాద ధోరణితో వెళుతున్నాయని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బాధ్యతను పాత్రికేయులే తీసుకోవాలని కోరారు. పాత్రికేయుల ఇళ్ల స్థలాల అప్పగింత విషయంలో ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ విలేకరులకు కూడా స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం మృతి చెందిన పాత్రికేయుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం సీఎం రేవంత్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, జేఎన్‌జే నాయకులు కిరణ్‌కుమార్, రవికాంత్‌రెడ్డి, వంశీ శ్రీనివాస్, రమణారావు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే..

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీకి ఇళ్ల స్థలాల కోసం 70 ఎకరాల భూమిని కేటాయించారు. 2008 మార్చి 25న నిజాంపేట్‌లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాలను జర్నలిస్టుల ఇళ్ల కోసం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. సొసైటీ ఏర్పాటైనప్పుడు మొత్తం 1105 మంది సభ్యులుగా ఉన్నారు. ఇదివరకే నిజాంపేటలోని 32 ఎకరాల స్థలం సొసైటీ ఆధీనంలో ఉండగా.. పేట్ బషీరాబాద్ స్థలానికి సంబంధించి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పగింత పత్రాలు అందజేశారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ స్థలాన్ని కేటాయించడం వల్లనే.. ఇప్పుడు తమకు స్థలాలు వచ్చాయన్న ఆనందాన్ని సమావేశానికి వచ్చిన జర్నలిస్టులు వ్యక్తం చేశారు. వైఎస్ మంచి మనసుతో స్థలాలు కేటాయించినా.. కొందరు జర్నలిస్టుల కారణంగా కోర్టు కేసులతో ఇంత కాలం జాప్యం జరిగిందని వారు వ్యాఖ్యానించారు.

పలువురు ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీవీ ఆనంద్

విజిలెన్స్‌కు కొత్తకోట శ్రీనివాసరెడ్డి.. ఏసీబీ డీజీగా విజయ్‌కుమార్



సీవీ ఆనంద్



శ్రీనివాసరెడ్డి



విజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న సీవీ. ఆనంద్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. సీవీ.ఆనంద్ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సైతం నగర పోలీసు కమిషనర్‌గా వ్యవహరించగా, మళ్లీ అదే పోస్టుకు బదిలీపై రావడం విశేషం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా వచ్చిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఏడాది కూడా కాకముందే బదిలీ అయ్యారు. ఆయన్ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. ఇక పోలీస్‌శాఖ అదనపు డీజీ(పర్సనల్) విజయ్‌కుమార్ ఏసీబీ డీజీగా బదిలీ అయ్యారు. అదనపు డీజీ(ఎల్‌అండ్‌ఓ) మహేష్.ఎం.భగవత్‌కు అదనపు డీజీ(పర్సనల్ అండ్ వెల్ఫేర్)గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. డీజీపీ కార్యాలయంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ఐజీగా ఉన్న ఎం.రమేశ్‌కు ఐజీ (క్రీడలు) పోస్టును అదనంగా కేటాయించారు.

‘ఫిరాయింపు’లపై హైకోర్టు తీర్పు నేడు

దానం, కడియం, తెల్లం పార్టీ మార్పుపై దాఖలైన పిటిషన్లు



సాక్షి, హైదరాబాద్: పదవులకు రాజీనామా చేయకుండానే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావును అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌ను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించనుంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డితోపాటు బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. న్యాయస్థానాలు, స్పీకర్.. రాజ్యాంగ అంశాల నేపథ్యంలో ఇరుపక్షాల నుంచి సుదీర్ఘ వాదనలు విన్నారు.

టెన్షన్.. టెన్షన్...

హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో టెన్షన్ నెలకొంది. వాస్తవానికి ముగ్గురి ఎన్నికను మాత్రమే సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలైనా భవిష్యత్తులో ఈ తీర్పు తమకు కూడా వర్తించే అవకాశం లేకపోలేదని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఒకవేళ స్పీకర్ లేదా స్పీకర్ కార్యాలయానికి గడువు నిర్దేశిస్తూ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశిస్తే తమ భవిష్యత్ ఏమిటనే చర్చ వారిలో నడుస్తోంది. మరోవైపు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన ‘పిల్’పై సీజే ధర్మాసనం స్పందించింది. ‘ఎమ్మెల్యేల ఫిరాయింపునకు సంబంధించిన మూడు పిటిషన్లపై సింగిల్ జడ్జి వద్ద తీర్పు రిజర్వ్ అయినందున ఈ దశలో జోక్యం చేసుకోలేం. ఆ తీర్పు వచ్చాక దాన్ని ప్రస్తావించే స్వేచ్ఛను పిటిషనర్‌కు ఇస్తున్నాం’అని స్పష్టం చేసింది.

త్యాగాలు చేసిన చరిత్ర బీజేపీదే

- ఉగ్రవాదులు, తీవ్రవాదుల చేతుల్లో బలైంది బీజేపీ నేతలే
- ప్రధాని, జాతీయ అధ్యక్షుడు కూడా సభ్యత్వం తీసుకుంటారు
- సభ్యత నమోదు ప్రారంభ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాంచందర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన చరిత్ర భారతీయ జనతా పార్టీదని..ఉగ్రవాదులు, తీవ్రవాదుల చేతిలో ఎంతోమంది బీజేపీ నేతలు ప్రాణాలు కోల్పోయారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం బేగంపేటలోని ఓ హోటల్‌లో బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో క్రమం తప్పకుండా నిబద్ధతతో సభ్యత్వ నమోదు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని చెప్పారు. ప్రధాని మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా మొదలు పోలింగ్‌బూత్ ఏజెంట్ వరకు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి మూడేళ్లకోసారి ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ కమిటీల పునర్నిర్మాణం జరుపుకుంటున్నామని చెప్పారు. నాడు రెండు సీట్లు గెలిచిన పార్టీ.. ఇవాళ దేశంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిందని, కార్యకర్తల త్యాగం, ప్రజల ఆశీర్వాదం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వం కోసం కనీసం 100 మందితో సభ్యత్వం చేయించాలని, సభ్యత్వ సేకరణను నిర్దేశిత షెడ్యూల్ లోపు పూర్తిచేయాలన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని అన్ని ప్రాంతాల్లో మరింత విస్తరించేలా, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా, పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా సభ్యత్వ నమోదు ప్రక్రియ రెండు విడతలుగా చేపడుతున్నట్టు తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చాలన్నది ప్రధాని నరేంద్రమోదీ సంకల్పమని చెప్పారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అరవింద్‌మీనన్ మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంతగా నియమాలకు అనుగుణంగా బీజేపీ ముందుకెళ్తుందన్నారు. సభ్యత్వ నమోదు అనంతరం పార్టీ కమిటీలను పునర్నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇందులో ఏ ఒక్క వ్యక్తిని కూడా మభ్యపెట్టే ప్రసక్తే లేదని, బీజేపీలో సభ్యులుగా చేరేందుకు ఏ ఒక్కరికి కూడా ఆశపెట్టే ఆలోచన లేదన్నారు.

భద్రత ఎలా ఉందో కళ్లు తెరిచి చూడు రాహుల్: కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై రోజుకో అఘాయిత్యం జరుగుతోందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల భద్రత అంటూ నిత్యం మొసలికన్నీరు కార్చే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇప్పటికైనా కళ్లు తెరిచి చూడాలన్నారు. ఈ ఏడాది జూన్ 13న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్లులో ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశారని, జూన్ 22న నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక గిరిజన మహిళను వారం రోజులపాటు చిత్రహింసలకు గురిచేసి, కళ్లు ప్రైవేట్ భాగాలలో కారం పొడి చల్లారన్నారు. జూలై 21న నాగర్‌కర్నూల్ జిల్లా హాజీపూర్‌లో ఇద్దరు మహిళా కూలీలపై షాపు యజమానులు కారులో లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, జూలై 24న మలక్‌పేట అంధుల పాఠశాలలో 8 ఏళ్ల చూపులేని బాలికపై దాడి జరిగిందని, జూలై 30న నిర్మల్‌కు చెందిన ఓ ప్రయాణికురాలు కదులుతున్న బస్సులో అత్యాచారానికి గురైందని, జూలై 30న వనస్థలిపురంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై ఇద్దరు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఆగస్టు 4న దొంగతనం ఆరోపణతో దళిత మహిళను షాద్‌నగర్ పోలీసులు హింసించారని, ఆగస్టు 22న నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ మద్దతుదారులు దాడి చేశారన్నారు. ఇన్ని జరుగుతున్నా రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించట్లేదన్నారు.

ఓ అవ్వ వ్యథ!

పదేళ్లుగా మరుగుదొడ్డిలోనే జీవనం



మరుగుదొడ్డి ముందు ఇంటి పనులు చేసుకుంటున్న మల్లమ్మ



మరుగుదొడ్డిలోనే సామాన్లతో ఇలా..

పరిగి: సంక్షేమ పథకాలు పేదలకు అందని ద్రాక్షలుగానే ఉంటున్నాయి. పేదలకు ఇళ్లిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. తాను నివసించే గుడిసె కూలిపోవడం, మళ్లీ నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో మరుగుదొడ్డిలోనే జీవనం సాగిస్తున్న ఓ అవ్వ వ్యథ ఇది. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని చిగురాల్‌పల్లికి చెందిన ఎర్రోళ్ల మల్లమ్మ ఇల్లు లేకపోవడంతో స్వచ్ఛభారత్ మిషన్ కింద నిర్మించుకున్న మరుగుదొడ్డిలోనే నివాసం ఉంటోంది. ఇద్దరు కూతుళ్ల వివాహం చేసిన మల్లమ్మ భర్త 20 ఏళ్ల క్రితమే చనిపోయాడు. శిథిలావస్థకు చేరిన వారి ఇల్లు భారీ వర్షాల కారణంగా 15 ఏళ్ల క్రితం కూలిపోయింది. కొన్నేళ్ల క్రితం ఇద్దరు కూతుళ్ల భర్తలు చనిపోవడంతో కొంతకాలం వారు తల్లితో పాటు టాయిలెట్ నీడలోనే ఉన్నారు. ప్రస్తుతం వారిద్దరూ పొట్ట చేతబట్టుకుని నగరానికి వలస వెళ్లడంతో మల్లమ్మ ఒక్కతే ఉంటోంది. అప్పటి ప్రభుత్వం ఆమెకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పడంతో...ఇప్పుడూ ఆశతో ఎదురు చూస్తోంది. బాత్‌రూం సైతం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతోంది.



సీఎంను కలిసిన కొత్త టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్ కుమార్‌గౌడ్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కోదండరెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులుగా నియమితులైన నిరంజన్, జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి తదితరులు కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

బీసీలకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నాం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ గౌడ్ నియామకం పట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం మహేశ్‌కుమార్‌ను బీసీ సంఘాల నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ మొదటి నుంచి రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న బీసీలకే పీసీసీ పీఠం ఇవ్వాలని తాము చేసిన పోరాటం ఫలించిందని, బీసీలకు పీసీసీ పీఠం కట్టబెట్టడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీల ఆకాంక్షలను గౌరవించి పీసీసీ పీఠం ఇచ్చి బీసీలను గౌరవించినట్లుగా భావిస్తున్నామన్నారు. ఇందుకు బీసీ సమాజం తరఫున రాహుల్ గాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జాజుల ధన్యవాదాలు తెలిపారు. సామాన్య బీసీ కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా పీసీసీ స్థాయికి ఎదిగిన మహేశ్‌కుమార్‌కు రాష్ట్రంలోని బీసీల తరఫున అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్‌యాదవ్, నాయకులు వెంకన్న, ఎలికట్టు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానించిన సర్పంచుల జేఏసీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా (పీసీసీ) నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఘనంగా సన్మానించింది. జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొధాని భూమన్న యాదవ్ తదితరులు ఆదివారం మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. రాష్ట్రంలో సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి ఖర్చు చేశారని, ప్రస్తుతం వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వాన్ని ఒప్పించి పెండింగ్ బిల్లులు ఇప్పించాలని ఈ సందర్భంగా కోరారు.

సామాజిక కూర్పులో భాగమే మహేశ్‌కు పదవి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి అవకాశాలు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం మరోసారి నిరూపించిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సామాజిక కూర్పులో భాగంగానే బీసీ వర్గానికి చెందిన మహేశ్‌కు అధ్యక్ష పదవి లభించిందన్నారు. రెడ్డి సీఎం, ఎస్సీ డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌గా బీసీ నియామకాలు జరిగాయని, మూడు ప్రధాన పదవుల్లో మూడు కులాల వారున్నారని పేర్కొన్నారు. తనకు పీసీసీ కావాలనే ఆలోచన మారదని, స్వేచ్ఛగా చెప్పుకునే వెసులుబాటు కాంగ్రెస్‌లోనే ఉందన్నారు. పీసీసీ చీఫ్ కోసం బీసీలో మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ పేర్లు పరిశీలనకు వచ్చాయని, ఎస్సీ నుంచి సంపత్, ఎస్టీ నుంచి బలరాం నాయక్ పేర్లు పరిశీలించారని జగ్గారెడ్డి తెలిపారు.



ఇతరుల అంచనాలకు తగినట్టుగా జీవించే బాధ్యత నా మీద లేదు.
అది వారి తప్పు, నా వైఫల్యం కాదు.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 9 సెప్టెంబర్ 2024

జగమంతా దగా చేసినా

పెద్దగా ఏమీ మార్పు ఉండదు. తెల్లవారి టీకొట్టు దగ్గర పెద్దమనిషి ఎప్పటిలాగే న్యూస్‌పేపర్‌ని మడతపెట్టి చదువుతుంటాడు. పిల్లల్ని తీసుకెళ్లే స్కూల్‌బస్ వారిని గోలగోలగా మోసుకెళుతూ ఉంటుంది. సూర్యుడు ప్రసరింప చేస్తున్న ఎండ జామచెట్టుపై పడి కింద నీడను పరుస్తూ ఉంటుంది. చెరువులో నీళ్లు అదే నిమ్మళంతో ఉంటాయి. లీవులున్నా పెట్టలేని ఉద్యోగాల హాజరీకి అందరూ తయారవుతూ ఉంటారు. వారికై వంటగదుల్లో సాగే ఇల్లాళ్ల హడావిడి ఏమీ మారదు. ఢిల్లీలో తెల్లవారుతుంది. ముంబైలో తెల్లవారుతుంది. పాలకులు పట్టు పరుపుల మీద నుంచి లేచి పనుల్లో పడతారు. సకల మానవ జీవన వ్యాపారాలకు చీమైనా కుట్టదు. కబురు తెలిసిన కొందరు ఆత్మీయులు కూడా 'తొందరగా టిఫెను పెట్టు. తినేసి వెళతాను' అనే బయలుదేరుతారు. మీరు ఆత్మహత్య చేసుకుని మరణించారు. అది మీకూ మీ ఇంటికీ. మిగిలిన లోకానికి ఏంటట?

ఆత్మహత్య చేసుకుని మరణించిన రైతుకు ఏ శిక్షా విధించలేక 'పోయి నీ కుటుంబం ఎలా ఉందో చూసిరా' అని పంపిస్తాడు దేవుడు– అదే శిక్షగా. చేసిన అప్పుకు ఎడ్లు జమ అయితే పొలంలో భార్యే ఎద్దులా కష్టపడుతూ ఉంటుంది. బడికెళ్లాల్సిన కూతురు తల్లికి సాయం చేస్తూ 'మా... అందుకే నిన్ను నాన్న తిడతాండె. చూడు... పడిన చోట నాలుగైదు ఇత్తనాలు పడినాయి. లేనిచోట్ల లేనే లేవు. ఇట్లేనా ఇత్తనమేసేది' అని తండ్రిని తలుచుకుంటూ ఆరిందాలా గద్దిస్తూ ఉంటుంది. భర్త గుర్తొచ్చిన తల్లి బోరుమని పొలంలో కూలబడుతుంది. గాలిరూపంలో ఉన్న రైతు అది చూసి ఎంత లబలబలాడినా ఏమొస్తుంది– ప్రాణమే వదులుకొని వచ్చేసినాక. బండి నారాయణ స్వామి కథ 'రంకె' ఇది.

మొన్న హైదరాబాద్‌లో ఒక తండ్రి– చిన్న టీకొట్టు నడుపుకునే తండ్రి– స్కూలుకెళ్లకుండా హఠం చేస్తున్న పిల్లల్ని కొట్టి, ఎందుకు కొట్టానా అని తీవ్రమైన కలతతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడా పిల్లలకు స్కూలుకు వెళ్లమని చెప్పే తండ్రి లేడు. స్కూల్ ఫీజు కట్టే తండ్రి లేడు. ఏ రాత్రో కొట్టు కట్టేసి ఇల్లు చేరి నిద్రపోతున్న పిల్లల్ని చూసి భార్యతో 'నిద్రపోయారా పిల్లలూ' అనడుగుతూ ప్రేమగా వారి తలను నిమిరే తండ్రి లేడు. ఖాళీ టీకొట్టు ఉంది. దాని ముందు ట్రాఫిక్కు ఏమెరగనట్టుగా ఉంది. ఇరుగు పొరుగు షాపులలో బేరాలు యథావిధిగా జరుగుతూనే ఉన్నాయి. అతడు లేడు. అతనికీ– ఇంటికీ.

మృత్యువుకు మోహగుణం ఉంటుంది. 'నా పరిష్వంగంలోకిరా విముక్తి సుఖం ఇస్తాను' అని పిలుస్తూ ఉంటుంది. అందుకోసం అది సముద్రంలోని నీలి కెరటాలకు మరింత నీలిమ ఇస్తుంది. నది ప్రవాహానికి మరింత చిక్కదనం ఇస్తుంది. దూకే వరకు బావినీళ్లను మెరుపు అద్దంలా మారుస్తుంది. పురుగుల మందుకు ఎంత రుచి ఇస్తుందో. ధగధగమని మండే మంటకు మంచుకంటే చల్లనైన గుణం ఉంటుందనే ప్రలోభం కలిగిస్తుంది. ఒక్క మృత్యువు. వేయి ఆకర్షణలు. కాని జీవితానికి వేయిన్నొక్కటి. ఆ ఒక్కటికై బతకాలి.

'మృత్యువా... నీవొక అందమైన కవితా పంక్తివి. నిను కలుస్తాననే వాగ్దానాన్ని మరువను' అంటాడు 'ఆనంద్' సినిమాలో రాజేష్ ఖన్నా. జీవితం అంటే ఏమిటి? చనిపోవడానికి ముందు దొరికే కాసింత సమయం. కేన్సర్ డయాగ్నసిస్ అయ్యి రెండు మూడు నెలల్లో పోతానని తెలిశాక ఆనంద్ ప్రతి నిమిషం జీవించడానికి ఉబలాటపడతాడు. తెలిసినవారినీ తెలియనివారినీ తన అభిమానంలో ముంచెత్తుతాడు. బతికేది కాసిన్ని రోజులే అయినా గాఢంగా ఎన్నటికీ మరువనంతగా ముద్రలేసి వెళతాడు. చావు ఎప్పుడో తెలిసిన అతడే, జబ్బు మనిషి అతడే అలా బతికితే ఇవాళ్టికి అంతా బాగున్న మనం ఎలా బతకాలి?

అవునండీ. భార్యాభర్తల మధ్య కీచులాటలు వస్తాయి. డబ్బుల కటాకటీ ఉంటుంది. బాస్ నరకం చూపుతుంటాడు. స్నేహితులు ద్రోహం చేస్తారు. బంధువులు వంచిస్తారు. సొంత తోబుట్టువులు ఊహించని నొప్పి కలిగిస్తారు. అనారోగ్యాలు ఉంటాయి. పంటల్లో నష్టం వస్తుంది. అయితే? చనిపోవడమేనా? ఇవాళ్టిని ఇవాళ్టితో ముగించడమేనా? ఎవరు ఇచ్చారు ఈ హక్కు? ఎవరి ఆమోదంతో తీసుకున్నారు ఈ నిర్ణయం? 'ఆత్మహత్య మహాపాతకం' అంది హిందూ ధర్మం. 'ఏ ఆయుధంతో ఆత్మహత్య చేసుకున్నాడో అదే ఆయుధంతో పైన దండింపబడతాడు' అంది ఇస్లాం ధర్మం. బతికి ఉండగా బతకడానికి చేసిన అన్ని తప్పొప్పులకైనా కన్సిడరేషన్ ఉందిగాని ఆత్మహత్య చేసుకుంటే నేరుగా నరకానికే. చచ్చాక సుఖపడదామనుకునే వారికి పైన ఎన్ని చచ్చే చావులు ఉన్నాయో ఏం తెలుసు? దాని బదులు బతకొచ్చుగా హాయిగా? ఏమిటి... పరువు పోయిందా... చచ్చిపోతారా? మన పరువును ఎంచేంత పరువు ఈ సమాజానికి ఉందంటారా ఇప్పుడు?

'మనసు కాస్త కలత పడితే మందు ఇమ్మని మరణాన్ని అడగకు' అన్నాడు సిరివెన్నెల. సెప్టెంబర్ 10– ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం. అసలు ఈ పేరే సరి కాదు. దీనిని 'ప్రపంచ జీవన కాంక్షా దినోత్సవం' అని మార్చాలి. జీవనకాంక్ష... ఇదే కావాల్సింది. ఎవరూ కష్టాలకు మినహాయింపు కాదు. ఎవరినీ సవాళ్లు ఒదిలిపెట్టవు. ఉక్కిరిబిక్కిరి అయ్యే క్షణాల వాయిదాలవారీ పంపకమే జీవితం. ఇది అందరికీ తెలుసు. అందుకే అర్ధంతరంగా మరణించిన వారికి గౌరవం లేదు. 'ఏం.. మేం బతకట్లేదా.. చచ్చేం సాధించాలి గనక' అనుకుంటారు. అందుకే ఓడినా సరే బతికి తీరాలి. సినారె అంటాడు– 'జగమంతా దగా చేసినా చివురంత ఆశను చూడు... గోరంత దీపం కొండంత వెలుగు... చివురంత ఆశ జగమంత వెలుగు'. ఏం మహాశయా... బతికేద్దామా? బతుకుదాం లేద్దూ!

పాత 'కలకత్తా' మిగిలే ఉంది!

కామెంట్



కరణ్ థాపర్

బెంగాలీ రాజధానిలో బ్రిటన్ రాచరికపు విశేషంగా కొన్ని చక్కటి అంశాలు ఇంకా మిగిలే ఉన్నాయి. 'కలకత్తా' నగరం నడిబొడ్డున, ఒకప్పుడు పార్క్ స్ట్రీట్‌గా వాడుకలో ఉన్న ప్రదేశానికి కొద్ది దూరాన... బ్రిటిష్ హయాంను గుర్తు చేసేలా 'ద గ్లెన్‌బర్న్' అనే ఒక ఆహ్లాదకరమైన చిన్న భోజనశాల ఉంది. బ్రిటన్ మారిపోయింది కానీ, కలకత్తాలోని ఈ ప్రదేశం ధిక్కారంగా నేటికీ అలానే ఉండిపోయింది. ఇటీవల ఆర్జీ కర్ ఆసుపత్రిలో జరిగిన విషాదం, ఆ వెంబడి సామూహిక నిరసనలు, ముఖ్యమంత్రి అనిశ్చిత భవిష్యత్తు... వీటన్నిటిపై చర్చలు, వాదనలు ఇక్కడ కూడా జరగకుండా లేవు. కానీ ఇక్కడి నుండి చూస్తే అవి వేరే ప్రపంచానికి చెందిన అంశాలుగా అనిపిస్తాయి.

తొలి పరిచయంలోనే ఏర్పరచుకునే అభిప్రాయాలు తప్పుదారి పట్టించేవిగా ఉండవచ్చునని నేను అంగీకరిస్తాను. కానీ అవి చెరగని ముద్రలుగా కూడా నిలిచిపోగలవు. గత వారాంతపు నా 'కలకత్తా' పర్యటన విషయంలో ఇది నిశ్చయంగా వాస్తవం. నాకు ఆ నగరం గురించి ఏమంత తెలియదు. కనీసం ఐదేళ్లుగా నేను ఆ నగరాన్ని సందర్శించిందే లేదు. అయితే, ఆ బెంగాలీ రాజధానిలో రాచరికపు విశేషంగా కొన్ని చక్కటి అంశాలు ఇంకా మిగిలే ఉన్నాయన్న ఒక కాదనలేని భావనకు నేను లోనయ్యాను. నేనక్కడ కలిసిన స్థానికులు కూడా ఇందుకు భిన్నమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని అనుకోను. అందువల్లనే నేను ఆ నగరానికి ఉన్న 'కలకత్తా' అనే వలసరాజ్య నామాన్ని ఉద్దేశపూర్వకంగా ఇక్కడ ఉపయోగిస్తున్నాను.

నగరం నడిబొడ్డున, ఒకప్పుడు పార్క్ స్ట్రీట్‌గా వాడుకలో ఉన్న ప్రదేశానికి కొద్ది దూరాన, అనాకమైనదిగా తప్ప మీరు గుర్తించని ఒక భవంతి... బ్రిటిష్ హయాంను గుర్తు చేసేలా 'ద గ్లెన్‌బర్న్' అనే ఒక ఆహ్లాదకరమైన చిన్న భోజనశాలను తనలో పొదవుకుని ఉంటుంది. ఒకసారి మీరు ఆ అసహ్యకరమైన పరిసరాలను, జీర్ణావస్థలో ఉన్న ప్రవేశ ద్వారాన్ని దాటుకుని లోపలికి వెళ్లారా... 7, 8 అంతస్థులలోని గతకాలపు విస్మృత ప్రపంచంలోకి అడుగు పెడతారు. గ్లెన్‌బర్న్‌లోని తొమ్మిది గదులలో రేఖాగణితం నమూనాలో డిజైన్ చేసిన చెక్క పలకల ఫ్లోరింగ్, షాండ్లియర్లు, కలపను మలిచి తీర్చిన సోఫాలు, వార్నిష్ పట్టిన ఒంపుకాళ్ల బల్లలు, వర్ణాలంకరణలను అచ్చు గుద్దిన పత్తి వస్త్రాల పరుపులు, ఇత్తడితో పటం కట్టిన పురాతన పూల కళాకృతులు ఉన్నాయి. అక్కడి విశాలమైన స్నానపు గదులు పాతకాలపు నాటి ఆధునిక శైలిలో రూపొందిన గాజు లోహపు తొట్టెలను కలిగి ఉన్నాయి. వాటిల్లో మీరు మునిగిపోవచ్చు. దేహాన్ని సాధ్యమైనంతగా సాగదీసుకోనూవచ్చు.

సూర్యోదయపు తొలి కిరణాలు తొంగి చూసే అక్కడి ఒక గదిలో నేను మూడు రోజుల పాతదైన లండన్ టైమ్స్ దిన పత్రికను చదువుతూ అల్పాహారం తీసుకున్నాను. అది మన 'టైమ్స్ ఆఫ్ ఇండియా' సమకాలీన సంచిక కన్నా మరింత సందర్భోచితంగా ఉన్నట్లు అనిపించింది. 'లండన్ టైమ్స్'లోని కోర్ట్ సర్క్యులర్ శీర్షికలో ఆనాటి రాచ కార్యాల వివరాలు ప్రచురించి ఉన్నాయి. రాజు గారు బల్మోరల్ విహారంలో ఉన్నారు, బహుశా గ్రౌస్ పక్షుల్ని వేటాడటం కోసం. పేపర్ నుంచి తలెత్తి చూసినప్పుడు బయట విక్టోరియా మెమోరియల్ నా వైపు తదేకంగా చూస్తూ ఉండటాన్ని గమనించాను. (దాని నిర్మాణ స్ఫూర్తి సారథి) లార్డ్ కర్జన్ తన ప్రాతఃకాల కాఫీ సేవిస్తూ, ఇంతకంటే మెరుగైన దృశ్యాన్ని ఆశించివుండరు!



కోల్‌కతాలోని పూర్వపు పార్క్ స్ట్రీట్

ఇంకో వైపు నుంచి కలకత్తా మైదానం కనిపిస్తోంది. గత ఆదివారం అది హరితపత్రంలా, ఆహ్వానిస్తున్నట్లుగా దర్శనమిచ్చింది. దూరంగా వర్షాకాలపు శీతల ఉషోదయంలో కొంతమంది పురుషులు ఉల్లాసంగా గుర్రాలను దౌడు తీయించటం గమనించాను. గొడుగులు పట్టుకొని ఉన్న మహిళలు, చిన్న పిల్లలు, వారి పెంపుడు కుక్కపిల్లలు అక్కడి పచ్చికలో ఆడుకుంటున్నట్లుగా కనిపిస్తున్నారు. ఆ తర్వాత వాళ్లు టిఫిన్ చేయటం కోసం గ్లెన్‌బర్న్‌కు వస్తారా? వస్తే కనుక వారి విహార యాత్రను ముగించటానికి పింక్ జిన్‌లు కచ్చితంగా ఒక అత్యంత సముచితమైన మార్గంగా ఉంటాయి.

బెంగాల్ క్లబ్బు సభ్యులతో మాట్లాడటానికి నాకు ఆహ్వానం లభించింది. పంజాబీ ధాబాలా మారిపోయిన ఢిల్లీ జింఖానా క్లబ్‌కు భిన్నమైన ప్రపంచం అది. ఇక్కడి బ్రిటిష్ వాసనల్లోని గొప్ప ఆపేక్ష, అమితమైన శ్రద్ధ... ఆహ్లాదాన్ని కలిగి ఉన్నాయి.

క్లబ్బుకు వచ్చిన వారిలో షిఫాన్ చీరలు, ముత్యాల కంఠ హారాలు ధరించిన స్త్రీలు; చక్కగా ఇస్త్రీ చేసిన ప్యాంట్లు, హుందాగా ఉండే చొక్కాలు ధరించిన పురుషులు ఉన్నారు. ఎక్కడా కుర్తా–పైజమా కానీ, భద్రలోక్ ధోతీ కానీ కనిపించలేదు. వారికి బెంగాలీ భాష తెలుసనటంలో సందేహం లేదు కానీ, నాకు ఇంగ్లిష్ మాత్రమే వినిపించింది... అచ్చంగా నైట్స్‌బ్రిడ్జ్ (లండన్)లో మాట్లాడిన విధంగా.

మేము జనరల్ అవుట్రామ్ నిలువెత్తు తైలవర్ణ చిత్తరువులోని ఆయన చురుకైన చూపుల కింద భోజనం చేశాం. క్లబ్బు పూర్వపు అధ్యక్షుడు ఆయన. ఇప్పుడైతే నిస్సందేహంగా కొత్త సభ్యత్వంపై ఒక కన్నేసి ఉంచేవారు. మెనూలోని ఆహార పదార్థాలు తప్పక ఆయన సమ్మతిని కలిగి ఉండేవి.

అది రెండు వైన్‌లతో కూడిన నాలుగు వంటకాల భోజనం. తళతళ మెరుస్తున్న తెల్లటి చైనా ప్లేట్లకు రెండు వైపులా వెండితో చేసిన స్పూన్లు, ఫోర్కులు అందంగా అమర్చి ఉన్నాయి. క్యారెట్, సెలెరీ కాడల చారు, రాతి పీతలు, క్రాన్‌బెర్రీ జెల్లీలో మిగుల వేయించిన మాంసం ముక్కలు, చుట్టూతా పుదీనా సాస్ పోసి ఉన్న మృదువైన బ్రాందీ స్నాప్ గొట్టాలు భోజనం బల్లపై ఉన్నాయి. గాజు స్ఫటికాల లోటాలలో వచ్చిన జివ్వనిపించే చల్లని మద్యం, దానికి జతగా ఉన్న సన్నని ఆకుకూరల కాండాలతో మా సాయంత్రం ముగిసింది. "నేను వారానికి ఒకసారి బ్లెన్‌హైమ్(బ్రిటన్ రాజప్రాసాదం)లో భోజనం చేస్తాను" అని కర్జన్ గొప్పగా చెప్పుకున్న మాటను ఇది నాకు గుర్తు చేసింది.

బ్రిటన్ మారిపోయింది కానీ, కలకత్తాలోని ఒక భాగం ధిక్కారంగా అలానే ఉండిపోయింది. ఆర్జీ కర్ ఆసుపత్రిలో జరిగిన విషాదం, ఆ వెంబడి సామూహిక నిరసనలు, ముఖ్యమంత్రి అనిశ్చిత భవిష్యత్తు... వీటన్నిటిపై చర్చలు, వాదాలు జరగటం అన్నది నిస్సందేహమే! అయినా, ఈ పరమ పావన గ్లెన్‌బర్న్, బెంగాల్ క్లబ్బు ఆవరణల నుంచి చూస్తే అవి వేరే ప్రపంచానికి చెందినవిగా అనిపిస్తాయి.

కాబట్టి, మీరు కనుక పొగలు కక్కుతున్న ఉడుకుడుకు తృణధాన్య ఆహారం, ఆ తర్వాత గిలకొట్టి వేయించిన గుడ్లు, ఊరబెట్టిన పంది మాంసంతో ఆదివారాలను ప్రారంభించేందుకు ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తి అయుండి, 'అమృత్ కాల్'తో నాకొచ్చేదేమిటని అనుకుంటూ ఉంటే నేను మీకు గ్లెన్‌బర్న్‌ను, బెంగాల్ క్లబ్బును సిఫారసు చేస్తాను. అక్కడ ఎల్లప్పుడూ సమయం నిశ్చలంగా ఉంటుందని మీరు దృఢంగా విశ్వసించవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనుషుల రకాలు



ప్రపంచం నలుమూలల నుంచీ వస్తున్న వార్తలు చదువుతుంటే రోజురోజుకీ ఒక విషయం బాగా స్పష్టమవుతోంది. లోకంలో రెండు రకాల మనుషులున్నారు. అందరికీ స్వేచ్ఛ, గౌరవం ఉండాలని కోరుకునేవారు ఒక రకం. కోరుకోనివారు ఇంకో రకం.

– ఎమీ దార్, పీస్ యాక్టివిస్ట్

లేకుండా చేశారు!



పాత వాస్తవం. ఐక్యరాజ్య సమితి 'పాపులేషన్ ఫండ్' (యూఎన్ఎఫ్‌పీఏ) నివేదిక 2020 ప్రకారం, పుట్టడానికి ముందు, పుట్టిన తర్వాత చేసుకున్న ఎంపికల వల్ల భారతదేశంలో గత యాభై ఏళ్లలో సుమారు 4.58 కోట్ల బాలికలు లేకుండాపోయారు.

– అమనా బేగమ్ అన్సారీ, పాలసీ అనలిస్ట్

మిగతావి తీసుకో!



అమెరికాలో ఒక వినియోగదారుడు: "నాకు రెండు గన్నులు, ఇరవై బుల్లెట్లు, ఒక క్రోసిన్ కావాలి." దుకాణదారు: "సారీ, డాక్టర్ చీటీ లేకుండా మేము క్రోసిన్ అమ్మం."

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

మళ్లీ బడికి...



ఒక మనిషి ఏ వయసులోనైనా, ఏ సమయంలోనైనా మళ్లీ చదువుకోవడానికి వెళ్లగలిగే సౌకర్యం ఉండాలి. పైగా అది సులభంగా, అందుబాటులో ఉండేవిధంగా ఉండాలి. దాన్ని సహజమైనదిగా చూసే పరిస్థితి కూడా ఉండాలి.

– ఎ. పావెల్, కవి

సదా సిద్ధంగా...



భగవంతుడిని కలిసే రోజుకోసం సిద్ధపడాలి. ఎందుకంటే, తర్వాత ఎవరో ఎవరికీ తెలియదు కనుక. అది ఎప్పుడైనా రావొచ్చు. అందుకే ప్రతిరోజూ సిద్ధంగానే ఉండాలి. ఇదే చివరిదన్నంతగా మన రోజును సాధ్యమైనంత పరిపూర్ణంగా మలుచుకోవాలి. అప్పుడు దేనికీ భయపడనవసరం లేదు.

– ముఫ్తి మెంక్, మత గురువు

కంటెంట్ వర్సెస్ నాలెడ్జ్



'కంటెంట్', 'నాలెడ్జ్' మధ్య తేడా అర్థం చేసుకోవడం మంచిది. 90 సెకన్లరీల్స్, థ్రెడ్స్ అనేవి కంటెంట్. అవి జ్ఞానం కాదు. జ్ఞానం కావాలంటే వేలాది పేజీల చదువుతోపాటు వ్యవహార అనుభవం కావాలి. కంటెంట్ అనేది మీలో కుతూహలం రేపడానికి పనికిరావొచ్చు. కానీ దాన్ని జ్ఞానంగా మాత్రం పొరబడొద్దు.

– క్రిష్ అశోక్, రచయిత

దేశభక్తి?



'గౌరవనీయ' మంత్రులు దేశభక్తి గురించి ఎప్పుడు మాట్లాడినా, నాకు వాళ్ల పిల్లలు పన్ను తక్కువ చెల్లించాల్సిన అమెరికా, బ్రిటన్, దుబాయ్‌లాంటి దేశాల్లో నివసించడం గుర్తొస్తుంది.

– దేవ్‌దత్ పట్నాయక్, కాలమిస్ట్

జనం గొడవే ఆయన గొడవ!

విపక్ష ఎక్కడున్నా వ్యతిరేకించి అణచివేత–అన్యాయాలపై ధిక్కార స్వరం వినిపించిన సమరశీలి; సామాజిక స్పర్శతో కవిత్వాన్ని పునీతం చేసిన ప్రజాకవి కాళోజీ! ప్రజా ఉద్యమాల్లో పాల్గొని అన్యాయాన్ని కవిత్వ కరవాలంతో ఎదిరించి ప్రశ్నించి నిలదీసిన ధీశాలి. నిజాం రాజును ఆత్మస్థైర్యంతో ఎదిరించడమే కాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరుబాటను నిర్దేశించిన యోధుడాయన. తనను వదిలేసుకొని ఇతరుల మంచి కోసం పోరాడే సామాజిక స్పృహ, నిరంతర తపన కాళోజీలో ఉన్నాయి. పీడిత, తాడిత ప్రజల గుండెల్లో పోరాటపు పుప్పొడిని చల్లి కవిగా నిలిచి పోయారు. మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో, వేషభాషల్లో, ఆలోచనలో, ఆర్తిలో, ఆవేదన – సంవేదనల్లో తెలంగాణ తనాన్ని వినిపించి, కనిపింపజేసిన ఆయన అసాధారణ కవి. ప్రజల్లోకి బలంగా తన కవిత్వాన్ని తీసుకెళ్లిన కాళోజీని మహాకవి దాశరథి 'తెలంగాణ ఆధునిక సాహిత్య ముఖద్వారం' అని అభివర్ణించారు. ఉద్యమ పథ నిర్దేశం చేసి చిరకాల కవిత్వాన్ని కాళోజీ ప్రజలకు మిగిల్చారు.



కాళోజీ

సమాజ గొడవను తన గొడవగా మార్చుకొని 'నా గొడవ' పేరుతో రాసిన కవితలు సమాజానికి మార్గదర్శకాలుగా మారాయి. దేశీయ దృక్పథం, ప్రాంతీయ స్పృహ కలిగిన కాళోజీ ఖండాంతర కవి. ప్రజా ఉద్యమాలతో మమేకమైన ఆయన సమాజాన్ని నా గొడవలో అనేక కోణాలలో ఆవిష్కరించి చూపారు. నిజాలను కవిత్వంలో కుండబద్దలు కొట్టి చెప్పిన కాళోజీ ఎవరేమనుకున్నా తన తత్వం ఇదేనని స్పష్టం చేశారు. 'ఓటేసేటప్పుడు వుండాలి బుద్ధి' అన్న మాటల్లో వాస్తవాల ఆవిష్కరణ కనిపిస్తుంది. ఆచరణ యోగ్యంగా ఆయన కవిత్వ పంక్తులు ఉంటాయి. సామాన్య ప్రజానీకానికి అంత దగ్గరగా కవిత్వాన్ని తీసుకెళ్లిన కవిగా కాళోజీ మిగిలిపోయారు. 'తిననోచని మాట్లాడనోచని నోరు, కష్టం చేసి తిననోచని చేతులు, సేవచేసి ప్రేమించనోచని శరీరం...' వంటివాటి పక్షం వహిస్తాడు కాళోజీ. కచ్చితమైన అభిప్రాయాలు కల్గిన కాళోజీ... పలుకుబడుల వ్యావహారిక భాషలో రచనలు చేశారు. 'ప్రాంతేతరులే దోపిడీ చేస్తే పొలిమేర దాకా తరుముతాం... ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతో పాతరేస్తాం' అంటూ తెలంగాణ వాణిని వినిపించిన కాళోజీ 'వీర తెలంగాణ నాది వేరు తెలంగాణ నాది... వేరై కూడా తెలంగాణ వీర తెలంగాణ ముమ్మాటికి' అని స్పష్టం చేశారు. స్వచ్ఛత, సూటిదనం, నచ్చని విషయాలపై నిరసన, ద్వంద్వ ప్రవృత్తులపై, అన్యాయం వంటివాటిపై ఖండనలు చేసిన ఆయన సామాజిక కవి శిఖరంగా కనిపిస్తారు. రాజకీయ లౌక్యాలు, వ్యంగ్యాస్త్రాలు ప్రస్తావిస్తూనే సాహిత్య విలువలను నా గొడవలో స్థాపన చేశారు. ప్రహ్లాదుడు అన్యాయాన్ని ఎదిరించినట్టే తనకు ఎదిరించినోడే ఆరాధ్యుడని ఆయన చెప్పారు. ఓటు విలువను సమాజానికి చెప్పిన ఆయన సమాజ అంతరాలను నా గొడవలో బట్ట బయలు చేసి ప్రజలకు దిశానిర్దేశం చేశారు. 'తొక్కినొక్కబడ్డప్పుడు ప్రత్యేక రాజ్యం పాలు కోరడం తప్పదు... కాలంబు రాగానె కాటేసి తీరాలె... కసి ఆరిపోకుండా బుసకొట్టుచుండాలె' అన్న కాళోజీ... నిర్భయత్వానికి నిదర్శనం!

– డా॥ తిరునగరి శ్రీనివాస్
కవి, సాహిత్య విశ్లేషకులు | 94414 64764
(నేడు ప్రజాకవి కాళోజీ జయంతి)


భారతీయ మేధా శిఖరం!



డా॥ యలమంచిలి శివాజీ

యాభై ఐదు సంవత్సరాల నాటి మాట. 1969 మేలో పూనా–బొంబాయి మధ్యగల లోనావాలా అనే హిల్ స్టేషన్‌లో లెస్లీ సాక్నీ ప్రజాస్వామ్య శిక్షణ శిబిరంలో ఓ పది, పద్నాలుగు రోజులున్నాను. ఎమ్.ఆర్. మసానీ ఆ శిబిరానికి ప్రారంభోపన్యాసం చేశారు. బొంబాయి విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్ర ఆచార్యులు ఎస్.పి. అయ్యర్ ప్రిన్సిపాల్‌గా తరగతులు నిర్వహించారు. నానీ పాల్కీవాలా ఆ సంస్థ అధ్యక్షులు. సోలీ సొరాబ్జీ, రజనీ పటేల్, వి.బి. కార్నిక్, వి.వి. జీన్, అరవింద్ దేశ్‌పాండే, రాము పండిట్, ఫెడీ మెహతా, ఎస్.వి. రాజు వంటి వారు వివిధ అంశాలపై శిక్షణ గరిపారు. వారిలో ఎ.జి. నూరానీ కూడా ఉన్నారు. ఆయన అప్పటికే ఒక దశాబ్ద కాలంగా వివిధ అంశాలపై పుంఖానుపుంఖాలుగా వివిధ పత్రికలలో వ్యాసాలు రాసేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూ, స్టేట్స్‌మన్ వంటి స్వదేశీ పత్రికలకే గాక, పాకిస్తాన్‌లోని 'డాన్' పత్రికలో కూడా వారి రచనలు ప్రచురితమవుతుండేవి. ఆ తదుపరి ఫ్రంట్‌లైన్, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి వాటికి కూడా రాసేవారు. జాకీర్ హుస్సేన్, బొంబాయి హైకోర్టులో మొట్టమొదటి భారతీయ వకీలు బద్రుద్దీన్ త్యాబ్జీ జీవిత చరిత్రలను ప్రచురించారు. కశ్మీర్ సమస్య, బాబ్రీ మసీదు, ఆర్టికల్–370, లద్దాఖ్, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, గవర్నర్ పాత్ర, పౌరహక్కులు, భగత్ సింగ్‌పై విచారణ, సావర్కర్, హైదరాబాదు డిమాలిషన్ వంటి భిన్న విభిన్న అంశాలపై రచనలు చేశారు.

తదాదిగా బొంబాయిలోగానీ, ఢిల్లీలోగానీ నూరానీని కలుసుకొనే అవకాశం దొరికేది. దక్షిణ బొంబాయిలో వీలు దొరికినప్పుడల్లా ఆయనను కలిసేవాడిని. ఎం.ఆర్. మసానీ అక్కడే బీచ్‌కాండీలో ఉండేవారు. నూరానీ నేపియన్ సీ అపార్టుమెంట్స్‌లో ఉండేవారు. అవి రెండూ మహాలక్ష్మి టెంపుల్ దగ్గర నుండేవి. దానితో మసానీ దగ్గరకెళ్లినప్పుడు విధిగా నూరానీని కూడా కలిసేవాడిని. నూరానీ బల్ల కుర్చీమీద కాకుండా, మంచంమీద కూర్చుని రాసేవారు. చుట్టూ అప్పడాలు ఆరబోసినట్లు లెక్కకు మించిన పుస్తకాలు తెరిచి, తిరగేసి ఉండేవి. ఏదైనా అంశంపై చర్చిస్తుండగా, ఎదురుగా ఉన్న పుస్తకాల్లో ఫలానా పుస్తకం తీసి ఫలానా చాప్టర్ చదవమనేవాడు. తాను చెప్పిన దానిని, వివరంగా అర్థం చేసుకోవడానికి ఉదయం చదివిన పత్రికలలో అవసరమయిన అంశాలను కత్తిరించి, అంశాల వారీగా ఫైల్ చేసేవారు. కొన్ని వందలు, వేల ఫైళ్ళు అలా ఉన్నాయి. ఏ అంశం మీద రాసినా, లోతైన పరిశోధన చేసేవారు. వాజ్‌పేయి–ముషారఫ్‌ల మధ్య ఆగ్రాలో జరిగిన చర్చలపై రాసే దానికి, పూర్తి సమాచారం రాబట్టడానికై, పనిగట్టుకొని ఇస్లామాబాద్ వెళ్లి పరిశోధన గావించారు. క్రీ.శ. 1775–1947ల మధ్య జరిగిన రాజకీయ ప్రేరిత విచారణలపై సమగ్ర పరిశోధన చేసి గ్రంథస్థం గావించారు. 'జిన్నా–తిలక్ – కామ్రేడ్స్ ఆఫ్ ఫ్రీడం స్ట్రగుల్' అనే పుస్తకాన్ని కూడా వెలువరించారు. అయితే ఏది ఎలా ఉన్నా ఎవరిమీదా వ్యక్తిగతంగా విమర్శ చేసేవారు కాదు. 'రాజాజీ – అంకితమైన, నిబద్ధతగల హిందువు, మహోన్నతమైన భారతీయుడు, అల్పసంఖ్యాక వర్గాల హక్కులకు అలుపెరుగని రక్షకుడు' అని కొనియాడారు. షేక్ అబ్దుల్లా, కరుణానిధిల తరపున సుప్రీంకోర్టు, బొంబాయి హైకోర్టులలో వకీలుగా తన వాదనలను వినిపించారు.



నివాళి

ఎ.జి. నూరానీ


నూరానీకి కొన్ని నిర్దిష్టమయిన, చిత్ర–విచిత్రమయిన అభిరుచులు ఉండేవి. ఢిల్లీ వస్తే ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో 38వ నంబరు గదిలోనే మకాం. ఓల్డ్ ఢిల్లీ, నిజాముద్దీన్, కరోల్ బాగ్, జామా మసీదు వంటి చోట సందులు – గొందులలోని హోటళ్లలో కబాబ్–కుర్మా ఎక్కడ దొరుకుతుందోనని శోధించి, ఆస్వాదించేవారు.

గత నెలాఖరులో తన 94వ ఏట కన్నుమూసిన అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ సేకరించిన వేలాది పుస్తకాలు, పేపర్ క్లిప్పింగ్‌లు ఏమవుతాయో? ఏదైనా జాతీయ స్థాయిలో నున్న గ్రంథాలయం గానీ, పరిశోధనా సంస్థలు, లేక జాతీయ పత్రికలు భద్రపరిచి, సద్వినియోగం గావించడం అవసరం. అవి భావి తరాలకు ప్రజాసేవా రంగాలలో, పాత్రికేయ రంగంలోకి అడుగు పెట్టే యువతరానికి ఉపయుక్తం కాగలవు.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు | 98663 76735

సాయపు చేతులు

యమదూతలు ఓ మనిషిని తీసుకొచ్చి యమలోకాన యమ ధర్మరాజు ఎదుట నిలబెట్టారు. ఆ మనిషి ఎంతో దిగాలు ముఖం వేసుకుని నిల్చున్నాడు. పక్కనే చిత్రగుప్తుడు ఆ మనిషి ఖాతాను తరచి చూస్తున్నాడు. అతను ఏం తప్పు చేశాడని యమధర్మరాజు అడిగాడు. చిత్రగుప్తుడు అదే పనిగా అతని గురించి నమోదు చేసిన పేజీలను చదువుతుంటే తలతిరుగుతోంది. అంతా విన్నాడు యమధర్మరాజు. 'అతనిని నరకలోకంలో పడేయండి' అన్నాడు యముడు. వెంటనే చిత్రగుప్తుడు అడ్డు తగిలి ఇలా అన్నాడు: 'అతను అన్ని పాపాలు చేసినప్పటికీ ఒకే ఒక్క పుణ్యం చేశాడు. ఓరోజు ఓ వృద్ధురాలు గుడికి వెళ్ళడానికి దారి అడిగితే చూపుడు వేలుతో దారి చెప్పడమే కాకుండా ఆమె చేయి పట్టుకుని వెళ్ళి దిగబెట్టాడు'. ఆ మాటతో యముడు తన తీర్పుని అప్పటికప్పుడు మార్చుకున్నాడు. 'అతని చేతికి గంధం పూసి ముందుగా స్వర్గానికి తీసుకుపోండి. అనంతరం అతనిని నరకానికి తరలించవచ్చు' అని ఆదేశించాడు.



జ్యోతిర్మయం

కర్ణుడు వంటి పుణ్యాత్మునికీ మరణానంతరం ఓ సమస్య ఎదురయ్యింది. ఆయన మహాదాత. అయితే ఆయన ధన రాశులను, వస్తువులనే ఇచ్చాడు. ఆకలిగొన్నవారి ఆకలి తీర్చిన చరిత్ర ఆయనకు లేదు. నిర్యాణానంతరం కర్ణుడు స్వర్గానికే వెళ్లాడు. స్వర్గానికి వెళ్ళే వారికి ఆకలి అనేది ఉండదు. కానీ కర్ణుడికి ఆకలి వేసింది. ఓమారు కర్ణుడు 'నాకు మాత్రమే ఎందుకు ఆకలి వేస్తోంది' అని స్వర్గలోక ద్వార పాలకుని అడిగాడు. అప్పుడతను 'నువ్వు భూలోకంలో ఎవరికీ అన్నదానం చేయలేదు. అందుకే నీకు ఆకలి వేస్తోంది'ని చెప్పాడు. 'మరిప్పుడు ఏం చేయాలి. ఆకలి ఎక్కువై భరించలేకపోతున్నాను' అన్నాడు కర్ణుడు. వెంటనే ద్వారపాలకుడు 'కర్ణా, నీ చూపుడు వేలుని నోట పెట్టుకో. ఆకలి తగ్గిపోతుంది' అన్నాడు. కర్ణుడు అలాగే చేశాడు. ఆకలి పోయింది. ఇందుకు కారణమేమిటి?

ఓసారి కృష్ణుడి సన్నిహితులకు కర్ణుడు అన్నం తినడానికి ఓ చోటును తన చూపుడు వేలుతో చూపించాడట. అది కాస్తా ఓ పుణ్య కార్యంగా కర్ణుడి ఖాతాలో జమైంది. పురాణాలు, ఇతిహాసాలలో పేర్కొన్న ఇటువంటి కథలను నమ్మవచ్చా, అసలు స్వర్గ–నరకాలు ఉన్నాయా అంటూ చర్చోప చర్చలు ఇక్కడ అనవసరం. మనిషిగా పుట్టినవాడు సాటి మనిషికి సాయం చేయడం అతడి కనీస ధర్మం అని తెలియచేయడానికి ఇటువంటి కథలు వాహకాలుగా నిలుస్తాయి. మానవ విలువలను ప్రోది చేసే భారతీయ తత్త్వం సర్వదా ఆచరణీయం.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** షష్ఠి సా.4.59 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** విశాఖ ప.2.50 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.7.07 నుండి 8.47 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.12 వరకు తదుపరి ప.2.51 నుండి 3.39 వరకు, **అమృతఘడియలు:** తె.5.16 నుండి 6.56 వరకు(తెల్లవారితే మంగళవారం), **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.07.

కూల్చివేతల్లో హైడ్రా దూకుడు

- సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో మూడు భవనాలు, ఒక గోడౌన్, 20 గుడిసెల తొలగింపు
- ఒంటిపై కిరోసిన్ పోసుకొని గుడిసెవాసుల ఆందోళన



అమీన్‌పూర్‌లో నిర్మాణాల తొలగింపు

గచ్చిబౌలి/మాదాపూర్: సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు, గుడిసెలను హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు నేలమట్టం చేశారు. నిలువ నీడ లేకుండా చేశారని గుడిసెల్లో నివాసముండేవారు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మాదాపూర్‌లోని గుట్టలబేగంపేట్‌లోని సున్న చెరువులో హైడ్రా కూల్చివేతలు ప్రారంభించింది. భారీ హిటాచీలతో వచ్చిన అధికారులు పోలీసు బందోబస్తు మధ్య మధ్యాహ్నం 2 గంటల వరకు కూల్చివేతలు కొనసాగించారు.

భవనాలు నేలమట్టం

గుట్టలబేగంపేట్ సర్వేనంబరు 12,13,14, 16లో సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ విస్తరించి ఉంది. దీని పరిధిలో నిర్మించిన జీ ప్లస్ ఫోర్ అంతస్తులు ఉన్న రెండు భవనాలు, జీ ప్లస్ టు అంతస్తులు ఉన్న ఒక భవనాన్ని హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. ఒక డ్రైవ్ ఇన్, ప్లంబింగ్ మెటీరియల్ ఉన్న గోడౌన్, ఓ అపార్ట్‌మెంట్ ప్రహరీని కూడా కూల్చారు. ప్లంబింగ్ మెటీరియల్ గోడౌన్ యజమాని సురేశ్ మాట్లాడుతూ కూల్చివేతలతో రూ.4 కోట్ల విలువైన సామగ్రి ధ్వంసమైందని,.. ఖాళీ చేయడానికి రెండు గంటల సమయం అడిగినా ఇవ్వలేదని వాపోయాడు.

గుడిసెవాసుల ఆందోళన

సున్నంచెరువు ఎఫ్‌టీఎల్‌లో చిన్నపాటి రేకులతో వేసుకున్న 20 గుడిసెలను అధికారులు కూల్చారు. అప్పటికప్పుడు బయటకు వెళ్లాలని వలస కూలీలకు చెప్పడంతో ఆందోళన చెందారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ముందస్తు సమాచారం ఇవ్వక పోవడంతో గుడిసెల్లోని వస్తువులు తీసుకోవడానికి కూడా వీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, గర్భిణులు ఉన్నారని, ఎక్కడకు వెళ్లాలంటూ ప్రశ్నించారు. వెంకటకృష్ణ, నరేశ్, తార ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంటామని ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న మాదాపూర్ పోలీసులు వారిని అడ్డుకొని పీఎస్‌కు తరలించారు.

ఎక్కడకు వెళ్లాలి



కొంత కాలంగా ఇక్కడే గుడిసెలు వేసుకొని ఉంటున్నాం. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మేం ఉంటున్న ఇళ్లను కూల్చేశారు. పని చేసుకుంటేనే పూట గడిచేది. ఉండటానికి గూడు కూడా లేదు. ఇప్పుడు ఎక్కడకు వెళ్లాలో తెలియడం లేదు. – వెంకటకృష్ణ

సామాన్లు తీసుకునే దాకా కూడా ఆగలేదు



అకస్మాత్తుగా వచ్చి గుడిసెలను కూల్చివేశారు. ఇంట్లో ఉన్న సామాన్లు తీసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. – సునీత



మల్లంపేట పరిధిలోని విల్లాలను కూల్చివేస్తున్న దృశ్యం

అమీన్‌పూర్ పెద్దచెరువులోనూ తొలగింపు

పటాన్‌చెరు: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను ఆదివారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. హైడ్రా డీఎస్పీ శ్రీనివాస్, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ, ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామస్వామి ఆధ్వర్యంలో ఐదు జేసీబీలతో పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలోకి వచ్చే పట్టా భూముల్లోని నిర్మాణాలు నిబంధన ప్రకారం లేవని వాటిని కూల్చి వేశారు. సర్వే నంబరు 323, 324, 329లో 20 ఎకరాల భూమికి ప్రహరీ, వర్కర్ల కోసం షెడ్లు నిర్మించారు. ఇది పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందినదిగా భావిస్తున్నారు. వాటిని కూడా హైడ్రా అధికారులు తొలగించారు. కొన్ని రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగానాథ్ పెద్ద చెరువు పరిసరాలను స్వయంగా పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్ద చెరువు పరిసరాల్లో ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే నిర్మాణాలను పారామిలటరీ బలగాలతో కూల్చివేశారు. తహసీల్దార్ రాధ మాట్లాడుతూ పట్టా భూములైనా, చిరు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్నామని స్పష్టం చేశారు.

దుండిగల్: మేడ్చల్ మల్కాజిగిరి దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని సర్వేనంబర్లు 170/3, 170/4, 170/5లో శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ పేరుతో 260 విల్లాలు నిర్మించారు. కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కొన్ని విల్లాలు ఉన్నాయి. ఆదివారం ఉదయమే హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ వద్దకు చేరుకున్నారు. మొత్తం 24 విల్లాలను గుర్తించిన అధికారులు ఆదివారం సాయంత్రం వరకు

మల్లంపేటలో 10 విల్లాలు నేలమట్టం

10 విల్లాలను కూల్చివేశారు. మిగిలిన 14 విల్లాల యజమానులకు నోటీసులు జారీ త్వరలోనే వాటిని సైతం కూల్చివేస్తామని అధికారులు తెలిపారు. కూల్చివేతల్లో ఇరిగేషన్ ఏఈ సారా, తహసీల్దార్ సయ్యద్ మతీన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా అన్ని అనుమతులు తీసుకుని విల్లాలు కొన్నామని, ఇప్పుడు అధికారులు కూల్చివేయడం ఏంటని బాధితులు వాపోయారు.

జనావాసాల జోలికి వెళ్లం

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టీకరణ
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నా.. వాణిజ్యపరమైనవే కూల్చేస్తున్నాం
- నిర్మాణదశలో ఉన్న భవనాలపైనే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి
- ఆదివారం పలు అక్రమ నిర్మాణాల కూల్చివేత



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు వంటి జలవనరులకు సంబంధించిన ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో నిర్మించిన జనావాసాల జోలికి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) వెళ్లదని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. ఆదివారం పలు ప్రాంతాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఆయా నిర్మాణాల్లో పని చేసే కూలీల కోసం బిల్డర్లు సమీపంలో ఏర్పాటు చేసిన షెడ్లను నేలమట్టం చేసింది. అయితే, ఇవి సామాన్యులు నివసిస్తున్న ఇళ్లని, వాటిని కూల్చివేశారంటూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న ఇళ్లు, సాధారణ ప్రజలు నివసించే భవనాలు, సముదాయాల జోలికి తాము వెళ్లబోమని స్పష్టం చేశారు. అయితే ఈ ప్రాంతాల్లో ఉన్న వాణిజ్య సముదాయాలతోపాటు నిర్మాణంలో ఉన్న ఇళ్లు, భవనాలపై మాత్రం చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. ఇందులో భాగంగానే ఆదివారం మాదాపూర్‌లోని సున్నం చెరువు, దుండిగల్‌లోని మల్లంపేట చెరువు పరిధిలోని నిర్మాణాలను కూల్చివేసినట్లు వివరించారు. వీటిలో కొన్ని అనుమతి లేని నిర్మాణాలు సైతం ఉన్నట్లు గుర్తించామన్నారు. అమీన్‌పూర్‌లో కూల్చివేసిన వాటిలో అత్యధికం ఏపీలోని పాణ్యం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి నిర్మించినవే అని, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేశామని చెప్పారు.

ఆ షెడ్లలో హోటళ్లు...

సున్నం చెరువులో కూల్చిన షెడ్లను హోటళ్లు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని, వీటిలో ఏ ఒక్కరి వ్యక్తిగత ఇళ్లుగానీ, నివాస సముదాయాలుగానీ కూల్చలేదని రంగనాథ్ స్పష్టంచేశారు. ఓ ఇంటిపై ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ చేయడంతో సామాన్లు బయటకు తీసుకొచ్చామని, తర్వాత వాటిని తిరిగి లోపల పెట్టించామని వివరించారు. దుండిగల్‌లోని మల్లంపేట చెరువులో కూల్చివేసిన ఏడు విల్లాలు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయని, స్థానికంగా లేడీ డాన్‌గా చలామణి అయ్యే విజయలక్ష్మి అనే మహిళ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆమెపైనా క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు రంగనాథ్ తెలిపారు. సున్నం చెరువులోని అక్రమ నిర్మాణాలను అధికారులు గతంలోనూ కూల్చారని, అయితే మళ్లీ అదే ప్రాంతంలో నిర్మాణాలు రావడంతో ఆదివారం కూల్చివేసినట్లు పేర్కొన్నారు. గోపాల్ అనే ఓ వ్యక్తి చెరువును ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టి, అద్దెకు ఇచ్చినట్లు వివరించారు. ఇతడు ట్యాంకర్లు, బోర్‌వెల్స్ బిజినెస్ కూడా చేస్తున్నట్లు తెలిసిందన్నారు.

అవి కొనుగోలు చేయొద్దు

జల వనరులతోపాటు వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను కొనుగోలు చేయొద్దని రంగనాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు హెచ్ఎండీఏకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి, చెరువుల వివరాలు తెలుసుకోవాలని కోరారు. స్థానిక రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలు, పోలీసుల సహకారంతో సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న నాలుగు అంతస్తులు, రెండు అంతస్తుల భవనాలు, 30కి పైగా షెడ్లు కూల్చివేసి పది ఎకరాల చెరువు భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నామని రంగనాథ్ అన్నారు. దుండిగల్‌లో అక్రమంగా నిర్మిస్తున్న 11 డూప్లెక్స్ విల్లాలు తొలగించి రెండెకరాల చెరువును తిరిగి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని 51 ఎకరాల్లో అనుమతులు లేకుండా రోడ్లను సైతం ఆక్రమించి పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన అక్రమ లేఔట్లకు సంబంధించిన ప్రహరీ గోడతోపాటు రెండు సెక్యూరిటీ గదులను తొలగించామని రంగనాథ్ వెల్లడించారు.

ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకోవాలి

జలవనరులతోపాటు వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇప్పటికే ఉన్న శాశ్వత నిర్మాణాలను హైడ్రా కూల్చివేయదని రంగనాథ్ స్పష్టం చేశారు. దీని పై మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఉన్న శాశ్వత ఆక్రమణల విషయంలో మాదిరిగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. జల వనరులతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు రాకుండా, ఇప్పటికే ఉన్న వాటిలో వాణిజ్య, నిర్మాణంలో ఉన్న నివాస భవనాలపై మాత్రమే హైడ్రా చర్యలు తీసుకుంటుదని చెప్పారు. చాలాకాలం నుంచి ఉన్న నివాసాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయం కోసం హైడ్రా వేచి ఉంటుందని రంగనాథ్ పేర్కొన్నారు.

మహిళా బీఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్య

- గుజరాత్‌లో విధులు నిర్వర్తిస్తున్న రామగుండం యువతి



గంగాభవాని

జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన మహిళా బీఎస్ఎఫ్ జవాన్ బల్లా గంగాభవాని (26) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ దంతివాడలో విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. శనివారం రాత్రి తన గదిలో ఆత్మహత్య చేసుకున్నారు. గంగాభవాని విధులకు గైర్హాజరు కావడంతో అధికారులు ఆమె నివాసం ఉండే గదికి చేరుకుని చూశారు. గది తలుపులు వేసి ఉండటంతో వాటిని పగుల గొట్టి లోనికి వెళ్లి చూడగా, ఆత్మహత్య చేసుకుని కనిపించారు. రామగుండం ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న బల్ల సుబ్రహ్మణ్యం, సరస్వతి దంపతుల కుమార్తె గంగాభవానికి 2021లో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం లభించింది. తొలుత ఆమె పశ్చిమబెంగాల్‌లో పనిచేశారు. ఇటీవల గుజరాత్‌లోని గాంధీనగర్ దంతివాడకు బదిలీపై వెళ్లారు. గతనెల 5వ తేదీన నుంచి 24వ తేదీ వరకు సెలవుపై రామగుండం వచ్చిన గంగాభవాని.. ఈనెల రెండో తేదీన తిరిగి విధుల్లో చేరారు. అయితే, అక్కడ రోజూ 18 గంటల పాటు డ్యూటీ చేయాల్సి వస్తోందని, ఆరు గంటలే విశ్రాంతి ఉంటోందని ఇటీవల తల్లిదండ్రులతో చెప్పినట్లు తెలిసింది. 'అమ్మా.. నాన్న.. ఈ ఉద్యోగం చేయలేను.. ఇక్కడ ఉండలేను'అని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఇబ్బందిగా ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి రావాలని చెప్పామని, ఇంతలోనే తమ కూతురు ఈ అఘాయిత్యానికి పాల్పడిందని తల్లిదండ్రులు బోరున విలపించారు. గంగాభవాని మృతదేహన్ని ఆదివారం ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలించారు. అక్కడినుంచి కుటుంబసభ్యులు స్వస్థలానికి తీసుకొచ్చారు.

బాలికపై ముగ్గురి అత్యాచారం

- గర్భం దాల్చిన 9వ తరగతి విద్యార్థిని
- నిందితులపై పోక్సో కేసు
- సిద్దిపేట ఏసీపీ మధు వెల్లడి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

దుబ్బాక: తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి ముగ్గురు యువకులు పలు మార్లు అత్యాచారానికి పాల్పడటంతో గర్భం దాల్చింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో ఈ ఘటన జరిగింది. సిద్దిపేట ఏసీపీ మధు ఆదివారం ఈ ఘటన వివరాలను మీడియాకు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలిక ఇటీవల అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమె తల్లి చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లింది. బాలికను పరీక్షించిన వైద్యులు గర్భవతి అని తెలిపారు. వెంటనే వైద్యులు ఈ విషయం గురించి సిద్దిపేట భరోసా కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అధికారులు బాలిక నుంచి పూర్తి వివరాలు సేకరించారు. దుబ్బాక మండలానికి చెందిన ఓ యువకుడితో పాటు భూంపల్లి–అక్బర్‌పేట మండలానికి చెందిన మరో ఇద్దరు యువకులు మార్చి, ఏప్రిల్ నెలల్లో బాలిక తల్లి ఇంట్లో లేని సమయాల్లో వచ్చి ఆమెకు మాయమాటలు చెప్పి లోబర్చుకొని పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఈ సంఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు పంపారు.

క్లుప్తంగా...

బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల నిరసన కొనసాగుతోంది. ఆదివారం ఐదోరోజు ఆందోళనలు చేపట్టారు. ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. ఉదయం క్యాంపస్‌లోకి ఎవరినీ అనుమతించలేదు. భారీగా పోలీసులను మోహరించారు. ప్రైవేటు సెక్యూరిటీని నియమించారు. అయినా విద్యార్థులు ఆందోళనలు ఆపడంలేదు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ రాజీనామా కోరుతూ 3 వేల మంది విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. రెగ్యులర్ వీసీని నియమించి తమ 17 డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- నారాయణపేట జిల్లా తిర్మలాపూర్‌లో ఘటన



మృతిచెందిన చిన్నారులు

నారాయణపేట రూరల్: మేన మామ దినకర్మకు వచ్చి ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందిన ఘటన నారాయణపేట జిల్లాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపేట మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కిష్టప్ప కూతురు రజిష్ట ప్రేమ వివాహం చేసుకుని కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌లో స్థిరపడ్డారు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా తల్లిగారింటికి ఆమె రాలేదు. ఇటీవల ఆమె సోదరుడు మృతిచెందగా అంత్యక్రియలకు హాజరుకాలేని ఆమె, దినకర్మ నిమిత్తం శనివారం మొదటిసారి స్వగ్రామానికి భర్త, పిల్లలతో కలసి వచ్చింది. కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న వారు ఆదివారం బీజాపూర్ వెళ్లడానికి సిద్ధం కాగా రజిష్ట భర్త ఓంకార్ పనిమీద నారాయణపేటకు వెళ్లడంతో ప్రయాణం వాయిదా పడింది. దీంతో పిల్లలు, తల్లి, మేనత్త పద్మ, మరో బంధువు సత్యమ్మతో కలసి రజిష్ట సాయంత్రం దుస్తులు ఉతకడానికి తమ పొలానికి వెళ్లారు. పక్కనే ఉన్న ఆసిరెడ్డి చెరువులో ముందుగా రజిష్ట ఇద్దరు పిల్లలు, పద్మ పిల్లలు ఇద్దరికి స్నానం చేయించి ఒడ్డుపై కూర్చోబెట్టారు. తర్వాత దుస్తులు ఉతికి పక్కనే ఆరేస్తుండగా వారికి తెలియకుండా రజిష్ట రెండో కుమార్తె ప్రీతి (13), కుమారుడు రోహిత్ (11) చెరువులోకి దిగారు. లోతు ఎక్కువ ఉండటంతో వారు మునిగిపోతుండటాన్ని గమనించిన మరో ఇద్దరు చిన్నారులు మంగళ, రాజమ్మ వారిని కాపాడేందుకు వెళ్లి వారు సైతం నీళ్లలో పడిపోయారు. పిల్లలు గట్టిగా కేకలు వేయడంతో రజిష్ట, ఆమె బంధువులు నీళ్లలోకి దిగారు. ఇంతలో అటుగా వచ్చిన పశువుల కాపరి దస్తప్ప, మరో నలుగురు నీటిలోకి దూకి రజిష్ట, పద్మలతోపాటు ఇద్దరు చిన్నారులను కాపాడారు. ముందుగా దిగిన ఇద్దరు చిన్నారులు నీళ్లలో మునిగి మృతిచెందారు. అనంతరం గ్రామస్తులు, పోలీసులు వచ్చి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భర్తను చంపి.. బావిలో పడేసి..

- కామారెడ్డి జిల్లాలో మహిళ ఘాతుకం
- రైతుబీమా కోసమేనని అనుమానాలు



లాల్ సింగ్

పిట్లం (జుక్కల్): కట్టుకున్న భర్తను చంపి బావిలో పడేసి.. కనిపించకుండా పోయినట్లు నమ్మించే ప్రయత్నం చేసిందో ఇల్లాలు. కామారెడ్డి జిల్లాలో ఈ ఘటన జరిగింది. మాలోత్ తండాకు చెందిన బాదావత్ లాల్‌సింగ్ (44) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల ఆటో చెడిపోవడంతో డబ్బులు లేక మరమ్మతులు చేయించ లేదు. లాల్‌సింగ్ ఖాళీగా తిరుగుతుండడంతో విసిగిపోయిన భార్య సుశీల.. భర్తను తీసుకుని శుక్రవారం పిట్లం మండలం సిద్దాపూర్ తండాలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ భర్తతో మద్యం తాగించింది. అనంతరం సోదరుడు, మరో వ్యక్తి సాయంతో అతని తలపై బండరాయితో కొట్టి చంపి, కాళ్లు చేతులు వైర్‌తో కట్టేసి, సంచిలో చుట్టి సిద్దాపూర్ గేట్ వద్దనున్న బావిలో పడేసింది. శనివారం లింగంపేట్ మండలంలోని మాలోత్ తండాకు వెళ్లి, భర్త ఎక్కడకు వెళ్లాడో తెలియడం లేదని తండావాసులను నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే తండావాసులకు అనుమానం వచ్చి గట్టిగా ప్రశ్నించగా నిజం ఒప్పుకుంది. దీంతో తండావాసులు ఆమెను లింగంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించారు. వారు పిట్లం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆదివారం మృతదేహన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా రైతుబీమా డబ్బుల కోసమే భార్య ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి

- గోదావరిలో మరో యువకుడి గల్లంతు
- సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఘటనలు



రాంచందర్

న్యాల్‌కల్ (జహీరాబాద్)/బాల్కొండ: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ఓ యువకుడు మృతి చెందగా, మరో ఘటనలో ఓ యువకుడు గోదావరిలో పడి గల్లంతయ్యాడు. సంగారెడ్డి జిల్లా హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. అమీరాబాద్‌కు చెందిన రాంచందర్ (36), రాఘవాపూర్‌కు చెందిన తన మిత్రుడు కిరణ్‌తో కలసి ఈనెల 6న ఉదయం బైక్‌పై శంకరంపేట్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. కిరణ్.. చాల్కి చౌరస్తా వద్ద దిగి తన ఇంటికి వెళ్లిపోయాడు. రాంచందర్ ఒక్కడే బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఆ సమయంలో చాల్కి సమీపంలోని కల్వర్టు పైనుంచి చౌట వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయితే రాంచందర్ వాగు ప్రవాహ ఉధృతిని గమనించక దానిని దాటే క్రమంలో ప్రమాద వశాత్తు నీటిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. మర్నాడు అతని మృతదేహం కొంతదూరంలో వాగుపక్కన ఉన్న చెట్టుకొమ్మలకు చిక్కుకుని కనిపించింది. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం జహీరాబాద్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.



ఫిరోజ్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన యువకుడి గల్లంతు: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గోదావరిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై నారాయణ కథనం ప్రకారం.. ముంబైకి చెందిన ఫిరోజ్ (28) అనే యువకుడు రెండు రోజుల క్రితం జగిత్యాల జిల్లా కోరుట్లలోని తన బంధువు ఇంటికి వచ్చాడు. ఆదివారం మిత్రులతో కలసి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శించిన ఫిరోజ్.. గోదావరి నదిలోకి దిగి, ప్రమాదవశాత్తూ నీటిలో కొట్టుకుపోయాడు. అతని మిత్రుడు రోహిత్ వెంటనే నీటిలోకి దూకి ఫిరోజ్‌ను కాపాడటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఫిరోజ్ కొట్టుకుపోయాడు. కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

అమ్మా! వద్దు.. వద్దంటున్నా..

- ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య
- కూతురు వారించినా ఆగని తల్లి
- పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఘటన



మాధవి

గోదావరిఖని: 'అమ్మా.. వద్దు వద్దు! నువ్వు ఏం జేస్తున్నవో నాకు తెలుస్తలేదు.. ఆ పని చేయొద్దమ్మా.. నాకు భయమేస్తుంది అమ్మా!'అని కూతురు వారిస్తున్నా వినకుండా ఓ వివాహిత, ఓ వ్యక్తితో వీడియోకాల్‌లో మాట్లాడుతూనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో శనివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం మూలసాల గ్రామానికి చెందిన చొప్పరి అంజయ్య, మాధవి భార్యాభర్తలు. ఉపాధి కోసం వారు పదేళ్ల క్రితం గోదావరిఖని విఠల్‌నగర్‌కు వలస వచ్చారు. అంజయ్య సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. వీరికి ఏడేళ్ల వయసున్న రితిక అనే కూతురు ఉంది. తిలక్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి ఎండీ యూసుఫ్ కుటుంబసభ్యులతో అంజయ్య, మాధవి కుటుంబానికి ఎనిమిదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో యూసుఫ్ తరచూ వీరి ఇంటికి వచ్చివెళ్లేవాడు. మాధవి, యూసుఫ్ ఫోన్‌లో కూడా మాట్లాడుకునేవారు. అంజయ్య శనివారం ఉదయం సెంట్రింగ్ పనులు చేసేందుకు గోదావరిఖని సమీపంలోని సుందిళ్ల గ్రామానికి వెళ్లాడు. ఏం జరిగిందో ఏమోకానీ.. యూసుఫ్‌తో వీడియోకాల్‌లో మాట్లాడుతూనే ఉదయం 10 గంటల సమయంలో మాధవి (30) ఉరివేసుకుంది. ఉరివేసుకుంటుండగా పక్కనే ఉన్న ఆమె కూతురు అమ్మా వద్దు వద్దు.. అని వారించినా వినలేదు. తన భార్య మరణం విషయంలో యూసుఫ్‌పై అనుమానంగా ఉందని మృతురాలి భర్త అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

నలిమెలకు కాళోజీ పురస్కారం

- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. నేడు సీఎం చేతులమీదుగా ప్రదానం



నలిమెల భాస్కర్

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల)/కరీంనగర్ కల్చరల్: బహుభాషావేత్త, కవి, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత నలిమెల భాస్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదికిగాను ప్రజాకవి కాళోజీ పురస్కారం ప్రకటించింది. సోమవారం కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందజేయనుంది. పురస్కారంతోపాటు రూ. లక్ష నగదు, శాలువాతో సత్కరించనుంది. మట్టిబిడ్డకు పురస్కారం రావడంపై సాహితీప్రియులు, భాస్కర్ స్వస్థలం నారాయణపూర్‌లో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాటకాల నుంచి రచనల వైపు

నలిమెల భాస్కర్ స్వస్థలం ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్. నలిమెల రామచంద్రం–బుచ్చమ్మ దంపతులకు 1956 ఏప్రిల్ 1న జన్మించారు. పాఠశాల విద్య మొత్తం సింగారం, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో చదివారు. ఇంటర్, డిగ్రీ కామారెడ్డిలో చదివారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ, ఎంఫిల్ చదివి లెక్చరర్ ఉద్యోగం సాధించారు. ఇంటర్ చదివే రోజుల్లోనే నారాయణపూర్ ఆయన నాటకాలు వేసేవారు. ఆ ప్రేరణతోనే సాహిత్యంపై మక్కువ కలిగి రచనలు చేశారు. ఇలా క్రమంగా 14 భాషలపై పట్టు సాధించి.. ఆయా భాషల్లోని పలు రచనలను అనువదించారు. అనువాదంపై పీహెచ్‌డీ చేశారు. 2013లో అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. మలయాళ రచన 'స్మారక శిశిగల్'న వలను తెలుగులో 'స్మారక శిలలు'పేరిట అనువదించారు. పీవీ నరసింహారావు తర్వాత అనువాద సాహిత్యంలో అవార్డు అందుకున్న రెండో రచయిత నలిమెల భాస్కర్ కావడం విశేషం.

తెలంగాణ పదకోశంతో మరింత గుర్తింపు

మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో 2003లో నలిమెల భాస్కర్ రచన 'తెలంగాణ పదకోశం'ఎంతో గుర్తింపు పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు, తెలంగాణ సాహిత్యకారులకు, రచయితలకు ఈ గ్రంథంలోని పదాలు తెలంగాణ యాస, భాష, ఇక్కడి ప్రజల జీవన విధానాన్ని తెలిపేందుకు ఉపయోగపడింది.

ధిక్కారమే జీవితంగా గడిపిన ప్రజాకవి కాళోజీ: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: జీవితాంతం ప్రజాపక్షాన నిలిచి ధిక్కారమే జీవితంగా గడిపిన మానవతావాది, అక్షర తపస్వి కాళోజీ నారాయణరావు అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం తాను బయలుదేరిన నాడు నిండు మనసుతో కాళోజీ దీవించారని గుర్తు చేసుకున్నారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నాటి తమ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తెలంగాణ సాహిత్యంలో విశేషంగా కృషి చేసిన వారికి కాళోజీ పురస్కారాన్ని ఏర్పాటు చేసుకొని సాహితీవేత్తలను గౌరవించుకుంటున్నామన్నారు. వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ పేరు పెట్టుకున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తిరిగొచ్చిన స్టార్‌లైనర్

సునీత, విల్మోర్ లేకుండా ఖాళీగానే ఐఎస్ఎస్ నుంచి భూమికి

వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌తో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లిన స్టార్ లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ ఒంటరిగానే తిరిగొచ్చింది. ఆరు గంటల ప్రయాణం తర్వాత స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం 9.31 గంటలకు అమెరికాలో న్యూమెక్సికో ఎడారిలోని వైట్ శాండ్ స్పేస్ హార్బర్ సమీపంలో క్షేమంగా దిగింది. ఐఎస్ఎస్ నుంచి కేవలం 10 రోజుల్లో తిరిగి రావాల్సిన స్టార్ లైనర్ సాంకేతిక లోపాల వల్ల మూడు నెలలకు పైగా ఆలస్యంగా భూమిపై అడుగుపెట్టింది. స్టార్ లైనర్‌లో వెనక్కి రావాల్సిన సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వారు భూమిపైకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. అప్పటి దాకా ఐఎస్ఎస్‌లోనే ఉండి, అంతరిక్ష పరిశోధనల్లో పాలుపంచుకోనున్నారు. ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో వ్యోమగాములతో అంతరిక్షంలోకి వెళ్లి, ఒంటరిగా తిరిగివచ్చిన మొట్టమొదటి స్పేస్‌క్రాఫ్ట్‌గా స్టార్ లైనర్ రికార్డుకెక్కింది.

ఏమిటీ స్టార్ లైనర్?

ప్రఖ్యాత బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన తొలి అంతరిక్ష వాహక నౌక స్టార్ లైనర్. ఈ ఏడాది జూన్ 5వ తేదీన ప్రయోగాత్మకంగా ఇద్దరు వ్యోమగాములతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపించారు. సునీతా విలియమ్స్, విల్‌మోర్ స్టార్ లైనర్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. ప్రయాణం మధ్యలో ఉండగానే సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఇంజన్‌లోని కొన్ని థ్రస్టర్లు విఫలమయ్యాయి. హీలియం గ్యాస్ లీకైనట్లు గుర్తించారు. తాత్కాలిక మరమ్మత్తులతో స్టార్ లైనర్ ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. వాస్తవానికి సునీతా విలియమ్స్, విల్‌మోర్ 8 రోజుల పాటు అక్కడే ఉండి, ఇదే స్టార్‌లైనర్‌లో వెనక్కి తిరిగిరావాలి. మరమ్మత్తులు చేయడం సాధ్యం కాకపోవడంతో వారిని వెనక్కి తీసుకొచ్చే అవకాశం లేకుండాపోయింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన 'డ్రాగన్' స్పేస్ క్రాఫ్ట్‌లో వారిద్దరూ భూమిపైకి తిరిగి రానున్నారు. 'డ్రాగన్'లో నలుగురు వ్యోమగాములు ప్రయాణించడానికి వీలుంది. కానీ, ఇద్దరే ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. వచ్చేటప్పుడు సునీతా విలియమ్స్, విల్‌మోర్‌ను కూడా తీసుకురానున్నారు. - వాషింగ్టన్


ఐఎస్ఎస్ నుంచి విడివడుతూ...
నేలకు దిగగానే నాసా సిబ్బంది పరీక్షలు
అమెరికాలోని న్యూ మెక్సికోలో ప్యారాచూట్ల సాయంతో భూమికి దిగుతున్న స్టార్‌లైనర్

ఖేడ్కర్ ఇక 'మాజీ ఐఏఎస్'



న్యూఢిల్లీ: తప్పుడు ధృవీకరణ పత్రాలతో అక్రమంగా సివిల్స్ ప్రవేశ పరీక్ష రాసి దివ్యాంగుల కోటాలో మెరుగైన ర్యాంక్ సాధించి ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. అఖిల భారత సర్వీస్ అయిన 'ఐఏఎస్' హోదా నుంచి ఆమెను తప్పిస్తున్నట్లు ప్రకటించింది. తక్షణం నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్రం సెప్టెంబర్ ఆరోతేదీన విడుదలచేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో ప్రొబెషనరీ ట్రైనీ ఐఏఎస్ అధికారిణి వివాదం దాదాపు ముగిసిపోయింది. ప్రొబేషన్‌లో ఉన్న వ్యక్తి పూర్తికాల సర్వీస్‌కు అనర్హుడని తేలితే శాశ్వతంగా తప్పించేందుకు వీలు కల్పించే నిబంధన ప్రకారం ఆమెను తొలగిస్తున్నట్లు కేంద్రం ఆ ప్రకటనలో పేర్కొంది.

పీఓకే ప్రజలారా.. భారత్‌లో కలవండి

- మిమ్మల్ని సొంత వాళ్లలా చూసుకుంటాం
- మిమ్మల్ని విదేశీయుల్లా పాక్ భావిస్తోంది
- జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్


ఆదివారం కశ్మీర్‌లో రాజ్‌నాథ్‌కు స్వాగతం

జమ్మూ/బనిహాల్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రామ్‌బాన్ నియోజకవర్గంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. ''ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడి యువత పిస్టల్, రివాల్వర్ పట్టుకోవడం వదిలేసి ల్యాప్‌టాప్ పట్టుకుంటున్నారు. కంప్యూటర్లు వినియోగిస్తున్నారు. బీజేపీకి మద్దతు పలికితే తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి ఇక్కడ మరింత అభివృద్ధిని సాకారం చేస్తాం. ఇక్కడి అభివృద్ధిని చూసి పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) ప్రజలు సైతం భారత్‌తో కలిసిపోతే బాగుంటుంది అని ఖచ్చితంగా అనుకుంటారు. నాదీ గ్యారెంటీ'' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. పీఓకే ప్రజలను భారత్‌లో విలీనానికి పిలుపునిచ్చారు. ''పీఓకే ప్రజలకు నేను చెప్పేదొకటే. పాకిస్తాన్ మిమ్మల్ని విదేశీయుల్లా భావిస్తోంది. పాక్ ప్రభుత్వం స్వయంగా ఈ విషయం ఒప్పుకుందికూడా. ఇటీవల పాక్ అదనపు సొలిసిటర్ జనరల్ ఒక విషయంలో సమర్పించిన అఫిడవిట్‌లో పీఓకే అనేది ఎప్పటికీ పాక్‌కు విదేశీ భూభాగమే అని స్పష్టంగా పేర్కొన్నారు. మిమ్మల్ని భారత్ తన సొంత మనుషుల్లా చూసుకుంటుంది. అందుకే రండి. మాతో కలవండి'' అని రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

ఉగ్రవాదం ఆపేస్తే చర్చలకు సిద్ధం

జమ్మూకశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదాన్ని ఎగదోయడం పూర్తిగా ఆపేస్తే ఆ దేశంతో చర్చలకు భారత్ సిద్ధమని రాజ్‌నాథ్ ప్రకటించారు. ''ఉగ్రవాదానికి మద్దతు పలకడం అనే చెడ్డపనిని పాక్ ఆపేయాలి. పొరుగు దేశాలతో సత్సంబంధాల మెరుగు కోసం ప్రతి దేశం ప్రయత్నిస్తుంది. ఎందుకంటే మనం మన మిత్రుడిని మార్చుకోగలంగానీ పొరుగు దేశాన్ని కాదుకదా. పాక్‌తో బంధం బలపడాలనే కోరుకుంటున్నాం. ముందుగా పాక్ ఉగ్రవాదాన్ని వీడాలి. ఉగ్రవాదాన్ని కశ్మీర్‌లో ఆపినప్పుడే చర్చలు పట్టాలెక్కుతాయి. ఇక్కడ ఉగ్రవాదం కోరల్లో చిక్కుకున్న వారిలో 85 శాతం మంది ముస్లింలే ఉన్నారు. ఉగ్రఘటనల్లో ముస్లింలే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే ఉగ్రవాదం బాటలో పయనించి ప్రాణాలు పోగొట్టుకోకండి'' అని రాజ్‌నాథ్ హితవు పలికారు.

వామ్మో మంకీపాక్స్!


భారత్‌లో అనుమానిత కేసు

వైరస్ ఉన్న దేశం నుంచి వచ్చిన యువకునిలో లక్షణాలు | ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స | ఆందోళన అవసరం లేదు: కేంద్రం

ప్రపంచ దేశాలను వణికిస్తున్న ప్రాణాంతక మంకీపాక్స్ (ఎంపాక్స్) వైరస్ సెగ భారత్‌కూ తాకింది. మన దేశంలో తాజాగా 'అనుమానిత' ఎంపాక్స్ కేసు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఎంపాక్స్ వ్యాప్తి అధికంగా ఉన్న ఓ దేశం నుంచి వచ్చిన యువకుడిలో వైరస్ లక్షణాలను గుర్తించినట్లు ఆదివారం ప్రకటన విడుదల చేసింది. ''బాధితుడిని ఆసుపత్రిలో చేర్చి ఐసోలేషన్‌లో ఉంచాం. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అతడితో కలిసి ప్రయాణించిన వ్యక్తులను గుర్తిస్తున్నాం. అతనికి నిజంగా ఎంపాక్స్ సోకిందీ లేనిదీ నిర్ధారించడానికి నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నాం'' అని పేర్కొంది. ''ఇది అనుమానిత కేసే. ఇంకా నిర్ధారణ కాలేదు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'' అని తెలిపింది. వైరస్ విషయంలో ఏ పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు వివరించింది.

99,176 కేసులు.. 208 మరణాలు

యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఇటీవల మంకీపాక్స్ వైరస్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దాంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ మంకీపాక్స్‌ను 'అంతర్జాతీయ ఆరోగ్య విపత్తు'గా ఆగస్టు 14న ప్రకటించింది. ఈ వైరస్ వ్యాప్తి 2022లో వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఆఫ్రికాలో కొత్త రకం ఎంపాక్స్ పుట్టుకొచ్చినట్లు తేలింది. 2022 వైరస్ కంటే ఇది మరింత ప్రాణాంతకమని తేలింది. కొత్త వైరస్ లైంగిక సంబంధాల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు. 2022 నుంచి 2023 దాకా 116 దేశాల్లో 99,176 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. 208 మంది మరణించారు. 2024లో 15,600కు పైగా కేసులు నమోదయ్యాయి. 537 మంది మృతిచెందారు. 2022 నుంచి భారత్‌లో కనీసం 30 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. చివరిసారిగా ఈ మార్చి నెలలో ఒక కేసు బయటపడింది.



ఇలా సోకుతుంది

- అప్పటికే వైరస్ సోకిన మనుషులు లేదా జంతువులను తాకినా, వారితో దగ్గరగా గడిపినా వైరస్ సోకుతుంది.
- కుక్క లేదా ఇతరత్రా పెంపుడు జంతువులకు వైరస్ సోకితే అవి మనుషులను కరిచినా, తాకినా, వాటి లాలాజలం, రక్తం, ఇతర స్రావాలు అంటుకున్నా సోకుతుంది.
- చర్మంపై గాయాలు, శరీర స్రావాలు, తుమ్మినపుడు పడే తుంపర్లు, నోటి లాలాజలం ఇలా వైరస్‌కు ఆవాసయోగ్యమైన ప్రతి తడి ప్రాంతం నుంచీ సోకుతుంది.
- రోగి వాడిన దుస్తులు, వస్తువులను ముట్టుకున్నా, వాడినా, ముఖాన్ని ముఖంతో తాకినా, కరచాలనం చేసినా, ముద్దుపెట్టుకున్నా సోకొచ్చు.
- తల్లి నుంచి బిడ్డకు సంక్రమించవచ్చు.

వ్యాధి లక్షణాలు ఏమిటీ?

- ఎంపాక్స్ సోకితే చర్మం ఎర్రగా మారి పొక్కులొస్తాయి. సొన చేరి పొక్కులు ఇబ్బంది పెడతాయి.
- చర్మంపై దద్దుర్లతోపాటు జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాల నొప్పి, వెన్ను నొప్పి వస్తాయి.
- 90 శాతం కేసుల్లో ముఖంపై, 75 శాతం కేసుల్లో అరచేతులు, పాదాల మీద, 30 శాతం కేసుల్లో జననాంగాల మీద పొక్కులొస్తాయి.
- నీటి బొడిపెలుగా పెద్దవై సొన చేరి ఎర్రగా, నల్లగా మారి పగులుతాయి.
- నీరసంగా ఉంటుంది. గొంతెండిపోతుంది.

ఏమిటీ ఎంపాక్స్?



1958లో తొలిసారిగా కోతుల్లో ఈ వైరస్‌ను కనుగొన్నారు. అందుకే దీనికి మంకీపాక్స్ పేరు స్థిరపడిపోయింది. అప్పట్లో పరిశోధన కోసం డెన్మార్క్‌కు తరలించిన కోతుల్లో కొత్త రకం వ్యాధి లక్షణాలు కనిపించడంతో ల్యాబ్ పరీక్షలు జరిపి ఈ వైరస్ ఉనికి కనిపెట్టారు. మనుషుల్లో దీన్ని 1970లో తొలిసారిగా గుర్తించారు. కాంగోలో తొమ్మిదేళ్ల బాలుడికి ఈ వైరస్ సోకింది. మనుషులు, చిట్టెలుకలకూ వైరస్ సోకుతుండటంతో ఎంపాక్స్ అనే పొట్టిపేరు ఖరారుచేశారు. దశాబ్దాల క్రితం లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న మశూచి కారక వైరస్, ఎంపాక్స్ ఒకే జాతికి చెందినవి. గోవులకు సోకే గో మశూచి, వసీనియా వంటి వ్యాధులను కల్గించే వైరస్ కూడా ఈ రకానిదే.

వ్యాక్సిన్ ఉందా?



స్వల్ప లక్షణాలు కనిపిస్తే వ్యాధి దానంతట అదే తగ్గిపోతుంది. ప్రస్తుతానికి ఎంపాక్స్‌కు నిర్దిష్టమైన చికిత్స విధానం, వ్యాక్సిన్ లేవు. మశూచికి వాడే టికోవిరమాట్ (టీపీఓఎక్స్ఎక్స్) యాంటీ వైరల్‌నే దీనికీ వాడుతున్నారు. అమెరికాలో మశూచికి వాడే జెనియోస్ (ఇమ్వామ్యూన్, ఇంవానెక్స్) డ్రగ్స్‌నే 18 ఏళ్ల పై బడిన రోగులకు ఇస్తున్నారు. కోవిడ్ దెబ్బకు సంపన్న దేశాల్లో మాదిరిగా నివారణ చర్యలు, నిర్ధారణ పరీక్షల వంటివి లేక ఆఫ్రికా దేశాల్లో వైరస్ విజృంభిస్తోంది.

అప్రమత్తంగా ఉండండి: కేంద్రం

పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల్లో ఎంపాక్స్ కేసులు పెరిగిపోతుండటంతో సరిహద్దులతోపాటు ఎయిర్‌పోర్టులు, ఓడరేవుల్లో అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సర్క్యులర్ జారీ చేసింది. ఎంపాక్స్ లక్షణాలు గుర్తించడానికి విదేశాల నుంచి వచ్చేవారికి పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ఎంపాక్స్ సన్నద్ధతపై ప్రధాని ముఖ్య కార్యదర్శి పి.కె. మిశ్రా తాజాగా ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. ఈ కేసుల్లో సమర్థ చికిత్స కోసం ఆసుపత్రులను ఇప్పట్నుంచే సిద్ధం చేసుకోవాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

నిర్భయంగా శ్వాసించండి!

- పలు నగరాల్లో బాగా మెరుగవుతున్న గాలి నాణ్యత
- ఎన్‌సీఏపీ పరిధిలోని 95 శాతం నగరాల్లో సత్ఫలితాలు: కేంద్రం
- జాబితాలో హైదరాబాద్, రాజమండ్రి, కర్నూలు, కడప, నల్లగొండతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు నగరాల్లో గాలి నాణ్యత మెరుగుపడుతున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) తెలియజేసింది. జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం(ఎన్‌సీఏపీ) పరిధిలో 131 నగరాలుండగా, వీటిలో 95 శాతం నగరాల్లో గాలి నాణ్యత మెరుగైనట్లు వెల్లడించింది. 2017-18 నాటి 'పీఎం10' స్థాయిలతో పోలిస్తే ఇప్పుడు 21 నగరాల్లో 'పీఎం10' స్థాయిలు 40 శాతానికి పైగా తగ్గినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు సీపీసీబీ తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది.

- ఎన్‌సీఏపీ పరిధిలోని 131 నగరాలను గాను కేవలం 18 నగరాల్లో గాలి నాణ్యత ప్రమాణాల మేరకు నమోదైంది. ఎన్ఏఏక్యూఎస్ ప్రకారం 'పీఎం10' ధూళి కణాలుక్యూబిక్ మీటర్‌కు 60 మైక్రోగ్రాముల్లోపు ఉండాలి.
- కడప, వారణాసి, ధన్‌బాద్, డెహ్రాడూన్, ట్యుటికోరిన్, మొరాదాబాద్, కోహిమా, లక్నో, కాన్పూర్, ఆగ్రా, గ్రేటర్ ముంబై తదితర 21 నగరాల్లో 'పీఎం10' స్థాయిలు 40 శాతానికి పైగా తగ్గాయి.
- విజయవాడ, అహ్మదాబాద్, ఘజియాబాద్, రాజ్‌కోట్, రాయ్‌బరేలీ, కోల్‌కతా, జమ్మూ, సిల్చార్, దిమాపూర్, జోధ్‌పూర్ తదితర 14 నగరాల్లో పీఎం10 స్థాయిలు 30 నుంచి 40 శాతం తగ్గిపోయాయి.
- హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, దుర్గాపూర్, డేరాబాబా నానక్, వడోదర, అలహాబాద్, అసన్‌సోల్, గోరఖ్‌పూర్, రాంచీ, బెంగళూరు, అకోలా, సూరత్, నోయిడా తదితర నగరాల్లో పీఎం10 స్థాయిలు 30 శాతం దాకా పడిపోయాయి.
- రాజమండ్రి, ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, అమరావతి, ఢిల్లీ, హౌరా, థానే, లాతూర్, అల్వార్, మండీ గోవింద్‌గఢ్, పటియాలా, జైపూర్, చంద్రపూర్, నాసిక్, ఝాన్సీ, సాంగ్లీ తదితర 21 నరగాల్లో పీఎం10 స్థాయిలు 10 నుంచి 20 శాతం తగ్గిపోయాయి.
- గాలిలో సూక్ష్మ ధూళి కణాల కాలుష్యాన్ని 2024 నాటికి 20 నుంచి 30 శాతానికి తగ్గించాలన్న లక్ష్యంతో ఎన్‌సీఏపీ కార్యక్రమాన్ని 2019లో ప్రారంభించారు. 2017 నాటి కాలుష్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు.
- 10 లక్షలకుపైగా జనాభా ఉన్న నగరాల్లో వాయు నాణ్యత మెరుగుదల ర్యాంకింగ్‌లో సూరత్, జబల్పూర్ టాప్‌లో ఉన్నాయి.
- 3 లక్షల నుంచి 10 లక్షల జనాభా ఉన్న నగరాల్లో వాయు నాణ్యత మెరుగుదల ర్యాంకింగ్‌లో ఫిరోజాబాద్(ఉత్తరప్రదేశ్), అమరావతి(మహారాష్ట్ర), ఝాన్సీ(ఉత్తరప్రదేశ్) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
- 3 లక్షల లోపు జనాభా ఉన్న నగరాల్లో రాయ్‌బరేలీ(యూపీ), నల్లగొండ (తెలంగాణ) టాప్ ర్యాంకులు సాధించాయి.
- వాయు నాణ్యతను మెరుగుపర్చడంలో ప్రతిభ చూపిన నగరాలకు కేంద్ర పర్యావరణ శాఖ శనివారం జైపూర్‌లో 'నేషనల్ క్లీన్ ఎయిర్ సిటీ అవార్డులు' ఇచ్చింది.

టీఎంసీకి, రాజ్యసభకు ఎంపీ జవహర్ గుడ్‌బై



కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి, రాజ్యసభకు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆ పార్టీ ఎంపీ జవహర్ సర్కార్ ఆదివారం ప్రకటించారు. వైద్యురాలి హత్యోదంతంలో సత్వర చర్యలు తీసుకోవడంలో మమత సర్కారు వైఫల్యానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ''నేనో రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని. బీజేపీ మోదీ నియంతృత్వ పాలనను తూర్పారబట్టేందుకు ఎంపీగా కొనసాగా. కానీ టీఎంసీలో అవినీతి పెచ్చరిల్లింది. నేతలు, అధికారులు పేట్రేగిపోతున్నారు'' అంటూ టీఎంసీ చీఫ్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు.

యూట్యూబ్ చూస్తూ ఆపరేషన్

మరణించిన 15 ఏళ్ల బాలుడు ● పరారైన నకిలీ వైద్యుడు



పట్నా: నకిలీ వైద్యుల చేతుల్లో అమాయక రోగులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆగట్లేవు. నకిలీడాక్టర్ యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ 15 ఏళ్ల బాలుడికి శస్త్రచికిత్స చేయబోయి అతని ప్రాణాలు తీసిన ఘటన తాజాగా బిహార్‌లో వెలుగుచూసింది. పరారైన నకిలీ వైద్యుడు, ఆస్పత్రి సిబ్బందిని పట్టుకునేందుకు పోలీసులు వేట మొదలుపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరణ్ జిల్లాలోని మఢౌరా పట్టణంలో నకిలీ డాక్టర్ అజిత్ కుమార్ పురి 'శ్రీ గణపతి హాస్పిటల్' పేరిట ఒక వైద్యశాల నిర్వహిస్తున్నాడు. 15 ఏళ్ల కృష్ణకుమార్ వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతుండటంతో శుక్రవారం రాత్రి అతడిని కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. కాసేపటికి వాంతులు తగ్గినా పిత్తాశయంలో రాళ్లున్నాయని, ఆపరేషన్ తప్పదని వైద్యుడు చెప్పాడు. తండ్రి వారించినా బలవంతంగా ఆపరేషన్ చేశాడు. బాలుడు విపరీతమైన నొప్పితో బాధపడుతుండటంతో నిలదీయగా గద్దించి పంపించేశాడు. ఇంటికెళ్లాక బాలుడు స్పృహ కోల్పోవడంతో మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడం ముందే పసిగట్టిన వైద్యుడు వెంటనే పట్నా తీసుకెళ్లాలని సూచించాడు. మార్గమధ్యంలోనే బాలుడు కన్నుమూశాడు. ''వైద్యునికి ఎలాంటి అర్హత లేదని మాకు తెలీదు. యూట్యూబ్ చేస్తూ ఆపరేషన్ చేశాడు. తర్వాతే విషయం మాకు అర్థమైంది'' అని బాలుడి తాత ప్రహ్లాద్ ప్రసాద్ షా ఆరోపించారు.

బీజేపీ హిందూ ఓటర్లను భయపెడుతోంది

ఎన్‌సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఆరోపణలు



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని హిందూ ఓటర్లను భయపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఆరోపించారు. ఎన్‌సీ-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఉగ్రవాదం మళ్లీ పెరుగుతుందంటూ తప్పుదోవ పట్టిస్తోందన్నారు. జమ్మూలో ఆదివారం ఎన్‌సీ వ్యవస్థాపకుడు షేక్ అబ్దుల్లా 42వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులర్పించిన ఫరూక్ అనంతరం మీడియాతో మాట్లాడారు. 'బీజేపీ వాళ్లు ఆర్టికల్ 370 రద్దు చేశారు. ఉగ్రవాదం అంతమైందా? అది మళ్లీ పెరిగిపోయింది. ఇందుకు బీజేపీదే పూర్తి బాధ్యత'అని ఫరూక్ అన్నారు. కశ్మీర్‌ను పట్టించుకోని వాళ్లు ఇక్కడికి ఎందుకు రావాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. 'కశ్మీరీలకు మంచి పాలన అందించడమే మా లక్ష్యం. బీజేపీ సృష్టించాలనుకునే భారత్‌కు మేం వ్యతిరేకం. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు..ఇలా భారత్ అందరిదీ. మేం ఆక్రమణదారులం కాదు. మంగళసూత్రాలను లాక్కోం. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింలు కూడా సమానపాత్ర పోషించారు'అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు.

అమెరికా డ్రోన్ నేలమట్టం!

కుప్పకూల్చేశామన్న యెమెన్ హౌతీ రెబల్స్

దుబాయ్: అక్రమంగా తమ గగనతలంపై చక్కర్లు కొడుతున్న అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను మారిబ్ ప్రావిన్స్‌లో కుప్పకూల్చామని యెమెన్‌లోని హౌతీ వేర్పాటువాదులు ఆదివారం ప్రకటించారు. దాదాపు రూ.252 కోట్ల విలువైన అత్యంత అధునాతన డ్రోన్‌గా ఎంక్యూ-9 రీపర్‌కు పేరుంది. దాదాపు 50,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తూ ఏకధాటిగా 24 గంటలపాటు చక్కర్లు కొట్టగలదు. అత్యంత ఎత్తుల్లో ఎగురుతూ నిఘా పెట్టి కీలక సమాచారాన్ని అమెరికా సైన్యం, సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ)లకు అందిస్తుంది. ఇంతటి కీలక డ్రోన్‌ను కోల్పోవడం అమెరికాకు దెబ్బే. 2014లో యెమెన్ రాజధాని సనాను ఆక్రమించాక ఇన్నాళ్లలో జనరల్ ఆటమిక్స్ తయారీ పలు రీపర్‌డ్రోన్లను రెబల్స్ కూల్చేశారు. కూల్చిన డ్రోన్ ఫొటోలను రెబల్స్ విడుదలచేయలేదు. ఎలా కూల్చిందీ వివరించలేదు.

దేశాభివృద్ధిలో పార్శీలది కీలక పాత్ర: అమిత్ షా

ముంబై: దేశాభివృద్ధిలో పార్శీల సహకారం అపారమైనదని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ ప్రయాణంలో గుజరాతీ వార్తా పత్రిక 'ముంబై సమాచార్'పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. 'ముంబై సమాచార్-200 నాటౌట్'డాక్యుమెంటరీ విడుదల సందర్భంగా ఆదివారం ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. ఈ డాక్యుమెంటరీ ఏకకాలంలో 40 దేశాల్లో విడుదలైంది. 200 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ముంబై సమాచార్ ఆసియాలోనే అత్యంత పురాతన వార్తా పత్రికగా నిలిచింది. విశ్వసనీయత కలిగిన జర్నలిజానికి 'కామా'కుటుంబం మారుపేరుగా నిలిచిందని అమిత్ షా కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర, నిష్పాక్షిక రిపోర్టింగ్ పత్రిక నిబద్ధతకు, శాశ్వత విజయాలకు రహస్యాలని పేర్కొన్నారు. అందులో వచ్చే ప్రతి వార్తా నిజమేనని జనం నమ్మేవారన్నారు.

అమెరికాలో కాల్పులు.. ఏడుగురికి గాయాలు

ఆగంతకుడి కోసం పోలీసుల ముమ్మర గాలింపు

లండన్(యూఎస్ఏ): అమెరికాలోని కెంటకీ రాష్ట్రంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న కాల్పుల ఘటన నిందితుడి కోసం ముమ్మర వేట కొనసాగుతోంది. ఇంటర్ స్టేట్-75పై లండన్ నగరానికి 9 మైళ్ల దూరంలోని లారెల్ కౌంటీలో రోడ్డు ప్రమాదం, అనంతరం జరిగిన కాల్పుల్లో ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. కాల్పులకు కారణమైన జోసెఫ్ ఎ కౌచ్(32) అనే శ్వేతజాతీయుడు అప్పటి నుంచి ఉన్నాడని పోలీసులు వివరించారు. తీవ్రంగా గాలిస్తోంది. అతడున్న ప్రాంతం తెలిసిందని అధికారులు తెలిపారు. వాహనదారులు ఇంటర్ స్టేట్-75, యూఎస్ 25పైకి వెళ్లొద్దంటూ హెచ్చరికలు జారీ చేసిన పోలీసులు..అనంతరం వాటిని ఉపసంహరించుకున్నారు.

వెస్ట్‌బ్యాంక్-జోర్డాన్ సరిహద్దుల్లో కాల్పులు ముగ్గురు ఇజ్రాయెలీలు మృతి

గాజాలో ఐదుగురు పాలస్తీనియన్లు కూడా..

అల్లెన్‌బీ క్రాసింగ్: వెస్ట్‌బ్యాంక్-జోర్డాన్ సరిహద్దుల్లోని అల్లెన్ బీ క్రాసింగ్ వద్ద ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు ఇజ్రాయెలీలు చనిపోయారు. జోర్డాన్ వైపు నుంచి ట్రక్‌లో క్రాసింగ్ వద్దకు చేరుకున్న సాయుధులు భద్రతా బలగాల వైపు కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో ముగ్గురు ఇజ్రాయెలీ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. బలగాల ఎదురుకాల్పుల్లో ఆగంతకుడు చనిపోయాడని ఆర్మీ తెలిపింది. ఘటనపై జోర్డాన్ దర్యాప్తు చేపట్టింది. జోర్డాన్ నదిపై ఈ మార్గాన్ని ఎక్కువగా పాలస్తీనియన్లు, విదేశీ టూరిస్టులు, సరుకు రవాణాకు వినియోగిస్తుంటారు. తాజా ఘటన నేపథ్యంలో ఈ క్రాసింగ్‌ను అధికారులు మూసివేశారు. అమెరికా, పశ్చిమదేశాలకు అనుకూలంగా పేరున్న జోర్డాన్ 1994లో ఇజ్రాయెల్‌లో శాంతి ఒప్పందం చేసుకుంది.

మేం లేకుంటే ఎన్‌సీది ఒంటెత్తు పోకడే



శ్రీనగర్: తన తండ్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ 1980ల్లో జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తుపెట్టుకునే దాకా ఆ పార్టీని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) శత్రువుగా సాగే చూసిందని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆదివారం అన్నారు. పీడీపీ లేకుంటే ఇప్పటికీ ఎన్‌సీ ఒంటెత్తు పోకడలే కొనసాగేవని పేర్కొన్నారు. ''ఎన్‌సీకి అవినీతికి వ్యతిరేకంగా మా తండ్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ పీడీపీని నెలకొల్పి ప్రజలను సంఘటితం చేశారు. ఫరూక్ అబ్దుల్లా సీఎంగా ఉండగా జరిగిన నిరసనలపై పోలీసు కాల్పుల్లో ఆరుగురు అమరులయ్యారు'' అని గుర్తు చేశారు. 'కాంగ్రెస్‌తో మైత్రిని లాభసాటిగా భావించి ఆ పార్టీని ఫరూక్ అబ్దుల్లా బుట్టలో వేసుకున్నారు. సీట్ల పంపకంలో పద్ధతి ప్రకారమైతే కోకర్‌నాగ్ కాంగ్రెస్‌కు దక్కాల్సింది'' అన్నారు.


పపువా న్యూ గినియాలో పర్యటిస్తున్న పోప్ ఆదివారం స్థానిక గిరిజనులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇలా వారి సంప్రదాయ తలపాగాను ధరించారు.

ర్యాలీలతో హోరెత్తిన కోల్‌కతా

కోల్‌కతా: ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్యురాలి హత్యోదంతంపై కోల్‌కతా నగరంలో ఆదివారం మరోమారు నిరసనలు మిన్నంటాయి. విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు, కుమ్మరి కార్మికులు, రిక్షావాలాలు... ఇలా వేర్వేరు రంగాలకు చెందిన వేలాది మంది రోడ్లపైకి వచ్చారు. బాధితురాలి తల్లిదండ్రులు సైతం వీటిలో పాల్గొన్నారు. దోషులకు కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. పలు ర్యాలీలో అమ్మాయిలు దుర్గా మాత వేషాల్లో పాల్గొన్నారు. 'ఇంకెంత కాలం?' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పశ్చిమబెంగాల్‌లోని పలు పట్టణాల్లోనూ నిరసనలు కొనసాగాయి. మరోవైపు, వైద్యురాలి హత్యోదంతంపై రాష్ట్ర కేబినెట్‌ను అత్యవసరంగా సమావేశపరిచి చర్చించాలని మమత సర్కారును గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆదేశించారు.



రిక్షావాలాల నిరసన ర్యాలీ

సాక్షి హైదరాబాద్
సోమవారం ౹ 9 ౹ సెప్టెంబర్ ౹ 2024

పోటెత్తిన భక్తజనం



ఖైరతాబాద్‌లో కొలువైన సప్తముఖ మహాశక్తి గణపతి దర్శనానికి ఆదివారం భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. ఓ వైపు వర్షం కురుస్తున్నా భక్తులు మహా గణపతిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. భక్తులకు స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో 25 వేల లడ్డూలను ఉచితంగా పంపిణీ చేశారు. భక్తులకు ప్రతిరోజూ ఉచిత ప్రసాద పంపిణీ ఉంటుందని దానం తెలిపారు. – ఖైరతాబాద్

జంట జలాశయాలకు భారీ వరద

దిగువన మూసీలోకి నీటి విడుదల

సాక్షి, సిటీబ్యూరో: ఎగువన కురుస్తున్న వర్షాలకు హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు వరద నీరు భారీగా వస్తోంది. ఇప్పటికే జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటున్నాయి. దీనికి తోడు మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేసిన నేపథ్యంలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు జలాశయాలకు సంబంధించి గేట్లు ఎత్తి దిగువన మూసీలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మూసీ నది పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదివారం వివిధ శాఖల అధికారులకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.

హిమాయత్ సాగర్ (రాత్రి 8 గంటల వరకు)

పూర్తి స్థాయి నీటి మట్టం	:1763.50 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:1761.40 అడుగులు
రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం	:2.970 టీఎంసీలు
ప్రస్తుత సామర్థ్యం	:2.504 టీఎంసీలు
ఇన్ ఫ్లో	:1200 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:330 క్యూసెక్కులు
మొత్తం గేట్ల సంఖ్య	:17
ఎత్తిన గేట్ల సంఖ్య	:1

ఉస్మాన్ సాగర్

పూర్తి స్థాయి నీటి మట్టం	:1790.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:1788.60 అడుగులు
రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం	:3.900 టీఎంసీలు
ప్రస్తుత సామర్థ్యం	:3.579 టీఎంసీలు
ఇన్ ఫ్లో	:700 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:226 క్యూసెక్కులు
మొత్తం గేట్ల సంఖ్య	:15
ఎత్తిన గేట్ల సంఖ్య	:2


గండిపేట గేట్లను ఎత్తిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు

తెరుచుకున్న జంట జలాశయాల గేట్లు

భూగర్భ జలాలు పెరిగాయి: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

మణికొండ: రాబోయే రోజుల్లో మరింత వర్షం పడే అవకాశం ఉండటంతో శనివారం సాయంత్రం ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను ఎత్తారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పూజలు నిర్వహించి నీటిని కిందకు వదిలారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత అయిదేళ్లుగా జంట జలాశయాలలో నీరు నిండుగా ఉండటంతో స్థానికంగా భూగర్భజలాలు పెరిగాయన్నారు. మూసీ పరీవాహకంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ పాల్గొన్నారు.

అప్పుల భారం.. బలవన్మరణం

ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆత్మహత్య


నరసింహరాజు (ఫైల్)

ఘట్‌కేసర్/రాంగోపాల్ పేట్: ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆదివారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అంబర్‌పేట్‌కు చెందిన నరసింహరాజు (39) సికింద్రాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆయన భారీగా నష్టపోయారు. నారపల్లిలోని తన ఇంటిని విక్రయించినా అప్పులు తీరలేదు. ఎప్పుడూ అప్పుల గురించి ఆయన తీవ్రంగా మథనపడేవారు. అప్పులు తీరే దారి కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన నరసింహరాజు ఆదివారం వేకువజామున తన బైక్‌పై ఘట్‌కేసర్‌కు వచ్చారు. బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి ఘట్‌కేసర్ హెచ్‌పీసీఎల్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై తల పెట్టి పడుకున్నారు. గుర్తు తెలియని రైలు పైనుంచి వెళ్లడంతో తల మొండెం వేరయ్యాయి. రైల్వే సిబ్బంది సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

10 నుంచి ఇంధన పొదుపు సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే అతిపెద్ద ఇంధన పొదుపు సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12 వరకు మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో జరగనుంది. ఈ కార్యక్రమంలో 23వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్, సీఐఐ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిల్వర్ జూబ్లీ, పవర్ ప్లాంట్ సమ్మిట్–2024, పేపర్ టెక్–2024, గ్రీన్ షుగర్ సమ్మిట్– 2024 వంటి మూడు ప్రధాన రంగాలపై ప్రత్యేక సదస్సులు ఉంటాయని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 1,600 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని, 18 రంగాలకు చెందిన పలు అంశాలు, ఆవిష్కరణలుంటాయని పేర్కొన్నారు.

మరోసారి..

సిటీ కొత్వాల్‌గా ఆనంద్ పునరాగమనం

- ఏడాది కాలంలో 'నాలుగో' సీపీ
- 11 నెలల్లో మారిన ముగ్గురు అధికారులు
- మహారాష్ట్ర తరహాలో డీజీపీ కంటే సీనియర్ కాప్
- 21 ఏళ్ల తర్వాత సీవీ ఆనంద్‌కు అరుదైన అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సీవీ ఆనంద్ మరోసారి నియమితులయ్యారు. కొత్తకోట శ్రీనివాసరెడ్డిని హఠాత్తుగా బదిలీ చేసిన సర్కారు.. కొత్త కొత్వాల్‌గా సీవీ ఆనంద్‌ను తీసుకువచ్చింది. దీంతో ఏడాదిలో ఈయన నాలుగో కమిషనర్‌గా రికార్డులకు ఎక్కారు. మొదటి, నాలుగు స్థానాలు ఆనంద్‌వే కాగా.. మధ్యలో మాత్రం శాండిల్య, శ్రీనివాసరెడ్డి పని చేశారు. మరో విశేషం ఏమిటంటే.. 21 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌కు డీజీపీ స్థాయి అధికారిని సీపీగా నియమించడం. నగరానికి 61వ పోలీసు కమిషనర్‌గా ఆనంద్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు.

2021లో తొలిసారిగా నియామకం..

హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్లకు డీసీపీ, ట్రాఫిక్ విభాగం అదనపు సీపీగా పని చేసిన ఆనంద్ 2021లో తొలిసారిగా సిటీ కొత్వాల్ అయ్యారు. ఆ ఏడాది డిసెంబర్ 25 నుంచి గత ఏడాది అక్టోబర్ 12 వరకు విధులు నిర్వర్తించిన సీవీ ఆనంద్... ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆ మరుసటి రోజు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి గత ఏడాది డిసెంబర్ 13 వరకు సందీప్ శాండిల్య పోలీసు కమిషనర్‌గా వ్యవహరించారు. ఆ మరుసటి రోజు బాధ్యతలు స్వీకరించిన కొత్తకోట శ్రీనివాసరెడ్డిని శనివారం బదిలీ చేసిన ప్రభుత్వం మళ్లీ సీవీ ఆనంద్‌నే కొత్వాల్‌గా నియమించింది.

నగర కమిషనరేట్ చరిత్రలో తొలిసారి..

హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు 177 ఏళ్ల చరిత్ర ఉంది. అయితే సుదీర్ఘకాలం నిజాం ఏలుబడిలో ఉన్న హైదరాబాద్ 1948 సెప్టెంబర్‌లో జరిగిన ఆపరేషన్ పోలోతో దేశంలో విలీనమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 45 మంది పోలీసు కమిషనర్లుగా పని చేశారు. కేవలం రెండు సందర్భాల్లోనే ఏడాదిలో ముగ్గురు కమిషనర్లుగా పని చేశారు. ఈసారి ఆ కాలంలో ఏకంగా నలుగురు మారారు. ఆనంద్‌ది పునరాగమనం అయినప్పటికీ... ఈయన నాలుగో అధికారే. 1990లో మాత్రం మత కలహాలు సహా అప్పటి ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఏడాదిలో నలుగురు పోలీసులు కమిషనర్లుగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఇప్పటి వరకు ఏడుగురికే...

హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ తొలి కొత్వాల్ హసన్ అలీ ఖాన్ నుంచి గత ఏడాది పోలీసు కమిషనర్‌గా వచ్చిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి వరకు మొత్తం 60 మంది అధికారులు ఈ పోస్టులో పని చేశారు. సీవీ ఆనంద్ సంఖ్య 61 కాగా.. ఇప్పటి వరకు ఏడుగురికి మాత్రమే రెండోసారి నగర పోలీసు చీఫ్‌గా పని చేసే అవకాశం దక్కింది. గతంలో సి.రంగస్వామి అయ్యంగార్, బీఎస్ కాలియా రావు, ఎస్‌పీ సత్తారు, కె.విజయరామారావు, ఆర్.ప్రభాకర్‌రావు, వి.అప్పారావు, ఆర్పీ సింగ్‌లకు మాత్రమే ఇలా పని చేయగలిగారు. 2003లో ఆర్పీ సింగ్ తర్వాత 21 ఏళ్లకు సీవీ ఆనంద్‌కు ఈ అరుదైన రికార్డు సాధించారు.

ఆదర్శనగర్ టు 'బంజారాహిల్స్'..

క్రికెట్, బ్యాడ్మింటన్, గోల్ఫ్ తదితర క్రీడల్లోనూ తనదైన మార్కు కలిగిన సీవీ ఆనంద్ పూర్వీకులది రంగారెడ్డి జిల్లాలోని కుంట్లూరు. ఆనంద్ కుటుంబం మాత్రం ఆదర్శనగర్‌లో నివసించేది. ఆయన పాతబస్తీలోని ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో జన్మించారు. హెచ్‌పీఎస్ నుంచి మొదలైన ఆయన విద్యాభ్యాసం ఐపీఎస్ వరకు వెళ్లింది. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీ సీసీసీ), అందులోని పోలీసు కమిషనర్ కార్యాలయం సైతం ఆయన హయాంలోనే ప్రారంభమైంది. ఆయన కొత్వాల్‌గా ఉండగా హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) సహా అనేక విభాగాలకు అంకురార్పణ జరిగింది.

చట్టం లేకపోయినా మహారాష్ట్ర తరహాలో..

నగర కొత్వాల్‌గా పునరాగమనం చేసిన ఆనంద్ 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం డీజీపీ హోదాలో పోలీసు విభాగానికి నేతృత్వం వహిస్తున్న పోలీసు బాస్ డాక్టర్ జితేందర్‌ది 1992 బ్యాచ్. ఇలా డీజీపీ కంటే సీనియర్ అయిన అధికారి సిటీ కొత్వాల్‌గా నియమితులయ్యారు. ఈ విధానం ప్రత్యేక చట్టం ద్వారా మహారాష్ట్రలో ఉంది. అక్కడి ప్రత్యేక పరిస్థితులు, అనివార్య కారణాల నేపథ్యంలో డీజీపీ కంటే సీనియర్ అధికారినే ముంబై కమిషనర్‌గా నియమిస్తుంటారు. క్షేత్రస్థాయిలోనూ మహారాష్ట్ర డీజీపీ కన్నా ముంబై నగర కమిషనర్‌గా ఎక్కువ బాధ్యతలు, అధికారాలు ఉంటాయి.

రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం



- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, ప్రమాదాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మోటారు వాహన చట్టం నిబంధనల మేరకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిబంధనలను ఉల్లంఘించిన సుమారు 6,936 మంది డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు మంత్రి చెప్పారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రవాణా శాఖ సాంకేతిక అధికారుల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రమాదాలను తగ్గించడానికి రోడ్డు ప్రమాదాల నివారణకు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రవాణాశాఖ విధులు నిర్వహిస్తోందన్నారు. రోడ్డు భద్రత నిబంధనలను ఉల్లంఘించేవారి పట్ల మరింత కఠినంగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. రవాణా శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న పదోన్నతులతో పాటు, ఇతర సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు రవాణా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కష్టపడి పని చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు మంత్రి సూచించారు.

అమెరికా తరహాలో..

డ్రంక్ అండ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ తదితర నిబంధనల ఉల్లంఘనలపై ప్రస్తుతం లైసెన్సులను సస్పెండ్ చేస్తున్నామని, భవిష్యత్తులో అలాంటి ఉల్లంఘనుల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు అమెరికా తరహాలో మరిన్ని కఠిన శిక్షలను అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అమెరికా రోడ్డు భద్రతా చట్టాలకు అనుగుణంగా రవాణాశాఖ పని విధానంలో మార్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు. యూనిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రహదారి భద్రతపై కేంద్రం రూపొందించిన చట్టానికి అనుగుణంగా కొన్ని సంస్కరణలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆటోమేటిక్ పొల్యూషన్ టెస్టింగ్ కేంద్రాలతో పాటు, ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, రవాణా సాంకేతిక అధికారుల సంఘం అధ్యక్షుడు పి.రవిందర్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.వెంకట పుల్లయ్య, సీహెచ్ కొండయ్య, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, మార్గం రవిందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యమే దిక్కు!

- రేషన్ షాపుల ద్వారా పోర్టిఫైడ్ రైస్ ఏదీ?
- వంటకు ఉపయోగించుకోలేని వైనం
- కారుచౌకగా అమ్ముకుంటున్న లబ్ధిదారులు

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా సాధారణ బియ్యానికి బదులు పోషకాలున్న బలవర్ధక బియ్యం (పోర్టిఫైడ్ రైస్) పంపిణీ మూణ్నాళ్ల ముచ్చటగా తయారైంది. దీంతో ఎప్పటి మాదిరిగానే దొడ్డు బియ్యం పంపిణీయే కొనసాగుతోంది. అవి కూడా నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు తినడానికి అనాసక్తి కనబరుస్తున్నారు. కేవలం కొద్ది బియ్యం అల్పాహారం కోసం మాత్రమే ఉపయోగిస్తూ మిగతావాటిని కారుచౌకగా విక్రయించడం పరిపాటిగా మారింది. వాస్తవంగా గత



ఏడాది అయిదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రమంతటా పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ ప్రారంభించినా ప్రభుత్వం మారగానే.. పౌరసరఫరాల శాఖ చేతులెత్తేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద ప్రజల్లో రక్తహీనతకు చెక్ పెట్టేందుకు ప్రజా పంపిణీలో భాగంగా వినియోగదారులకు అందిస్తున్న పీడీఎస్ బియ్యానికి బదులు పోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేయాలని నిర్ణయించి రేషన్ షాపులతో పాటు గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం,అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా పోర్టిఫైడ్ సన్న బియ్యాన్నే సరఫరా చేసింది. ప్రస్తుతం ఆ బియ్యం సరఫరా ప్రస్తావనే లేకుండాపోయింది.

పోర్టిఫైడ్ రైస్ అంటే
రక్తహీనతకు చెక్ పెట్టడంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ–12 కీలకమైన పోషకాలు. సాధారణ బియ్యం పిండికి ఈ మూడింటితో చేసిన మిశ్రమాన్ని కలిపి బియ్యం గింజల మాదిరిగా తయారు చేస్తోంది. దీనిని పోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ పేర్కొంటారు. ఈ విధంగా తయారు చేసిన బియ్యం గింజలను సాధారణ బియ్యంలో కలిపేస్తారు. ప్రతి క్వింటాల్ సాధారణ బియ్యంలో ఒక కిలో పోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను కలుపుతారు. ఇవి సాధారణ బియ్యంలో కలిసిపోతాయి. సాధారణ బియ్యం మాదిరిగానే పోర్టిఫైడ్ కెర్నల్స్ కూడా ఉడుకుతాయి. సాధారణ బియ్యానికి ఉన్న రంగు, రుచి, వాసనే ఉంటుంది.

ప్రయోజనాలు ఇలా..
ఐరన్: ఎనీమియా (రక్తహీనత) నుంచి రక్షణ లభిస్తుంది. శరీరంలో అలసట తగ్గిస్తుంది. చురుకుదనం, చలాకీతనం పెరుగుతుంది. నెలలు నిండకుండా ప్రసవం కావడం, బరువు తక్కువగా పుట్టడం వంటి ప్రసవ సంబంధిత, ఇతర సమస్యలు తలెత్తవు.
ఫోలిక్ యాసిడ్: శరీరంలో తగిన మోతాదులో రక్తం తయారీకి సహాయపడుతుంది. గర్భస్థ దశలో నరాల బలహీనత వల్ల పుట్టే బిడ్డల్లో, పుట్టుకతో వచ్చే రుగ్మతల నుంచి రక్షణ ఇస్తుంది.
విటమిన్ బీ–12: మెదడు, నాడీ వ్యవస్థను సక్రమంగా పని చేయించడంలో సహకరిస్తుంది. శరీరంలో రక్తం తయారు కావడానికి సహకరిస్తుంది.

రంగలాల్ కుంట బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన ఇనుప రేకులు



రంగలాల్ కుంటపై 'జయభేరి' కన్ను!

- నిర్మాణాల కోసం ఫెన్సింగ్ వేసిన యాజమాన్యం
- నీరు రాకుండా, అలుగు పారకుండా అడ్డుగా రేకులు
- ఈ ప్రాంతాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- వారం రోజుల్లో అన్నీ తొలగించాలని ఆదేశాలు

గచ్చిబౌలి: సైబరాబాద్ పరిధిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న రంగలాల్ కుంటపై జయభేరి సంస్థ కన్ను పడింది. దీని ఫుల్ ట్యాంక్ లెవల్‌లోని (ఎఫ్‌టీఎల్) రెండు మీటర్లు ఆక్రమించిన ఆ సంస్థ రేకులతో ఫెన్సింగ్ నిర్మించింది. స్థానికుల ద్వారా ఫిర్యాదు అందుకున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సంస్థ ప్రతినిధులను పిలిపించిన ఆయన వారం రోజుల్లో ఫెన్సింగ్‌తో పాటు రేకులు తొలగించాలని స్పష్టం చేశారు. రంగలాల్ కుంటకు అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేట్ వ్యక్తులు అష్ట దిగ్బంధనం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఐటీ కారిడార్‌లోని అన్ని చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి. వేవ్‌రాక్ లాంటి ఐటీ టవర్‌ను ఆనుకొని ఉన్న రంగలాల్ కుంటలోకి మాత్రం ఇప్పటికీ పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. దీని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో రేకులు ఏర్పాటు చేయడమే దీనికి కారణం.

అలుగు పారేలా చర్యలు తీసుకోండి..

- నానక్‌రాంగూడ సర్వే నెం.66లో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రంగలాల్ కుంట ఉంది. ఎఫ్‌టీఎల్‌తో కలుపుకొని 5 ఎకరాలకు పైగానే ఉంటుంది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నానక్‌రాంగూడ రోటరీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను కలుపుతూ 100 అడుగుల రోడ్డును ఈ కుంట మధ్యలో నిర్మించారు. దీంతో రంగలాల్ కుంట రెండుగా చీలిపోయింది. వరద వస్తే మాత్రం నీరు ప్రవహించే విధంగా రోడ్డు కింది భాగంలో చానెల్ ఏర్పాటు చేశారు. పై నుంచి నీరు రాకుండా నిర్మాణాలు ఉండటంతో రంగలాల్ కుంటకు పూర్తి స్థాయిలో నీరు చేరడం లేదు. పైభాగంలో కార్ల పార్కింగ్ ఏర్పాటు చేసిన ఓ నిర్మాణ సంస్థ రేకులు అడ్డుగా పెట్టింది. దీంతో కుంటలోకి నీరు, వరద సరిగా రావడం లేదు. రంగలాల్ కుంట కింది భాగంలో అలుగు పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫెన్సింగే కారణం..

కట్ట కింద ఉన్న బఫర్ జోన్‌లోనూ అడ్డుగా రేకులు పెట్టారు. గతంలో రంగలాల్ కుంట అలుగు పారేదని, ఇప్పుడా పరిస్థితి లేదని స్థానికులు చెబుతున్నారు. దీనికి జయభేరి సంస్థ చేసిన ఫెన్సింగ్ ఓ కారణమని ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ తూము భాగం సురక్షితంగా ఉందని, రంగలాల్ కుంటకు పూర్వ వైభవం సంతరించుకునేలా హైడ్రా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రంగలాల్ కుంట తూము ఉన్న వైపు రోడ్డును ఆనుకొని బఫర్ జోన్‌లోనూ షెడ్డు నిర్మాణం చేపట్టారు. సీఎస్ఆర్‌లో భాగంగా రంగలాల్ కుంట సుందరీకరణ కోసం వర్చ్యూసా ఐటీ కంపెనీ ముందుకు వచ్చింది. కానీ.. కేవలం చుట్టూ బండ్ ఏర్పాటు చేసింది. అంతకు మించి సుందరీకరణ పనులు ముందుకు సాగలేదు. బండ్ ఏర్పాటు కూడా సరిగా చేయలేదనే విమర్శలు ఉన్నాయి.


రంగలాల్ కుంట తూము

‘ఇన్‌స్టా’ స్నేహితుడు.. 20 రోజులు

నిర్బంధించాడు!

భైంసా బాలికకు సోషల్‌మీడియాలో యువకుడితో పరిచయం

- ట్రాప్ చేసి హైదరాబాద్‌కు రప్పించి, లాడ్జిలో నిర్బంధం
- తల్లిదండ్రులకు సమాచారం అందించిన బాధితురాలు
- రంగంలోకి సిటీ షీ-టీమ్స్
- యువతిని రక్షించి కుటుంబీకులకు అప్పగింత



సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన ఓ యువకుడు నిర్మల్ జిల్లా, భైంసాకు చెందిన బాలికను ట్రాప్ చేశాడు. 20 రోజుల క్రితం నగరానికి రప్పించి ఓ హోటల్‌లో నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎట్టకేలకు ధైర్యం చేసిన బాధితురాలు తన కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆదివారం నగరానికి చేరుకున్నారు. హైదరాబాద్ షీ-టీమ్స్‌ను ఆశ్రయించడంతో బాలికను రక్షించారు. నిందితుడిపై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెలితే..భైంసాకు చెందిన బాలికకు నగరానికి చెందిన యువకుడితో ఇన్‌స్టాగ్రామ్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లు స్నేహం నటించిన అతగాడు ఆమెను పూర్తిగా నమ్మించాడు. చివరకు తన అసలు రూపం బయటపెట్టి సదరు యువకుడు 20 రోజుల క్రితం బాలికను బెదిరించాడు. దీంతో భయపడిన బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా నగరానికి వచ్చేసింది. ఆమెను కలుసుకున్న అతను నారాయణగూడలోని ఓ లాడ్జికి తీసుకువెళ్లి గదిలో నిర్బంధించాడు. బాలికపై పదేపదే అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అతడి బెదిరింపులకు భయపడిన ఆమె మిన్నకుండిపోయింది. చివరకు ఆదివారం ధైర్యం చేసిన బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన పరిస్థితిని వివరించింది. వాట్సాప్ ద్వారా కరెంట్ లోకేషన్ షేర్ చేసింది. హుటాహుటిన నగరానికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు షీ-టీమ్స్‌ను ఆశ్రయించారు. తక్షణం రంగంలోకి దిగిన షీ-టీమ్స్ నారాయణగూడలోని లాడ్జిపై దాడి చేసి బాలికను రెస్క్యూ చేశారు. తల్లిదండ్రులను చూసిన బాలిక ఉద్వేగానికి గురైంది. సదరు యువకుడిపై బాలిక తల్లిదండ్రులు నారాయణగూడ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

విద్యార్థినికి ఆన్‌లైన్‌లో వేధింపులు..

మరో కేసులో ఓ విద్యార్థినిని ఆన్‌లైన్‌లో వేధిస్తున్న సహ విద్యార్థులకు షీ-టీమ్స్ చెక్ చెప్పింది. బాధిత యువతి పంజగుట్ట పరిధిలోని ఓ ప్రముఖ అకాడమీలో విద్యనభ్యసిస్తున్నారు. అదే అకాడమీకి చెందిన కొందరు పోకిరీలు ఆన్‌లైన్‌లో, సోషల్‌మీడియా ద్వారా యువతిని రకరకాలుగా వేధించారు. దీనిపై ఆమె వాట్సాప్ ద్వారా షీ-టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన అధికారులు వారిని గుర్తించడంతో పాటు పంజగుట్ట ఠాణాలో కేసు నమోదు చేయించారు. ఈ పోకిరీలతో పాటు అకాడమీ నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యనభ్యసిస్తున్న యువతుల భద్రత కోసం మరిన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా నిర్వాహకులకు స్పష్టం చేశారు.

మహాగణపతిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మహాగణపతి సన్నిధిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని ఆదివారం సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటి సభ్యులు కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా ఆహ్వానించి పూజలు చేయించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకురాలు మాధవీలత, ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పబ్‌లలో పోలీసుల తనిఖీలు

నలుగురికి డ్రగ్స్ పాజిటివ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని బేబీలాన్ పబ్‌లో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షల్లో ఇద్దరు యువకులకు డ్రగ్స్ పాజిటివ్ రాగా వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్,: గచ్చిబౌలి పబ్‌లలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన ఈ తనిఖీల్లో మొత్తం నలుగురికి డ్రగ్స్ పాజిటీవ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. 12 మందికి పరీక్షలు నిర్వహించామని నలుగురికి పాజిటివ్‌గా తేలిందని అధికారులు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య



ముక్తార్ మృతదేహం

లంగర్‌హౌస్: మద్యం మత్తులో నిద్రిస్తున్న వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెద్దమందడి గ్రామానికి చెందిన అబ్దుల్ అయూబ్ కుమారుడు ముక్తార్ అహ్మద్(55) న్యూ డ్రీమ్ కాలనీలోని భవనానికి వాచ్‌మెన్‌గా పని చేస్తూ ఆదే భవనంలో మేస్త్రీ పని చేస్తున్నాడు. నిత్యం మద్యం మత్తులో భార్యాభర్తలు గొడవపడేవారు. శనివారం రాత్రి కూడా వారి మధ్య గొడవ జరిగింది. అనంతరం అతను మద్యం తాగి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం భవన సూపర్‌వైజర్ రక్తం మడుగులో పడి ఉన్న ముక్తార్‌ను గుర్తించి అతడి భార్యకు చెప్పాడు. శంషాబాద్‌లో ఉంటున్న కుమార్తెలకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న కుమార్తెలు పోలీసులకు సమాచారం అందించారు. బండరాళ్లతో తలపై మోది హత్య చేసినట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మంచు విష్ణుకు సైబర్ వేధింపులు

- ఆయనతో పాటు నిర్మాణ సంస్థ పైనా ట్రోలింగ్
- కేసు నమోదు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు
- నిందితుడికి నోటీసులు జారీ చేసిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణుకు సైబర్ వేధింపులు తప్పలేదు. సోషల్ మీడియా ద్వారా ఈ పని చేస్తున్న విజయ్ చంద్రహాసన్ దేవరకొండను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నోటీసులు జారీ చేసి పంపారు. నేరం నిరూపణకు అవసరమైన ఆధారాలు సేకరించి, నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయాలని నిర్ణయించారు. విజయ్ చంద్రహాసన్ ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వివిధ సోషల్‌మీడియా ఖాతాల్లో అనేక వీడియోలు అప్‌లోడ్ చేశారు. వీటిలో మంచు విష్ణు, ఆయనకు సంబంధించిన నిర్మాణ సంస్థ, ‘మా’లతో పాటు సినీ రంగాన్నీ కించపరిచే, అవమానించే, అభ్యంతరకరంగా చిత్రీకరించే అంశాలను పొందుపరిచాడు. ఇతను పదేపదే ఇదే పంథా అనుసరిస్తుండటాన్ని ‘మా’ సీరియస్‌గా తీసుకుంది. సంస్థ ట్రెజరర్ శివబాలాజీ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.మధులత సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. దీంతో అతడికి నోటీసులు జారీ చేసిన అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. త్వరలోనే అవసరమైన ఆధారాలను సేకరించి, న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని నిర్ణయించారు.



ఆ నృత్యాలు కనువిందు

చిక్కడపల్లి: తాండవ కృష్ణ నృత్య సంగీత అకాడమి మహబూబాబాద్ ఆధ్వర్యంలో భారతీయ నృత్యోత్సవ్ శీర్షికతో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కూచిపూడి , భరత నాట్యం, జానపద, పేరిణి, మోహినీఅట్టం, ఆంధ్రనాట్యం, కథక్, ఒడిస్సీ, మణిపురి నృత్యాలను చిన్నారులు, వర్ధమాన కళాకారులు జనరంజకంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ కార్తిక్, సినీదర్శకుడు కుమారస్వామి, మిమిక్రీ శ్రీనివాస్, సైకాలజిస్ట్ డాక్టర్ రమ్య శ్రీ, జాతీయ క్రీడాకారుడు సాదులే ప్రకాష్, ప్రముఖులు శ్రీకాంత్‌రెడ్డి, అదయశ్రీ మనోజ్, ఎం.పావని, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పేరిట పేదలకు అన్యాయం తగదు



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

అంబర్‌పేట: మూసీ నది సుందరీకరణ పేరిట దాని పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను తొలగించవద్దని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గోల్నాక పెరల్ గార్డెన్‌లో ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎం.మహేందర్ అధ్యక్షతన మూసీ పరీవాహక ప్రాంతాల నివాసితులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాడా బాబుల కబ్జాలపై హైడ్రా చర్యలకు తమ మద్దతు ఉంటుందని, పేదల ఇళ్లు కూల్చే ముందు ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. పేదలు చిన్న, చిన్న పనులు చేస్తూ మూసీ పరిసరాల్లో 50, 100 గజాల స్థలాలు తీసుకుని నివిస్తున్నారని, వాటిని తొలగిస్తామంటూ ప్రభుత్వం మార్కింగ్ చేయడంతో అంతా భయందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పేదల ఇళ్ల జోలికి వస్తే తాము పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు రాములు, సుబ్బారావు, షబానా, వరలక్ష్మీ, అఖిల్, రహీస్, మహేష్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు పేరుతో రూ.4 లక్షలు టోకరా

వెంగళరావునగర్: వస్తువులు కొనుగోలు చేసి రూ. 4 లక్షలు టోకరా వేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఆర్‌నగర్ సమీపంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌కు గతనెల 7, 14, 15, 20 తేదీల్లో ముగ్గురు వ్యక్తులు వచ్చి రూ. 4 లక్షల విలువైన వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేశారు. సదరు వినియోగదారులు మొత్తాన్ని షాపునకు చెందిన క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించారు. అయితే సిబ్బంది నగదు తమ షాపు ఖాతాలోకి వచ్చిందనుకుని పూర్తిస్థాయిలో గమనించ లేదు. అయితే ఆ తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు చెల్లించిన వారి ఖాతాలోనికి తిరిగి (రీఫండ్) వెళ్లింది. ఇటీవల దీనిని గుర్తించిన క్యాషియర్ అరవింద్ దీనిపై ఆరా తీశాడు. బ్యాంకుకు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల డబ్బు వారికి రిటర్న్ వెళ్లినట్లుగా గుర్తించాడు. మోసానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో రోగి తండ్రి ఆత్మహత్య



బి.శేఖర్(ఫైల్)

అఫ్జల్‌గంజ్: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి సహాయకుడిగా ఉన్న తండ్రి బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉస్మానియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. అఫ్జల్‌గంజ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, యాలాల మండలం , కమలాపూర్ గ్రామానికి చెందిన బి.శేఖర్(50) అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడిని కొన్ని రోజుల క్రితం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. కుమారుడి ఆరోగ్యం బాగుపడుతుందో లేదోనని ఆందోళనకు గురైన శేఖర్ ఆదివారం కులీకుతుబ్‌షా భవన్‌లోని నాల్గో అంతస్తులోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చైతన్య వర్సిటీ డీన్ అరెస్టు

- నకిలీ ఏజెంట్లతో కాలేజీలో అడ్మిషన్లు
- కమీషన్ల పేరిట రూ.కోట్లు వసూలు
- డీన్ సుమతో పాటు మరో ఇద్దరి అరెస్టు
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: కళాశాల రికార్డులను తారుమారు చేసి విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడంతో పాటు రూ.కోట్లలో కమీషన్ కొట్టేసిన చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డీన్‌తో సహా మరో ఇద్దరిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కే ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం .. మొయినాబాద్ మండలం, హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వరంగల్ జిల్లా ఖాజీపేటకు చెందిన సానికొమ్ము డీన్, ఇన్‌చార్జ్‌గా, ఇదే విభాగంలో భూతపతి దినకర్, బుర్ర శ్రీకాంత్ పనిచేస్తున్నారు. ఈ యూనివర్సిటీలో విద్యార్థులు నేరుగా, ఏజెంట్ల ద్వారా కూడా అడ్మిషన్లు పొందుతుంటారు. ఎవరైనా విద్యార్థి ఏజెంట్ లేదా ఏజెన్సీ ద్వారా ప్రవేశం పొందినట్లయితే కళాశాల యజమాన్యం సంబంధిత ఏజెంట్‌కు కమీషన్ రూపంలో కొంత సొమ్ము చెల్లిస్తుంది. ఈ అవకాశాన్ని సుమ, దినకర్, శ్రీకాంత్‌లు సంపాదనకు మార్గంగా మలుచుకోవాలని భావించిన వారు నకిలీ ఏజెంట్లను సృష్టించి, వారి పేర్లతో రికార్డులు సృష్టించారు. ఈ నకిలీ ఏజెంట్ల ద్వారా విద్యార్థులకు అడ్మిషన్లు జరిగినట్లు కళాశాల రికార్డులలో నమోదు చేశారు. దీంతో ఎప్పటిలాగే కళాశాల యాజమాన్యం ఏజెంట్లకు కమీషన్ సొమ్మును ఓచర్ల రూపంలో జారీ చేసింది. సుమారు రూ.1-2 కోట్ల నిధులను ముగ్గురు నిందితులు వారి సొంత ఖాతాల్లోకి మళ్లించారు. రికార్డుల పరిశీలన సమయంలో కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపాటి వెంకట పురుషోత్తం రెడ్డికి అనుమానం రావడంతో అంతర్గత విచారణ చేపట్టిన ఆయన డీన్ సుమ, మరో ఇద్దరి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై మోసం, ఫోర్జరీ కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాలను సేకరించి సుమ, దినకర్, శ్రీకాంత్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కమిటీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నూతన కమిటీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగి సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జీవీ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా మొగిలి రఘునాథ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపా కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ శేషగిరిరావుగౌడ్, వెంకటరాజన్‌గౌడ్, డాక్టర్ విజయ, భాస్కర్‌గౌడ్ అందరి ఆమోదంతో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నల్లకుంట: గణేష్ మండపంలో సౌండ్ బాక్స్ రిపేరీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై జె.శ్రీనివాస్ కథనం మేరకు వివరాలి ఉన్నాయి. న్యూ నల్లకుంట నారాయణ కళాశాల ఎదుట స్థానిక యువకులు గణేష్ మండపాన్ని ఏర్పాటు చేశారు. కాగా మండపం వద్ద ఏర్పాటు చేసిన సౌండ్ బాక్స్ పని చేయకపోవడంతో పద్మాకాలనికి చెందిన ప్రైవేటు ఉద్యోగి పాండు రెడ్డి(26) ఆదివారం సాయంత్రం సౌండ్ బాక్స్ వైర్లకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ప్రతాప్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహంకాళి ఈఓకు జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే

రాంగోపాల్‌పేట్: కోర్టు ధిక్కరణ కేసులో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయ ఈఓకు హైకోర్టు విధించిన నెల రోజుల సాధారణ జైలు, రూ.2వేల జరిమానా తీర్పుపై సుప్రీం కోర్టు స్టే మంజూరు చేసింది. చీరెలు, జాకెట్ ముక్కలు, కొబ్బరి చిప్పల సేకరణ నిమిత్తం సికింద్రాబాద్ మహంకాళి ఆలయ ఈఓ మార్చి 3న జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ రాకేష్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి పిటిషనర్ల లీజును జూలై 1వ తేదీ నుంచి 5 నెలలు పొడిగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 13న కోర్టు తీర్పు ఇచ్చినా ఈఓ వాటిని ఉల్లంఘించి జూన్ 26న మళ్లీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఈఓ కావాలనే అమలు చేయకుండా టెండర్లకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని పిటిషనర్లు కేసు దాఖలు చేశారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు కొద్ది రోజుల క్రితం ఈఓకు నెల రోజుల సాధారణ జైలు, రెండు వేల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఈఓకు హైకోర్టు విధించిన శిక్షతో పాటు పిటిషనర్లకు 5 నెలల పాటు లీజును పొడిగించాలనే తీర్పుపై 6న స్టే మంజూరు చేసింది.

గుండెపోటుతో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

- మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన
- కంపెనీ యాజమాన్యం జోక్యంతో విరమణ



రాజు (ఫైల్)

మహేశ్వరం: విప్రో కంపెనీలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగి గుండె పోటుతో శనివారం మృతి చెందాడు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామానికి చెందిన పొట్టిగళ్ల రాజు(31) మహేశ్వరం మండల కేంద్రం కేసీ తండా సమీపంలోని విప్రో కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా కంపెనీలో విధులు నిర్వహించడానికి లోపలికి వెళ్తుండగా ఒక్క సారి కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న కంపెనీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కంపెనీ యాజమాన్యం ఒత్తిడితోనే తమ కుమారుడు మరణించాడని కంపెనీ ఎదుట మృతదేహంతో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

వాడవాడలా కొలువుదీరిన గణపయ్యలు

• విభిన్న రకాల గణనాథులను ఏర్పాటు చేసిన నిర్వాహకులు • ఆలయాల్లో ప్రత్యేక పూజలు


రజత కవచాలంకరణలో శ్రీ విజయగణపతి

బంజారాహిల్స్: వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్ల వద్ద ఉత్సవ కమిటీలు విభిన్న రకాల గణనాథులను ఏర్పాటు చేయగా ఆదివారం ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాయి. ఫిలింనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 23అడుగులకుపైగా ఉన్న భారీ గణనాథుడిని ఏర్పాటు చేశారు. భగత్‌సింగ్ కాలనీలో ఆకు రూపంలో ఉన్న గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ విజయగణపతి ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా స్వామివారిని 50 కేజీల వెండి కవచాలతో అలంకరించారు. రజత కవచాలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో స్వామివారిని బాల గణపతిగా అలంకరించారు. అనంతరం ఇక్కడ నిర్వహించిన బాల గణపతి హోమంలో భక్తులు పాల్గొన్నారు.


దుర్గా భవానీనగర్ ఈదమ్మ–ఎల్లమ్మ గుడిలో...


భగత్‌సింగ్ యువసేన ఆధ్వర్యంలో...


ఫిలింనగర్ దైవసన్నిధానంలో...


దైవసన్నిధానం పూజల్లో పరుచూరి గోపాలకృష్ణ తదితరులు


రహమత్‌నగర్‌లో...


ఇందిరానగర్ ఫేజ్2లో...


దుర్గా భవానీనగర్‌లో..


వెంకటగిరిలో పూజలు చేస్తున్న సురేందర్‌యాదవ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు


ఫిలింనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..


ఇందిరానగర్‌లో...

పోషకాహారంపై అవగాహన


పోషకాహారంపై అవగాహన కలిగిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బంజారాహిల్స్: పోషణ మాసంలో భాగంగా ఐసీడీఎస్ ఖైరతాబాద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏ ఆహారం తీసుకుంటే పోషక విలువలు ఎక్కువగా లభిస్తాయో వాటి గురించి టీచర్లు సూచిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే బాలామృతం, కోడిగుడ్లు, ఆకుకూరలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవచ్చని పేర్కొంటున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక పదార్థాలు తీసుకుంటున్న వారి వివరాలను నమోదు చేసుకుని వాటిని ఖచ్చితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

13 నుంచి ఆసియా జువెల్స్ షో


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నటీమణులు సిరిపాప, మిస్ సూపర్ నేషనల్–2023 ప్రజ్ఞ అయ్యగారి

బంజారాహిల్స్: ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మక ఆసియా జ్యువెల్స్ షో–2024ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం ఆదివారం బంజారాహిల్స్‌రోడ్ నెం.10లో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రాన్ని నటి సిరిపాపతోపాటు మిస్ సూపర్ నేషనల్–2023 ప్రజ్ఞ అయ్యగారి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యువెల్‌షోలో ప్రదర్శించబోయే పలు రకాల ఆభరణాలను వారు పలువురు మోడల్స్‌తో కలిసి ధరించి ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వజ్రాభరణాలను ఇక్కడ ప్రదర్శిస్తారని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

లిబర్టీ: సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండు కుమారస్వామి కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకులాల్లో, హాస్టల్స్‌లో వెనుకబడిన బీసీ విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని నాణ్యమైన ఆహారాన్ని అందించకపోతే ఎలా ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాలు, హాస్టల్స్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందించకుండా పురుగుల అన్నాన్ని సరఫరా చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇటీవల పాలమాకులలోని రెసిడెన్షియల్ హాస్టల్‌లో పురుగుల అన్నాన్ని విద్యార్థులకు సరఫరా చేయడంతో విద్యార్థుల ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తే ఉత్తమ విద్యార్థులుగా వెలుగొందుతారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారికి అండా నిలవాలని ఆయన కోరారు.

అన్నపూర్ణాదేవికి పూజలు.. భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న రహమత్‌నగర్ వర్తక సంఘం నేతలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని రహమత్‌నగర్ చౌరస్తాలో ఆదివారం వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నపూర్ణాదేవికి, వినాయక, శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. వినాయకచవితి ఉత్సవాలతో పాటుగా ఆదివారం రావడం ప్రజలు సుఖ శాంతులతో సంతోషంగా ఉండేందుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు సంఘం నేతలు తెలియజేశారు. అంతేగాకుండా ప్రతి అమావాస్య నాడు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అనంతరం స్థానికులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ అన్నదాన, పూజా కార్యక్రమాల్లో రహమత్‌నగర్ వర్తక సంఘం నాయకులు తాడికొండ కృష్ణమూర్తి, ఎం.శ్యాం రావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, బ్రహ్మానందం గుప్తా, కొవ్వూరి ప్రభు, ఆంజనేయులు యాదవ్, బుద్ధ నాగార్జున గుప్తా, సత్యానారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే నెలలో కూడా అమావాస్యనాడు పూజలు, అన్నదానం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నేతలు కోరారు.

19 నుంచి మాదిగల మేల్కొలుపు యాత్ర : పిడమర్తి రవి


అభివాదం చేస్తున్న మాదిగ సంఘాల నాయకులు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 19వ తేదీ నుంచి మాదిగల మేల్కొలుపు యాత్ర నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏ జిల్లాలో ఎస్సీ జనాభా ఎంత ఉందో వారి జనాభా దామాషా ప్రకారం ఆయా జిల్లాల వారీగా రిజర్వేషన్ల ఫలాలు అందేలా చూడాలన్నారు. జిల్లాల వారీగా రిజర్వేషన్లు కేటాయించి విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. సెప్టెంబర్ 19న మేల్కొలుపు యాత్ర హైదరాబాద్‌లో ప్రారంభమై అన్ని జిల్లాల్లో పర్యటించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించుకుందామని దళితులను చైతన్యపరిచి ఈ నెల 30న భువనగిరిలో ముగుస్తుందన్నారు. మాదిగ శక్తి రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ సన్ని, మాదిగ రాజకీయ వేదిక అధ్యక్షులు చంద్రశేఖర్ మాదిగలు మాట్లాడుతూ మంత్రివర్గంలో మాదిగలకు రెండు పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షునిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మైసా ఉపేందర్, బుద్దాల బాబబురావు, వంశీ, మెగులయ్య, బొర్రెల్లి సురేష్, నక్క మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సురేందర్‌కు అవార్డు

బంజారాహిల్స్: సోమాజీగూడలోని ప్రభుత్వ రాజ్‌భవన్ హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ ఎస్.సురేందర్‌కు హైదరాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రాగా, డీఈఓ రోహిణి చేతుల మీదుగా ఆయనకు భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల టీచర్లు ఆయనను అభినందించారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ


శుభాకాంక్షలు తెలుపుతున్న నవీన్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: టీపీసీసీ అధ్యక్షులుగా నియామకమైన బి. మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇంచార్జి నవీన్‌యాదవ్, వెంకట్‌యాదవ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఎర్రగడ్డకు చెందిన గ్రేటర్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, మోసిన్ ఖురేషి, మహ్మద్ సర్దార్, కృష్ణకుమార్‌లు కూడా మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కాలనీవాసులు

బంజారాహిల్స్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అంజనేయులు కోరారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో ఆదివారం ఏషియన్ ఈఎన్‌టీ కేర్, వివేకానంద హాస్పిటల్స్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు వైవై. రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, క్లబ్ సభ్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని పలు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. అనంతరం డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఈఎన్‌టీ, గైనకాలజీ, బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలతో పాటు, వినికిడి పరీక్షలు ఆర్థో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కాలనీవాసులతో పాటు క్లబ్ సభ్యులు 200 మందికి పైగా పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నీలిమ, శివ, నేతి సాయి ప్రసాద్, డాక్టర్ ప్రియాంక గుప్తా, మనీష, శివ సందీప్, వేణు గోపాల్, యోదా డయాగ్నస్టిక్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.


కోదండరాంను అభినందిస్తున్న సీఎన్ రెడ్డి

కోదండరాంకు అభినందనలు

రహమత్‌నగర్: ఎమ్మెల్సీ కోదండరాం రహమత్‌నగర్ డివిజన్‌కు విచ్చేసిన సందర్భంగా ఆదివారం రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఆయన మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దళిత స్టడీ సెంటర్ భవనాన్ని త్వరగా ప్రారంభించి వినియోగంలోని తేవాలని సీఎన్‌రెడ్డి కోదండరాంను కోరారు. హైయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, సీడీఎస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రముఖ సంపాదకులు డా.కె. రాంచంద్రమూర్తి, సీడీఎస్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణ పాల్గొన్నారు.

చిన్నారులు, మహిళలకు పోటీలు

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ చిన్నారులు, మహిళలకు రన్నింగ్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. కమిటీ ప్రెసిడెంట్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, సత్యనారాయణ, బాపయ్య చౌదరి, రజిని, గఫార్, సయ్యద్, చాంద్, జగన్ పాల్గొన్నారు. అమీర్‌పేట సితార హోటల్‌లో వినాయకచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిబ్బంది గణనాథునికి విశేష పూజలు నిర్వహించారు.

'సాక్షి' కథనానికి విశేష స్పందన


'గణపతి విశ్వరూపం' శీర్షికను ప్రదర్శిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్: 70 సంవత్సరాలు 70 అడుగుల శ్రీ సప్తముఖ మహాశక్తి వినాయకుడి విశ్వరూపం పేరుతో వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతి విశిష్టతలను తెలియజేస్తూ 'సాక్షి' సిటీ ప్లస్‌లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. వినాయక చవితి సందర్భంగా మహాగణపతి సమక్షంలో మహాగణపతి విశ్వరూపం శీర్షికను ప్రదర్శించడంతో పాటు భక్తులకు సాక్షి దినపత్రికను ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పంపిణీ చేశారు.



వరదనీటితో వాకర్లకు ఇబ్బందులు

కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో భారీగా నిలిచిన వరద


కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్ వేలో నిలిచిపోయిన వరద

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో పలుచోట్ల వరదనీరు నిలిచిపోయి వాకర్లకు తీవ్ర అసౌకర్యంగా మారింది. కేబీఆర్ పార్కు ప్రధాన గేటు నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్లే జీహెచ్‌ఎంసీ వాక్ వేలో మూడుచోట్ల మోకాలు లోతు వరద నీరు నిలిచిపోయి గత రెండు వారాలుగా వాకింగ్ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్ వేలో ఆరు కిలోమీటర్ల మేర వాకింగ్ చేయడానికి వేలాది మంది వస్తుంటారు. అయితే వాక్ వే నీట మునగడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఇంత జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ ఇటువైపు తొంగిచూడడం లేదు. తరచూ వాక్ వేను సందర్శించే ఉన్నతాధికారులు కూడా ఈ పరిస్థితిపై దృష్టిసారించడం లేదు. ఫలితంగా వాక్ వేలో వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఫుట్‌పాత్‌పై వాకింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే గత నెల రోజుల నుంచి ఈ ఫుట్‌పాత్‌పై కూడా విద్యుద్దీపాల అలంకరణ కోసం స్తంభాల ఏర్పాటుకు తవ్వకాలు చేపట్టారు. కేబుల్ వైర్ల కోసం ఫుట్‌పాత్‌లు తవ్వారు. దీంతో ఫుట్‌పాత్‌లపై కూడా నడవలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వందల సంఖ్యలో వచ్చే కేబీఆర్ పార్కు చుట్టూ ఈ అధ్వానమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి వానాకాలంలోనూ వాక్‌వే నీట మునుగుతున్నా ప్రత్యామ్నాయ వంతెనలు నిర్మించడంలో జీహెచ్‌ఎంసీ విఫలమవుతుంది. ప్రతిఏటా వాక్ వే డెవలప్‌మెంట్ పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుండగా ఈ నిధులన్నీ వరదపాలు అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి నీట మునిగిన వాక్ వేలపై వాకర్లు నడిచేందుకు వీలుగా చిన్నపాటి వంతెనలు నిర్మిస్తే పరిస్థితి కొంత మెరుగుపడుతుంది.

మండపాల వద్ద పోలీసుల తనిఖీలు

బంజారాహిల్స్: వినాయక మండపాల వద్ద శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు, ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రులను నిర్వహించుకునే విధంగా పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులతో మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని సూచిస్తున్నారు. ఈక్రమంలోనే వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర తదితరులు శనివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–13లోని శ్రీరామ్‌నగర్‌లో గణేష్ మండపాల వద్ద తనిఖీలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులకు తగిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కూడా పోలీసులు పర్యటించి మండప నిర్వాహకులతో మాట్లాడి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకునేందుకు వీలుగా సూచనలు చేశారు.

రహమత్‌నగర్‌లో...

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ శనివారం రాత్రి సందర్శించి మండప నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్, సెక్టార్ ఎస్సైలు పాల్గొన్నారు.


మండపాలను పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్



సెల్‌ఫోన్ మాయం

వెంగళరావునగర్: హాస్టల్ రూంలో చార్జింగ్ పెట్టి ఉంచిన సెల్‌ఫోన్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జగిత్యాలకు చెందిన ఎస్. రాజశేఖర్ స్థానిక మధురానగర్‌కాలనీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈనెల 5వ తేదీ తన సోదరితో ఫోన్‌లో మాట్లాడి చార్జింగ్ పెట్టి తలుపులు వేయకుండా నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా ఫోన్ కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లి వచ్చేలోగా ల్యాప్‌టాప్ చోరీ

వెంగళరావునగర్: బయటకు వెళ్లి వచ్చేలోగా ల్యాప్‌టాప్ చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కడప ప్రాంతానికి చెందిన టి.హర్షవర్ధన్ స్థానిక మధురానగర్‌కాలనీ హాస్టల్‌లో ఉంటూ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 5వ తేదీన సొంత పనిమీద ల్యాప్‌టాప్ రూంలో పెట్టి బయటకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి రాగా తన రూంలోని లాకర్ పగిలిపోయి ఉంది. అందులో ఉండాల్సిన ల్యాప్‌టాప్ మాయమైంది. గత 4వ తేదీన కొత్తగా రూంలోకి జాయిన్ అయిన పి.హేమంత్ మణికంఠ అనే యువకుడు కూడా కనిపించ లేదు. అతని ఆధార్ ఇతర గుర్తింపుకార్డులు కూడా లేవు. దీంతో హేమంత్ మణికంఠ ఈ దొంగతనం చేసి ఉంటాడని భావించి బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024

యూపీఎస్సీ మెయిన్స్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని టీజీఎస్పీఎస్సీ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ మెయిన్స్‌కు 30 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ నెల 21న జరగనున్న పరీక్షకుగాను వీరందరిలో ధైర్యాన్ని నింపి భయం పోగొట్టి భరోసా కల్పించేందుకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులకు గంటన్నరసేపు కౌన్సెలింగ్ సెషన్ నిర్వహించారు. మెయిన్స్‌కు ఎలా చదవాలి, ఈ పది రోజుల్లో టైం మేనేజ్‌మెంట్ ఎలా ఉండాలి.. అనే దానిపై ఆయన కీలక సూచనలు చేశారు. ఈ 10 రోజుల కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఎలా చదివాలి, పరీక్షకు హాజరయ్యేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన తెలియజేశారు.

29న కార్డియాక్ రిహాబ్ రన్

- ఏఐసీటీ హబ్ ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమం

రాయదుర్గం: మారథాన్ అనేది ఆరోగ్యం, ఓర్పు, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం సాగే ప్రయాణం. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన కార్డియాక్ రిహాబ్ రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ టీ హబ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ కార్డియాక్ రిహాబ్ రన్–2024లో 'వాక్, జాగ్, రన్'వంటి మూడింటిని నిర్వహించాలని తలపెట్టారు. నగరంలోని నెక్లెస్ రోడ్డులో 3కె, 5కె, 10కె, 16కె, 21కె కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

ఎన్టీఆర్ స్టేడియంలో వినాయక కొలనులు

విగ్రహాల నిమజ్జనానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు



ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నీటి కొలనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ డీఈ సన్నీ

కవాడిగూడ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ముషీరాబాద్ నియోజకవర్గంలోని వినాయక విగ్రహాల నిమజ్జనానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ప్రత్యేకంగా నీటి కొలనులను ఏర్పాటు చేశారు. వీటిని ఆదివారం జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్–15 డీఈ సన్నీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు, మండపాల్లో ఏర్పాటు చేసిన ఆరు ఫీట్ల వరకు ఉన్న గణనాథుల నిమజ్జనం కోసం ఈ కొలనులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒకటి నుంచి నాలుగు ఫీట్లు వరకున్న విగ్రహాలకు రెండు కొలనులు, నాలుగు నుంచి ఆరు ఫీట్ల వరకున్న విగ్రహాల నిమజ్జనానికి మరో కొలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ నిమజ్జన ప్రక్రియ ఈ నెల 17 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

రాజ్యాంగ రక్షణ కల్పించాలి

- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కిరణ్‌కుమార్

రాయదుర్గం: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచి రాజ్యాంగ రక్షణ కల్పించాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ ప్రధాన గేటు బయట ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని చాలా ఓబీసీ కులాలకు నేటికీ చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించి అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. తెలంగాణ, ఏపీలలో అధికార కాంగ్రెస్, టీడీపీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ అనేది బీసీల పాలిట శాపంగా మారిందన్నారు.

బీఆర్ఎస్‌కు గడ్డం శ్రీనివాస్ రాజీనామా



అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు, ఇటీవల జరిగిన హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గడ్డం శ్రీనివాస్‌యాదవ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం ఆయన తన రాజీనామాను మాజీ సీఎం కేసీఆర్‌కు, మాజీ మంత్రి కేటీఆర్‌లకు వాట్సాప్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంటు, గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల అభిప్రాయం మేరకు భవిష్యత్ ప్రణాళిక నిర్ణయిస్తానన్నారు.

మెదడు సమస్యలకు ఆధునిక వైద్యసేవలు



లక్డీకాపూల్: మెదడు సంబంధిత అనారోగ్య సమస్యలకు నిమ్స్ అత్యాధునిక వైద్య సేవలను అందిస్తుందని పలువురు వక్తలు అన్నారు. న్యూరాలజీలో ఎదురయ్యే అనేక సమస్యలకు టీఎంఎస్ ద్వారా మెరుగైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం నిమ్స్‌లో ట్రాన్స్‌క్రానియల్ మాగ్నెటిక్ స్టిమ్యులేషన్(టీఎంఎస్)పై అవగాహన కార్యక్రమం జరిగింది. నిమ్స్ న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ సూర్యప్రభ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ ఉప్పిన్, న్యూరోసర్జన్లు డాక్టర్ వంశీ కృష్ణ, సుచంద భట్టాచార్జీ, న్యూరాలజిస్టులు డాక్టర్ శిరీషా, పద్మజ, భవాని, మహేష్, డాక్టర్ రూపమ్ బోర్గోహైన్, బెంగళూరుకి చెందిన డాక్టర్ నితీష్ ఎల్.కాంబ్లే, బీబీనగర్ ఎయిమ్స్ సైకియాట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ సాయి కృష్ణ టిక్కా తదితరులు పాల్గొన్నారు.

- ప్రత్యేక పోర్టల్ ద్వారా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు బిల్లు చెల్లించేలా చర్యలు
- ప్రభుత్వ విద్యాసంస్థలకు తప్పనున్న ఆర్థిక భారం
- నగర శివారులోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలకు ప్రయోజనం



1,900 ప్రభుత్వ విద్యాసంస్థలకు

ఉచిత వెలుగు!

ఇప్పటివరకు వస్తున్న స్వల్పనిధుల్లో 30 శాతం కరెంటు బిల్లులకే..

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ విద్యాసంస్థలకు కొత్త వెలుగులు రానున్నాయి. ఇప్పటి వరకు సర్కారు బడులకు వస్తున్న అరకొర నిధుల్లో 30 శాతం విద్యుత్ బిల్లులకే చెల్లించాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో ఇక మీదట ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ విద్యాసంస్థలకు విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించనుంది. విద్యాసంస్థలు ఏ శాఖ పరిధిలోకి వస్తే ఆ శాఖ ఉన్నతాధికారికి పోర్టల్ లాగిన్ సదుపాయం కల్పిస్తారు. ఆ శాఖ పరిధిలోని విద్యాసంస్థల వివరాలను వెబ్ పోర్టల్‌లో చేర్చడం, తొలగించడంతోపాటు సవరణకు అవకాశం కల్పిస్తారు. ఉచిత విద్యుత్ నేపథ్యంలో వచ్చిన బిల్లును విద్యాసంస్థలు చెల్లించకుండా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆ శాఖకు వచ్చే బడ్జెట్లో నుంచి ప్రతినెలా డిస్కంలకు చెల్లిస్తారు. ఇందుకు వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు నెలకు రూ. వెయ్యి నుంచి రూ. 1,500, ఉన్నత పాఠశాలలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు, గురుకుల పాఠశాలలకు రూ.10 వేలు, ఉన్నత విద్యాసంస్థలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఈ లెక్కన అన్నింటికీ కలిపి రూ.లక్షల్లో ఆర్థిక భారం తప్పనుంది.

శివారుల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు 1,900పైనే..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మొత్తంగా 1,900 పైగా ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మూడు డిగ్రీ, ఐదు జూనియర్ కళాశాలలు, ఒకటి ఒకేషనల్ కళాశాల, స్పోర్ట్స్ అథారిటీ కళాశాల, ఆరు సాంఘిక సంక్షేమ కళాశాలలు, రెండు గిరిజన సంక్షేమ కళాశాలలు, ఆరు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ కళాశాలలు, ఎనిమిది మైనార్టీ సంక్షేమ కళాశాలలు ఉన్నాయి. రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, నాలుగు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,301 ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐలు కూడా ఉన్నాయి.

ఉచిత విద్యుత్‌ను స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ బడులు, కళాశాలల్లో ఉచిత విద్యుత్‌కు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ విద్య బలోపేతానికి బడులు, కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కూడా సర్కారు దృష్టి సారించాలి. విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులన్నీ భర్తీ చేయాలి.

– రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పాలనలో పారదర్శకతకు పెద్దపీట

సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతను పాటిస్తూ, అవినీతి నిర్మూలనకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఉమ్మడి రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. సమాచార హక్కు వికాస సమితి 9వ రాష్ట్ర మహాసభ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ కట్టడాలను కూల్చేందుకు ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసి పార్టీలకతీతంగా అక్రమ కట్టడాలను కూల్చడం ప్రజా పాలనకు నిదర్శనమని అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో భారీ ప్రక్షాళన చేసి ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం, ఉద్యోగ కేలండర్ ముందస్తుగానే ప్రకటించడం అభినందనీయమని అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఏసీబీ అధికారులు దాడులు చేయడం, అవినీతికి పాల్పడిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

అక్టోబర్ 12న మహాప్రదర్శన నిర్వహించాలి

సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో, అధికారుల్లో సరైన అవగాహన లేని కారణంగా అనేక అనర్థాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా, అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యత పెరిగే విధంగా చూడాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే విధంగా వికాస సమితి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని, అక్టోబర్ 12న నగరంలో మహాప్రదర్శన నిర్వహించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మారం వెంకట గోనారెడ్డి, సీహెచ్ విద్యాసాగర్, హేమలత, వీరారెడ్డి, వినోద్ రెడ్డి, దైవాధీనం, అశోక్‌రెడ్డి, పాపిరెడ్డి, నయీం, సురేష్, అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వీడని వర్షం

సాక్షి,సిటీబ్యూరో: వారం రోజులుగా నగరాన్ని వర్షం వెంటాడుతూనే ఉంది. మొన్నటి వరకు వరసగా రాత్రిపూట వర్షం కురవగా , గత రెండు రోజుల నుంచి మధ్యాహ్నం వేళ భారీ వర్షం కురిసింది. ఆ తర్వాత చినుకులకు పరిమితమైంది. ఆదివారం సెలవు కావడంతో రోడ్లపై పెద్దగా జనసంచారం లేదు. దీంతో ట్రాఫిక్‌కు ఎలాంటి సమస్య ఏర్పడలేదు. అయితే ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కప్పుకుంది. మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

నగరంలో నేడు

- పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు రవీంద్రభారతిలో కవిసమ్మేళనం జరగనుంది. 'కాళోజీ మానవతా విలువలు' అనే అంశంపై జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం, భాషా సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.
- నగరంలోని శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయాల్లో శ్రీవారి లడ్డూలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్ప కళావేదికలో ఉదయం 10 గంటలకు అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ స్నాతకోత్సవం, గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేయనున్నారు.
- తెలంగాణ యువతి మండలి ఆధ్వర్యంలో రజిత రత్నాలు, సిల్వర్ జూబ్లీ వేడుకలు సాయంత్రం 5.30 గంటలకు కళాశాల ఆవరణలో జరుగుతాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు.
- నాంపల్లిలోని లలిత కళాతోరణం వేదికగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్‌ను ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నేడు ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా తెలంగాణలో సమాచారం, హక్కులు, ఫిర్యాదుల పరిష్కార విధానాలపై పబ్లిక్ హియరింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి (ఉన్నత విద్య, సామాజిక న్యాయం) ఆర్.సుబ్రమణ్యం, ఎంకేఎస్ఎస్ వ్యవస్థాపకుడు నిఖిల్ డేతోపాటు పలువురు సామాజికవేత్తలు, పలు సామాజిక సంఘాలు పాల్గొననున్నాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బండారుపల్లి గ్రంథాల ఆవిష్కరణ



నాంపల్లి: ప్రముఖ రచయిత బండారుపల్లి రామచంద్రరావు రచించిన ఆత్మీయ రూప, ఆనందప్రద శ్రీ శ్రీనివాస శరణు మంజరి, అష్టరూప, అభయ వరద ఏడుకొండల శ్రీ వేంకటేశ్వర శరణు మంజరి గ్రంథాల ఆవిష్కరణోత్సవం సభ ఆదివారం మాసాబ్ ట్యాంక్ హఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని మానస ఆర్ట్స్ థియేటర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లలితవాణి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.వి. రమణాచారి హాజరై గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేటి నిజం పత్రిక సంపాదకుడు బైస దేవదాస్, జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి, మానస ఆర్ట్స్ థియేటర్స్ అధ్యక్షులు రఘుశ్రీ పాల్గొన్నారు.

12న ఉచిత హోమియో వైద్య శిబిరం

నాంపల్లి: మహానగరంలో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఈ నెల 12న సాయంత్రం 4 గంటలకు రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో ఉచిత హోమియో శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అల్లోపతి, ఆయుష్ విభాగాల్లోని అగ్రశ్రేణి నిపుణులు శిబిరానికి హాజరవుతారు. వ్యాధి నివారణ, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై నిపుణులు ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ఉచిత హోమియోపతి కన్సల్టేషన్, మందుల పంపిణీ జరుగుతుంది.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- రైతు–కూలీ పోరాట సమితి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో జరిగిన ప్రాణ, ఆస్తుల నష్టాలను జాతీయవిపత్తుగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని తెలంగాణ రైతు–కూలీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన రైతు–కూలీ పోరాట సమితి ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల వల్ల రోడ్లు, వంతెనలు ఎక్కువగా దెబ్బతిన్నాయని, చెరువులు, కాలువలు తెగడంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయని విచారం వ్యక్తం చేశారు. వరదలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి వెంటనే పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమరయ్య, నాయకులు సత్తయ్య, బాబాన్న, సైదులు, కృష్ణ, అమర్‌నాయక్, గురువన్న తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థల కృషి మరువలేనిది

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



భారత్ కల్చరల్ అకాడమీ రజతోత్సవంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: భారతీయ సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణలో సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషి మరువలేనివని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. భారత్ కల్చరల్ అకాడమీ రజతోత్సవాలను ఆదివారం బేగంపేటలో ఘనంగా నిర్వహించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్లుగా రాజధాని నగరంలో భారత్ కల్చరల్ అకాడమీ ఎన్నెన్నో వైవిధ్యభరితమైన కార్యక్రమాలను నిర్వహించిన వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయుడు, యువ పారిశ్రామికవేత్త, ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన గిరిష్ ఇయ్యపును 'సేవారత్న'పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ సీఎన్ గోపీనాథ్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, సినీ ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, రోజారమణి, కవిత, జేఎల్ శ్రీనివాస్, యువ సినీ నిర్మాత రాహుల్ యాదవ్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధపోరు మహోన్నతమైనది

- సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న సురవరం

కాచిగూడ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రపుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని సీపీఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటచరిత్రను నాలుగు భాషల్లో ముద్రించి ప్రచురించిన బుక్‌లెట్స్‌ను బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవిష్కరించారు. తెలంగాణ సాయుధ పో రాట సేనాని, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని మతోన్మాదశక్తులు ఇప్పుడు చరిత్రకు మతం రంగును పులుముతూ హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తున్నారని ధ్వజమెత్తారు. మత ఛాందసవాదుల కుట్రలను, వక్రీకరణను తిప్పికొట్టాలని, వాస్తవికత చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. మహత్తరమైన సాయుధ పోరాట చరిత్రను అభాసుపాలు చేసి వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధిని పొందాలని బీజేపీ చూస్తోందన్నారు. ఈ మతోన్మాద శక్తులను ఓడించేందుకు జ్ఞానవంతమైన తెలంగాణ సమాజం ముందుకు రావాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 11–17 తేదీల మధ్య తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకోవాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, ఈటి నర్సింహా, బి.విజయలక్ష్మి, ఉజ్జిని రత్నాకర్, స్టాలిన్, కమతం యాదగిరి, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో సామూహిక హారతి

చార్మినార్ వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద జరిగిన సామూహిక హారతి కార్యక్రమంలో మహిళా భక్తులతోపాటు పలువురు అధికార అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.



హైలైఫ్‌ పోస్టర్‌ ఆవిష్కరణ

లక్డీకాపూల్‌ : నగరంలో ప్రత్యేక డిజైన్లతో కూడిన నగల ప్రదర్శన మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు హైలైఫ్‌ జ్యువెలరీ నిర్వాహకులు పేర్కొన్నారు. అమీర్‌పేట మ్యారీగోల్డ్‌ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత జ్యువెలరీ డిజైనర్స్‌ రూపొందించిన ఎగ్జిబిషన్‌ పోస్టర్‌ను పలువురు మోడళ్లతో కలిసి నటీమణులు శ్రవంతి చొకారపు, నయని పావనిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైలైఫ్‌ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ నెల14 నుంచి 16 వరకూ హైటెక్‌ సిటీలోని హెచ్‌ఐసీసీలో ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ నగల ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



ఎర్త్‌ ఇన్‌ ఫోకస్‌ ఫొటోగ్రఫీ పోటీలు.. షురూ..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఛానెల్‌ సోనీ బీబీసీ ఎర్త్‌ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పోటీలను 'ఎర్త్‌ ఇన్‌ ఫోకస్‌' పేరిట నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. 'ఒకే ప్రపంచం, అనేక ఫ్రేమ్‌లు' అనే థీమ్‌తో ఫొటోలను ప్రదర్శించడానికి వేదికను ఏర్పాటు చేసిందనీ, ఔత్సాహికులు తమ విభిన్న ఛాయాచిత్రాలతో ఈ పోటీలో పాల్గొనవచ్చన్నారు. నెల రోజుల పాటు జరిగే పోటీకి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఫొటోగ్రాఫర్‌ శివంగ్‌ మెహతా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తారని తెలియజేశారు. వివరాలకు https://www.sonybbcearth.com/Earthinfocusలో సందర్శించాలని కోరారు.

వావ్‌.. చాకొలెట్‌ పార్టీ

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తియ్యటి విందు తెచ్చిన స్విస్‌ చాకొలెట్‌ పేజ్‌ త్రీ గ్లామర్‌ అభిమానుల నోళ్లను సమ్మోహనపరిచింది. ప్రముఖ వ్యాపార సంస్థ దరమ్‌పాల్‌ సత్యపాల్‌ గ్రూప్‌ (డీఎస్‌ గ్రూప్‌) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని ఎఫ్‌ఐయు డిసర్ట్స్‌, బార్‌ అండ్‌ కిచెన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో స్విస్‌ చాకొలెట్‌ బ్రాండ్‌ ల్యాడెరాక్‌ను నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ల్యాడెరాక్‌ బ్రాండ్‌ ప్రతినిధి సంస్కృతి గుప్తా మాట్లాడుతూ తమ లగ్జరీ చాకొలెట్‌కు నగరంలో అనేక మంది అభిమానులు ఉన్నారని, గత కొంత కాలంగా నగరం నుంచి వస్తున్న ఎంక్వైరీలతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను అంచనా వేసి తమ బ్రాండ్‌ను ఇక్కడ విడుదల చేస్తున్నామన్నారు.

పేజ్‌ త్రీ.. సందడి..

ఈ చాకొలెట్‌ బ్రాండ్‌ కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు పేజ్‌ త్రీ సోషలైట్స్‌, వ్యాపార ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరిలో పింకీరెడ్డి, శీతల్‌ భంగర్‌, రిచా జలాన్‌, కోమల్‌ అగర్వాల్‌, ప్రియాంక చిగురుపాటి, జలాచర్‌ ఎల్లా, రింకు రెడ్డి, ఫ్యాషన్‌ డిజైనర్‌ అనుశ్రీరెడ్డి తదితరులు ఉన్నారు.







దేశంలో హైదరాబాద్‌కు ఒలింపియన్స్‌ సిటీగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి పీవీ సింధూ, సైనా నెహ్వాల్‌, గుత్తా జ్వాల, నగరంతో అనుబంధమున్న గగన్‌ నారంగ్‌ వంటి వారు ఒలింపిక్స్‌ మెడల్స్‌ సాధించడమే కారణం. అంతేకాకుండా పుల్లెల గోపీచంద్‌ ఆధ్వర్యంలో ఒలింపియన్స్‌ సన్నద్ధమైంది కూడా ఇక్కడే. ఇలా నగరం నుంచి బ్యాడ్మింటన్‌, టెన్నిస్‌, క్రికెట్‌, హాకీ, చెస్‌, రైఫిల్‌ షూటింగ్‌ వంటి పలు అంతర్జాతీయ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించి నగర ఖ్యాతిని విశ్వ వ్యాప్తం చేశారు. ఇదే కోవలో ఆర్చరీ క్రీడ కూడా భవిష్యత్‌లో రాణించనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆర్చరీకి ప్రాధాన్యత చాలా పెరుగుతోంది. ఈ సారి ఒలింపిక్స్‌లో తెలుగు క్రీడా కారుడు ధీరజ్‌ 4వ స్థానంలో నిలిచిన సంగతి విధితమే. భారతీయ క్రీడా చరిత్రలో తమకంటూ ఒక పేజీ రాసుకోవాలనుకునే నగర క్రీడాకారులు విల్లంబులు చేతబట్టి ఒలింపిక్‌ వేటకు సిద్ధమవుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఎక్కుపెట్టిన బాణాలు.. ఈ విల్‌కారులు

ఆర్చరీపై భాగ్యనగర వాసుల గురి..

ఏ క్రీడ ఆడాలన్నా, శిక్షణ పొందాలన్నా మరో క్రీడాకారుడు ఉండాల్సిందే. ఇలా కాకుండా ఇండివిడ్యువల్‌ గేమ్‌ (వ్యక్తిగత క్రీడ) విభాగంలో ఆర్చరీ ఒకటి. గత కొన్ని ఏళ్లుగా ఈ గ్లామర్‌ గేమ్‌పై నగర క్రీడా అభిలాషకులు ఫోకస్‌ పెట్టారు. నగరం నుంచి ఇప్పటికే పలు క్రీడల్లో చాలా మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంతో తమను తాము నిరూపించుకోవడానికి ఆర్చరీని ఎంచుకుంటున్నారు. అంతేకాకుండా ఇతర క్రీడల్లో కొనసాగుతున్న పోటీని తప్పించుకోవడానికి కూడా ఆర్చరీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మధ్య కాలంలో నేషనల్స్‌లో నగర ఆర్చరీ క్రీడాకారులు రాణిస్తుండటం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోంది. తెలంగాణలో ఆర్చరీ శిక్షణ అందించే 'సాయ్‌' (స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా ట్రైనింగ్‌ సెంటర్‌, గచ్చిబౌలి), హకీం పేట్‌ స్పోర్ట్స్‌ స్కూల్‌ రెండూ నగరానికి అనుబంధమున్నవే. వీటితో పాటు నగరంలో దాదాపు ఎనిమిది ప్రైవేటు శిక్షణా కేంద్రాలున్నాయి. ఈ అంశాల దృష్ట్యా ఇక్కడ ఆర్చరీ క్రీడాకారుల సంఖ్య పెరుగుతోంది.





నేషనల్స్‌లో వెయ్యి మంది రాణింపు..

జాతీయ స్థాయిలో టాప్‌ 2లో నా విద్యార్థులు ఉన్నారు. 2000 సంవత్సరంలో ఆర్చరీ ప్రారంభించిన నేను ఏడేళ్ల పాటు 23 విభాగాల్లో నేషనల్స్‌, ఆల్‌ ఇండియా యూనివర్సిటీ నేషనల్‌ ఛాంపియన్స్‌ ఆడాను. 7 నేషనల్స్‌లో పతకాలు సాధించాను. ఆల్‌ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్‌గా నిలిచాను. అనంతరం మేటి ఆర్చర్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా 2008 నుంచి శిక్షణ ప్రారంభించాను. ఇప్పటి వరకూ నా శిక్షణలో వెయ్యి మందికి పైగా నేషనల్స్‌ ఆడారు. కొందరు యూత్‌ ఒలింపిక్స్‌ ఇండియా క్యాంపుకు వెళ్లారు. దాదాపు 3 వేల మందికి పైగా శిక్షణ అందించాను. ఫ్రెండ్స్‌ అండ్‌ ఆర్చర్స్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ పేరుతో నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌, ఖైరతాబాద్‌, ప్రగతి నగర్‌, నార్సింగిలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి అథ్లెట్లను తయారు చేస్తున్నాను. 2028 ఒలింపిక్స్‌ పతకమే లక్ష్యంగా అద్భుతమైన నైపుణ్యాలున్న ఇద్దరు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలను సన్నద్ధం చేస్తున్నాను. ఆర్చరీ శిక్షణతో పాటు వీరికి అవసరమైన ఫిట్నెస్‌, ఫిజియోథెరపీ, సైకాలజీ కౌన్సిలింగ్‌, స్పెషల్‌ ట్యూనింగ్‌ అందిస్తున్నాం. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా కూడా ఆర్చరీకి మంచి భవిష్యత్‌ ఉంది. రీకర్వ్‌, కాంపౌండ్‌ విభాగాల్లో మన ఆర్చర్స్‌ అద్భుతంగా రాణిస్తున్నారు. ప్రభుత్వం తరపున మంచి భద్రతా ప్రమాణాలతో మరిన్ని ఆర్చరీ గ్రౌండ్స్‌ నిర్మిస్తే వందల మంది ఆర్చర్స్‌కు అవకాశం ఉంటుంది. ఎక్విప్‌మెంట్‌ అందించగలిగితే ఆర్చరీ మరింత రాణిస్తుంది. ఖమ్మం, వరంగల్‌, కరీంనగర్‌, మహబూబ్‌నగర్‌ వంటి ప్రాంతాల్లో అద్భుతమైన కోచ్‌లు ఉన్నారు. నా అకాడమీ తరపున చాలా మంది పేద పిల్లలకు ఆర్చరీలో సహకారం అందిస్తున్నాను. వారిలో రాజ్‌భవన్‌ స్కూల్‌కు చెందిన వైభవ్‌ నేషనల్స్‌ మెడల్‌ సాధించాడు. మరో అమ్మాయి లలితా రాణి నేషనల్స్‌ ఆడి సత్తా చాటింది.

– రాజు, ఆర్చరీ నేషనల్స్‌ ఛాంపియన్‌, ప్రముఖ కోచ్‌, ఫ్రెండ్స్‌ అండ్‌ ఆర్చర్స్‌ ఆర్చరీ ట్రైనింగ్‌ సెంటర్‌.

నాలుగు నేషనల్స్‌ ఆడాను..



కాచిగూడ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ చదువుతున్నాను. ఇప్పటి వరకూ గుజరాత్‌, ఉత్తరాఖండ్‌, తమిళనాడు వంటి ప్రాంతాల్లో నాలుగు నేషనల్స్‌ ఆడాను. అసోసియేషన్‌ నేషనల్స్‌, ఫుల్‌ నేషనల్స్‌లో పోటీ పడ్డాను. భారతీయ ఆర్చర్‌గా ఒలింపిక్స్‌లో సత్తా చాటి దేశ ఖ్యాతిని మరింత పెంచడమే లక్ష్యం. – లలితా రాణి

నగర వేదికగా...

నగరం వేదికగా దాదాపు 150 మంది ఆర్చరీ అథ్లెట్స్‌ ఉన్నారని అంచనా. జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ టీం రెండో స్థానంలో ఉన్నట్లు క్రీడా నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా జాతీయ స్థాయి సీనియర్స్‌, జూనియర్స్‌ విభాగంలో నగరానికి చెందిన అమ్మాయిలు ఇద్దరూ సిల్వర్‌ మెడల్స్‌ సాధించగా, అబ్బాయిలు ఎనిమిదో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

ఆరు కేటగిరీల్లో..


ఆర్చరీకి సంబంధించి నేషనల్స్‌లో అండర్‌ 10, 13, 15, 17, 19, అబౌ 19 విభాగాలు ఉంటాయి. ఒలింపిక్స్‌కు అయితే ఎలాంటి ప్రమాణాలూ ఉండవు. ఎవరైనా పోటీ పడొచ్చు. ఆరు కేటగిరీల్లో ఈ ఎంపిక కొనసాగుతోంది. మొదటి దశ ఓపెన్‌ కేటగిరీలో దేశవ్యాప్తంగా ఎవరైనా పోటీ పడొచ్చు. ఇందులోంచి టాప్‌ 32, టాప్‌ 16, టాప్‌ 8, టాప్‌ 6 ఇలా ఎంపిక చేసి చివరగా ముగ్గురిని ఒలింపిక్స్‌కు పంపిస్తారు.

2028 ఒలింపిక్స్‌ లక్ష్యంగా..



12 ఏళ్ల వయస్సు నుంచి ఆర్చరీలో రాణిస్తున్నాను. ఇప్పటి వరకూ ఎనిమిది నేషనల్స్‌ ఆడాను. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన నేషనల్స్‌లో ఒక గోల్డ్‌, మరో సిల్వర్‌ మెడల్‌ సాధించాను. 2028 ఒలింపిక్స్‌లో ఆడి పతకం సాధించడమే లక్ష్యంగా శిక్షణ కొనసాగిస్తున్నాను. ప్రస్తుతం మొయినాబాద్‌ కాలేజీలో పీజీ చదువుతున్నాను.

– హర్షవర్ధన్‌



ఇటు న్యాయం.. అటు సాయం..

న్యాయవాదిగా పనిచేస్తూ దాతృత్వం చాటుతున్న బాబు

మారుమూల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత

నిరుపేద కుటుంబం నుంచి వచ్చారు.. ఆయనకు చదువు విలువ తెలుసు.. చదువుకుంటే జీవితం ఎంత అందంగా ఉంటుందో.. ఎంత గౌరవం ఉంటుందో తెలియజేసే నిలువెత్తు నిదర్శనం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కష్టాలు స్వయంగా అనుభవించారు. అందుకే తనకు చేతనైనంత సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఏటా విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, స్కూల్‌ బ్యాగ్స్‌, వాటర్‌ బాటిల్స్‌ అందిస్తూ సమాజ సేవకు నడుం బిగించారు. చేతనైనంత సాయం చేస్తే ప్రకృతి కూడా మనకు సాయపడుతుందని చెబుతారు న్యాయవాది సంగిశెట్టి బాబు. ఆయన గురించిన మరిన్ని విషయాలు.. - సాక్షి, సిటీబ్యూరో

ఏటా పేద విద్యార్థులకు పుస్తక సామగ్రి పంపిణీ

ఇబ్రహీంపట్నం సమీపంలోని రాయ్‌పూర్‌లో ఓ నిరుపేద కుటుంబంలో యాదమ్మ, శంకరయ్య దంపతులకు జన్మించారు సంగిశెట్టి బాబు. చిన్నప్పటి నుంచి కడు పేదరికం అనుభవించారు. అయితే తమ జీవితాలను చదువు మాత్రమే మారుస్తుందన్న మాటను తు.చ. తప్పకుండా పాటించారు. అందుకే ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కాలేజీల్లో విద్యాభ్యాసం కొనసాగించారు. అనంతరం ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. ఎల్‌ఎల్‌ఎంలో గోల్డ్‌ మెడల్‌ సాధించారు. లా ప్రాక్టీస్‌ చేసుకుంటూనే పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. చిన్నప్పుడు తాను పడ్డ కష్టాలు ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు పడొద్దనే తలంపుతో తన వంతు సాయంగా ముందడుగు వేస్తున్నారు.


ఒక్క రూపాయి లేనిస్థితి నుంచి..

తన తల్లిదండ్రుల పేరుతో 2016లో యాదశంకర మెమోరియల్‌ ఫౌండేషన్‌ పేరుతో ఓ ట్రస్ట్‌ ఏర్పాటు చేశారు. అయితే ఆ సమయంలో తన చేతిలో ఒక్క రూపాయి కూడా లేదట. కానీ సంకల్ప బలం తోడైతే ఏదైనా సాధించవచ్చని నమ్మే బాబుకు.. విద్యా సామగ్రి పిల్లలకు అందజేసే ముందురోజు కేసులకు సంబంధించిన డబ్బులు వచ్చాయట. అందుకే తాను నమ్మిన సిద్ధాంతంతోనే ముందుకు వెళ్తున్నానంటారు బాబు.

ఆదిలాబాద్‌, ఆసిఫాబాద్‌ జిల్లాల్లో..



హైదరాబాద్‌ చుట్టుపక్కల చాలామంది ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే ఆదిలాబాద్‌ వంటి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోని పిల్లలు చదువుకోవడమే కష్టం అవుతుందన్న విషయం గుర్తు చేసుకున్నారు. అంతే ఏటా ఆదిలాబాద్‌, ఆసిఫాబాద్‌ జిల్లాల్లోని పలు మండలాల్లోని పిల్లలకు సామగ్రి అందజేస్తున్నారు. మౌలిక సదుపాయాలు లేక ఎవరూ చదువు మధ్యలో ఆపేయొద్దనేదే తన ఉద్దేశమని బాబు అంటున్నారు. భవిష్యత్తులో పిల్లల కోసం ఎంత కష్టమైనా తాను ముందుంటానని చెబుతున్నారు. బాబు నేపథ్యం స్ఫూర్తిదాయకం అయితే.. ఆయన సేవాగుణం ఆదర్శప్రాయం అనడంలో అతిశయోక్తి లేదు.





ఐవీఎఫ్‌పై అవగాహన పెరగాలి

సాక్షి, సిటీబ్యూరో: ఐవీఎఫ్‌ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని టాలీవుడ్‌ సినీనటి ఫరియా అబ్దుల్లా తెలిపారు. టోలీచౌకిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌ టెన్షన్‌, హిరా ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆమె ఆదివారం ప్రారంభించారు. సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న జంటలకు హిరా ఫెర్టిలిటీ సెంటర్‌ చక్కటి పరిష్కారం అందిస్తుందని అన్నారు. హిరా ఫెర్టిలిటీ సెంటర్‌ ఫౌండర్‌ డాక్టర్‌ ఫజలున్నీసా మాట్లాడుతూ.. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణుల బృందంతో కూడిన హిరా ఫెర్టిలిటీ సెంటర్‌లో ఐవీఎఫ్‌, ఐయూఐ, సంతానోత్పత్తి సంరక్షణ, సమగ్ర సంతానోత్పత్తి సేవలను అందిస్తున్నామన్నారు.

నగరంలో శ్రీవారి లడ్డు

ఇక ప్రతి రోజూ అందుబాటులో

గన్‌ఫౌండ్రీ: నగరంలో శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త చెప్పింది. ఇక నుంచి ప్రతి రోజూ శ్రీవారి లడ్డు ప్రసాదం అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకూ శని, ఆదివారాల్లో మాత్రమే విక్రయించే పరిస్థితి ఉండేది. శ్రీవారి లడ్డూల జారీలో టీటీడీ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చిందని హిమాయత్‌ నగర్‌ టీటీడీ డిప్యూటీ ఏఈవో రమేష్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ప్రతిరోజు శ్రీవారి లడ్డు ప్రసాదం అందుబాటులో ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో భక్తులకు పవిత్రమైన శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని (రూ.50లకు ఒక లడ్డు) అందించనున్నామన్నారు. హిమాయత్‌ నగర్‌, జూబ్లీహిల్స్‌ లోని తిరుమల తిరుపతి దేవస్థానాల్లో ఈ లడ్డులను విక్రయించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆయా ఆలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

గ్లోబల్‌ వేదికగా 'ఏడీపీ ఇండియా' వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: హ్యూమన్‌ క్యాపిటల్‌ మేనేజ్‌మెంట్‌ రంగంలో 'ఏడీపీ ఇండియా' వినూత్న ఆవిష్కరణలతో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ అగ్రస్థానంలో కొనసాగుతోందని ఏడీపీ గ్లోబల్‌ ప్రెసిడెంట్‌, సీఈఓ మరియా బ్లాక్‌ తెలిపారు. హ్యూమన్‌ రిసోర్సెస్‌ మేనేజ్‌మెంట్‌ సాఫ్ట్‌వేర్‌, సర్వీసెస్‌లో ప్రసిద్ధి చెందిన ఏడీపీ ఇండియా 25వ వార్షికోత్సవాలను ఆదివారం నిర్వహించింది. నగరంలోని హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్‌ శ్రీని కుటం, సీఎఫ్‌ఓ డాన్‌ మెక్‌గ్యురే, చీఫ్‌ హ్యూమన్‌ రిసోర్సెస్‌ ఆఫీసర్‌ పాల్‌ బోలాండ్‌తో పాటు దాదాపు 5 వేల మంది ఏడీపీ అసోసియేట్లు పాల్గొన్నారు. 102 మంది అసోసియేట్‌లతో కార్యకలాపాలను ప్రారంభించి 25 ఏళ్లలో 12 వేల మందికి పెరగడం విశేషమని మేనేజింగ్‌ డైరెక్టర్‌ విజయ్‌ వేములపల్లి అన్నారు. 25 శాతం సర్వీస్‌ ఆర్గనైజేషన్‌, 34 శాతం సాంకేతిక బృందాలు ఉన్నాయని, ప్రపంచ మార్కెట్‌లో కంపెనీ శక్తివంతమైన పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. నూతన ఆవిష్కరణలతో క్లైంట్‌ సేవలను అందించే కేంద్రంగా సంస్థను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తుందని సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సుజ్ఞాన్‌ వెంకటేష్‌ అన్నారు. ఏడీపీ ఇండియా సీఎస్‌ఆర్‌ ప్రోగ్రాం– తరంగ్‌, స్టూడియో, డ్యాన్సింగ్‌ స్టార్స్‌, ధోల్‌ అసోసియేట్‌ల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా 25వ వార్షికోత్సవం



క్లుప్తంగా...

వర్సిటీల్లో మొదటి విడత పీజీ సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల మొదటి విడత పీజీ సీట్ల కేటాయింపు జాబితాను ఆదివారం విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరానికి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర పీజీ కోర్సుల్లో 21,505 మంది విద్యార్థులు ఆయా వర్సిటీల క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు పీజీ కాలేజీల్లో సీట్లు సాధించినట్లు టీజీపీసీఈటీ–2024 కన్వీనర్ పాండురంగారెడ్డి వెల్లడించారు. పీజీ మొదటి ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన 21,505 మంది విద్యార్థుల్లో రెండింతలు 15,694 బాలికలు కాగా.. ఒక వంతు 5,811 మంది మాత్రమే బాలురు ఉన్నారు. సీటు లభించిన విద్యార్థులు ఈనెల 13 వరకు ఆయా కాలేజీల్లో టీసీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఫీజు చెల్లించాలన్నారు.

యూజీసీ గుర్తింపు లేకున్నా మహిళా వర్సిటీలో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి యూజీసీ గుర్తింపు లేకున్నా వరుసగా మూడో సంవత్సరం డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. పర్మినెంట్ వీసీ లేనందున, రాష్ట్ర ఉన్నత విద్యామండలితో పాటు విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుర్తింపు లభించలేదు. యూజీసీ గుర్తింపు లేనందున మహిళ వర్సిటీల్లో చదువులు పూర్తి చేసుకొని బయటకు వచ్చిన విద్యార్థులకు ఇంత వరకు డిగ్రీ సర్టిఫికెట్లను జారీచేయలేదు. సకాలంలో సర్టిఫికెట్లు అందకపోవడంతో పైచదువులకు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. డిగ్రీలు పూర్తి చేసినా సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో సమయం వృథా అవుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఏటా 5 వేల మంది విద్యార్థినులు మహిళా వర్సిటీలో ప్రవేశం పొందుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయనందునే యూజీసీ గుర్తింపు రాలేదని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

ముగిసిన ఎన్నికల కమిషనర్ పార్థసారథి పదవీకాలం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వ పరంగా కసరత్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల పాలక మండళ్ల పదవీకాలం దాదాపు ఆరున్నర నెలల కిందటే ముగిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మొదలుపెట్టేసింది. వార్డులు, గ్రామపంచాయతీల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఈనెల 13న జీపీలు, వార్డులలో ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురించి, 28న తుది జాబితాలు ప్రచురించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించింది. ఇదిలా ఉంటే రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా సి.పార్థసారథి నాలుగేళ్ల పదవీకాలం ఆదివారంతో పూర్తయింది. అయితే ఆయననే మరో ఏడాది పాటు పొడిగించడమా? లేదా కొత్త కమిషనర్‌ను నియమిస్తారా? అన్నది రెండు, మూడ్రోజుల్లో తేలిపోతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనను అధికారికంగా మొదలు పెట్టనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు కొంతకాలం పాటు వాయిదా పడే అవకాశాలున్నట్టు సమాచారం.

రైతుల పట్ల యమపాశం

▶ మొదటి పేజీ తరువాయి

రేవంత్ కుటుంబ బంధాల్లో కూడా చిచ్చుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సురేందర్‌కు ఏపీజీవీబీ బ్యాంకులో రూ.1.92 లక్షల అప్పు ఉందని, వాళ్ల అమ్మకు రూ.1.15 లక్షల అప్పు ఉండటంతో బ్యాంకు మేనేజర్ కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ అని చెప్పడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. రుణమాఫీకి రేషన్ కార్డు లింకు లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని, సురేందర్ ఆత్మహత్యతో సీఎం చెప్పిన మాటలు తప్పని తేలాయన్నారు. రేవంత్ పాలనకు సురేందర్ రెడ్డి లేఖ పంచనామా లాంటిదని చెప్పారు.

కుటుంబ బంధాల విచ్ఛిన్నం

కేసీఆర్ కుటుంబ బంధాలను బలోపేతం చేస్తే వాటిని రేవంత్ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని హరీశ్‌రావు మండిపడ్డారు. తన నియోజకవర్గంలో జక్కాపూర్ గ్రామంలో గురజాల బాల్‌రెడ్డి కుటుంబంలో ముగ్గురికి రుణం ఉందని, వారికి ఆరు లక్షల అప్పు ఉంటే కేవలం రెండు లక్షలే మాఫీ అవుతోందని చెప్పారు. ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయన్నారు. రుణ మాఫీ ఎగ్గొట్టడానికి రేవంత్ ప్రభుత్వం 31 సాకులు చూపెడుతోందన్నారు. కుంభాల సిద్దారెడ్డి, చాట్ల హరీష్ అనే రైతులకు భార్యల ఆధార్ కార్డులు తెమ్మంటున్నారని, వారికి పెళ్లే కానప్పుడు భార్యల ఆధార్ కార్డులు ఎక్కడ్నుంచి తెస్తారని ప్రశ్నించారు. 20 లక్షల మందికే ఇప్పటిదాకా రుణ మాఫీ అయిందని, ఇంకా 21 లక్షల రైతులకు మాఫీ కావాల్సి ఉందన్నారు. ఇప్పటిదాకా 470 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. కేసీఆర్ 11 విడతలుగా రైతు బంధు ఇచ్చారని, యాసంగి పంట వేసే టైం వస్తున్నా... వానా కాలం రైతు బంధు ఇవ్వరా? అని ప్రశ్నించారు. వడ్లకు బోనస్ బోగస్‌గా మారిందని ఎద్దేవా చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతుల కోసం బీఆర్ఎస్ ప్రాణాలకు తెగించి పోరాడుతోందన్నారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీలో ప్రభుత్వం ఉందా?

సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ధ్వజం

- సాయం అందించడంలో ఇంత చేతగానితనమా?
- వరద వచ్చి 8 రోజులైనా ఇప్పటికీ బాధితుల ఆకలికేకలు వినిపిస్తూనే ఉన్నాయి
- ఐదారు లక్షల మందిని ఆదుకోలేని దీనస్థితిలో మీ ప్రభుత్వం ఉందా?



సాక్షి, అమరావతి: విజయవాడలో వరద వచ్చి 8 రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ సాయం అందడం లేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? లేదా? అని ధ్వజమెత్తారు. వరదలకన్నా చంద్రబాబు నిర్వాకాల వల్ల నెలకొన్న విషాదం, ఆయన అసమర్థత వల్ల వచ్చిన నష్టం భారీగా ఉందన్నారు. 5 కోట్లమంది జనాభా, రూ.లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని నడుపుతున్న ప్రభుత్వం ఐదారు లక్షలమందిని ఆదుకోలేని దీన స్థితిలో ఉందా? అని నిలదీశారు. సహాయక చర్యల్లో చంద్రబాబు వైఫల్యాన్ని 'ఎక్స్'వేదికగా వైఎస్ జగన్ శనివారం ఎండగట్టారు. ఆయన పోస్టు పూర్తి పాఠం ఇది...

ఇంత చేతగానితనమా..

విజయవాడలో వరద వచ్చి 8 రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ దారీతెన్నూ లేకుండాపోయింది. ఇంకా ఆకలికేకలు వినిపిస్తూనే ఉన్నాయి. అసలు ప్రభుత్వం అనేది ఉందా? లేదా? అని అనిపిస్తోంది. వరదలకన్నా మీ నిర్వాకాల వల్ల నెలకొన్న విషాదం, మీ అసమర్థత వల్ల వచ్చిన నష్టం భారీగా ఉంది. 5 కోట్లమంది జనాభా, లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని నడుపుతున్న మీ ప్రభుత్వం ఐదారు లక్షలమందిని ఉదారంగా ఆదుకోలేని దీన స్థితిలో ఉందా? ఇంత చేతగానితనమా? ఇంతటి అమానవీయత మీకు మాత్రమే సాధ్యం చంద్రబాబూ.

50 మందికిపైగా చనిపోవడం ఎప్పుడూ జరగలేదు

మూడు రోజుల్లో 30 సెం.మీ. పైగా వర్షం పడటం అసాధారణం ఏమీ కాదు. గతంలో చాలాసార్లు పడింది. కానీ ఈ మాదిరిగా 50 మందికిపైగా ప్రజలు చనిపోవడం ఎప్పుడూ జరగలేదు. బాధితుల కోసం సహాయక శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటు చేశామని మీరు చెబుతున్నా.. అవి ఎక్కడున్నాయో తెలియకపోవడం, బాధితులను లోతట్టు ప్రాంతాల నుంచి సహాయక శిబిరాలకు తరలించకపోవడం అన్నది మీ ప్రభుత్వంలో మాత్రమే జరిగింది. ఈ వరదలు వచ్చి 8 రోజులు అవుతున్నా, 4–5 రోజులుగా వర్షాలు లేకున్నా ఇంకా ప్రజలు నీటిలోనే సహాయం అందని పరిస్థితుల్లోనే ఉండడం చాలా దారుణం.

ఇదంతా మీ నిర్లక్ష్యం వల్లేగా చంద్రబాబూ..

అసలు ఇదంతా ఎందుకు జరిగింది? దీనికి కారణం మీరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కాదా చంద్రబాబూ? శుక్రవారం (ఆగస్టు 30) నుంచి భారీ వర్షాలు వస్తాయని, భారీగా వరద వస్తుందని మీకు బుధవారమే (ఆగస్టు 28) అలర్ట్ వచ్చింది. అప్పటికే కృష్ణా నదిపై ఉన్న జలాశయాలన్నీ పూర్తి సామర్థ్యంతో నిండుగా ఉన్నాయని కూడా మీకు తెలుసు. అలాగే పై నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వరద వస్తుందని సమాచారం కూడా ఉంది. బుధవారం నుంచి శుక్రవారం వరకూ రెండున్నర రోజుల సమయం ఉన్నా మీరు పట్టించుకోలేదు. నీటిపారుదల, రెవెన్యూ, హోం శాఖ కార్యదర్శిలతో సమీక్షించి.. వారికి బాధ్యతలు అప్పగించి.. దిశానిర్దేశం చేసి ఉంటే ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు కదా?

'బుడమేరు'లో మీ నిర్వాకం వల్లే విపత్తు..

ఆ సమీక్ష జరిగి ఉంటే నీటిపారుదల శాఖ కార్యదర్శి ఫ్లడ్ కుషన్ మీద ధ్యాస పెట్టేవారు కదా? కృష్ణా నదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల నుంచి కొద్దికొద్దిగా నీటిని ముందుగానే విడుదల చేసి, తగ్గించుకుంటూ వస్తూ 60–70 టీఎంసీల ఫ్లడ్ కుషన్ ఏర్పాటు చేసి ఉండేవారు కదా? అప్పుడు పై నుంచి వచ్చే వరద నీటిని ఆయా జలాశయాల్లోనే సర్దుబాటు చేసి ఉంటే.. పులిచింతల కింద కృష్ణా నదిలోకి వచ్చే వరద నీటిని సక్రమంగా నియంత్రించి భారీ వరద ముప్పును తప్పించేవారు. దీనివల్ల ఇంత దారుణం జరిగి ఉండేది కాదు కదా? పై నుంచి వచ్చిన వరదను తగ్గించకపోవడం వల్ల కృష్ణానదిలో భారీ ప్రవాహానికి పులిచింతల దిగువ వరద కూడా తోడయ్యింది. దీంతోపాటు బుడమేరు విషయంలో మీ నిర్వాకం ఇంత విపత్తుకు దారితీసింది.

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ఉండి ఉంటే..

అదే విధంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి షెల్టర్ల ఏర్పాటు, నిరాశ్రయులకు వసతుల కల్పనపై దృష్టిపెట్టేవారు. హోం శాఖ కార్యదర్శి లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలను ఈ షెల్టర్లలోకి తరలించి ఉండేవారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ఉండి ఉంటే వారితో కలిసి వీరంతా ఈ ముప్పును చాలా సమర్థవంతంగా, ప్రాణనష్టం లేకుండా ఎదుర్కొనేవారు. కానీ ఇవేమీ జరగలేదు.

మీ ప్రచార ఆర్భాటాల వల్లే సమన్వయలోపం

మీ ప్రచార ఆర్భాటాల వల్లే సహాయక చర్యల్లో పూర్తిగా సమన్వయ లోపం నెలకొంది. మీకూ, మీ కూటమి మంత్రి నాదెండ్లకూ మధ్య జరిగిన సంభాషణపై వైరల్ అయిన వీడియోనే దీనికి సాక్ష్యం. ట్రాక్టర్లు రాకపోవడం ఏంటి? 150 వాహనాలు మాత్రమే ఉండడం ఏంటి? 80 వేల కుటుంబాలకు సరుకులు ఇవ్వాలనుకుంటే తొలిరోజు 15 వేల మందికీ ఇవ్వలేకపోయారని స్వయంగా సీఎం స్థానంలో ఉండి మీరే బేలతనం చూపడం ఏంటి? వర్షాలు ఆగి ఐదు రోజుల అయిన తర్వాత కూడా మీరు ఎలాంటి పాలన చేస్తున్నారు? లక్షల ఉద్యోగులున్న యంత్రాంగం ఏమైపోయింది? ఇప్పటికీ ఇంటింటికీ జల్లెడపట్టి ఎన్యుమరేషన్ చేసిన దాఖలాలేవీ కనిపించడంలేదు. మరి మీరిచ్చిన సహాయం వారికి ఎలా చేరుతుంది? విపత్తుల సమయంలో అసమాన సేవలందించిన, గ్రామ–వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థపై కక్ష పెంచుకుని వాటిని నిర్వీర్యం చేయడం వల్ల ఈ పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నది వాస్తవం కాదా?

మా హయాంలో ఒక్క రోజులోనే డోర్ డెలివరీ

బాధితులకు బియ్యం, పప్పు, నూనె తదితర సరుకులు ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌లో ఇదే తొలిసారి అన్నట్టుగా, దాన్నే ఓ పెద్ద ప్యాకేజీగా చూపించి మీరు ప్రచారం చేసుకుంటున్న తీరు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వరదల వల్ల బాధితులైన వారికే కాదు, వరద ప్రభావం ఉన్న కుటుంబాలకు కూడా రేషన్ సరుకులను ఒక్క రోజులోనే ఎండీయూ వాహనాల్లో డోర్ డెలివరీ చేశాం. అంతేకాకుండా వారికి కొంత డబ్బు ఇచ్చి వాళ్ల ఆనందంతో ఇంటికి వెళ్లేలా చేశాం. కానీ విజయవాడలో పరిస్థితి ఇంత విషమంగా ఉన్నా మీరిస్తున్న సరుకులు అరకొరే. తీరా అవి కూడా డోర్ డెలివరీ పద్ధతిలో చేరడం లేదు. తీసుకున్న ఆ కొద్దిమంది, ఇళ్ల నుంచి నీళ్లలో నడుచుకుంటూ వచ్చి మోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఇది ఇంకా వారిని బాధపెట్టడం కాదా?

సాయం చేయడంలో బీద అరుపులెందుకు?

కుటుంబ సభ్యుల్ని కోల్పోయి ఒకరు, వ్యాపారాలు తుడిచిపెట్టుకుపోయి మరొకరు, ఉపాధిని కోల్పోయి ఇంకొకరు, ఇల్లు ధ్వంసమై మరొకరు .. ఇలా విజయవాడ వరదబాధిత ప్రాంతాల్లో ఏ ఒక్కరిని కదిపినా ఇలాంటి దీనగాథలే వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో వారికి ఉదారంగా సహాయం చేయాల్సిన బాధ్యత మీది కాదా చంద్రబాబూ? ఒక్క పథకం కూడా అమలు చేయని మీ ప్రభుత్వం వరద బాధితులకు సహాయం చేయడంలో బీద అరుపులు ఎందుకు? బాధితులు కోలుకునేలా ఉదారంగా తగిన సహాయం చేయండి. మీరు ఆదుకోకపోతే మా పార్టీ తరపున కచ్చితంగా పోరాటాలు చేస్తాం.



ఆదివారం విజయవాడలోని జక్కంపూడి కాలనీలో స్వచ్ఛంద సంస్థ పంపిణీ చేస్తున్న ఆహారం కోసం వరద బాధితులు అవస్థలు

ఎటు చూసినా ఆక్రందనలే

ప్రభుత్వ సాయమెక్కడ?.. దారుణ పరిస్థితుల్లో వరద ముంపు ప్రాంత పేదలు

- పనులు లేక.. చేతిలో చిల్లిగవ్వ లేక సతమతం
- పిల్లల కోసం పాల ప్యాకెట్ కూడా కొనలేని దుస్థితి
- పత్తా లేని ప్రభుత్వం.. సహాయం ఎండమావే
- దాతల సాయంపైనే ఆధారపడి జీవిస్తున్న వైనం
- ఆదుకోవాలంటూ బంధువులు, స్నేహితులకు ఫోన్లు
- వారం దాటిపోయినా లోతట్టు కాలనీల వైపు తొంగిచూడని చంద్రబాబు సర్కార్

వారు రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు. ఏరోజుకారోజు కూలికి పోతే కానీ ఐదు వేళ్లు నోట్లోకి పోవు. ఇలాంటి వారిని వరద ముంచింది.. దీనికంటే ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకా ముంచుతోంది. విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తి వారం దాటిపోయినా లోతట్టు కాలనీల ప్రజల వైపు ప్రభుత్వం తొంగిచూస్తే ఒట్టు. ప్రధాన రోడ్లలో ఉన్నవారికి సాయం చేస్తున్నట్టు షో చేస్తున్న సర్కారు పెద్దలు లోతట్టు కాలనీల పేదలను పూర్తిగా వరదకు వదిలేశారు. దీంతో దారుణ పరిస్థితుల్లో ఈ కాలనీల్లో పేదలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. వారానికి పైగా పనులు లేక.. చేతిలో చిల్లిగవ్వ లేక అల్లాడుతున్నారు. చివరకు పసిపిల్లలకు పాలు పట్టడానికి పాల ప్యాకెట్ కూడా కొనలేని దుస్థితిలో ఉన్నారు. ఏమాత్రం ప్రభుత్వ సాయం అందకపోవడంతో దాతల సహాయంపైనే ఆధారపడి బతుకీడుస్తున్నారు. ఇంకోవైపు యజమానులు అద్దె ఇంటిని ఖాళీ చేయమంటారేమోనని కలత చెందుతున్నారు. సాయం చేయాలంటూ బంధువులు, స్నేహితులను అర్థిస్తున్నారు. ఇంకోవైపు పగబట్టినట్టు వాన వెంటాడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతను విస్మరించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడలో వరదలకు పేదల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. వారం రోజులకు పైగానే జలదిగ్బంధంలో ఉండిపోవడంతో పూట గడవడానికి కూడా చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నారు. బయట కూడా అప్పు పుట్టడం లేదు. దాతలు పంచే ఆహారాన్ని పిల్లలకు పెట్టి పెద్దలు పస్తులుంటున్నారు. ఒకటి, రెండు రోజుల్లో దాతల ఆహార పంపిణీ కూడా నిలిచిపోతే తమను ఆదుకునేవారెవరని పేద కుటుంబాలు చింతిస్తున్నాయి. ముంపు బాధితులను తక్షణ సాయంతో ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టనట్టే వ్యవహరిస్తోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రభుత్వానికి ముందే తెలుసు..



- 35 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుందని ముందు రోజే తెలిసింది
- 2 లక్షల మందిని పునరావాస శిబిరాలకు తరలించడం అసాధ్యం
- అందుకే ప్రజలకు మేము చెప్పలేదు
- ఏపీ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా

ఇదో కొత్తరకం సైబర్ మోసం

- సోషల్ మీడియా ఖాతాలు అన్‌లాక్ చేస్తామంటూ నేరగాళ్ల వల
- నకిలీ ఫాలోవర్స్‌ను చూపి నిజమైన సర్వీస్ ప్రొవైడర్లుగా బిల్డప్
- డేటా రిట్రైవ్‌కో రేటు.. లైవ్ లొకేషన్ ట్రాకింగ్‌కు మరో రేటు
- సోషల్ మీడియాలో యాడ్స్ ఇస్తూ మోసాలు చేస్తున్న సైబర్ కేటుగాళ్లు



సాక్షి, హైదరాబాద్: ఇదో సరికొత్త సైబర్ మోసం.. లాక్ అయిన మీ సోషల్ మీడియా ఖాతాలకు సంబంధించిన ప్రొఫైల్‌ను అన్‌లాక్ చేస్తామని.. పాస్‌వర్డ్‌లు క్రియేట్ చేసి ఇస్తామని.. కాల్ హిస్టరీ, కాల్ రికార్డింగ్‌లు ఇలా ఏవైనా రిట్రైవ్ చేస్తామని ఊదరగొడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త మోసానికి తెరతీస్తున్నారు. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో ప్రకటనలు సైతం ఇస్తున్నారు. తమ భాగస్వాములు, లేదా ఏ ఇతర వ్యక్తి గురించయినా గుట్టుగా సమాచారం సేకరించాలనుకునే వారి బలహీనతనే తమ పెట్టుబడిగా మార్చుకోవాలన్నది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ. ఇందుకు సంబంధించి తాము చేసే ప్రతీ పనికి కొంత మొత్తంలో ఫీజు నిర్ణయించి, ఫీజు చార్ట్‌ను సైతం వారి ప్రకటనల్లో పేర్కొనడం గమనార్హం.

ఒక్కో పనికి ఒక్కో రేటు..

ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ పాస్‌వర్డ్‌లు రికవరీ చేసి ఇచ్చేందుకు రూ.599, కాల్ హిస్టరీ, చాట్ హిస్టరీ తీసి ఇచ్చేందుకు రూ.750, లైవ్ లొకేషన్ ట్రాకింగ్‌కు రూ. 699, ఫుల్ ఫోన్ యాక్సెస్ చేయాలంటే రూ.999 అని సోషల్ మీడియాలో యాడ్స్ సైతం ఇస్తున్నారు. మీరు ఏ వ్యక్తికి సబంధించిన లైవ్ లొకేషన్ గురించి తెలుసుకోవాలన్నా.. తాము ఆ పని చేసిపెడతామని ఊదరగొడుతున్నారు. జనాన్ని నమ్మించేందుకు వారి సోషల్ మీడియా ఖాతాలకు వేల సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్నట్టుగా చూపుతున్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలకు చిక్కితే.. వెంటనే బ్యాంక్ ఖాతా నంబర్లు, యూపీఐ క్యూఆర్ కోడ్‌లు పంపి డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. ముందు వారు చెప్పినట్టుగా డబ్బు పంపితేనే పని మొదలవుతుందని సూచిస్తున్నారు. ఇలా నమ్మి డబ్బులు పంపగానే అవతలి వ్యక్తి ఫోన్ నంబర్‌ను సైబర్ నేరగాళ్లు బ్లాక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మోసగాళ్ల ప్రకటనలు నమ్మి మోసపోవద్దని సైబర్ భద్రతా నిపుణులు, పోలీసులు సూచిస్తున్నారు.

టాప్ అఛీవర్స్‌లో తెలంగాణ

ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బిజినెస్ రిఫారమ్స్ యాక్షన్ ప్లాన్)లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. కానీ ప్రతిపక్ష పార్టీ నేతలు రాష్ట్రాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రకటనలు ఇవ్వడం దారుణమని విమర్శించారు. అత్యుత్తమ సాధకులు (టాప్ అఛీవర్స్)గా ఎంపికైన 17 రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, ఈనెల 5న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కూడా తెలంగాణ ప్రభుత్వానికి అవార్డు అందించిందని గుర్తుచేశారు. వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికలో మొత్తం 352 పారామీటర్స్‌కు నూటికి నూరు శాతం అమలు చేసి టాప్ అఛీవర్స్ జాబితాలో తెలంగాణా స్థానం సంపాదించుకుందని శ్రీధర్‌బాబు వివరించారు. ఒక పత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురిస్తే దాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని అవార్డుల జాబితాలో లేదని అపఖ్యాతి పాలు చేయడం దుర్మార్గమని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో శ్రమించి అవార్డు సాధించిన పరిశ్రమల శాఖ అధికారులను హుందాగా అభినందించాల్సింది పోయి నిస్పృహకు గురిచేసేలా విమర్శలు చేయడం తగదన్నారు.



దీప్తిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

దీప్తి జివాంజీకి రూ.కోటి.. గ్రూప్–2 ఉద్యోగం

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన దీప్తి

సాక్షి, హైదరాబాద్/పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన అథ్లెట్ దీప్తి జివాంజీ పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. దీప్తిని అభినందిస్తూ రూ.కోటి నగదుతో పాటు గ్రూప్–2 ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థలం, దీప్తి కోచ్‌కు రూ.10 లక్షల నజరానా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు కల్లెడ గ్రామస్తులు తెలిపారు. అంతే కాకుండా పారా గేమ్స్ క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎంపీ బలరాంనాయక్, దీప్తి తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి, కోచ్ నాగపురి రమేశ్, అథ్లెట్ మృదుల, కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో క్రీడాకారులను అణచివేశారు: ముత్తినేని

బీఆర్ఎస్ పాలనలో క్రీడాకారులను అణచివేశారని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, పారా ఒలింపిక్స్‌లో విజేతగా నిలిచిన దీప్తి జివాంజీకి రూ.కోటితో పాటు 500 గజాల ఇంటి స్థలం, గ్రూప్–2 స్థాయి ఉద్యోగం, కోచ్‌కు రూ.10 లక్షలు కేటాయించడం చారిత్రక నిర్ణయమన్నారు. సీఎంతో పాటు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వందేభారత్

- ఈ నెల 15న ప్రారంభించనున్న ప్రధాని
- గతంలోనే ప్రతిపాదనలు
- 7.15 గంటల్లో చేరుకొనే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నాగ్‌పూర్– సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 15వ తేదీన ప్రారంభించనున్నారు. దీంతో పాటు దేశంలోని మరికొన్ని రూట్లలో వందేభారత్ రైళ్లను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ రైలులో 16 కోచ్‌లు ఉంటాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, బెంగళూరు నగరాలకు వందేభారత్ రైళ్లు నడుస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే నాగ్‌పూర్–సికింద్రాబాద్ మార్గంలో వందేభారత్ రైళ్లను నడపాలనే ప్రతిపాదన మొదటి నుంచి ఉంది. కానీ అప్పట్లో రెండు తెలుగు రాష్ట్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్–విశాఖ మధ్య వందేభారత్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆ తరువాత తిరుపతికి వెళ్లే భక్తుల రద్దీ, డిమాండ్ మేరకు మరో వందేభారత్ పట్టాలెక్కింది. తాజాగా అందుబాటులోకి రానున్న నాగ్‌పూర్–సికింద్రాబాద్ వందేభారత్ వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, విద్యార్థులు, ఇతర ప్రయాణికుల ఇబ్బందులు తొలగనున్నాయి. నారింజ తోటలకు ప్రసిద్ధి చెందిన నాగ్‌పూర్ పారిశ్రామికంగా కూడా ప్రముఖమైనది. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు నిజాంకాలం నుంచే విద్య, ఉద్యోగ, వ్యాపార సంబంధాలు బలంగా ఉన్నాయి. నాగ్‌పూర్‌కు చెందిన ఎంతోమంది విద్యార్థులు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. అలాగే నాగ్‌పూర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వైద్యం కోసం చాలా మంది హైదరాబాద్‌కు వస్తారు. దీంతో ఈ మార్గంలో వందేభారత్ రైలును ప్రవేశపెట్టడం వల్ల రెండు నగరాల మధ్య రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉందని ఉత్తర తెలంగాణ రైల్వే వినియోగదారుల సంఘం ప్రతినిధి ఫణి తెలిపారు.

7.15 గంటల ప్రయాణం..

నాగ్‌పూర్–సికింద్రాబాద్ వందేభారత్ రైలు మంగళవారం మినహా మిగతా అన్ని రోజుల్లో రాకపోకలు సాగించనుంది. ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ మీదుగా న్యూఢిల్లీకి రాకపోకలు సాగించే కర్ణాటక సంపర్క్‌క్రాంతి, ఏపీ సంపర్క్ క్రాంతి, యశ్వంత్‌పూర్–ఢిల్లీసరాయి రోహిల్లా దురంతో ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు నాగ్‌పూర్‌కు చేరుకొనేందుకు సుమారు 7.30 గంటల నుంచి 8 గంటల సమయం పడుతుంది. సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ మధ్య దూరం సుమారు 578 కిలోమీటర్లు ఉంటుంది. కొత్తగా అందుబాటులోకి రానున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ దూరాన్ని 7.15 గంటల్లో చేరుకొనే అవకాశం ఉంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీకి రాకపోకలు సాగించేవి కాకుండా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి నిజాముద్దీన్ వరకు నడిచే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా నాగ్‌పూర్ మీదుగానే వెళ్తున్నాయి. నాగ్‌పూర్ నుంచి ప్రారంభమయ్యే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఇది సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్హార్ష, రామగుండం, కాజీపేట్ స్టేషన్లలో ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం ఒంటిగంటకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 8.20 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుంది. ప్రస్తుతం ప్రాథమికంగా ఈ వేళలను నిర్ణయించారు. రైలు ప్రారంభించేనాటికి ఈ వేళల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చునని అధికారులు తెలిపారు.

కవులు సమాజానికి మేలు కొలుపు

హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్. చిత్రంలో కూరెళ్ల విఠలాచార్య

రామగిరి (నల్లగొండ): కవులు, రచయితలు సమాజానికి మేలు కొలుపు అని హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ అన్నారు. సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని విశ్వకర్మ భవన్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్యకు నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విఠలాచార్యకు శిష్యుడు అవడం తన అదృష్టమని, సాహిత్యం, మాతృ భాష అంటే తనకు ఎనలేని మక్కువ అని అన్నారు. విఠలాచార్య మాట్లాడుతూ గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పలువురు సాహితీ వేత్తలు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విఠలాచార్యకు పద్మశ్రీ అవార్డు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ తండు కృష్ణకౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, వేణుసంకోజు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఎస్.రఘు, కొల్లోజు సత్యనారాయణ, దాసోజు శ్రీనివాస్, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, పెరుమాళ్ల ఆనంద్, పెందోట సోము, కన్నెకంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి టీజీసెట్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీసెట్–2024) ఈనెల 10, 11, 12 తేదీల్లో జరగనున్నాయి. ప్రతి రోజు రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. తొలి రోజు 11,750, రెండో రోజు 10,479, మూడో రోజు 11,265 మొత్తం 33,764 మంది అభ్యర్థులు టీజీసెట్‌కు హాజరుకానున్నట్లు వెల్లడించారు. మొదటి విడత ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

మంచిమాట

గురు అన్న మాటని అతి సామాన్యంగా వాడేస్తూ ఉంటాం. దారిలో కనపడిన ముక్కు మొహం తెలియని మనిషిని పలకరించటానికి, ఎలా సంబోధించాలో తెలియని సందర్భంలోనూ, స్నేహితులు ఒకరినొకరు పలకరించుకోటానికి, చివరికి బస్ కండక్టర్‌నీ, డ్రైవర్‌నీ, ఇంకా ఎవరిని పడితే వారిని గురూ అని సంబోధించటం చూస్తాం. కాస్త పెద్దవారైతే గురువుగారూ అంటారు. గురువు అంటే పెద్ద వాడు అన్న అర్థంలో వాడితే సరే! గురు అన్నది అర్థం మాట అటు ఉంచి, పదమే సరి కాదు. గురువు అన్నది సాధు పదం.



సాధకులు... గురువులు

అసందర్భంగా ఉపయోగించటమే కాదు కొంత మంది ఆ విధంగా పిలిపించుకోవాలి అని చాలా తాపత్రయ పడుతూ ఉంటారు. నిజానికి ఆ విధంగా పిలిపించుకోవటం చాలా పెద్ద బరువు. బాధ్యత అవుతుంది. నాలుగు లలిత గీతాలు నేర్పి, పది పద్యాలో, శ్లోకాలో నేర్పి, రెండు మూడు యోగాసనాలు నేర్పించి, నాలుగు ప్రవచనాలు చెప్పి 'గురు' అనే బిరుదాన్ని తమకు తామే తగిలించుకోవటం చూస్తాం. వారి వద్ద నేర్చుకుంటున్న వారు గురువుగారు అనటం సహజం. తప్పనిసరి. అందరూ అట్లాగే అనాలి అనుకోవటం వల్ల సమస్య. అందరూ ఎందుకు అంటారు? అందుకని తామే తమ పేరులో భాగంగా పెట్టుకుంటున్నారు. అయితే ఏమిటట?

గురువు అంటే అజ్ఞాన మనే చీకట్లని తొలగించి, జ్ఞానమనే వెలుగుని ప్రసాదించే వాడు అని కదా అర్థం. గురుత్వాన్ని అంగీకరిస్తే శిష్యుల పూర్తి బాధ్యత నెత్తి కెత్తుకోవలసి ఉంటుంది. వారి తప్పులకి బాధ్యత తనదే అవుతుంది. బోధకుడుగా ఒక విషయంలో బాధ్యత వహించ వచ్చు. కానీ, గురువు అంటే మొత్తం అన్ని విషయాలలోనూ బాధ్యత ఉంటుంది. ఈ బరువు మోస్తూ ఉంటే తన సాధన సంగతి ఏమిటి? తన జీవన విధానం ఆదర్శప్రాయంగా ఉన్నదా?

ఒక్కసారి గురుస్థానం ఆక్రమిస్తే తరచుగా జరిగేది గర్వం పెరగటం. తాను ఒక స్థాయికి రావటం జరిగింది కనుక ఇక పై తెలుసుకోవలసినది, సాధన చేయవలసినది లేదు అనే అభిప్రాయం కలుగుతుంది. దానితో ఎదుగుదల ఆగిపోతుంది. గిడసబారి, వామన వృక్షాలు అవుతారు.

బోధిసత్వుడు తనను 'తథాగతుడు' అనే చెప్పుకున్నాడు కానీ గురువుని అని చెప్పుకోలేదు. శ్రీ రామ చంద్రుడికి అరణ్యవాసంలో మార్గనిర్దేశనం చేసిన ఋషులు కూడా 'ఇది ఋషులు నడచిన దారి' అనే చెప్పారు. మా దారి అని చెప్పలేదు. ఎందుకంటే, వారు అప్పుడు ఉన్న స్థితి కన్నా ఇంకా ఎక్కువ స్థాయికి వెళ్ళటం అనే ఆదర్శం ఉన్న వారు. ఒక్క సారి తనని గురువు అనిప్రకటించుకున్నాక ముందుకి సాగటం ఉండదు. ఈ జన్మకి ఇంతే! సాధకులు అనే స్థితి లేక పోతే, సాధన ఎక్కడ? సిద్ధి ఎక్కడ?

అటువంటి వారిని ఎంతో మంది చూస్తూనే ఉంటాం. ఏదో చిన్న సిద్ధి రాగానే దానిని ప్రకటించుకుంటూ ఆగి పోతారు. పతనం కూడా అవుతారు. మరొక గొప్ప బాధకరమైన ఉదాహరణ. చిన్నపిల్లలలో ప్రతిభ ఉండచ్చు. దాన్ని ప్రోత్సహించాలి కూడా. కానీ, వాళ్ళకి బిరుదాలు మొదలైనవి ఇచ్చిన తరువాత మరొక్క అడుగు ముందుకి వేయక పోవటం అనుభవమేగా!

ఒక రంగంలో అత్యున్నత స్థానాన్ని పొందిన వారు ఎవరు కూడా తాము గురువులము అని చెప్పకోవటం చూడం. ఇంకా సాధన చేస్తున్నాము, జ్ఞానం అనంతం మాకు ఈ మాత్రం అందినందుకు ధన్యులం అంటారు. పైగా ప్రతిరోజు మరింతగా సాధన చేస్తూ ఉంటారు. సంగీత విద్వాంసులయినా, వేద పండితులైనా, క్రికెట్ ఆటగాళ్లయినా అభ్యాసం ఆపరు. తాను చెప్పినది విని తనని నలుగురు అనుసరిస్తున్నారు అంటే ఎంత జాగ్రత్తగా మసలుకోవాలి?

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికథ

సుగుణ భూషణుడు... విభీషణుడు

విభీషణుడు విశ్రవసు, కైకసిల సంతానమే విభీషణుడు, రావణాసురుని చిన్న తమ్ముడు. అందరికంటే పెద్దవాడు రావణాసురుడు, కుంభకర్ణుడు రెండవవాడు. విభీషణుడు వీరిద్దరికంటే పూర్తి భిన్నమైన వాడు. సంస్కారవంతుడు, ఉత్తమోత్తమగుణాలు కలవాడు. సోదరులంటే అభిమానం కలవాడు. అందులో రావణాసురుడు అంటే భయభక్తులున్నవాడు. సీతమ్మ వారిని రావణాసురుడు చెర పట్టినప్పుడు 'అన్నా నీకు ఇది తగదు' అని మొదట హెచ్చరించింది విభీషణుడే. తదుపరి ఎన్నడూ రావణుని మందిరానికి వెళ్ళింది లేదు. హనుమ లంకాదహనం చేసినప్పుడు మరోసారి రావణునికి హితబోధ చేయాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. రావణుడు, సీతమ్మ దగ్గరకు వెళ్ళి గడువు పెట్టి వస్తున్నప్పుడు, రావణుని ఏకాంతంగా కలసి చెప్పాలనుకుని భయంతో విరమించుకున్నాడు. ఈ దిశలో రామలక్ష్మణులు, వానర సైన్యంతో సముద్రాన్ని దాటి రావడం, రావణునితో సమర భేరి మోగించడం జరిగింది ఆ సమయంలో రాచకొలువులో కోపోద్రిక్తుడై యుద్ధంలో ఆ రోజు విధులను కొంత మంది రాక్షస వీరులను నియమించాడు. అప్పుడు కూడా విభీషణుడు, రావణునికి చెప్పలేకపోయాడు. అన్న అంటే అంత భయం అతనికి. యుద్ధంలో రాక్షస వీరులు మరణిస్తుంటే తట్టుకోలేక పోయాడు విభీషణుడు. అప్పుడే పూజ ముగించి ధైర్యంతో నేరుగా రావణుని దగ్గరకు వెళ్ళాడు.. అప్పుడు రావణుడు ''రా విభీషణా!రేపు యుద్ధంలో నీవే నాయకత్వం వహించాలి'' అని చెబుతుండగా, విభీషణుడు చేతులు జోడించి 'అగ్రజా! యుద్ధం మనకు వద్దు. సీతమ్మ పరమ సాధ్వి. ఆ రామలక్ష్మణులు దైవాంశ సంభూతులు... అందు వల్ల... '' అంటుండగా రావణుని తీక్షణ చూపులు చూడలేక తల దించుకున్నాడు. మళ్ళీ ధైర్యంతో 'ఒక్కసారి ఆలోచించు ఒక రాజుగా మీకు ఇది శ్రేయస్కరం కాదు. రాజు ప్రజల బాగోగులు చూడాలి. స్త్రీ లకు రక్షణగా ఉండాలి. నా మాట విను, ఆ సీతమ్మ వారిని రాముల వారికి అప్పగించు. సమయం మించి పోలేదు. చేసిన తప్పు ఒప్పుకుని ఆ శ్రీరాముల వారిని శరణు వేడు. నీకు జయం కలుగుతుంది. శరణుజొచ్చిన వారిని అక్కున చేర్చుకునే మంచి గుణాలు అయనకు ఉన్నాయి. మీ మేలు కోరి ఈ లంక ప్రజల తరపున చివరిసారిగా చెబుతున్నాను. సీతమ్మ వారిని అప్పగించు, చేసిన తప్పు ఒప్పుకో! నిన్ను శ్రీ రాములు వారు కరుణిస్తారు'' అని పరి పరి విధాలుగా చెప్పాడు.



ఆ మాటలు విని రావణుడు ''అయ్యిందా నీ ఉపన్యాసం? నాకే నీతులు చెబుతావా! ముల్లోకాలలోనూ నాకు ఎదురు లేదు అనే విషయం నీకు తెలియదా! ఆ రాముని వధించి, సీతను వివాహం చేసుకొనుటకే నేను నిశ్చయించుకున్నా, నీ హితబోధ నాకు కాదు. ఇదే నిన్ను శాసిస్తున్నాను. రేపు యుద్ధ భూమిలో నీవే ప్రధాన బాధ్యత వహించాలి ఇది నా ఆజ్ఞ'' అని చర చర వెళ్ళిపోయాడు రావణుడు. విభీషణుడు అన్నీ ఆలోచించి శ్రీరాముల వారి దగ్గరకు 'శరణు, శరణు' అని వెళ్ళాడు. శ్రీ రాముడు అతన్ని చూశాడు. వినమ్రంగా, చేతులు జోడించి ఉన్న విభీషణుని చూడగానే ఆసనంపై నుంచి లేచి తన హృదయానికి హత్తుకున్నాడు.'నా జన్మ ధన్యమైంది ప్రభూ'' అంటూ శ్రీ రాముల వారి పాదాలు తాకి తన భక్తి, వినయం నిరూపించుకున్నాడు. ఆ విధంగా శ్రీరాముడితో విభీషణునికి స్నేహం కుదిరింది. రాముడికి యుద్ధంలో చేదోడుగా ఉన్నాడు. రావణుని మరణానంతరం లంకకు విభీషణుడు రాజైనాడు. ఇది శ్రీ రాముల వారు, విభీషణునికి ఇచ్చిన కానుక. లంకకు రాజైన విభీషణుడు సుపరిపాలన చేసి, ప్రజలకు ఉత్తమ పాలన అదించాడు. విభీషణుని చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది.

– కనుమ ఎల్లారెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకులు

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

అది... క్షీరసాగరమథనం



మనిషి జీవితంలో సంస్కారానికి ఆలంబన గృహస్థాశ్రమంలోనే. దానిలోకి వెడితే భార్య వస్తుంది, పిల్లలు వస్తారు...అలా చెప్పలేదు శాస్త్రం. అక్కడ ఆటు ఉంటుంది, పోటు ఉంటుంది. దెబ్బలు తగిలినా, సుఖాలు వచ్చినా... అవన్నీ అనుభవంలోకి రావల్సిందే. వాటిలో నీవు తరించాల్సిందే. కుంతీ దేవి చరిత్రే చూడండి. ఎప్పుడో సూర్య భగవానుడిని పిలిచి నీవంటి కొడుకు కావాలంది. కర్ణుడిని కనింది. అయ్యో! కన్యా గర్భం.. అపఖ్యాతి ఎక్కడ వస్తుందో అని విడిచిపెట్టలేక విడిచిపుచ్చలేక...మాతృత్వాన్ని కప్పిపుచ్చి నీళ్ళల్లో వదిలేసింది. తరువాత బాధపడింది. కొన్నాళ్ళకు పాండురాజు భార్యయింది. సుఖంగా ఉన్నాననుకుంటున్న తరుణంలో సవతి మాద్రి వచ్చింది. పిల్లలు లేరంటే మంత్రంతో సంతానాన్ని ధర్మరాజు, భీముడు, అర్జునుడిని పొందింది. ఆ మంత్రం మాద్రికి కూడా చెప్పమన్నాడు పాండురాజు. చెప్పింది. మాద్రికి నకులుడు, సహదేవుడు పుట్టారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

శాపం వచ్చింది. పాండురాజు చచ్చిపోయాడు. మాద్రి సహగమనం చేసింది. ఈ పిల్లలు నీ పిల్లలేనని ఏం నమ్మకం? అని... పాండురాజు పిల్లలకు రాజ్యంలో భాగం ఇవ్వరేమోనని... ఇది ధార్మిక సంతానం అని చెప్పించడానికి మహర్షుల్ని వెంటబెట్టుకుని పిల్లల్ని తీసుకుని హస్తినాపురానికి వెళ్లింది. అంత కష్టపడి వెడితే లక్క ఇంట్లో పెట్టి కాల్చారు. పిల్లల్ని తీసుకెళ్ళి నదిలో పారేసారు, విషం పెట్టారు. .. అయినా చలించకుండా ఇన్ని కష్టాలు పడుతూ పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. ఆఖరికి ధర్మరాజు ఆడిన జూదంతో అన్నీ పోగొట్టుకుని అరణ్యవాసానికి వెళ్ళాల్సి వచ్చింది.

అజ్ఞాతవాసం కూడా అయింది. తిరిగొచ్చారు. కురుక్షేత్రం జరిగింది. హమ్మయ్య గెలిచాం, పట్టాభిషేకం కూడా అయిందనుకున్నది. కంటికి కట్టుకున్న కట్టు కొంచెం జారి... కోపంతో ఉన్న గాంధారి చూపులు ప్రసరిస్తే ధర్మరాజుకు కాళ్ళు బొబ్బలెక్కిపోయాయి. అటువంటి గాంధారీ ధృతరాష్ట్రులు అరణ్యవాసానికి వెడుతుంటే... తన పిల్లలు గుర్తొచ్చి గాంధారి మళ్ళీ ఎక్కడ శపిస్తుందోనని, మీకు సేవ చేస్తానని చెప్పి... సుఖపడాల్సిన తరుణంలో వారి వెంట వెళ్ళిపోయింది. ఆమె పడిన కష్టాలు లోకంలో ఎవరు పడ్డారు కనుక !!!

గంగ ప్రవహిస్తూ పోయి పోయి చివరకు సముద్రంలో కలిసినట్లు ఈ ఆట్లు, పోట్లు కష్టాలు, సుఖాలతో సంసార సాగరంలో చేరి తరించాలి. చివరలో తిలోదకాలు ఇచ్చేటప్పుడు ఒక్కొక్కరి పేరు చెబుతున్నారు.. కొంత మంది పేరు చెప్పగానే ధృతరాష్ట్రుడు 'నావాడు' అంటున్నాడు... కొంత మందికి ధర్మరాజు 'నా వాడు' అంటున్నాడు. కర్ణుడి పేరు చెప్పగానే ధృతరాష్ట్రుడు 'నావాడు' కాదన్నాడు. ధర్మరాజు కూడా 'నావాడు' కాదన్నాడు... తట్టుకోలేకపోయింది తల్లిగా. ''వరం వల్ల పుట్టాడ్రా.. వాడు నీ అన్నరా, నీ సహోదరుడు... నా బిడ్డ...'' అంది.

మరి ధర్మరాజేమన్నాడు... తల్లిని శపించాడు..''ఆడవారి నోట్లో నువ్వుగింజ నానకుండుగాక..'' అని. దీనికోసమా ఇంత కష్టపడ్డది. అప్పుడొచ్చింది ఆమెకు వైరాగ్యం. కృష్ణభగవానుడిని స్తోత్రం చేసింది. గృహస్థాశ్రమం అంటే క్షీరసాగర మథనం. అక్కడ అమృతం పుట్టాలి. జీవితం అన్న తరువాత ఆటుపోటులుండాలి. రుషిరుణం, పితృరుణం, దేవరుణం... ఈ మూడు రుణాలు తీరాలన్నా, మనిషి తరించి పండాలన్నా గృహస్థాశ్రమంలోనే... అంతే తప్ప భార్యాబిడ్డలకోసం మాత్రమే కాదు.. కర్తవ్యదీక్షతో అన్నీ అనుభవంలోకి వచ్చిన నాడు ఈశ్వర కృప దానంతటదే వస్తుంది.

సినిమా

అర్థాలే వేరులే!



ధనుష్, నాగార్జున

ధనుష్, అక్కినేని నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని ధనుష్, నాగార్జునల పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ధనుష్ చూపులు దీనంగా ఉన్నట్లు, నాగార్జున తీక్షణంగా చూస్తున్నట్లు అనిపిస్తోంది. ఇద్దరు చూపులకు అర్థాలేంటో సినిమా చూస్తేనే తెలుస్తుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి.

ఫిర్యాదు చేయకపోతే ప్రయోజనం ఉండదు!



రోహిణి

మలయాళ సినిమా ఇండస్ట్రీలోని లైంగిక వేధింపులపై జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ నివేదిక తర్వాత పలువురు నటీమణులు తమకు ఎదురైన వేధింపుల గురించి బహిరంగంగా మాట్లాడుతున్నారు. తాము ఎదుర్కొన్న ఘటనలను మీడియా ముందుకొచ్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం చెన్నైలో జరిగిన నడిగర్ సంఘం (నటీనటుల సంఘం) సమావేశంలో నటి రోహిణి చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ– ''లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకపోవడం మంచిది. తమను వేధించిన వారిపై ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మీడియా ముందుకొచ్చి మాట్లాడటం వల్ల ఏ ప్రయోజనం ఉండదు'' అని పేర్కొన్నారు.

ఉత్సవంలో ...



రామ్‌చరణ్

'జరగండి... జరగండి...' అంటూ రామ్‌చరణ్ ఏ రేంజ్‌లో మాస్ స్టెప్పులేశారో ఆ పాట వీడియో చూసినవాళ్లకి తెలిసిందే. రామ్‌చరణ్‌తో కలిసి కియారా అద్వానీ కూడా జోష్‌గా డ్యాన్స్ చేశారు. ఈ ఇద్దరూ జంటగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'గేమ్ ఛేంజర్' చిత్రంలోని పాట ఇది. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే మరో పాటను రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం తెలియజేసి, ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఓ ఉత్సవం నేపథ్యంలో రామ్‌చరణ్, ఉత్సాహంగా డ్యాన్స్ చేసే పాట ఇది అని పోస్టర్ స్పష్టం చేస్తోంది. క్రిస్మస్ సందర్భంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎస్. తిరుణావుక్కరసు.


మూడు పాత్రలు సవాల్‌గా అనిపించింది

– టోవినో థామస్



''ఏఆర్‌ఎమ్' సినిమా మొదలుపెట్టినప్పుడు నటుడిగా ఇది నా 50వ చిత్రం అవుతుందనుకోలేదు. ఎగ్జయిటింగ్ స్క్రిప్ట్ ఇది. ఈ చిత్రంలో మూడు వైవిధ్యమైన పాత్రలు చేయడం పెద్ద సవాల్‌గా అనిపించింది. అయితే ఈ మూడు పాత్రలు దేనికవే ప్రత్యేకంగా ఉంటాయి'' అని హీరో టోవినో థామస్ అన్నారు. జితిన్ లాల్ దర్శకత్వంలో టోవినో థామస్ హీరోగా కృతీ శెట్టి, ఐశ్వర్యా రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఏఆర్‌ఎమ్'. డా. జకారియా థామస్‌తో కలిసి లిస్టిన్ స్టీఫెన్ నిర్మించిన ఈ మూవీ పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. తెలుగులో ఈ నెల 12న మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ– ''చిన్న నటుడిగా నా కెరీర్ ఆరంభించాను. సపోర్టింగ్, కామెడీ, విలన్ రోల్స్ చేశాను. 2016 నుంచి లీడ్ రోల్స్ చేస్తున్నా. నటుడు కావాలనేది నా కల... ఇప్పుడు ఆ కలలో జీవిస్తున్నాను. 'అజాయంతే రండం మోషణం' (ఏఆర్‌ఎమ్) అంటే అజయన్ రెండో దొంగతనం అని అర్థం. మిగతా భాషల వారికి ఈ పేరు పలకడం ఇబ్బందిగా ఉంటుందని 'ఏఆర్‌ఎమ్'గా పిలుస్తున్నాం. యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. మైత్రీ లాంటి టాప్ డిస్ట్రిబ్యూటర్స్ మా సినిమాని తెలుగులో రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు.

అడవిలో ప్రేమకథ



రోషన్ కనకాల

'బబుల్ గమ్' మూవీ ఫేమ్ రోషన్ కనకాల హీరోగా రెండో సినిమా ప్రకటన వచ్చింది. 'మోగ్లీ' పేరుతో ఈ చిత్రం రూపొందనుంది. తన మొదటి చిత్రం 'కలర్ ఫోటో'తో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఈ చిత్రంలోని రోషన్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''అడవి నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రం 'మోగ్లీ'. ఈ సినిమా కోసం అద్భుతమైన కథను సిద్ధం చేశారు సందీప్ రాజ్. ఈ చిత్రంలో రోషన్ యూనిక్ రోల్‌లో కనిపించనున్నారు. 2025 వేసవిలో ఈ సినిమాని విడుదల చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కాల భైరవ, కెమెరా: రామ మారుతి ఎమ్.

వెల్‌కమ్... బేబీ గర్ల్



రణ్‌వీర్, దీపిక

రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్ తల్లి దండ్రులయ్యారు. వినాయక చవితి సందర్భంగా శనివారం ముంబైలో ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయక ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు దీపిక, రణ్‌వీర్. అదే రోజు సాయంత్రం ముంబయ్‌లోని ఓ ఆస్పత్రిలో చేరిన దీపిక ఆదివారం పాపకు జన్మనిచ్చారు. 'వెల్‌కమ్... బేబీ గర్ల్' అంటూ ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా రణ్‌వీర్, దీపిక పేర్కొన్నారు. తల్లిదండ్రులైన వీరికి పలువురు సినీ ప్రముఖులు, ఫ్యాన్స్ శుభాకాంక్షలు చెబుతున్నారు.

నా లైఫ్‌లో రెండు హార్ట్ బ్రేక్స్ ఉన్నాయి



తమన్నా

''ఏ బంధంలో అయినా ఇచ్చి పుచ్చుకోవడం ప్రధానం. కానీ గతంలో నా భాగస్వామి నేను ఇచ్చినదానిని స్వీకరించే స్థితిలో ఉన్నారో లేదో కూడా ఆలోచించకుండా ఎక్కువే ఇచ్చేదాన్ని. అయితే ఇది సరికాదు. అలాగని ఇప్పుడు ఇవ్వడం మానేస్తానని కాదు... ఇచ్చి పుచ్చుకోవడంలోనే ఓ అనుబంధం బలం తెలుస్తుంది'' అంటున్నారు తమన్నా. గతంలో తనకు రెండు 'హార్ట్ బ్రేక్స్' ఉన్నాయని ఓ ఇంటర్వ్యూలో పేర్కొని, ఈ విధంగా అన్నారామె. ఆ ఇంటర్వ్యూలో హార్ట్ బ్రేక్స్ గురించి తమన్నా మాట్లాడుతూ – ''నా టీనేజ్‌లో ప్రేమలో పడ్డాను. అయితే అది సాగలేదు. ఎందుకంటే జీవితంలో ఏదో సాధించాలనే తపనతో ఉన్న నాకు ఒక వ్యక్తి కోసం జీవితాన్ని వదులుకోవాలనిపించలేదు. ఆ విధంగా తొలి హార్ట్ బ్రేక్ ఎదుర్కొన్నాను. ఆ తర్వాత మరో వ్యక్తితో ప్రేమలో పడ్డాను. ఆ ప్రేమ కూడా ముగిసిపోయింది. ప్రతి చిన్న విషయానికీ అబద్ధం ఆడే వ్యక్తితో కొనసాగలేననిపించింది. ఆ విధంగా రెండో హార్ట్ బ్రేక్ ఎదురైంది'' అన్నారు. ఇక ప్రస్తుతం నటుడు విజయ్ వర్మ–తమన్నా ప్రేమలో ఉన్నారనే వార్త ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే.

సోషియో సుబ్రహ్మణ్య



అద్వయ్

ప్రముఖ అనువాద కళాకారుడు, నటుడు పి. రవిశంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సుబ్రహ్మణ్య'. ఈ సినిమాతో రవిశంకర్ కుమార్ అద్వయ్ హీరోగా పరిచయమవుతున్నారు. ప్రవీణ కడియాల, రామలక్ష్మి సమర్పణలో తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ విడుదల చేశారు. ''60 శాతం షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఊరినిండా రాక్షసులే...



చంద్రహాస్

చంద్రహాస్ కే, అంకిత సాహా జంటగా గౌతమ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగంపేట'. గుంటక శ్రీనివాస్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. 'ఈశ్వర్.. ఇరవై ఏళ్లు అయిందిరా... ఊరిని చూడాలనిపిస్తుందిరా... చూపిస్తావా?', 'కొన్ని రోజులు ఆగమ్మా... ఊరినిండా రాక్షసులే ఉన్నారు... వాళ్లని చంపి ఊరిని చూపిస్తానమ్మా...' వంటి డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''మాస్ ఆడియన్స్‌కు సరికొత్త అనుభూతినిచ్చేలా మా సినిమా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శివన్, సంగీతం: పూనిక్. జి.

ఆరుగురి ప్రయాణం



రవిప్రకాశ్ రెడ్డి, రమ్యకృష్ణ

రవిప్రకాశ్ రెడ్డి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం '6 జర్నీ'. సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి రాథోడ్, రమ్యా రెడ్డి, రమ్యకృష్ణ ఇతర పాత్రధారులు. బషీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''ట్రైలర్, విజువల్స్, ఆర్ఆర్ బాగున్నాయి'' అన్నారు. ''విహార యాత్రకి వెళ్లిన ఆరుగురిపై కొందరు దాడి చేస్తారు. ఆ దాడి చేసింది ఎవరు? ఎందుకు చేశారు? అనే అంశాలతో ఈ సినిమా రూపొందింది'' అని తెలిపారు బషీర్ ఆలూరి. ''ఈ సినిమా అద్భుతంగా వచ్చింది'' అని రవిప్రకాశ్ రెడ్డి చెప్పారు.



సిరియాతో నేడు భారత్ పోరు... గెలిస్తేనే టీమిండియాకు టైటిల్

ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టైటిల్ కోసం నేడు భారత జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో సిరియా జట్టుతో భారత్ తలపడనుంది. మూడు దేశాల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. మారిషస్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌ను భారత్ 0–0తో 'డ్రా' చేసుకోగా... సిరియా జట్టు 2–0తో మారిషస్ జట్టును ఓడించింది. ఈ నేపథ్యంలో నేడు భారత్‌తో జరిగే మ్యాచ్‌ను సిరియా 'డ్రా' చేసుకుంటే చాలు టైటిల్‌ను దక్కించుకుంటుంది. భారత జట్టుకు టైటిల్ లభించాలంటే సిరియాపై గెలవాలి. ఇప్పటి వరకు భారత్, సిరియా జట్లు ముఖాముఖిగా ఏడు సార్లు తలపడ్డాయి. 3 మ్యాచ్‌ల్లో సిరియా, 2 మ్యాచ్‌ల్లో భారత్ గెలిచాయి. మరో రెండు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. ప్రపంచ ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో సిరియా 93వ స్థానంలో, భారత్ 124వ స్థానంలో ఉన్నాయి. నేడు రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్18–3 టీవీ చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



సబలెంకా... విజయ ఢంకా

యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన బెలారస్ స్టార్

ఫైనల్లో అమెరికా ప్లేయర్ జెస్సికా పెగూలాపై విజయం

రూ. 30 కోట్ల 23 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

న్యూయార్క్: గత మూడేళ్లుగా ఊరిస్తున్న యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌ను బెలారస్ స్టార్ అరీనా సబలెంకా నాలుగో ప్రయత్నంలో సొంతం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా 7–5, 7–5తో ప్రపంచ ఆరో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)పై గెలిచింది. గంటా 53 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో సబలెంకా కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. విజేతగా నిలిచిన సబలెంకాకు 36 లక్షల డాలర్లు (రూ. 30 కోట్ల 23 లక్షలు), రన్నరప్ జెస్సికా పెగూలాకు 18 లక్షల డాలర్లు (రూ. 15 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టోర్నీలో గత ఏడాది రన్నరప్‌గా నిలిచిన సబలెంకా 2021, 2022లలో సెమీఫైనల్లో నిష్క్రమించింది.


జెస్సికా

తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన పెగూలా అనుభవరాహిత్యంతో ఓటమి పాలైంది. తొలి సెట్ కోల్పోయినప్పటికీ రెండో సెట్‌లో కోలుకున్న పెగూలా 5–3తో ఆధిక్యంలోకి వెళ్లింది. మరో గేమ్ గెలిచిఉంటే పెగూలా రెండో సెట్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచేది. కానీ కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న సబలెంకా తన ప్రత్యర్థికి అలాంటి అవకాశం ఇవ్వలేదు. ఒక్కసారిగా విజృంభించిన ఈ బెలారస్ స్టార్ వరుసగా నాలుగు గేమ్‌లు గెల్చుకొని 7–5తో సెట్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. సబలెంకా కెరీర్‌లో ఇది మూడో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్. 2023, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన సబలెంకా తొలిసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకుంది.

"2019లో నాన్న చనిపోయాక మా ఇంటి పేరును టెన్నిస్ చరిత్రలో భాగంగా చేయాలనే లక్ష్యంతో ముందుకుసాగాను. నా టెన్నిస్ ప్రయాణం నిరాటంకంగా, ఎల్లవేళలా కొనసాగేందుకు నా కుటుంబ సభ్యులు ఎంతో కృషి చేశారు. గత మూడేళ్లుగా ఈ టోర్నీలో నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. టోర్నీలలో విన్నర్స్ ట్రోఫీపై నా పేరు చూసుకుంటున్నపుడు ఎంతో గర్వంగా అనిపిస్తుంది." –సబలెంకా

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

సబలెంకా		జెస్సికా
6	ఏస్‌లు	4
5	డబుల్ ఫాల్ట్‌లు	4
18/23	నెట్ పాయింట్లు	5/14
6/15	బ్రేక్ పాయింట్లు	4/7
40	విన్నర్స్	17
34	అనవసర తప్పిదాలు	22
88	మొత్తం పాయింట్లు	79

గతంకంటే ఘనంగా...

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్‌కు 29 పతకాలు

- 18వ స్థానంతో ముగింపు
- జావెలిన్ త్రోలో నవ్‌దీప్‌కు స్వర్ణం
- మహిళల 200 మీటర్ల రేసులో కాంస్యం నెగ్గిన సిమ్రన్

పారిస్: కనీసం 25 పతకాలతో తిరిగి రావాలనే లక్ష్యంతో 'పారిస్' బయలుదేరిన భారత దివ్యాంగ క్రీడాకారులు లక్ష్య సాధనలో విజయవంతమయ్యారు. పారాలింపిక్స్ చరిత్రలోనే తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అబ్బురపరిచారు. ఆదివారం ముగిసిన పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లో భారత్ 29 పతకాలతో 18వ స్థానంలో నిలిచింది. గత టోక్యో పారాలింపిక్స్‌లో భారత్ 5 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి 19 పతకాలతో 24వ స్థానంలో నిలిచింది. శనివారం భారత్‌కు ఒక స్వర్ణ పతకం, ఒక కాంస్య పతకం లభించింది. భారత్ సాధించిన 29 పతకాల్లో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు ఉన్నాయి. చైనా 220 పతకాలతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. చైనా క్రీడాకారులు 94 స్వర్ణాలు, 76 రజతాలు, 50 కాంస్య పతకాలు గెల్చుకున్నారు.

మెరిసిన నవ్‌దీప్...

శనివారం భారత్‌కు రజతం ఖరారైన చోట అనూహ్య పరిస్థితుల్లో స్వర్ణ పతకం లభించింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 కేటగిరీలో భారత అథ్లెట్ నవ్‌దీప్ సింగ్ ఈటెను 47.32 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంతో రజత పతకాన్ని దక్కించుకున్నాడు. ఇరాన్ అథ్లెట్ సాదెగ్ బీట్ సాయె జావెలిన్‌ను 47.64 మీటర్లు విసిరి స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. అయితే స్వర్ణం ఖరారయ్యాక సాదెగ్ నిబంధనలకు విరుద్ధంగా మతపరమైన పతాకాన్ని ప్రదర్శించాడు. అంతకుముందు త్రో విసిరాక తలను చేతితో ఖండిస్తున్నట్లుగా సాదెగ్ సంకేతం ఇచ్చాడు. దాంతో అతనికి హెచ్చరికగా ఎల్లో కార్డును ప్రదర్శించారు. మతపరమైన పతాకాన్ని ప్రదర్శించడంతో సాదెగ్‌కు రెండో ఎల్లో కార్డు చూపెట్టారు. దాంతో అతను డిస్‌క్వాలిఫై అయ్యాడు. సాదెగ్ ఫలితాన్ని రద్దు చేయడంతో పాటు అతను సాధించిన స్వర్ణ పతకాన్ని వెనక్కి తీసుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన నవ్‌దీప్‌కు స్వర్ణ పతకాన్ని ప్రదానం చేశారు. మరోవైపు మహిళల 200 మీటర్ల టి12 (దృష్టిలోపం) కేటగిరీలో సిమ్రన్ కాంస్యం సాధించింది. ఫైనల్లో సిమ్రన్ తన గైడ్ అభయ్ సింగ్‌తో కలిసి 24.75 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది.


నవ్‌దీప్


గైడ్ అభయ్‌తో రన్నర్ సిమ్రన్

పంత్ పునరాగమనం

- బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు భారత జట్టు ప్రకటన
- పేస్ బౌలర్ యశ్ దయాల్‌కు తొలిసారి చోటు

ముంబై: వికెట్ కీపర్ రిషభ్ పంత్ భారత టెస్టు జట్టులోకి తిరిగొచ్చాడు. 2022 డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన పంత్ 20 నెలల తర్వాత టెస్టు ఫార్మాట్‌లో బరిలోకి దిగనున్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో భారత్ 'బి' జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 7, 61 పరుగులు చేశాడు. ఈ నెల 19 నుంచి చెన్నైలో బంగ్లాదేశ్‌తో జరగనున్న తొలి టెస్టు కోసం బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఆదివారం రాత్రి 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు వ్యక్తిగత కారణాలతో దూరమైన విరాట్ కోహ్లి తిరిగి రాగా... ఉత్తర ప్రదేశ్ పేస్ బౌలర్ యశ్ దయాల్ తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. సీనియర్ పేసర్ షమీ శస్త్రచికిత్స అనంతరం పూర్తిగా కోలుకోకపోవడంతో... సెలెక్టర్లు యశ్ దయాల్‌కు అవకాశం కల్పించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 24 మ్యాచ్‌లాడిన యశ్ దయాల్ 76 వికెట్లు పడగొట్టాడు. టి20 ప్రపంచకప్ గెలిచినప్పటి నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ, కోహ్లి, బుమ్రా విశ్రాంతి తీసుకుంటుండగా... ఇతర ఆటగాళ్లు దులీప్ ట్రోఫీ ఆడుతున్నారు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా గాయపడి జట్టుకు దూరమైన కేఎల్ రాహుల్ కూడా పునరాగమనం చేశాడు.



తొలి టెస్టుకు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, కోహ్లి, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్ర సాయుధ బలగాల్లో 39,481 కానిస్టేబుల్/రైఫిల్‌మ్యాన్ పోస్టులు



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర సాయుధ బలగాలైన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్), అస్సాం రైఫిల్స్(ఏఆర్)లో రైఫిల్‌మ్యాన్(జనరల్ డ్యూటీ), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)లో.. కానిస్టేబుల్/రైఫిల్‌మ్యాన్(గ్రౌండ్ డ్యూటీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 39,481

» **విభాగాల వారీగా పోస్టుల వివరాలు:** బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)–15,654, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)–7145, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)–11,541, –సశస్త్ర సీమబల్ (ఎస్ఎస్‌బీ)–819, –ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) –3017, అస్సాం రైఫిల్స్(ఏఆర్)–1248, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్)–35, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)–22.

» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్/పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ.లకు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీ.లకు తగ్గకూడదు.

» **వయసు:** 01.01.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. అభ్యర్థులు 02.01.2002 కంటే ముందు, 01.01.2007 తర్వాత జన్మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

» **వేతనం:** పే లెవల్–1 కింద ఎన్‌సీబీలో సిఫాయి ఉద్యోగాలకు రూ.18,000 నుంచి రూ.56,900, ఇతర పోస్టులకు పే లెవల్–3 కింద రూ.21,700 నుంచి రూ.69,100 వరకు ఉంటుంది.

» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షలు, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష. మొత్తం 160 మార్కులకు 80 ప్రశ్నలు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(20 ప్రశ్నలు–40 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్(20 ప్రశ్నలు–40 మార్కులు), ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్(20 ప్రశ్నలు–40 మార్కులు), ఇంగ్లిష్/హిందీ(20 ప్రశ్నలు–40 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికి నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 05.09.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 14.10.2024.
» ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుకు చివరితేది: 15.10.2024.
» దరఖాస్తు సవరణ తేదీలు: 05.11.2024 నుంచి 07.11.2024 వరకు
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు: జనవరి/ఫిబ్రవరి 2025.
» వెబ్‌సైట్: https://ssc.gov.in

గ్రూప్-2.. గురి తప్పకుండా!

టీజీపీఎస్సీ గ్రూప్-2.. 783 పోస్టులతో 2022లో నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి దాదాపు 5 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు వాయిదా పడిన ఈ పరీక్షకు టీజీపీఎస్సీ తాజాగా షెడ్యూల్ ప్రకటించింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించనుంది. దీంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో.. టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..

» డిసెంబర్ 15, 16 తేదీల్లో పరీక్షలు
» మొత్తం 783 పోస్టులకు ఎంపిక ప్రక్రియ
» దాదాపు 5 లక్షల మందికిపైగా దరఖాస్తు

పోటీ పరీక్షల వాయిదా అనేది అభ్యర్థులను నిరాశకు గురి చేస్తుందనేది వాస్తవం. కానీ.. దీన్ని తమకు అవకాశంగా మలచుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే.. పరీక్షలో విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు. గ్రూప పరీక్షకు మూడు నెలలకు పైగా సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుంటే పరీక్షలో విజేతగా నిలిచే అవకాశం ఉంటుంది.

4 పేపర్లు-600 మార్కులు

నాలుగు పేపర్లుగా మొత్తం 600 మార్కులకు (ఒక్కో పేపర్‌కు 150 మార్కులు) గ్రూప్ 2 పరీక్షలను నిర్వహించనున్నారు. పేపర్–1 పరీక్ష జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటుంది. అదేవిధంగా పేపర్–2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ అంశాలపై 150 ప్రశ్నలు–150 మార్కులకు, పేపర్–3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 150 ప్రశ్నలు–150 మార్కులకు, పేపర్–4 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం 150 ప్రశ్నలు–150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

- **పేపర్–1:** జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్:
- అత్యంత కీలకమైన ఎంతో విస్తృతంగా చదవాల్సిన పేపర్ ఇది. స్థానికం నుంచి అంతర్జాతీయం వరకు అన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి. జనరల్ స్టడీస్ పరిధిలోకి వచ్చే హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పాలిటీల్లోని అన్ని అంశాలపై పట్టు సాధించాలి. తెలంగాణ ప్రాంతంలోని అంశాలకు ప్రాధాన్యతనిస్తూ జనరల్ స్టడీస్ ప్రిపరేషన్ సాగించాలి.
- చరిత్రకు సంబంధించి భారత దేశ చరిత్రతోపాటు, తెలంగాణ ప్రాంత చరిత్రలోని ముఖ్య అంశాలుగా పేర్కొనే శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు, అసఫ్ జాహీల కాలం నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.
- పాలిటీలో రాజ్యాంగం, సవరణలు, రాజ్యాంగ సంస్థలు –వాటి విధుల గురించి తెలుసుకోవాలి. ఈ విభాగం నుంచి తెలంగాణ ప్రత్యేకంగా ఉండే అంశాలు తక్కువే అయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ముఖ్యమైన సంస్థల ఏర్పాటు, అదే విధంగా ఉమ్మడి రాష్ట్రంగా ఉమ్మడి సంస్థలుగా ఉన్న వాటి విభజన –అందుకు పరిపాలన పరంగా ఉన్న అధికారాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- జాగ్రఫీలో తెలంగాణ ప్రాంతం గురించి మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, పంటలు, రవాణా సౌకర్యాలు, రాష్ట్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారులు, నీటి పారుదల వ్యవస్థ అంశాలు బాగా చదవాలి.
- ఎకానమీ కోసం కూడా తెలంగాణపై ప్రత్యేక దృష్టితో ప్రిపరేషన్ సాగించాలి. ముఖ్యంగా తెలంగాణ ఆర్థిక వృద్ధికి చేయూతనిచ్చే రంగాలపై అవగాహన అవసరం. పంటలు–దిగుబడి,తాజా ఆర్థిక సర్వేలో ఈ ప్రాంతం గురించి పేర్కొన్న ముఖ్య అంశాలన్నింటిపై దృష్టి సారించాలి.
- జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీని బేసిక్స్ నుంచి కరెంట్ అఫైర్స్ వరకు ఔపోసన పట్టాలి. పుస్తకాల్లో బేసిక్‌గా భావించే విటమిన్లు–వ్యాధులు వంటి అంశాల నుంచి తాజా అంతరిక్ష పరిశోధనల వరకు అన్ని విషయాలపై అవగాహన ఎంతో అవసరం.

పేపర్-2: హిస్టరీ, పాలిటీ అండ్ గవర్నెన్స్

- హిస్టరీకి సంబంధించి ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్ర, అదే విధంగా తెలంగాణ చరిత్రపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పర్చుకోవాలి. భారత చరిత్రకు సంబంధించి సింధు నాగరికత, వేదకాలం–నాగరికత, జైన,బౌద్ధ తదితర మత ఉద్యమాల ప్రారంభం; మగధ సామ్రాజ్యం;ఇస్లాం మతం–ప్రభావం,భక్తి ఉద్యమాలు–స్వభావం, విజయనగర సామ్రాజ్యం, మొగల్ సామ్రాజ్యం, శివాజీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఆధునిక భారతదేశ చరిత్రకు సంబంధించి బ్రిటిష్ పాలనకు దారితీసిన ప్లాసీ యుద్ధంతో మొదలుపెట్టి బ్రిటిష్ కాలంలోని ముఖ్య ఘట్టాలు, బ్రిటిషర్లకు–మైసూర్, మరాఠా, సిక్కు రాజ్యాలతో జరిగిన యుద్ధాలు, పరిణామాల గురించి తెలుసుకోవాలి.
- తెలంగాణ చరిత్రకు సంబంధించి ప్రాచీన చరిత్రలో శాతవాహనులు, ఆనాటి సాంఘిక, మత పరిస్థితులు, సంస్కృతి, సాహిత్యం; బౌద్ధం, జైనం, ఇక్ష్వాకులు, తూర్పు చాళుక్యులు–నాటి సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. మధ్యయుగ తెలంగాణకు సంబంధించి కాకతీయులు, కుతుబ్‌షాహీల పాలన, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సేవలపై దృష్టి పెట్టాలి. –ఆధునిక తెలంగాణ చరిత్రకు సంబంధించి అసఫ్ జాహీలు, తెలంగాణ సాయుధ పోరాటం వంటివి కీలకమైనవి. వీటితోపాటు 1857 మొదటి స్వాతంత్ర్య ఉద్యమంలో తెలంగాణ ప్రాంత ప్రజల భాగస్వామ్యం–నిజాం వ్యతిరేక విధానాలపై పోరాటాల గురించి తెలుసుకోవాలి.
- **పాలిటీ అండ్ గవర్నెన్స్:** పేపర్–2లోనే మరో విభాగంగా ఉండే పాలిటీ అండ్ గవర్నెన్స్ కోసం భారత రాజ్యాంగంలోని ముఖ్య లక్షణాలు, ప్రవేశిక, ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, భారత సమాఖ్య–విశిష్ట లక్షణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన; శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రలపై నిర్దేశిత సిలబస్ ప్రకారం లోతుగా అధ్యయనం చేయాలి.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక విధుల విభజన, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు వాటి గురించి రాజ్యాంగంలో పేర్కొన్న అధికరణలను అధ్యయనం చేయాలి. వీటితోపాటు తాజా రాజ్యంగ సవరణలు వాటి ఉద్దేశంపై అవగాహన ఏర్పరచుకోవాలి. పంచాయతీరాజ్ వ్యవస్థ; 73,74 రాజ్యాంగ సవరణలు; వాటి ప్రాధాన్యతపై దృష్టి సారించాలి.

పేపర్-3: ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్

- దీనికి సంబంధించి పంచవర్ష ప్రణాళికలు మొదలు తాజా ఆర్థిక పరిణామాల వరకూ.. అవగాహన ఏర్పరచుకోవాలి. ఆర్థిక సంఘం సిఫార్సులు, ప్రణాళిక సంఘం స్థానంలో ఏర్పాటైన నీతి ఆయోగ్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి. అదే విధంగా.. పారిశ్రామిక విధానాలు, విదేశీ వాణిజ్య విధానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గురించి అధ్యయనం చేయాలి. సహజ వనరుల లభ్యత, ఆర్థికాభివృద్ధి దిశగా అవి దోహదపడుతున్న తీరుపై అధ్యయనం చేయాలి. కోర్ ఎకానమీకి సంబంధించి ద్రవ్యం, బ్యాంకింగ్, పబ్లిక్ ఫైనాన్స్‌ల నిర్వచనాలు–సిద్ధాంతాలు తెలుసుకోవాలి. అదే విధంగా జాతీయాదాయ భావనలు, జీడీపీ, తలసరి ఆదాయం వంటి బేసిక్ కాన్సెప్టులు తెలుసుకోవాలి.
- **తెలంగాణ ఎకానమీ:** పేపర్–3లోనే ఉండే తెలంగాణ ఎకానమీలో తెలంగాణ ప్రాంతంలోని ముఖ్యమైన వనరులు, అవి లభించే ప్రాంతాలు, పంటలు–దిగుబడి కారకాలు గురించి తెలుసుకోవాలి. వీటితోపాటు తాజాగా సమకాలీన అంశాలతో సమ్మిళితమైన అంశాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా తెలంగాణ ఆర్థిక విధానం, ఆయా రంగాల్లో అభివృద్ధి, జీఎస్‌డీపీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. రాష్ట్ర ఆర్థిక సర్వే గణాంకాలు, కేంద్ర ఆర్థిక సర్వే గణాంకాల్లో రాష్ట్రాల వారీగా పేర్కొన్న వివరాలు సేకరించి ఔపోసన పట్టాలి.



పేపర్-4: తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం

గ్రూప్–2లో నాలుగో పేపర్‌గా పేర్కొన్న.. తెలంగాణ ఆలోచన (1948–1970), ఉద్యమ దశ (1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం (1991–2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం 1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు–వాటి సిఫార్సులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణకు కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

డిస్క్రిప్టివ్ ప్రిపరేషన్

గ్రూప్–2 పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. కాని అభ్యర్థులు మాత్రం ప్రిపరేషన్ సమయంలో డిస్క్రిప్టివ్ విధానంలో చదవాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని పేర్కొంటున్నారు. అభ్యర్థులు ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి.

అనుసంధానం.. సొంత నోట్స్

ప్రిపరేషన్‌లో అభ్యర్థులకు కలిసొచ్చే మరో అంశం... పలు పేపర్లలో ఉమ్మడిగా ఉన్న అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదవడం. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్; భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అన్ని అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి. ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా సొంత నోట్స్ తయారు చేసుకోవాలి. ఇది పరీక్షకు ముందు వేగంగా రివిజన్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,017	81,184
నిఫ్టీ ▽	293	24,852

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	16,691	▽	437
డోజోన్స్	40,345	▽	410
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,181	▽	60
డాక్స్	18,302	▽	275
హాంగ్‌సెంగ్	2,766	▽	23
నికాయ్	36,391	▽	266

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.25	118.86
€	యూరో	ఎస్‌బీఐ	91.95	94.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.81	59.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.56	57.52
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.23	66.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.76
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.79

మెరుగైన పెన్షన్ కావాలంటే?



సర్కారు ఉద్యోగం.. ఎంతో మంది నిరుద్యోగుల ఆకాంక్ష. ఆకర్షణీయమైన వేతనం, ఇతర ప్రయోజనాలతోపాటు, రిటైర్మెంట్ తర్వాత మెరుగైన పింఛను వస్తుందన్న భరోసా ఎక్కువ మందిని ఆకర్షించే అంశాలు. కానీ, 2004 నుంచి అమల్లోకి వచ్చిన నూతన ఫింఛను విధానంతో రిటైర్మెంట్ తర్వాత వచ్చే ప్రయోజనాలు మారిపోయాయి. దీంతో పాత పింఛను విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనికి పరిష్కారంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను కేంద్ర సర్కారు తాజాగా తెరపైకి తీసుకొచ్చింది. పదవీ విరమణ చివరి ఏడాది వేతనంలో కనీసం 50 శాతాన్ని పింఛనుగా అందించే హామీ ఉంటుంది. మరి ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారి సంగతి ఏంటి? రిటైర్మెంట్ తర్వాత మెరుగైన పింఛను పొందాలంటే అసాధ్యమేమీ కాదు. ఇందుకు చేయాల్సిందల్లా.. ప్రణాళిక మేరకు ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లడమే. ఈపీఎఫ్‌తోపాటు, ఎన్‌పీఎస్‌లోనూ నిర్ణీత శాతం మేర పెట్టుబడి పెట్టడం ద్వారా విశ్రాంత జీవితాన్ని మెరుగ్గా గడిపేందుకు మార్గం ఉంది. ఇందుకు ఏం చేయాలో నిపుణుల విశ్లేషణ చూద్దాం.

– సాక్షి, బిజినెస్‌డెస్క్



- విశ్రాంత జీవనానికి పక్కా ప్లానింగ్ అవసరం
- నెలవారీ కేటాయింపులు చేయాలి
- ఈపీఎఫ్, ఎన్‌పీఎస్ కలయికతో మంచి రాబడి
- చివరి వేతనంలో సగం పింఛనుగా పొందే మార్గం

కేటాయింపులు కీలకం..

ప్రభుత్వరంగ ఉద్యోగుల మాదిరే ప్రైవేటు రంగ ఉద్యోగులూ తమ రిటైర్మెంట్ పెట్టుబడులను కొంత మేర ఎన్‌పీఎస్‌కు కేటాయించుకోవడం ఇక్కడ కీలకం. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి వేతనం నుంచి 10 శాతం, వారి తరఫున ప్రభుత్వం నుంచి 14 శాతం చొప్పున ఎన్‌పీఎస్‌లోకి పెట్టుబడిగా వెళుతుంది. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు కొన్ని పరిమితులు ఉన్నాయి. మొత్తం ఎన్‌పీఎస్ పెట్టుబడుల్లో ఈక్విటీలకు 15 శాతం మించి కేటాయించుకోలేరు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌లో రాబడుల వృద్ధి పరిమితంగానే ఉంటుంది. అంటే 10 శాతంలోపు అని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ప్రైవేటు రంగంలోనూ ఇంచుమించుగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ప్రైవేటు రంగ ఉద్యోగులకు ఈపీఎఫ్ అమలవుతుంది. ఉద్యోగి, యాజమాన్యం చెరో 12 శాతం చొప్పున మూల వేతనం, డీఏపై ఈపీఎఫ్ ఖాతాకు జమ చేస్తుంటాయి. దీనిపై రాబడి 8 శాతం స్థాయిలోనే ఉంది. దీనివల్ల దీర్ఘకాలంలో చెప్పుకోతగ్గ భవిష్యనిధి ఏర్పడుతుందేమో కానీ, రిటైర్మెంట్ అవసరాలను తీర్చే స్థాయిలో కాదు. కనుక ప్రైవేటు రంగ ఉద్యోగులు ఈపీఎఫ్ కాకుండా ఎన్‌పీఎస్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవాలి.

కేంద్ర ఉద్యోగులకు ప్రతిపాదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)లో అతి పెద్ద ఆకర్షణ.. చివరి వేతనంలో కనీసం 50 శాతాన్ని పింఛనుగా పొందడం. కానీ దీర్ఘకాలం పాటు సేవలు అందించిన తర్వాత చివరి వేతనంలో 50% భారీ మొత్తం కాబోదు. ప్రైవేటు రంగంలో పనిచేసే వారు సైతం తమ చివరి వేతనంలో 50 శాతాన్ని ఉద్యోగ విరమణ తర్వాత పొందొచ్చు. ప్రణాళిక మేరకు క్రమశిక్షణతో వ్యవహరిస్తే ఇంతకంటే ఎక్కువే సొంతం చేసుకోవచ్చు.

ఈపీఎఫ్-ఎన్‌పీఎస్ కలయిక

ఈపీఎఫ్, ఎన్‌పీఎస్‌లో సమకూరిన నిధితోపాటు, ఈపీఎఫ్‌లో భాగమైన ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) కూడిన పెట్టుబడుల ప్రణాళిక ఒకటి. ఉదాహరణకు ఈపీఎఫ్ కింద ఉద్యోగి మూల వేతనం నుంచి 12%, అంతే చొప్పున యాజమాన్యం జమ చేస్తాయి. దీనికితోడు పాత పన్ను విధానంలో కొనసాగే వారు ఎన్‌పీఎస్ ఖాతా తెరిచి తమ వేతనంలో 10 % మేర యాజమాన్యం ద్వారా జమ చేసుకోవాలి. దీనికి సెక్షన్ 80సీసీడీ(2) కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ కొత్త పన్ను విధానంలోకి మళ్లిన వారు తమ వేతనంలో 14 శాతాన్ని ఎన్‌పీఎస్‌కు జమ చేయించుకోవడం ద్వారా ఆ మొత్తంపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఉద్యోగ జీవితంలో క్రమం తప్పకుండా ఈ పెట్టుబడులు కొనసాగించడం ద్వారా చివరి వేతనంలో 50 శాతాన్ని పొందొచ్చు. ప్రభుత్వ ఉద్యోగులు కాని ఇతరులు అందరూ.. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీలకు గరిష్టంగా 75% కేటాయింపులు చేసుకోవచ్చు. దీని ద్వారా రిటైర్మెంట్ నాటికి భారీ నిధి సమకూరుతుంది.

ప్రైవేటు ఉద్యోగంలో ఆరంభ మూల వేతనం రూ.14,000తో ప్రారంభమై.. ఏటా 10% చొప్పున పెరుగుతూ వెళితే.. పైన చెప్పుకున్న విధంగా ఈపీఎఫ్, ఎన్‌పీఎస్‌లకు 30 ఏళ్ల పాటు చందాలు జమ చేసుకుంటూ వెళ్లినట్టయితే, రిటైర్మెంట్ తర్వాత నెలవారీ రూ.2.9 లక్షలు పొందొచ్చు. చివరి ఏడాదిలో వేతనం రూ.2.44 లక్షల కంటే ఇది ఎక్కువ. రిటైర్మెంట్ నాటికి ఎన్‌పీఎస్‌లో సమకూరిన నిధిలో 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ (పింఛను) తీసుకోవాలి. మిగిలిన 60% ఫండ్‌ను వెనక్కి తీసుకోవచ్చు. అలాగే, ఈపీఎఫ్‌లో సమకూరిన

నెలవారీ ఆదాయం..

నిధిని కూడా వెనక్కి తీసుకోవచ్చు. ఈ మొత్తాన్ని ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ/సిప్‌కు విరుద్ధమైనది) ఎంపిక చేసుకోవాలి. తద్వారా ప్రతి నెలా కోరుకున్నంత వెనక్కి తీసుకోవచ్చు. అలాగే, పనిచేసిన కాలం ఆధారంగా ఈపీఎఫ్‌లో భాగమైన ఎన్‌పీఎస్ నుంచి నెలవారీ నిర్ణీత మొత్తం పింఛనుగా అందుతుంది. ఎన్‌పీఎస్‌లో 60% నిధి, ఈపీఎఫ్‌లో భవిష్యనిధి వాటా కింద సమకూరిన మొత్తాన్ని.. రిస్క్, రాబడుల ఆకాంక్షలకు అనుగుణంగా డెట్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్ లేదా హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. కన్జర్వేటివ్ లేదా బ్యాలన్స్‌డ్ హైబ్రిడ్ ఫండ్స్ అయితే రిస్క్–రాబడుల సమతుల్యంతో ఉంటాయి. వ్యాల్యూ రీసెర్చ్ డేటా ప్రకారం గడిచిన పదేళ్లలో కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ విభాగం సగటు వార్షిక రాబడి 8.41 శాతంగా ఉంది. బ్యాలన్స్‌డ్ హైబ్రిడ్ ఫండ్స్ విభాగంలో రాబడి 9.83% మేర ఉంది. ఈ ఫండ్స్‌లో వార్షిక రాబడి రేటు కంటే తక్కువ మొత్తాన్ని ఏటా ఉపసంహరించుకోవాలి. దీనివల్ల కాలక్రమంలో పెట్టుబడి కూడా కొంత మేర వృద్ధి చెందుతుంది. పెట్టుబడి విలువలో ప్రతి నెలా 0.5% చొప్పున ఎస్‌డబ్ల్యూపీ ద్వారా వెనక్కి తీసుకోవాలి. ఏటా ఈ మొత్తాన్ని 5% (ద్రవ్యోల్బణం స్థాయిలో) పెంచుకుని ఉపసంహరించుకున్నా సరే.. రిటైర్మెంట్ నిధి ఏటా 10% చొప్పున వృద్ధి చెందితే 25 ఏళ్లలో రూ.2.05 కోట్ల నుంచి రూ.2.9 కోట్లకు చేరుతుంది. రిటైర్మెంట్ ఫండ్ విలువ మరింత పెరగాలంటే, నెలవారీ ఉపసంహరణ రేటు వీలైనంత తక్కువగా ఉండేలా చూడాలి.



ఎంత మేర..?

ఆరంభ మూల వేతనం రూ.14,000. ఏటా 10% పెరిగేట్టు. ఈపీఎఫ్‌లో నిబంధనల మేరకు ఇన్వెస్ట్ చేస్తూనే, ఎన్‌పీఎస్‌లోనూ పాత పన్ను విధానంలో 10% మొత్తాన్ని యాజమాన్యం ద్వారా డిపాజిట్ చేయించుకుంటే ఎంత వస్తుందో చూద్దాం. ఈపీఎఫ్ నిధిపై 8% రాబడి రేటు. ఎన్‌పీఎస్ జమలపై 12% రాబడి రేటు అంచనా. ఎన్‌పీఎస్ 40% ఫండ్‌తో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే.. దీనిపై 6% రాబడి ప్రకారం ప్రతి నెలా వచ్చే ఆదాయం అంచనాలు ఇవి.

సర్వీస్ కాలం	10 ఏళ్లు	15ఏళ్లు	20 ఏళ్లు	25 ఏళ్లు	30 ఏళ్లు	35 ఏళ్లు
ఈపీఎఫ్, ఎన్‌పీఎస్ నుంచి వచ్చే మొత్తం (రూ.లలో)	9.62లక్షలు	23.84లక్షలు	51.96లక్షలు	1.05కోట్లు	2.05కోట్లు	3.86కోట్లు
ఏటా 10% రాబడి ఆధారంగా నెలవారీ ఉపసంహరణ	4,812	11,921	25,978	52,731	1.02లక్షలు	1.93లక్షలు
ఈపీఎస్ నుంచి పెన్షన్	రూ.2,143	3,214	4,286	5,357	6,429	7,500
ఎన్‌పీఎస్ యాన్యుటీ ప్లాన్‌పై ప్రతి నెలా ఆదాయం	915	2,317	5,217	11,019	22,360	44,142
ఎన్‌పీఎస్, ఈపీఎఫ్, ఈపీఎస్ ద్వారా వచ్చే మొత్తం	7,870	17,452	35,480	69,108	1.31లక్షలు	2.44లక్షలు

గమనిక: కొత్త పన్ను విధానంలో ఎన్‌పీఎస్‌కు 14% మేర వేతనంలో ప్రతి నెలా కేటాయించుకుంటే.. చివర్లో 40% యాన్యుటీ ప్లాన్‌పై ప్రతి నెలా టేబుల్‌లో పేర్కొన్న ఆదాయం కంటే 40% అధికంగా, ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ప్రతి నెలా 10% మేర అదనంగా పొందొచ్చు.



ఆరంభ మూల వేతనం రూ.14,000. ఏటా 8 శాతం పెరిగేట్టు. ఈపీఎఫ్‌లో నిబంధనల మేరకు ఇన్వెస్ట్ చేస్తూనే, ఎన్‌పీఎస్‌లోనూ పాత పన్ను విధానంలో 10 శాతం మొత్తాన్ని యాజమాన్యం ద్వారా డిపాజిట్ చేయించుకుంటే ఎంత మేర వస్తోందన్నది చూద్దాం. ఈపీఎఫ్ నిధిపై 8 శాతం రాబడి రేటు. ఎన్‌పీఎస్ జమలపై 10 శాతం రాబడి రేటు అంచనా.

సర్వీస్ కాలం	10 ఏళ్లు	15ఏళ్లు	20 ఏళ్లు	25 ఏళ్లు	30 ఏళ్లు	35 ఏళ్లు
ఈపీఎఫ్, ఎన్‌పీఎస్ నుంచి వచ్చే మొత్తం (రూ.లలో)	8.45లక్షలు	19.62లక్షలు	40.12లక్షలు	76.41లక్షలు	1.39కోట్లు	2.45కోట్లు
ఏటా 10 % రాబడి రేటు ఆధారంగా నెలవారీ 0.5% ఉపసంహరణ	4,225	9,.810	20,060	38,205	69,537	1.23లక్షలు
ఈపీఎస్ నుంచి పెన్షన్	రూ.2,143	3,214	4,286	5,357	6,429	7,500
ఎన్‌పీఎస్ యాన్యుటీ ప్లాన్‌పై ప్రతి నెలా 6 శాతం ఆదాయం అంచనా	769	1,779	3,657	7,054	13,072	23,567
ఎన్‌పీఎస్, ఈపీఎఫ్, ఈపీఎస్ ద్వారా వచ్చే మొత్తం పింఛను	7,138	14,803	28,003	50,617	89,037	1.54లక్షలు

గమనిక: కొత్త పన్ను విధానంలో ఉన్న వారు ఎన్‌పీఎస్‌కు 14 శాతం మేర వేతనంలో ప్రతి నెలా కేటాయించుకుంటే.. చివర్లో 40 శాతం యాన్యుటీ ప్లాన్‌పై ప్రతి నెలా టేబుల్‌లో పేర్కొన్న ఆదాయం కంటే 40 శాతం అధికంగా, ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ప్రతి నెలా 10 శాతం మేర అదనంగా పొందొచ్చు.

ప్రత్యామ్నాయం

ప్రైవేటు రంగ ఉద్యోగులకు ఈపీఎఫ్ ఎలానూ ఉంటుంది. దీనికితోడు ఎన్‌పీఎస్ జోడించుకోవడం రాబడుల రీత్యా మంచి నిర్ణయం అవుతుంది. రిటైర్మెంట్ నాటికి ఎన్‌పీఎస్ నిధిలో 60 శాతాన్ని ఎలాంటి పన్ను లేకుండా ఉపసంహరించుకోవచ్చు. ఈపీఎఫ్ నిధిపైనా ఎలాంటి పన్ను లేదు. పన్ను కోణంలో ఈ రెండింటి కంటే మెరుగైనవి లేవు. ఎన్‌పీఎస్‌లో 75 శాతం ఈక్విటీలకు కేటాయించుకోవచ్చు. కానీ, ఎన్‌పీఎస్ ఫండ్ మేనేజర్లు టాప్–200 కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేయగలరు. ఒకవేళ ఇంతకంటే అదనపు రాబడులు ఆశించే వారు



ఎన్‌పీఎస్ బదులు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. రిటైర్మెంట్ సమయంలో మొత్తం వెనక్కి తీసుకోకుండా, క్రమానుగతంగా ఉపసంహరణ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల పన్ను భారం చాలా వరకు తగ్గుతుంది. అయితే పదవీ విరమణ తర్వాత నూరు శాతం ఈక్విటీల్లోనే పెట్టుబడులు ఉంచేయడం సరైనది కాదు. కనుక 50% మేర అయినా డెట్ ఫండ్స్‌కు మళ్లించుకోవాలి. కనుక ఈ మొత్తంపై పన్ను భారం పడుతుంది. అయినా సరే యాక్టివ్, ఇండెక్స్ ఫండ్స్ ద్వారా పన్ను భారానికి దీటైన రాబడులు సొంతం చేసుకోవడం సాధ్యమే. ఈ సంక్లిష్టతలు వద్దనుకునే వారికి సులభమైన మార్గం ఎన్‌పీఎస్. ఇందులో వ్యయాలు చాలా తక్కువ. పైగా పన్ను భారం లేకుండా ఈక్విటీ నుంచి డెట్‌కు, డెట్ నుంచి ఈక్విటీకి పెట్టుబడుల కేటాయింపులు మార్చుకోవచ్చు. అలాగే, భవిష్యత్తులో ఎన్‌పీఎస్‌లోనూ ఎస్‌డబ్ల్యూపీ ప్లాన్ వచ్చే అవకాశం లేకపోలేదు. ఇదే జరిగితే ఎన్‌పీఎస్ ద్వారా 50% పెట్టుబడులను ఈక్విటీల్లో, మిగిలినది డెట్‌లో కొనసాగిస్తూ, క్రమానుగతంగా కావాల్సినంత మేర వెనక్కి తీసుకోవచ్చు.

టాటా ఏఐజీ బీమాతో వాహనాలకు మరింత భద్రత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వర్షాకాలంలో వాహనాలకు మరింత మెరుగైన బీమా కవరేజీనిచ్చే విధంగా సమగ్ర పాలసీలను అందిస్తున్నట్లు టాటా ఏఐజీ మోటార్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. కారు ఇంజిన్లోకి నీరు చొరబడితే కవరేజీనిచ్చేలా ఇంజిన్ సెక్యూర్, డిప్రిసియేషన్ రీయింబర్స్‌మెంట్ కవర్, అలాగే ఫైబర్, గ్లాస్, రబ్బర్ భాగాలు దెబ్బ తింటే పూర్తిగా రీప్లేస్ చేయకుండా రిపేరు చేసేందుకు వీలు కల్పించేలా కవరేజీ ఉంటుందని పేర్కొంది. దీని వల్ల నో క్లెయిమ్ బోనస్ (ఎన్‌సీబీ)పై ప్రభావం పడదని వివరించింది.

బజాజ్ అలయంజ్ లైఫ్ పాలసీల సెటిల్మెంట్ సరళతరం

ముంబై: తెలుగు రాష్ట్రాల్లో వరదల నేపథ్యంలో క్లెయిమ్‌ల సెటిల్మెంట్ ప్రక్రియను సరళతరం చేసినట్లు బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభావిత పాలసీదారులు, వారి కుటుంబాల క్లెయిమ్‌ల పరిష్కారానికి మరింత ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొంది. ఇందుకోసం కేవలం కీలక పత్రాలను కంపెనీ టోల్ ఫ్రీ నంబరు 18002097272కి కాల్ చేసి గానీ, దేశవ్యాప్తంగా ఉన్న 548 శాఖల్లో గానీ, claims @bajajallianz.co.inకి ఈమెయిల్‌చేస్తే సరిపోతుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

9-9-2024	
విశాఖ	520–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	520–00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్ బలహీనత కొనసాగొచ్చు
చైనాలోకి అదానీ అడుగు

ఏ బీమాను ఎంపిక చేసుకోవాలి?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

జీవిత బీమా విషయానికొస్తే మార్కెట్లో ఎన్నో రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి ఎంపిక ఉత్తమం? – జితేంద్ర

జీవిత బీమా పాలసీ కొనుగోలు చేయాలన్న మీ నిర్ణయం అభినందనీయం. ఆర్థికంగా తమపై ఆధారపడిన వారుంటే తప్పకుండా దీన్ని తీసుకోవాలి. తమకు ఏదైనా జరగరానిది జరిగితే అప్పుడు కుటుంబ అవసరాలను ఆదుకుంటుంది. మనీ బ్యాక్, యులిప్, పెన్షన్ ప్లాన్లు ఇవన్నీ హైబ్రిడ్ బీమా ఉత్పత్తులు. ఇవి జీవిత బీమాతోపాటు పెట్టుబడుల ప్రయోజనాన్ని ఆఫర్ చేస్తుంటాయి. దీంతో చూడానికి ఆకర్షణీయంగా అనిపిస్తాయే కానీ, వాస్తవంలో కాదు. ఎందుకంటే ఈ తరహా పాలసీలు తగినంత జీవిత బీమా రక్షణను ఇవ్వవు. భారీ రక్షణ కోరుకుంటే ప్రీమియం చాలా ఖరీదుగా మారుతుంది. ఇక ఈ ప్లాన్లలో పెట్టుబడులపై రాబడులు చాలా తక్కువ. కనుక బీమా, పెట్టుబడులను వేర్వేరుగా నిర్వహించుకోవడం మంచిది. పెట్టుబడుల కోసం ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవాలి. జీవిత బీమా కోసం అచ్చమైన టర్మ్ ప్లాన్‌ను పరిశీలించాలి. హైబ్రిడ్ ప్లాన్లతో పోల్చి చూస్తే టర్మ్ ప్లాన్ల ప్రీమియం ఎంతో అందుబాటులో ఉంటుంది. 35 ఏళ్ల ఆరోగ్యవంతుడైన పురుషుడికి రూ.కోటి కవరేజీకి ఏటా చెల్లించాల్సిన ప్రీమియం రూ.15,000. చాలా మంది బీమా పాలసీని ఏజెంట్ లేదా బ్రోకర్ ద్వారా తీసుకుంటుంటారు. దీంతో వారు తమకు అధిక కమీషన్ లభించే హైబ్రిడ్ ప్లాన్లను అంటగడుతుంటారు. అచ్చమైన టర్మ్ ప్లాన్‌లో జీవించి ఉంటే ఎలాంటి ప్రయోజనం రాదు. అలాంటివి టర్మ్ ప్లాన్లు అని సులభంగా గుర్తించొచ్చు. కేవలం పాలసీదారు మరణించిన సందర్భంలోనే ఈ ప్లాన్ల కింద పరిహారం అందుతుంది. కానీ, హైబ్రిడ్ ప్లాన్లు జీవించి ఉన్నా కానీ, చివర్లో కొంత మొత్తాన్ని వెనక్కిస్తాయి. ఇందుకోసం అవి అధిక ప్రీమియం వసూలు చేస్తాయి.

మంచి డైనమిక్ బాండ్ ఫండ్స్ ఏవి? – వినయ

డెట్ ఫండ్ ఇన్వెస్టర్లు తమ స్వల్పకాల అవసరాలకు ఉద్దేశించిన నిధులను లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల పెట్టుబడికి రక్షణ ఉంటుంది. అస్థిరతలు లేకుండా ఊహించతగిన ఆదాయం కోసం షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ ఎంపిక చేసుకోవాలి. చాలా మంది ఇన్వెస్టర్లకు షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి సురక్షితమైనవి. స్థిరత్వంతోపాటు నిలకడైన రాబడులు అందిస్తాయి. డైనమిక్ బాండ్ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయాలని కోరుకుంటే.. ముందుగా ఆ విభాగంలోని పథకాల పనితీరు వివిధ వడ్డీ రేట్ల సైకిల్స్‌లో ఎలా ఉందన్నది విశ్లేషించండి. సంబంధిత ఫండ్ పోర్ట్‌ఫోలియోలోని డెట్ పత్రాల క్రెడిట్ నాణ్యతను కూడా పరిశీలించాలి. నిర్వహణ ఆస్తుల పరంగా టాప్–10 డైనమిక్ బాండ్ ఫండ్స్‌లో ఐసీఐసీఐ, కోటక్, ఎస్‌బీఐ పథకాలు మెరుగ్గా ఉన్నాయి.

హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ఎక్స్‌పోర్ట్ ఆపర్చునిటీస్ ఫండ్



హెచ్‌ఎస్‌బీసీ మ్యుచువల్ ఫండ్ కొత్తగా హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ఎక్స్‌పోర్ట్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది సెప్టెంబర్ 19తో ముగుస్తుంది. ఉత్పత్తులు లేదా సర్వీసుల ఎగుమతుల వల్ల లబ్ధి పొందే సంస్థల షేర్లు, అలాగే ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ క్రమంలో తయారీ, ఆటోమొబైల్స్, పారిశ్రామికోత్పత్తులు, ఫార్మా, రసాయనాలు, టెక్స్‌టైల్స్, నిర్మాణం మొదలైన విభాగాల్లో పెట్టుబడులు పెడుతుంది. వ్యాపార ఫండమెంటల్స్, పరిశ్రమ స్వరూపం, వేల్యుయేషన్, ఆర్థిక బలాలు వంటి అంశాల ప్రాతిపదికన షేర్ల ఎంపిక ఉంటుందని సంస్థ సీఐవో–ఈక్విటీ వేణుగోపాల్ మంగత్ తెలిపారు.

కోటక్ నిఫ్టీ ఇండియా టూరిజం ఇండెక్స్ ఫండ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తాజాగా కోటక్ నిఫ్టీ ఇండియా టూరిజం ఇండెక్స్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇది సెప్టెంబర్ 16తో ముగుస్తుంది. నిఫ్టీ500లో ట్రావెల్, టూరిజం థీమ్ ఉన్న షేర్లను ఎంచుకుని ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను బట్టి ఇండెక్స్‌లోని ఒక్కో స్టాక్‌కి వెయిటేజీ ఉంటుంది. పర్యాటక రంగానికి చోదక విభాగాలు ఇందులో ఉంటాయి. విహారయాత్రలు, వ్యాపార సంబంధ ప్రయాణాలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో దానికి సంబంధించిన షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇన్వెస్టర్లు లబ్ధి పొందవచ్చని సంస్థ ఎండీ నీలేశ్ షా తెలిపారు.

యూటీఐ నుంచి రెండు ఇండెక్స్ ఫండ్ ఆఫర్లు

యూటీఐ ఫండ్ 2 ఇండెక్స్ ఫండ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యూటీఐ నిఫ్టీ ప్రైవేటు బ్యాంక్ ఇండెక్స్ ఫండ్, యూటీఐ నిఫ్టీ200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ ఆఫర్లను (ఎన్ఎఫ్‌వో) ప్రారంభించింది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణలో తమకున్న విస్తృతమైన అనుభవంతో తక్కువ వ్యయాలతో కూడిన అత్యధిక నాణ్యమైన పెట్టుబడుల ఆప్షన్లు అందిస్తున్నట్టు ఫండ్ పేర్కొంది. యూటీఐ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్‌ఫండ్ అన్నది ఇదే సూచీలోని స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతుంది. ఈ 2 పథకాల ఎన్ఎఫ్‌వోలు 16న ముగుస్తాయి. కనీసం రూ.5,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్ లేదు.

స్టాక్స్ వ్యూ

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ | బ్రోకరేజ్: కొటక్ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 443 టార్గెట్: రూ. 550

ఎందుకంటే: అందుబాటులో ఉన్న ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే భారీ బ్యాలన్స్‌షీట్, అత్యంత పటిష్ట మార్టిగేజ్ ఆధారిత రుణ సెక్యూరిటీలు, అత్యున్నత రిటర్న్(ఆర్‌వోఈ) రేషియోల కారణంగా ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌కు కొనుగోలు రేటింగ్‌ను ఇస్తున్నాం. ఆదాయంలోసాధిస్తున్న వృద్ధి అంచనాలతో టార్గెట్ ధరను నిర్ణయించాం. అంతేకాకుండా మూడేళ్ల కాలం(2024–27)లో వార్షిక ప్రాతిపదికన 21 శాతం రుణ వృద్ధిని సాధించే వీలుంది. వెరసి వేగవంత వృద్ధిలో ఉన్న చౌక చిన్న గృహ రుణ కంపెనీలకంటే ఆధార్ హౌసింగ్‌ను మెరుగైన సంస్థగా ప్రస్తావించవచ్చు. ఈ దిశలో చూస్తే భారీ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలతో సరిపోల్చవచ్చని భావిస్తున్నాం. మార్చితో ముగిసిన గతేడాది(2023–24) కంపెనీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) రూ. 21,000 కోట్లను తాకాయి. అందుబాటు గృహ రుణ కంపెనీలలో ఇది అత్యధికం కాగా.. 7 శాతం మార్కెట్ వాటాను పొందింది. వేతనజీవులు 57 శాతం, సొంత వ్యాపారాలుగల వ్యక్తులు 43 శాతం ద్వారా ఏయూఎంలో డైవర్సిఫైడ్ కస్టమర్లను కలిగి ఉంది. ప్రాంతాలవారీగా కూడా(యూపీ వాటా 15 శాతం) సానుకూలతలు కలిగి ఉంది. రానున్న మూడేళ్లలో వార్షికంగా షేరువారీ ఆర్జన(ఈపీఎస్)లో 22 శాతం చొప్పున పురోగతి సాధించగలదని భావిస్తున్నాం. ఇందుకు ఏయూఎంలో 21 శాతం వృద్ధి, దాదాపు సుస్థిర మార్జిన్లు(స్ప్రెడ్స్), అధిక ఫీజులు, నిధుల వినియోగ సామర్థ్యం తదితరాలను సానుకూల అంశాలుగా పేర్కొనవచ్చు. తీవ్ర పోటీ కారణంగా నికర వడ్డీ మార్జిన్లపై ఒత్తిడి తలెత్తడం, రుణాలలో సొంత వ్యాపార వ్యక్తుల వాటా పెరుగుతుండటం, రుణ ఒప్పందాలలో నిబంధనల మార్పులు తదితరాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

వీఐపీ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: సెంట్రమ్ బ్రోకింగ్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 498 టార్గెట్: రూ. 592

ఎందుకంటే: ప్రస్తుత డిమాండ్ పరిస్థితులు, కొత్త ప్రొడక్టుల విడుదల తదితరాల ద్వారా బిజినెస్ వృద్ధికి తీసుకుంటున్న వివిధ రకాల చర్యలు వంటి అంశాలపై స్పష్టతకోసం ఇటీవలే కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్(యాజమాన్యం)తో సమావేశమయ్యాం. దీని ప్రకారం అధికకాలం కొనసాగిన వేసవి(వడగాడ్పులు) కారణంగా ప్రయాణాలు వాయిదా పడటం, తగ్గిన వివాహ ముహూర్తాలు ఏప్రిల్, మే నెలల్లో కంపెనీ పనితీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. అయితే జులై, ఆగస్ట్‌లలో ప్రోత్సాహకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రొడక్టులకు ఆకర్షణీయ ధరలు, ఈకామర్స్ ద్వారా అమ్మకాలు జోరందుకోవడం, అమెజాన్‌లో కంపెనీ ఉత్పత్తుల విక్రయాన్ని పటిష్టపరచడం ఇందుకు దోహదం చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో క్వార్టర్(జులై–సెప్టెంబర్) తదుపరి మరింత రికవరీకి అవకాశముంది. ఇందుకు తేలికపాటి, దీర్ఘకాల మన్నికగల ఆధునిక డిజైన్లకు తెరతీయడం, కార్ల్‌టన్ ఫ్రాంచైజీ ద్వారా 50 ప్రత్యేక బ్రాండ్ ఔట్‌లెట్లను జత కలుపుకోవడం తోడ్పాటునందించనున్నాయి. దీంతో అధిక ధరలు(ప్రీమియమైజేషన్) ద్వారా లాభదాయకత మెరుగుపడనుంది. వీటికి జతగా సప్లై చైన్‌ను పటిష్టపరచడం, అధిక వృద్ధికి వీలున్న బ్యాక్‌ప్యాక్, హ్యాండ్‌బ్యాగుల విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పెళ్లిళ్ల సీజన్‌కు అధిక ప్రాధాన్యత వంటి కార్యాచరణ కంపెనీకి బలాన్నివ్వనుంది. అంతేకాకుండా సరఫరా వ్యయాలను తగ్గించుకునేందుకు బీసీజీని ఎంపిక చేసుకుంది. ప్రస్తుతం బంగ్లాదేశ్ కార్యకలాపాలు నిలకడను సాధించాయి. ఈ నేపథ్యంలో కంపెనీ స్థూల మార్జిన్లు 55 శాతానికి చేరే వీలుంది. టెక్నాలజీ ఆధారిత లగ్జరీ విభాగ అమ్మకాలు పుంజుకుంటున్న నేపథ్యంలో నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు ఈ ఏడాది 15 శాతాన్ని తాకే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ప్రాసిక్యూషన్‌కు అనుమతి

- ఆదాయానికి మించి 350 రెట్ల ఆస్తులు ఉన్నట్లు నిర్ధారణ
- ఇప్పటివరకు బినామీ పేర్లతో ఉన్న 214 ఆస్తులు గుర్తించి స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఏసీబీ జనవరిలో బాలకృష్ణను అరెస్టు చేసింది. దర్యాప్తు పూర్తి కావడంతో చార్జిషీట్ దాఖలుకు ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిని పరిశీలించిన సర్కారు ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరు చేసింది. శివబాలకృష్ణ భారీగా అక్రమాస్తులు కూడగట్టారని ఏసీబీ తేల్చింది. ఆయనతోపాటు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల పేర్లతో వివిధ ప్రాంతాల్లో ఉన్న 214 ఆస్తుల్ని గుర్తించి సీజ్ చేసింది. ప్రభుత్వ విలువ ప్రకారమే వీటిని ఆదాయానికి మించి 350 రెట్లుగా తేల్చారు. ఈ కేసులో ఆయనకు ఇచ్చిన నోటీసులకు సమాధానాల కోసం నిరీక్షిస్తున్నారు. వాటిని పరిశీలించాక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు.

మద్యం మత్తులో మలయాళ నటుడు వినాయకన్ వీరంగం

- ఇండిగో గేట్ సిబ్బందితో వాగ్వాదం
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన
- ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించిన సీఐఎస్



శంషాబాద్: జైలర్ సినిమాలో విలన్‌గా పాపులర్ అయిన మలయాళ నటుడు వినాయకన్ మద్యం మత్తులో వీరంగం సృష్టించిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు కథనం ప్రకారం.. నటుడు వినాయకన్ శనివారం సాయంత్రం గోవా వెళ్లేందుకు కొచ్చిన్‌లో ఇండిగో విమానం ఎక్కాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం మారాల్సిన సమయంలో ఇండిగో విమానం గేట్‌సిబ్బందితో ఆయన వాగ్వాదానికి దిగాడు. మద్యం మత్తులో ఉన్న ఆయన ప్రవర్తనపై ఇండిగో సిబ్బంది శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని సీఐఎస్ఎఫ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వినాయకన్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారితో కూడా అతను దురుసుగా వ్యవహరించాడు. దీంతో సీఐఎస్ఎఫ్ అధికారులు వినాయకన్‌ను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించగా సిటీ పోలీస్ యాక్ట్ కింద అతనిపై న్యూసెన్స్ కేసును నమోదు చేశారు. మద్యం మత్తులోనే అతను దురుసుగా వ్యవహరించినట్లు గుర్తించారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. కాగా, పోలీస్‌స్టేషన్‌లో మీడియా పట్ల కూడా వినాయకన్ దురుసుగా వ్యవహరించాడు. కాగా, గత ఏడాది కూడా ఎర్నాకులం పోలీస్‌స్టేషన్‌లో వినాయకన్‌పై న్యూసెన్స్‌కేసు నమోదైంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
ట్రావెల్ ఆర్ట్ & కల్చర్
సోమవారం ॥ 9-9-2024

● గోవా


● అరేబియా తీరం నుంచి చపోరా కోట


● చపోరా కోట నుంచి అరేబియా తీరం









బీచ్‌లే కాదు... బర్డ్స్ కూడా!

గోవా అంటే సముద్ర తీరమే కాదు, అంతకంటే చెప్పుకోవాల్సింది చాలా ఉంది. చూడాల్సినవి కూడా చాలానే ఉన్నాయి. అందుకు వర్షాలు ముగుస్తూ, చలి మొదలు కాని ఈ సీజన్ వెకేషన్‌కు బెస్ట్ టైమ్. నిజానికి గోవాకు టూర్ కంటే వెకేషన్‌ను ఎంజాయ్ చేయడానికి వెళ్లడమే కరెక్ట్. ఓ వారం లేదా కనీసం నాలుగు రోజులు ఆహ్లాదంగా గడపడానికి ప్లాన్ చేసుకోవాలి. టూర్ ప్యాకేజీల్లో చూపించే ప్రధానమైన ప్రదేశాలతో సరిపెట్టుకోకుండా పట్టణం లోపల అన్ని వీధుల్లో తిరగాలి. నివాస ప్రదేశాల దగ్గరకు వెళ్లాలి. పంట పొలాలను చూడాలి. నది తీరాన, గోవా రోడ్ల మీద సైకిల్ మీద వెళ్లాలి. చపోరా కోట మీద నుంచి అరేబియా సముద్రాన్ని చూడాలి. అలాగే సముద్ర తీరం నుంచి కోట గోడను చూడాలి. చపోరా కోటలో చిత్రీకరించిన దిల్ చాహ్ తా హై సినిమాను గుర్తు చేసుకోవాలి. ఆదిల్ షా కట్టిన ఆ కోట పేరు షాపూరా కోట. ఆ కోట సమీపాన ఉన్న నదికి కూడా అదే పేరు ఖాయమై పోయింది. షాపూరా వాడుకలో కొంకణి భాషలో చపోరా అయింది. ఈ నదిలో కేయాకింగ్ చేయాల్సిందే. ఇంకో విషయం... చేపలు పట్టాలనే సరదా ఉంటే గైడ్‌తో ఒక మాట చెప్పండి. స్థానికులు చేపలు పట్టే నీటి కొలనుల్లో ఏర్పాటు చేస్తారు లేదా చేపలు పట్టే వాళ్ల దగ్గరకు వెళ్లి అడిగితే నేర్పిస్తారు. కానీ చేప ఎరను కొరికిన వెంటనే ఒడుపుగా పైకి లాగడం అంత సులువేమీ కాదు. కొత్తవాళ్లకు కర్ర మాత్రమే పైకి వస్తుంది, చేప నీటిలోకి జారుకుంటుంది.



నెమలి నాట్యం

సైకిల్, బైక్ అద్దెకు తీసుకుని రోడ్ల వెంట సాగిపోతూ ఉంటే ఊడలు దిగిన వందల ఏళ్ల మర్రిచెట్లు, పచ్చటి పొలాల్లో పురి విప్పి నాట్యం చేస్తున్న నెమళ్లు, చిన్న చిన్న ఇసుక దీవులు, జలపాతాల వరకు సాగిపోవచ్చు. జలపాతంలో తడిస్తే ఉత్సాహం ఉరకలు వేస్తుంది. దూద్‌సాగర్ వాటర్‌ఫాల్స్ 350 మీటర్ల నుంచి వంద అడుగుల వెడల్పుతో విస్తరించి పాయలు పాయలుగా జాలువారుతుంటుంది. ఈ నీళ్లు దూరానికి తెల్లటి పాలలా కనిపిస్తాయి. అందుకే దీనికి దూద్‌సాగర్ అని పేరు. దూద్‌సాగర్ వరకు సాగే ట్రెకింగ్‌ని కూడా ఎక్స్‌పీరియెన్స్ చేయాల్సిందే.

సలీం అలీ బర్డ్ సాంక్చురీ

వర్షాకాలంలో మూతబడిన రెస్టారెంట్‌లు సెప్టెంబరు చివరి వారానికి తెరుచుకుంటాయి. గోవా స్థానికులతో మాట కలపండి. వాళ్ల సంప్రదాయ వంటకాల కోసం అడగండి. వాళ్ల దగ్గర హోమ్ స్టేలో బస చేయకపోయినప్పటికీ భోజనం చేసే సౌకర్యం ఉంటుంది. ఒక మోస్తరు రెస్టారెంట్ భోజనం ధరకే భోజనం పెడతారు. పక్షి ప్రేమికుల స్వర్గధామం సలీం అలీ బర్డ్ సాంక్చురీలో చెట్ల కొమ్మల మీద కూర్చుని కువకువలాడుతున్న పక్షులను చూస్తూ ప్రశాంతంగా నడుస్తూ ఉంటే ఆకలయ్యే వరకు టైమ్ ఎంత గడిచిన సంగతే తెలియదు. ఇక ఎలిజబెత్ చర్చ్, 18వ శతాబ్దం నాటి పోర్చుగీసు నిర్మాణశైలి రిసార్టును చూడాలంటే గోవాపట్టణం సమీపాన ఉన్న మొయిరా గ్రామానికి వెళ్లాలి.

● వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్

నేల తల్లికి పూల దుప్పటి

వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్క్... ఇది ఉత్తరాఖండ్, చమేలీ జిల్లాలో ఉంది. సముద్రమట్టానికి మూడు వేల ఐదు వందల మీటర్ల ఎత్తులో హిమాలయ పర్వతశ్రేణుల్లో విస్తరించిన విశాలమైన లోయ. ప్రకృతిలో వర్ణాలెన్ని ఉన్నాయో లెక్క పెట్టాలంటే ఇక్కడ పర్యటించాల్సిందే, పూలరంగులను చూడాల్సిందే. పది మైళ్ల దూరం ట్రెకింగ్ చేయగలిగితే భూతల స్వర్గం కనువిందు చేస్తుంది. జోషిమఠ్, హరిద్వార్, రిషికేశ్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్తుంటారు. వీటి మధ్యనే ఉంది వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్. ఈ ట్రిప్‌లో కలుపుకోవచ్చు. ఈ దారిలోనే హేమకుండ్ సాహిబ్ గురుద్వారా ఉండడంతో టూరిస్టుల్లో సిక్కులు ఎక్కువగా కనిపిస్తారు. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌లో పర్యటించడానికి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అనుమతి తీసుకోవాలి. టూర్ ప్యాకేజ్‌లో వెళ్తుంటే టూర్ ఆపరేటర్లే టూరిస్టుల ఐడీ ప్రూఫ్‌ల ఆధారంగా అనుమతులు తీసుకుంటారు. మూడు రోజులకు మాత్రమే అనుమతిస్తారు. అది కూడా పగలు మాత్రమే పర్యటనకు అనుమతి. ఎందుకంటే ఇక్కడ వన్యమృగాలు తిరుగుతుంటాయి. ఈ నేషనల్ పార్కులోనే పర్యాటకులకు బస ఏర్పాట్లు ఉంటాయి.

వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ పర్యటనకు సెప్టెంబరు వరకు అనువైన కాలం. చెట్లన్నీ పూలతో, రెక్కల మీద నీటి చుక్కలతో కళకళలాడుతుంటాయి. ఆకాశంలో మబ్బులు విహరిస్తుంటాయి. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్కులో ట్రెకింగ్ చేసేటప్పుడు కొన్నిసార్లు పూలు స్పష్టంగా కనిపించకుండా మబ్బు వెనుక దాగినట్లుంటాయి. కొంతసేపు అసలే కనిపించకుండా పరదా అడ్డుపడ్డట్లు ఉంటుంది. మన చుట్టూ మబ్బు ఆవరించినప్పుడు అలా ఉంటుంది. ఆ క్షణంలో మనం మబ్బు మధ్యలో విహరిస్తుంటామన్నమాట. శీతాకాలం మొదలైనప్పటి నుంచి ఫిబ్రవరి వరకు దట్టమైన మంచు ఉంటుంది. కాబట్టి పూలను కంటినిండుగా తృప్తిగా చూడాలంటే శీతాకాలం లోపే ప్లాన్ చేసుకోవాలి.









● ఔలి

సాహస విహారం







ఔలి... ఇది కూడా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనే ఉంది. జోషిమఠ్‌కు ఏడు కిలోమీటర్ల దూరాన ఉంది. హిమాలయ పర్వత శ్రేణులకు ముఖద్వారం అని చెప్పవచ్చు. ఇక్కడి నుంచి హిమాలయ పర్వత శిఖరాలను చూడవచ్చు. ఈ ప్రదేశం అడ్వెంచరస్ టూరిస్ట్ స్పాట్. మన దేశంలో ఓ యాభై ఏళ్ల వరకు యాత్రలంటే తీర్థయాత్రలే. ఆధ్యాత్మిక క్షేత్రాలకే వెళ్లేవాళ్లు. దాంతో అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు ఆలవాలమైన ఔలి వంటి ప్రదేశాలకు పెద్దగా ప్రచారం లభించలేదు. మంచు మీద స్కీయింగ్ చేయడానికి మనదేశంలో ఔలి తర్వాతనే మిగిలిన ప్రదేశాలన్నీ.

కేబుల్ కార్‌లో ఆకాశయానం

ఔలి పదివేల అడుగుల ఎత్తులో ఉంది. ఏడాదంతా నేల మీద తెల్లని మంచు నిండి ఉంటుంది. ఈ టూర్‌లో హెవీ ఉలెన్స్‌తోపాటు మంచులో జారని షూస్, గ్లవ్స్ తప్పనిసరి. మంచు చేతికి తీసుకుని బాల్స్ చేసి ఒకరి మీద ఒకరు విసురుకుంటూ ఆడుకోవచ్చు. మంచు ముద్ద నేరుగా ఒంటికి తాకిందంటే దెబ్బ గట్టిగానే తగులుతుంది. జోషిమఠ్ నుంచి ఔలికి కేబుల్ కార్‌లో వెళ్లాలి. కేబుల్ కార్ ఎక్కి నేల మీద విస్తరించిన తెల్లటి మంచు తివాచీని చూస్తూ, మంచును చీల్చుకుని ఎదిగిన చెట్లను తాకుతూ ఉంటే ఆకాశంలో విహరిస్తున్నట్లే ఉంటుంది. ప్రభుత్వం అధీనంలో ఉన్న రిసార్టుల్లో బస చేయడమే క్షేమం, సౌకర్యం కూడా. గవర్నమెంట్ శీతాకాలంలో వింటర్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్ నిర్వహిస్తుంది. వాటిని చూడాలంటే శీతాకాలంలో వెళ్లాలి.

మెల్లగా సాగే ప్రయాణం


ఔలికి ఫ్లయిట్ జర్నీ చేయాలంటే డెహ్రాడూన్‌లో దిగాలి. అక్కడి నుంచి దాదాపు మూడు వందల కిలోమీటర్లు రోడ్డు మీద ప్రయాణించాలి. ట్రైన్‌లో వెళ్లాలంటే రిషికేశ్ స్టేషన్‌లో దిగాలి. అక్కడి నుంచి 250 కిమీలు రోడ్డు మార్గాన ప్రయాణించాలి. రోడ్డుమార్గం పర్వతశ్రేణుల మధ్య మెలికలు తిరుగుతూ సాగుతుంది. కాబట్టి ప్రయాణ దూరం ఎక్కువ. పైగా మైదానంలో ప్రయాణించినట్లు గంటకు అరవై కిలోమీటర్ల వేగం సాధ్యం కాదు. కాబట్టి టూర్ ప్లాన్‌లో ఒక చోట నుంచి మరొక చోటకు జర్నీ టైమ్ ఎక్కువగా ఉంటుంది. మన దగ్గర ప్రయాణ వేగాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాన్ చేసుకుంటే ప్రయాణంలోనే ఎక్కువ సమయం గడిచిపోతుంది. వెళ్లిన చోట ఎక్కువ సమయం గడపలేం.

● థియేటర్, విజువల్ ఆర్ట్ గ్యాలరీలు

మరపురాని సాంస్కృతిక అనుభవం









సందడిగా ఉండే నగరాలలో వేగవంతమైన జీవన విధానాల మధ్య కూరుకుపోతుంటాం... ప్రజల జీవనశైలిలో మెరుపు, వేగవంతమైన మార్పు ఉన్నప్పటికీ మన ప్రాచీన చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునే వారు ఎంతోమంది ఇప్పటికీ ఉన్నారు. కొందరు వివిధ రకాల కళలను తమ థియేటర్ ప్రదర్శనలతో మన హృదయాలను గెలిస్తే, మరికొందరు విజువల్ ఆర్ట్‌కున్న శక్తివంతమైన రంగులతో మనల్ని ఇట్టే ఆకర్షిస్తారు. ఈ సాంస్కృతిక సాహసాన్ని మరింత ఆహ్లాదకరం చేయడానికి, భారత దేశంలో ప్రఖ్యాతి చెందిన థియేటర్, విజువల్ ఆర్ట్స్ గ్యాలరీలు ఉన్నాయి. వాటిలో...

అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, కోల్‌కతా

భారతదేశంలోని ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలలో ఒకటిగా పరిగణించబడుతోంది కోల్‌కతాలోని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్. రవీంద్ర నాథ్ ఠాగూర్ రచించిన 'గర్ల్ విత్ ఎ పిక్చర్ అండ్ ఎ వింటర్స్ ఈవినింగ్' వంటి చిత్రాలకు ఈ గ్యాలరీ ప్రసిద్ధి చెందింది. కోల్‌కతాలోని ఈ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 1933లో స్థాపించబడింది. ఈ అకాడమీ వలసవాద, సమకాలీన శైలుల మిశ్రమంగా, అన్ని కళారూపాల సంపూర్ణ సమ్మేళనంగా ఈ గ్యాలరీని చెప్పుకోవచ్చు.

నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్

బాంద్రా-కుర్లా కాంప్లెక్స్‌లోని సంపన్నమైన బహుళ-క్రమశిక్షణా సాంస్కృతిక స్థలంగా నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌ను చెప్పుకోవచ్చు. భారతీయ కళలను పెద్ద ఎత్తున గౌరవించడానికి, ప్రోత్సహించడానికి ఈ సెంటర్ రూపొందించబడింది. కల్చరల్ సెంటర్‌లో ప్రధానంగా మూడు ప్రదర్శన కళలకు నిలయంగా ఉంది. 2,000 సీట్ల గ్రాండ్ థియేటర్, సాంకేతికంగా అభివృద్ధి చెందిన 250 -సీట్ స్టూడియో థియేటర్, డైనమిక్ 125- సీట్ క్యూబ్ దీంట్లో ఉంటుంది. ఇది భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కళాత్మక ప్రతిభకు నెలవుగా చెప్పవచ్చు. గ్లోబల్ మ్యూజియం ప్రమాణాల ప్రకారం నాలుగు-అంతస్తులుగా ఈ సెంటర్‌ను నిర్మించారు.

ప్రభుత్వ మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, చండీగఢ్

ఆర్ట్ గ్యాలరీ ఆఫ్ చండీగఢ్ 1947లో స్థాపించబడింది. ఈ స్థలం రేఖాగణిత రూపాలు, ఫంక్షనల్ డిజైన్‌ను ప్రదర్శిస్తుంది. ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్ లే కార్బుసియర్ రూపొందించినట్లు చెప్పబడిన ఈ గ్యాలరీలో అనేక కళాఖండాలు, పురాతన శిల్పాలు, పహారీ సూక్ష్మ చిత్రాలు, సమకాలీన కళాఖండాలు ఉన్నాయి.


చెన్నై ప్రభుత్వ మ్యూజియం

చెన్నైలో ఉన్న ప్రభుత్వ మ్యూజియం 1814వ సంవత్సరంలో ప్రారంభించారు. ఇది భారతదేశంలోని రెండవ పురాతన మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ. ఆధునిక పెయింటింగ్‌లతో పాటు రాజ్‌పుత్, మొఘల్ యుగాల చిత్రాల గురించి తెలుసుకోవాలంటే మ్యూజియంలో భాగమైన నేషనల్ ఆర్ట్ గ్యాలరీ సందర్శించవచ్చు.

నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్, న్యూఢిల్లీ

భారత ప్రభుత్వం కళలను ప్రోత్సహించడానికి ఒక చొరవతో న్యూ ఢిల్లీలో నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ 1954లో స్థాపించింది. ఈ గ్యాలరీలో కార్ల్ అంటావో రచించిన ది స్మోకింగ్ డాంకీ, ఫ్రోజెన్ పోర్కుపైన్, భూపేన్ ఖాఖర్ రచించిన బొకే ఆఫ్ ప్లాస్టిక్ ఫ్లవర్ వంటి ప్రసిద్ధ చిత్రాలను ప్రదర్శించారు.

కావి ఆర్ట్‌ను కాపాడుకోలేమా?!



● ప్రాచీన కళ

మన దేశంలో ప్రాచీనమైన కుడ్య చిత్రాలలో 'కావి' ఆర్ట్ ఒకటి. మండల డిజైన్లు, దేవతా చిత్రాలు, అంచులూ... అన్నీ ఎరుపు, తెలుపు రంగుల కాంబినేషన్స్‌తో ఆకట్టుకుంటాయి. కొంకణ్ ప్రాంతంలో ముఖ్యంగా గోవా, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని దేవాలయాలలో కనిపించే కుడ్య చిత్రాల రూపం కావి. అరుదైన ఈ కళ అంతరించిపోవడానికి సిద్ధంగా ఉందని, కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.





కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో .. ప్రాచీన దేవాలయాలు, చర్చిలు, మసీదులు, జైన, ఇతర గ్రామీణ దేవతా మందిరాల గోడలపైన ప్రసిద్ధి చెందిన కుడ్య చిత్రకళ కనిపిస్తుంటుంది. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఈ కళను చూస్తాం.

ఎర్రటి మట్టి-సున్నం

సాంప్రదాయ 'కావి' ఆర్ట్‌కు మెత్తగా పొడి చేసిన ఎర్రటి మట్టిని ప్రాథమిక పొరకు ప్రధాన పదార్థంగా ఉపయోగిస్తారు. పై పొరకు తెల్లని రంగు కోసం సీషెల్ సున్నం వాడుతారు. ఈ రంగు తయారీకి చిక్కటి నదీ ఇసుక, బెల్లం, వివిధ రకాల మొక్కల నుండి తీసిన రసం వంటి సేంద్రీయ పదార్థాలను ఉపయోగిస్తారు. 'తీర ప్రాంతాల్లో తేమతో కూడిన వాతావరణం ఉంటుంది. మట్టిగోడలు తేమను పీల్చుకుంటాయి. దీంతో రంగులు మసకబారుతాయి. అందుకని ఈ కుడ్య చిత్రాలకు వివిధ రంగులను ఉపయోగించడం అనువైనదిగా నాటి రోజులు ఉండేవి కావు. అందుకే సహజసిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన రెండు ప్రాథమిక ఎరుపు-తెలుపు రంగులను ఉపయోగించేవార'ని ఉడిపికి చెందిన కావి కళాకారుడు, పరిశోధకుడు జనార్ధన్ హవంజే చెబుతున్నారు.

మధుకేశ్వర ఆలయ ప్రాంగణంలోని అర్ధగణపతి ఆలయంలో కావి కళా చిత్రాన్ని చూడవచ్చు. గోవాలోని ఆర్చ్‌బిషప్ ప్యాలెస్ గోడలపైన 1567–1619 మధ్య చిత్రించిన కావి కళలో గండబేరుండ మూలాంశం ఉందని గమనించడం ఆసక్తికరంగా మారింది.

కళ పునరుద్ధరణ

పోర్చుగీసుల దండయాత్ర సమయంలో ఎన్నో దేవాలయాలు ధ్వంసమయ్యాయి. దీంతో దేవాలయాల పైన ఉండే 'కావి' కళ ప్రాభవం కోల్పోయింది. ఇప్పుడు ప్రాచీన మందిరాలలో ఈ కావి కళా చిత్రాలను వెలుగులోకి తీసుకురావడానికి ఎంతో కృషి జరుగుతోంది. దీంట్లో భాగంగా కావి ఆర్ట్‌ను గుర్తించి, ప్యాచ్ టెస్ట్ చేసి, ఫంగస్, దుమ్ము, పెయింట్.. వంటివి తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అనేక సందర్భాల్లో సున్నం వంటి సహజ పదార్థాలను ఉపయోగించి పగుళ్లను పూరించడం ద్వారా పనిని పునరుద్ధరిస్తున్నారు. కొన్ని సందర్భాలలో అసలైనది మరమ్మత్తు చేయలేనప్పుడు కళాకారులు పునఃసృష్టి చేయడానికి పనిచేస్తున్నారు. అయితే, అనేక ప్రదేశాలలో దేవాలయాల పునరుద్ధరణ సమయంలోనూ, అశాస్త్రీయమైన పునరుద్ధరణ పద్ధతుల కారణంగానూ అసలు కళాఖండాలు పూర్వ వైభవం కోల్పోతున్నాయి. దక్షిణ కన్నడ, ఉడిపి, ఉత్తర కన్నడ జిల్లాలలో, గోవా, మహారాష్ట్రాల్లో కొద్దిమంది సంప్రదాయ కళాకారులు మాత్రమే మిగిలి ఉండటం కూడా ఓ కారణం అవుతోంది.



కావి కళ అభివృద్ధి

పోర్చుగీసుల దండయాత్ర తర్వాత అంటే దాదాపు 500 సంవత్సరాల క్రితం కొంకణ్ తీరం వెంబడి కావి కళ అభివృద్ధి చెందిందని పరిశోధనల ద్వారా వెలుగులోకి వచ్చింది. అయినప్పటికీ హవాంజే వంటి కొందరు నిపుణులు కావి కళ పోర్చుగీసు దండయాత్రకు ముందే ఉందని ఆధారాలు కూడా చూపుతున్నారు. 14వ శతాబ్దానికి చెందిన బనవాసిలోని

కనుమరుగవుతున్న కళ

ప్రస్తుతం కర్ణాటక, గోవా రాష్ట్రాలు రెండూ కావి కళ కోసం భౌగోళిక సూచిక (జిఐ) ట్యాగ్ కోసం పోటీ పడుతున్నాయి. రాష్ట్రాలు కావి కళా శైలి చరిత్ర, వారసత్వం, ఔచిత్యాన్ని హైలైట్ చేస్తున్నాయి. కావి కళాకారుల సంఘాలు కూడా తమ తమ రాష్ట్రాల్లో ఈ కుడ్య చిత్ర కళను సజీవంగా ఉంచడంలో చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకున్నాయి. గోవా గత సెప్టెంబరులో జిఐ ట్యాగ్‌కు దరఖాస్తు దాఖలు చేయగా, కర్ణాటకకు చెందిన కవి ఆర్ట్ ఫౌండేషన్ విశ్వేశ్వరయ్య ట్రేడ్ ప్రమోషన్ సెంటర్‌తో కలిసి దరఖాస్తును దాఖలు చేసే ప్రక్రియలో ఉంది.

కళ పరిరక్షణకు జిఐ ట్యాగ్

జీఐ క్రాఫ్ట్ సర్టిఫికెట్ పొందడం ద్వారా కళాకారులు తమ కళాకృతులను ప్రదర్శించడానికి అంతర్జాతీయ మార్కెటింగ్ ప్లాట్‌ఫారమ్‌లను కూడా యాక్సెస్ చేయగలరు. కావి ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడు మంజునాథ్ రావు, హవంజే మాట్లాడుతూ 'కావి కళను పునరుద్ధరించడానికి ప్రభుత్వం మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'కళా రూపంపై పుస్తకాలు, పరిశోధనా రచనలు ప్రచురించాల్సిన అవసరం ఉంది. డాక్యుమెంటేషన్ కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి. అలాగే ఆర్ట్ కోర్సులలో 'కావి' కళను సిలబస్‌లో చేర్చాలి' అని చెబుతున్నారు.

● సందర్భం

మూడు తరాల ముంబై శిల్పి





ముంబై నగరానికి వన్నెతెచ్చే గణేష్ మహారాజ్‌ని రూపుదిద్దిడంలో సంతోష్ కాంబ్లీ కుటుంబం మూడు తరాలుగా నిమగ్నమై ఉంది. అతిపెద్ద గణపతి విగ్రహాన్ని రూపొందించడంలో ఈ కుటుంబీకులు తమ కళాత్మకతను చాటుతూనే ఉన్నారు. ఈ గణేష్ నవరాత్రుల్లో సంతోష్ కాంబ్లీ రూపొందించిన 14 అడుగుల ఎత్తైన విగ్రహానికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. లాల్‌బాగా రాజా ముంబైలోనే అతి పెద్ద గణేష్ మూర్తిగా పేరొందింది. లాల్‌బాగ్ గా పిలువబడే ఈ ప్రాంతంలో 1928లో గణేష్ చతుర్థి రోజున గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటి ముంబై సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా ఈ వేడుక మొదలయ్యింది. నాటి నుంచి 89 ఏళ్లుగా ఇక్కడ గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, నవరాత్రులు జరుపుతున్నారు. నాటి నుంచి ఈ గణేషుడిని సంతోష్ కాంబ్లీ కుటుంబీకులే తయారుచేస్తున్నారు. నవరాత్రుల్లో పూజలందుకునే ఈ గణేషుడు ప్రతి రోజూ 1.5 మిలియన్ల భక్తులను ఆకర్షిస్తుంటాడు.



స్ఫూర్తిదాయకమైనదే నాయకత్వం
అధికార దర్పం కాదు
- కెన్నెత్ బ్లాంచర్డ్, ప్రఖ్యాత అమెరికన్ బిజినెస్ కన్సల్టెంట్

సాక్షి ప్లస్
సోమవారం: 9-9-2024

బిజినెస్ రీల్

ఎగుమతిదారులకు బ్యాంక్ రుణ సమస్య!

11న జరిగే భేటీలో ప్రస్తావన

న్యూఢిల్లీ: ఎగుమతిదారులకు తగ్గుతున్న బ్యాంక్ రుణ పరిమాణం ఈ రంగాన్ని దెబ్బతీస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తో సెప్టెంబర్ 11 జరిగే సమావేశంలో ట్రేడర్లు ఈ సమస్యను ప్రముఖంగా ప్రస్తావించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. 2021-22 నుంచి 2023-24 మధ్య రూపాయి పరంగా ఎగుమతులు 15 శాతం వృద్ధి చెందగా, 2022 మార్చి నెలతో పోల్చితే 2024 మార్చి నాటికి ఎగుమతిదారులకు రుణ పరిమాణం 5 శాతం తగ్గిందని ఎగుమతిదారులు పేర్కొంటున్నారు. పెరుగుతున్న ఎగుమతులకు అనుగుణంగా రుణ పరిమాణం పెరగడం లేదని ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈఓ) పేర్కొంటోంది.

అసెట్ మేనేజర్ నుంచి అసెట్ ఓనర్‌గా వేదాంతా

చైర్మన్ అనిల్ అగర్వాల్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రతిపాదిత బిజినెస్‌ల విడదీత తదుపరి అసెట్ మేనేజర్ స్థాయి నుంచి అసెట్ ఓనర్‌గా వేదాంతా గ్రూప్ ఆవిర్భవించనున్నట్లు సంస్థ చైర్మన్ అనిల్ అగర్వాల్ పేర్కొన్నారు. 15కుపైగా కమోడిటీలతో విభిన్న బిజినెస్ విభాగాలు కలిగిన గ్రూప్ ఆరు ప్రత్యేక కంపెనీలుగా విడిపోనుంది. తద్వారా వేదాంతా గ్రూప్ నుంచి వేదాంతాసహా ఆరు లిస్టెడ్ కంపెనీలు ఏర్పాటుకానున్నాయి. వాటాదారులకు తమవద్దగల ప్రతీ 1 షేరుకి విడదీయనున్న బిజినెస్‌లకు చెందిన 5 షేర్లు జారీ చేస్తారు. కాగా.. అల్యూమినియం, చమురు- గ్యాస్, విద్యుత్, స్టీల్- ఫెర్రస్ మెటీరియల్స్, బేస్ మెటల్స్ ప్రత్యేక సంస్థలుగా లిస్ట్‌కానున్నాయి. ఈ బాటలో ప్రస్తుత జింక్, కొత్త ఇన్‌క్యుబేటెడ్ బిజినెస్‌లు వేదాంతా లిమిటెడ్‌లో కొనసాగనున్నాయి. పరివర్తన దశను దాటిన కంపెనీ ఒక్కో బిజినెస్ విభాగంలో సమీకృతంకావడంతోపాటు.. అసెట్ బేస్‌ను పటిష్టపరచుకోవడంపై దృష్టిపెట్టినట్లు వేదాంతా చైర్మన్ అనిల్ అగర్వాల్ పేర్కొన్నారు. తద్వారా ప్రత్యేక కంపెనీగా ఏర్పాటుకానున్న ప్రతీ బిజినెస్‌నూ ప్రపంచస్థాయిలో నిలిపేందుకు కృషి చేయనున్నట్లు తెలియజేశారు. విడదీత ప్రణాళికకు ఇప్పటికే రుణదాతల నుంచి ఆమోదం పొందడంతో తదుపరి అనుమతుల కోసం ఎన్‌సీఎల్‌టీకి వేదాంతా దరఖాస్తు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా అన్ని అనుమతులూ లభించగలవని అంచనా వేస్తోంది.

అహ్లువాలియాకు భారీ కాంట్రాక్ట్

సిగ్నేచర్ నుంచి హౌసింగ్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ సిగ్నేచర్ గ్లోబల్ తాజాగా రూ. 1,114 కోట్ల విలువైన కాంట్రాక్టును జారీ చేసింది. నిర్మాణ రంగ సంస్థ అహ్లువాలియా కాంట్రాక్ట్స్ ఈ ఆర్డర్‌ను దక్కించుకుంది. దీనిలో భాగంగా గురుగ్రామ్‌లో విలాసవంత గృహసముదాయ ప్రాజెక్టును నిర్మించవలసి ఉంటుంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని సెక్టార్ 37డీ వద్ద 16.65 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును చేపట్టవలసి ఉన్నట్లు సిగ్నేచర్ గ్లోబల్ వెల్లడించింది. 28.12 లక్షల చదరపు అడుగుల అభివృద్ధిలో భాగంగా 1,008 యూనిట్లను నిర్మించవలసి ఉన్నట్లు తెలియజేసింది. ఈ ప్రాజెక్టును ప్రీలాంచ్ చేసిన కొద్ది రోజుల్లోనే రూ. 3,600 కోట్ల విలువైన ముందస్తు అమ్మకాల(బుకింగ్స్)ను సాధించినట్లు సిగ్నేచర్ గ్లోబల్ వైస్‌చైర్మన్ లలిత్ కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు.

బలహీనత కొనసాగొచ్చు

అంతర్జాతీయ సంకేతాలు కీలకం ● ద్రవ్యోల్బణ డేటాపై దృష్టి ● ఈ వారం మార్కెట్‌పై నిపుణుల అంచనా



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలకు తోడు దేశీయంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే అంశాలేవీ లేకపోవడంతో దలాల్ స్ట్రీట్ బలహీనంగా కదలాడొచ్చని స్టాక్ నిపుణులు భావిస్తున్నారు. స్థూల ఆర్థిక గణాంకాలు, ప్రపంచ పరిణామాలు, విదేశీ ఇన్వెస్టర్ల తీరుతెన్నులను ఇన్వెస్టర్లు పరిశీలించవచ్చంటున్నారు. వీటితో పాటు క్రూడాయిల్ కదలికలు, డాలర్ మారకంలో రూపాయి విలువ అంశాలు ట్రేడింగ్‌ను ప్రభావితం చేయొచ్చంటున్నారు.

''కార్పొరేట్ తొలి త్రైమాసిక ఫలితాల మాదిరిగానే దేశీయ క్యూ1 జీడీపీ వృద్ధి అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. ఆగస్టు పీఎంఐ తయారీ, సేవా రంగ డేటా, ఆటో అమ్మకాలు మెప్పించలేపోయాయి. ఈ పరిణామాలతో అప్రమత్తత వాతావరణం నెలకొని ఉంది. అధిక వాల్యుయేషన్ల కారణంగా పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు రాణించలేపోతున్నాయి. కమోడిటీ ధరలు తగ్గడంతో మెటల్ షేర్లూ నష్టాలు చవిచూస్తున్నాయి. అమ్మకాలు కొనసాగితే నిఫ్టీకి 24,500-24,400 పరిధిలో తక్షణ మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే 24,400 వద్ద మరో మద్దతు ఉంది'' అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల గతవారంలో సెన్సెక్స్ 1,182 పాయింట్లు, నిఫ్టీ 384 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

స్థూల ఆర్థిక డేటాపై దృష్టి

అమెరికా ఆగస్టు ద్రవ్యోల్బణ గణాంకాలు సెప్టెంబర్ 11న, దేశీయ ఆగస్టు రిటైల్ ద్రవ్యోల్బణ, జూలై పారిశ్రామికోత్పత్తి డేటా గురువారం విడుదల కానున్నాయి. అమెరికా ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్(పీపీఐ) సెప్టెంబర్ 14న వెల్లడి కానున్నాయి. అమెరికాలో ఉపాధి కల్పన తగ్గినట్లు డేటా వెలువడంతో ఫెడ్ రిజర్వ్ 50 బేసిస్ పాయింట్ల మే వడ్డీరేట్లను తగ్గించే అంచనాలు పెరిగాయి. ఇదే సమయంలో ఆర్థిక మాంద్య భయాలు తెరపైకి వచ్చాయి.

తొలివారంలో రూ.11వేల కోట్ల కొనుగోళ్లు

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో పాటు దేశీయ మార్కెట్ స్థిర్వతం కారణంగా సెప్టెంబర్ తొలి వారంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ.11,000 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. ''అగ్ర రాజ్యాలైన అమెరికా, చైనాల ఆర్థిక మందగమన భయాలతో ఎఫ్ఐఐలు తమ కేటాయింపులను పునశ్చరణ చేసుకోవచ్చు. రిస్క్ సామర్థ్యాన్ని తగ్గించుకునే వ్యూహం అమలు చేసినట్లయితే భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడుల తగ్గొచ్చు'' అని మోజోపీఎంఎస్ ఇన్వెస్ట్‌మెంట్ సీఈవో సునీల్ దమానియా తెలిపారు. ఇదే సమీక్షా కాలం(సెప్టెంబర్ 1-6 తేదీల)లో డెట్ మార్కెట్లో రూ.7,600 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఎఫ్ఐఐలు ఆగస్టులో రూ.7,320 కోట్లు, జూలైలో రూ.32,365 కోట్లు, జూలైలో రూ.26,565 కోట్లు చొప్పున విక్రయాలు జరిపారు.

ఈ వారం ఐపీఓల పండుగ

దలాల్ స్ట్రీట్‌లో ఐపీఓల వారం మళ్లీ వచ్చింది. మెయిన్ బోర్డు విభాగంలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో సహా నాలుగు కంపెనీలు ఐపీఓకి రానున్నాయి. అందులో పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్, టొలిన్స్ టైర్స్, క్రాస్ కంపెనీలు ఉన్నాయి. తద్వారా ఆయా కంపెనీలు మొత్తం రూ.8,390 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నాయి. అలాగే తొమ్మిది సంస్థలు ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో పబ్లిక్ ఇష్యూ ప్రారంభించనున్నాయి. ''సెబీ నిబంధల ప్రకారం కంపెనీలు సమర్పించిన ముసాయిదా పత్రాల్లోని ఆర్థిక గణాంకాలు ఆరు నెలలలోపు అయి ఉండాలి. గత ఆర్థిక సంవత్సరంలో సెబీ నుంచి అనుమతులు పొందిన ఐపీఓలకు ఈ సెప్టెంబర్ చివరి నెల కావడంతో కంపెనీలు ఇష్యూ బాట పట్టాయి'' అని ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ ఎండీ మునీష్ అగర్వాల్ తెలిపారు.

చైనాలోకి అదానీ అడుగు

- సబ్సిడరీ ఏర్పాటు
- సప్లయ్‌చైన్, ప్రాజెక్ట్ నిర్వహణ సేవలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ చైనాలోకి అడుగుపెట్టింది. సప్లయ్ చైన్ సొల్యూషన్లు, ప్రాజెక్టు నిర్వహణ సేవలను ఆఫర్ చేసేందుకు వీలుగా ఓ సబ్సిడరీ కంపెనీని ఏర్పాటు చేసింది. సింగపూర్ కేంద్రంగా పనిచేసే తన సబ్సిడరీ కంపెనీ అదానీ గ్లోబల్ పీటీఈ (ఏజీపీటీఈ) షాంఘై కేంద్రంగా 'అదానీ ఎనర్జీ రీసోర్సెస్ (షాంఘై) కో' (ఏఈఆర్‌సీఎల్)ను ఏర్పాటు చేసినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా కంపెనీల చట్టం కింద ఏఈఆర్‌సీఎల్‌ను సెప్టెంబర్ 2న ఏర్పాటు చేశామని, ఇది ఇంకా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉందని తెలిపింది. ఎయిర్‌పోర్ట్‌లు, మైనింగ్, రోడ్లు, ప్రాజెక్టుల నిర్మాణం, నీటి ప్రాజెక్టులు, గ్రీన్ ఎనర్జీ తదితర రంగాల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కెన్యాలోని నైరోబీలో జోమో కెన్యట్టా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి గాను ఆ దేశ ప్రభుత్వంతో చర్చలు కూడా నిర్వహిస్తోంది. ఇది సఫలమైతే ఆ సంస్థకు భారత్ వెలుపల ఇది మొదటి ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ అవుతుంది.

యాక్సిస్ బ్యాంక్ నుంచి రెండు డిజిటల్ సొల్యూషన్స్



హైదరాబాద్: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తాజాగా రిటైల్, వ్యాపార వర్గాల కోసం రెండు ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. యూపీఐ-ఏటీఎం, భారత్ కనెక్ట్ (గతంలో బీబీపీఎస్) ఫర్ బిజినెస్ వీటిలో ఉన్నాయి. కార్డ్‌లెస్ నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లకు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) టెక్నాలజీ ఆధారిత ఆండ్రాయిడ్ క్యాష్ రీసైక్లర్‌గా యూపీఐ-ఏటీఎం పని చేస్తుంది. అకౌంటు తెరవడం, క్రెడిట్ కార్డుల జారీ, డిపాజిట్లు, రుణాలు, ఫారెక్స్ మొదలైన సర్వీసులన్నీ కూడా ఒకే ప్లాట్‌ఫాం మీద అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని బ్యాంకు డిప్యూటీ ఎండీ రాజీవ్ ఆనంద్ తెలిపారు. మరోవైపు, వ్యాపార సంస్థలు సప్లై చెయిన్‌లోని వివిధ దశల్లో నిర్వహణ మూలధన అవసరాల కోసం, అకౌంట్ రిసీవబుల్స్-పేయబుల్స్‌ను సమర్ధవంతంగా క్రమబద్ధీకరించుకునేందుకు భారత్ కనెక్ట్ ఫర్ బిజినెస్ ఉపయోగపడుతుంది. ఎన్‌పీసీఐలో భాగమైన భారత్ బిల్‌పే భాగస్వామ్యంతో దీన్ని రూపొందించింది.

పండుగ సీజన్‌లో పెరిగిన ట్రక్ అద్దెలు

శ్రీరామ్ మొబిలిటీ బులెటిన్

ముంబై: పండుగ సీజన్ సమీపిస్తుండటం, ఎన్నికల తర్వాత కార్యకలాపాలు పుంజుకోవడంతో ఆగస్టులో రవాణాకు డిమాండ్ పెరిగినట్లు శ్రీరామ్ ఫైనాన్స్ రూపొందించిన మొబిలిటీ బులెటిన్‌లో వెల్లడైంది. దీంతో వరుసగా రెండో నెల కూడా ట్రక్కుల అద్దెలు పెరిగినట్లు సంస్థ ఎండీ వైఎస్ చక్రవర్తి తెలిపారు. కోల్‌కతా-గౌహతి మార్గంలో ట్రక్కుల అద్దెలు అత్యధికంగా 3 శాతం, ఢిల్లీ-హైదరాబాద్ రూట్‌లో 2.3 శాతం పెరిగినట్లు పేర్కొన్నారు. శ్రీనగర్ ప్రాంతంలో యాపిల్స్, ఎన్నికల సీజన్ కారణంగా సరుకు రవాణా ధరలు దాదాపు 10 శాతం ఎగిసినట్లు చక్రవర్తి పేర్కొన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో ట్రక్కుల వినియోగం గణనీయంగా వృద్ధి చెందినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో వర్షాల కారణంగా వాహన విక్రయాలు నెమ్మదించినట్లు, తెలుగు రాష్ట్రాలు ప్రస్తుత విపత్కర పరిస్థితుల నుంచి సత్వరం బైటపడి, పుంజుకోవడం గురించి ఎదురుచూస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆర్థిక విజయాలకు గణేశుడి బాసట..



విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు మనకు ఎన్నో జీవిత పాఠాలు కూడా నేర్పుతాడు. దారిలో ఉన్న అడ్డంకులను తొలగించి విజయాలకు మార్గం ఏర్పరుస్తాడు. ఇదే ప్రేరణతో మనం కూడా మ్యుచువల్ ఫండ్స్‌లో సిస్టమాటిక్‌గా పెట్టుబడులు పెట్టే విషయంలో వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తును ఆర్థికంగా సురక్షితమైనదిగా తీర్చిదిద్దుకోవడానికి బాటలు వేసుకోవచ్చు.

సిస్టమాటిక్ ఇన్వెస్టింగ్ : శుభారంభం

వినాయకుడు అంటే వివేకం, దూరదృష్టికి ప్రతీక. మన జీవితాల్లో ఎదురయ్యే విఘ్నాలను తొలగిస్తాడనే నమ్మకం. తగినంత డబ్బు లేకపోవడం లేదా ఆర్థిక భద్రతపరమైన సమస్యలతో మనలో చాలా మంది సతమతమవుతుంటారు. ఆర్థికపరమైన అడ్డంకులేవి ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడం వల్ల వచ్చే సమస్యలని మనం గుర్తించాలి. వివేకవంతమైన నిర్ణయాల ద్వారా వాటిని అధిగమించాలి. మనం పొదుపు చేసుకునే మొత్తాన్ని ద్రవ్యోల్బణం అనేది పగలు, రాత్రి చెదపురుగులా తినేస్తుంది కాబట్టి ఆర్థిక భద్రతకు పొదుపు ఒక్కటే సరిపోదనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. భవిష్యత్తులో ఆర్థిక భద్రతను సాధించాలన్నా, సంపదను పెంచుకోవాలన్నా మన పొదుపును అర్థవంతమైన విధంగా ఇన్వెస్ట్ చేయాలి. అప్పటికప్పుడు లాభాలు వచ్చేయాలనే తాపత్రయంతో ట్రేడింగ్ టిప్స్, స్పెక్యులేటివ్ పెట్టుబడులపై ఆధారపడకుండా వివేకవంతంగా, క్రమం తప్పకుండా మ్యుచువల్ ఫండ్స్‌లో సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తే మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చు.

ప్రొఫెషనల్ సలహా తీసుకోవడం

వినాయకుడి పెద్ద చెవులు మనం చక్కని శ్రోతగా ఉండాలనేది సూచిస్తాయి. ఆర్థిక ప్రపంచం విషయాన్ని తీసుకుంటే అర్హత పొందిన ఫైనాన్షియల్ ప్లానర్ లేదా సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు ఇచ్చే ఆర్థిక సలహాలను స్వీకరించే ఆలోచనా ధోరణిని కలిగి ఉండాలని ఇది సూచిస్తుంది. దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా మీ డబ్బును సరైన విధంగా ఎలా ఇన్వెస్ట్ చేసుకోవచ్చనేది ఆర్థిక సలహాదార్లు మెరుగైన సలహాలు ఇవ్వగలరు.

తప్పిదాల నుంచి నేర్చుకోవడం

గణేశుడి పెద్ద తల వివేకాన్ని, పాండిత్యాన్ని సూచిస్తుంది. దీన్నే పెట్టుబడులకు అన్వయించుకుంటే, గత తప్పిదాల నుంచి నేర్చుకుని, మెరుగైన ఇన్వెస్టర్లుగా మారే వివేకం కలిగి ఉండాలని అర్థం చేసుకోవచ్చు. క్రమశిక్షణ లేకపోవడం లేదా మరీ ఎక్కువ రిస్కులు తీసుకోవడం లేదా అస్సలు రిస్కే తీసుకోకపోవడం, అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల చాలా మంది ఇన్వెస్టర్లు నష్టపోతుంటారు. అయితే, దీనితో కుంగిపోకుండా, ఈ అనుభవాలన్నింటినీ విలువైన పాఠాలుగా భావించి, విజయాల వైపు బాటలు వేసుకోవాలి.



సురేశ్ సోని
సీఈవో, బరోడా బీఎన్‌పీ పారిబా ఏఎంసీ

జీవిత పాఠాలు

వినాయకుడి ఎడమ దంతం విరిగి ఉంటుంది. మహాభారతాన్ని రాసేందుకు వేదవ్యాసుడు అత్యంత వేగంగా రాయగలిగే సామర్థ్యాలు గల వినాయకుడి సహాయం తీసుకున్నట్లు మన పురాణాలు చెబుతాయి. ఒక దశలో రాస్తున్న ఘంటం విరిగిపోవడంతో గణేశుడు తన దంతాన్నే విరగగొట్టి దాన్నే ఘంటంగా ఉపయోగించి రాయడాన్ని కొనసాగించాడు. అలా వినాయకుడి పట్టుదల, నిబద్ధతతో మనకు మహోత్కృష్టమైన మహాభారతం అందింది. అద్భుతమైన ఆర్థిక లక్ష్యాలతో మొదలెట్టిన పెట్టుబడుల ప్రయాణంలోనూ ఎలాంటి ఆటంకాలు వచ్చినా వెరవకుండా క్రమానుగత పెట్టుబడులు పెడుతూ, నిబద్ధతతో ముందుకు సాగాలని ఈ వృత్తాంతం మనకు తెలియజేస్తుంది. నెలకు కేవలం రూ. 10,000 ఇన్వెస్ట్ చేస్తూ వెడితే 20 ఏళ్లలో ఏకంగా రూ. 1 కోటి మొత్తాన్ని సమకూర్చుకునేందుకు (13 శాతం వడ్డీ రేటు అంచనా), అలాగే నెలకు రూ. 45,000 ఇన్వెస్ట్ చేస్తే పదేళ్లలోనే అంత మొత్తాన్ని సమకూర్చుకునేందుకు సిప్ సహాయపడగలదు. కాబట్టి వాయిదాలు వేయకుండా సాధ్యమైనంత త్వరగా సిప్‌ను ప్రారంభిస్తే కాంపౌండింగ్ ప్రయోజనాలను అత్యధికంగా పొందవచ్చు.

విదేశాలకు క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలా..

విదేశాల వెళ్లాలనుకునేవారికి ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంటు వారి నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలా అనే ప్రశ్న ఈ మధ్య చాలా ఎక్కువగా వినిపిస్తోంది. దీనికి సుందరకాండలో హనుమంతుడి జవాబులాగా ''అక్కర్లేదు'' అని చెప్పాల్సి ఉంటుంది. ఇప్పుడు వివరాల్లోకి వెళదాం..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి



కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

ఈ మధ్యే ఆర్థిక శాఖ తెచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలో విదేశీయానం చేసేవారంతా ఆదాయపు పన్ను శాఖ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలనే అర్థం వచ్చేలా ధ్వనించింది. దీంతో అందరు పౌరులు ఉలిక్కిపడ్డారు. గాభరా పడ్డారు. షాక్ తిన్నారు. ఎందుకంటే, మనం చూస్తూనే ఉన్నాం. ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లల బాగోగులు చూసేందుకు, ఇంకా ఎన్నో కార్యక్రమాలు స్వయంగా చూసేందుకు విదేశాలకు వెళ్తున్నారు. 2023 మార్చి 31తో పోలిస్తే 2024 మార్చి 31 నాటికి పూర్తయిన ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 15 శాతం పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 69.6 మిలియన్ల మంది విదేశీయానం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో అన్ని రకాల వారూ ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా గణనీయంగా పెరుగుతుందని అంచనా. ఆపాటి, ఈపాటి ప్రతి మధ్యతరగతి కుటుంబంలో విదేశీయానం చెయ్యని వారు లేరంటే అతిశయోక్తి కాదేమో.

బడ్జెట్‌లో ఒక కొత్త మార్పు వచ్చింది. విదేశాల్లో ఉన్న ఆస్తులు, ఆదాయం మొదలైనవాటిని చూపించని ఎంతో మంది భారతీయ పౌరులు ఉన్నారు. బ్లాక్‌మనీ 2015 చట్టం ప్రకారం ఇలాంటి ఆస్తులను చూపించకపోవటం నేరం. ఇలాంటి వారి మీద దృష్టి పెడుతోంది డిపార్టుమెంటు. ఒకప్పుడు ఎవరు విదేశీయానం చేసినా, ప్రయాణానికి ముందు క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని నిబంధన ఉండేది. దాన్ని సడలించారు. రద్దు చేశారని చెప్పారు. అంతే కాకుండా 1/4 బిఅని 1/6 అని షరతులు ఉండేవి. ఒక షరతు ప్రకారం స్వయంగా విదేశీయానం చేయకపోయినా 'టికెట్' కొని ఉంటే రిటర్నుల్లో చూపించాల్సి వచ్చేది. కాలక్రమేణా సరడలింపుల వల్ల అంతా మర్చిపోయారు.

కానీ మొన్న బడ్జెట్‌లో ఈ ప్రస్తావన రావడంతో అందరిలోనూ గుబులు.. కానీ నిబంధన కొంతమందికే వర్తిస్తుంది. తల్లిదండ్రులెవరూ భయపడక్కర్లేదు. డిపార్టుమెంటుకి వెళ్లక్కర్లేదు. సర్టిఫికెట్ తీసుకోనవసరం లేదు. రిలాక్స్.. రిలాక్స్.. అందరికీ ఇది అవసరం లేదు. మీరంతా నిశ్చింతగా ప్లాన్ చేసుకోవచ్చు.

ఎవరికి క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలి..

ఆర్థికపరంగా అవకతవకలు చేసినవారు, పది లక్షలు దాటి పన్ను చెల్లించాల్సిన వారు, ఈ పన్ను భారానికి 'స్టే' విధించకపోతే.. ఇటువంటి వారికి కావాలి. ఇది అరుదైన పరిస్థితి. అసాధారణ పరిస్థితి. ట్యాక్స్ చెల్లించకపోవడం నేరం. కట్టకుండా విదేశాలకు వెళ్లే వారి నుంచి .. అంటే డిఫాల్టర్ల నుంచి పన్ను వసూలు చేసే ప్రక్రియలో భాగంగా ఈ సర్టిఫికెట్ అడుగుతారు. పైన చెప్పిన రెండు షరతులు ఫిబ్రవరి 2004 నాడు జారీ చేసిన సూచన .. కాదు.. ఆదేశం అని అనాలి. అంటే 20 సంవత్సరాల మాట .. ఈ ఆదేశానికి, 2015 బ్లాక్ మనీ చట్టానికి లింకు కలిపారు. ఈ విషయాన్నే 2024లో ప్రస్తావించారు. ఇరవై సంవత్సరాల మాట .. ఇప్పుడు ప్రస్తావన తేవడంతో దురదృష్టవశాత్తూ ప్రజల్లో భయాందోళనలకు దారి తీసింది. ఏం గాభరాపడక్కర్లేదు.

మీరు ఒక విజయ్ మాల్యాని .. ఒక నీరవ్ మోడీని ప్రస్తావించి గవర్నమెంటు మీద దుమ్మెత్తిపోయకండి. చట్టప్రకారం రిటర్నుు వేయడం విధి. పన్ను చెల్లించడం తప్పనిసరి. ఆ దోవలో వెళ్తే మిమ్మల్ని ఎవరూ ఆపరు. అడ్డు చెప్పరు. ఆటంకపర్చరు. ఎయిర్‌పోర్టుకి ఎవరూ రారు. అయితే, ఒక సూచన. మీతోపాటు మీ పాన్‌కార్డు, మీరు అసెస్సీ అయితే లేటెస్ట్ రిటర్ను కాపీ పెట్టుకోండి. మీరు ఆదాయపు పన్ను పరిధిలో లేకపోయినా రిటర్నులు వేసే అవసరం లేకపోయినా.. అసెస్‌మెంట్ కాకపోయినా .. అసెస్‌మెంట్ ఆగిపోయినా 10 లక్షల లోపుల పన్నులు చెల్లించకపోయినా (మనలో మన మాట, బండి అంతవరకు పోనివ్వకండి) గాభరా పడక్కర్లేదు. క్షేమంగా వెళ్లి లాభంగా రండి. బాన్ వొయాజ్.. ఆల్ ద బెస్ట్.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్ తక్కువ.. రాబడి మెరుగు

- పరాగ్ పారిఖ్ కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్

పెట్టుబడులపై మెరుగైన రాబడులు అందరూ కోరుకుంటారు. కానీ, అస్థిరతల రిస్క్‌ను ఎదుర్కొనే గుండె ధైర్యం అందరికీ ఉండకపోవచ్చు. రిస్క్ తక్కువగా ఉండాలి, అదే సమయంలో అచ్చమైన డెట్‌తో పోల్చితే కాస్త మెరుగైన రాబడి కోరుకునే వారికి కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ అనుకూలం. ఈ విభాగంలో నమ్మకమైన పనితీరు చూపిస్తున్న కొన్ని పథకాల్లో పరాగ్ పారిఖ్ కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్ ఒకటి. మధ్య, దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకునే వారు ఈ పథకాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. బాండ్ల పట్ల బుల్లిష్ ధోరణితో ఉన్న వారికి కూడా ఈ విభాగం అనుకూలం.



రాబడులు



ఈ పథకం ఏడాది కాలంలో 16.6 శాతం రాబడిని అందించింది. మూడేళ్లలో ఏటా11.49 శాతం రాబడిని తెచ్చి పెట్టింది. 2021 మే నెలలో ఇది ప్రారంభమైంది. అంటే ఈ పథకానికి మూడేళ్ల చరిత్రే ఉంది. అయినప్పటికీ కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ విభాగం సగటు పనితీరు కంటే ఈ పథకమే మెరుగ్గా పనిచేసినట్టు తెలుస్తోంది. కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్ విభాగంలో వార్షిక రాబడి 13.91 శాతంగా ఉంటే, మూడేళ్లలో వార్షిక రాబడి 8.59 శాతంగానే ఉండడం గమనించొచ్చు.

పెట్టుబడుల విధానం

కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ సాధారణంగా ఈక్విటీలకు 25-30 శాతం వరకు (పరిస్థితులు, అవకాశాలు) పెట్టుబడులు కేటాయిస్తుంటాయి. డెట్‌లో 70 శాతం వరకు ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కానీ పరాగ్ పారిఖ్ కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్‌మాత్రం నేరుగా ఈక్విటీల్లో 15 శాతం వరకే ఇన్వెస్ట్ చేస్తుంది. మరో 10-15 శాతం వరకు ఈక్విటీ ఆర్బిట్రేజ్ అవకాశాల్లో పెట్టుబడులు పెడుతుంటుంది. పరాగ్ పారిఖ్ మ్యూచువల్ ఫండ్ సాధారణంగా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంది. రాబడుల కోసం అధిక రిస్క్ తీసుకోవడానికి మొగ్గు చూపదు. ఈ పథకమనే కాకుండా ఈ సంస్థకు చెందిన అన్ని విభాగాల్లోనూ ఇదే విధానం అంతర్లీనంగా కొనసాగుతుంటుంది. అందులో ఇది కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్ కనుక రిస్క్ ఇంకా తక్కువనే చెప్పుకోవాలి. ముఖ్యంగా ఈక్విటీ కేటాయింపులను గమనించినట్టయితే ఎక్కువ పెట్టుబడులు డివిడెండ్ దండిగా పంపిణీ చేసే బ్లూచిప్ కంపెనీల్లోనే ఉన్నాయి. డివిడెండ్ స్టాక్స్‌లో అస్థిరతలు తక్కువగా ఉంటాయి.

టాప్ డెట్ హోల్డింగ్స్

కంపెనీ	ఇనుస్ట్రుమెంట్	నిర్వహణ ఆస్తులు (శాతంలో)
బ్రూక్‌ఫీల్డ్	రీట్	3.41
ఎంబసీ ఆఫీస్	రీట్	2.71
పీఎన్‌బీ	సీడీ	2.38
మహారాష్ట్ర ఎస్‌డీఎల్ 31/5/2031	రాష్ట్రాభివృద్ధి రుణం	2.29
కర్ణాటక ఎస్‌డీఎల్12/1/2032	రాష్ట్రాభివృద్ధి రుణం	2.27
యాక్సిస్ బ్యాంక్	సీడీ	2.15
మహారాష్ట్ర ఎస్‌డీఎల్04/10/2030	రాష్ట్రాభివృద్ధి రుణం	2.11
మహారాష్ట్ర ఎస్‌డీఎల్19/10/2030	రాష్ట్రాభివృద్ధి రుణం	1.87
మహారాష్ట్ర ఎస్‌డీఎల్08/04/2030	రాష్ట్రాభివృద్ధి రుణం	1.64
ఆర్ఈసీ	డిబెంచర్	1.59

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో రూ.2,197 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇందులో 14.28 శాతం మేర ఈక్విటీలో ఇన్వెస్ట్ చేసింది. 75.71 శాతం డెట్ సాధనాలకు కేటాయించింది. రియల్ ఎస్టేట్ సాధానాల్లో 6.88 శాతం పెట్టుబడులు పెట్టింది. 3.13 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే ఈ నగదును ఉపయోగించి మెరుగైన అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీ పెట్టుబడుల్లోనూ 62 శాతం లార్జ్‌క్యాప్‌లోనే ఉన్నాయి. 32 శాతం మేర మిడ్‌క్యాప్‌లో, 6.18 శాతం మేర స్మాల్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో 14 స్టాక్స్ ఉన్నాయి. డెట్ పెట్టుబడులు గమనిస్తే 56 శాతం ఎస్‌ఓవీ (సావరీన్ డెట్) రేటెడ్ పత్రాలు, 18.59 శాతం ఏఏఏ రేటెడ్ ఫండ్స్‌లోనే ఉండడం గమనించొచ్చు. అంటే డెట్‌లోనూ 74 శాతం పెట్టుబడులను రిస్క్ చాలా తక్కువ ఉన్న వాటినే ఎంపిక చేసుకుంది.


రాహుల్
సహచరులతో నితీశ్ కుమార్ రెడ్డి సంబరం

రాహుల్ పోరాటం వృథా

భారత్ 'బి' జట్టు చేతిలో భారత్ 'ఎ' పరాజయం

బెంగళూరు: దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో భారత్ 'బి' జట్టు శుభారంభం చేసింది. చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆదివారం ముగిసిన పోరులో భారత్ 'బి' జట్టు 76 పరుగుల తేడాతో భారత్ 'ఎ' జట్టుపై విజయం సాధించింది. 275 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 'ఎ' జట్టు 53 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా ఆటగాడు కేఎల్ రాహుల్ (121 బంతుల్లో 57; 7 ఫోర్లు) అర్ధశతకంతో పోరాడాడు. రియాన్ పరాగ్ (18 బంతుల్లో 31; ఒక ఫోర్, 3 సిక్సర్లు), ఆకాశ్‌దీప్ (42 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ధాటిగా ఆడారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (21) ఎక్కువసేపు నిలువలేకపోగా... మయాంక్ అగర్వాల్ (3), ధ్రువ్ జురెల్ (0), తనుశ్ కొటియాన్ (0), శివమ్ దూబే (14) విఫలమయ్యారు. భారత్ 'బి' జట్టు బౌలర్లలో యశ్ దయాల్ 3... ముకేశ్ కుమార్, నవ్‌దీప్ సైనీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 150/6తో నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'బి' జట్టు 184 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్ (47 బంతుల్లో 61; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), సర్ఫరాజ్ ఖాన్ (36 బంతుల్లో 46; 7 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించారు. భారత్ 'ఎ' బౌలర్లలో ఆకాశ్‌దీప్ 5, ఖలీల్ అహ్మద్ 3 వికెట్లు పడగొట్టారు. భారీ సెంచరీతో చెలరేగిన రైజింగ్ స్టార్ ముషీర్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న మ్యాచ్‌ల్లో భారత్ 'సి' జట్టుతో భారత్ 'బి'... భారత్ 'డి' జట్టుతో భారత్ 'ఎ' తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: 321; **భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్:** 231; **భారత్ 'బి' రెండో ఇన్నింగ్స్:** 184; **భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్:** మయాంక్ అగర్వాల్ (సి) నితీశ్ కుమార్ రెడ్డి (బి) యశ్ దయాల్ 3; శుభ్‌మన్ గిల్ (సి) రిషభ్ పంత్ (బి) నవ్‌దీప్ సైనీ 21; రియాన్ పరాగ్ (సి) పంత్ (బి) యశ్ దయాల్ 31; కేఎల్ రాహుల్ (సి) పంత్ (బి) ముకేశ్ కుమార్ 57; ధ్రువ్ జురెల్ (సి) యశస్వి జైస్వాల్ (బి) యశ్ దయాల్ 0; తనుశ్ కొటియాన్ (సి) పంత్ (బి) ముకేశ్ కుమార్ 0; శివమ్ దూబే (సి) ముషీర్ ఖాన్ (బి) నితీశ్ కుమార్ రెడ్డి 14; కుల్దీప్ యాదవ్ (సి) ముషీర్ ఖాన్ (బి) వాషింగ్టన్ సుందర్ 14; ఆకాశ్‌దీప్ (రనౌట్) 43; అవేశ్ ఖాన్ (సి) పంత్ (బి) నవ్‌దీప్ సైనీ 3; ఖలీల్ అహ్మద్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: (53 ఓవర్లలో ఆలౌట్)** 198. **వికెట్ల పతనం:** 1-7, 2-51, 3-75, 4-76, 5-76, 6-99, 7-141, 8-170, 9-183, 10-198. **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 10-1-50-2; యశ్ దయాల్ 12-1-50-3; నవ్‌దీప్ సైనీ 12-1-41-2; వాషింగ్టన్ సుందర్ 7-1-14-1; నితీశ్ కుమార్ రెడ్డి 3-0-8-1; యశస్వి జైస్వాల్ 1-0-1-0; సాయికిశోర్ 6-0-16-0; ముషీర్ ఖాన్ 2-1-12-0.

మానవ్ మాయాజాలం

ఏడు వికెట్లతో మెరిసిన స్పిన్నర్ ● భారత్ 'డి' జట్టుపై భారత్ 'సి' ఘనవిజయం



సాక్షి, అనంతపురం: ఎడంచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ (7/49) విజృంభించడంతో భారత్ 'డి'తో జరిగిన దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో భారత్ 'సి' జట్టు నాలుగు వికెట్లతో విజయం సాధించింది. నాలుగు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన భారత 'డి' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మానవ్ మాయాజాలానికి 236 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 233 పరుగుల విజయలక్ష్యాన్ని భారత 'సి' జట్టు 61 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (48 బంతుల్లో 46; 8 ఫోర్లు), ఆర్యన్ జుయెల్ (74 బంతుల్లో 47; 3 ఫోర్లు, 1 సిక్సర్), రజత్ పాటిదార్ (77 బంతుల్లో 44; 6 ఫోర్లు, ఒక సిక్సర్), అభిషేక్ పొరెల్ (63 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్సర్) తలా కొన్ని పరుగులు చేశారు. భారత్ 'డి' బౌలర్లలో సారాంశ్ జైన్ 4 వికెట్లు పడగొట్టాడు. మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీసిన మానవ్ సుతార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: 164; **భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్:** 168; **భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్:** 236; **భారత్ 'సి' రెండో ఇన్నింగ్స్:** రుతురాజ్ గైక్వాడ్ (సి) శ్రేయస్ అయ్యర్ (బి) సారాంశ్ జైన్ 46; సాయి సుదర్శన్ (సి) రికీ భుయ్ (బి) సారాంశ్ జైన్ 22; ఆర్యన్ జుయెల్ (సి) హర్షిత్ రాణా (బి) అర్ష్‌దీప్ సింగ్ 47; రజత్ పాటిదార్ (స్టంప్డ్) శ్రీకర్ భరత్ (బి) సారాంశ్ జైన్ 44; బాబా ఇంద్రజీత్ (సి) అథర్వ (బి) సారాంశ్ జైన్ 7; అభిషేక్ పొరెల్ (నాటౌట్) 35; హృతిక్ షోకీన్ (సి) రికీ భుయ్ (బి) అక్షర్ పటేల్ 0; మానవ్ సుతార్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: (61 ఓవర్లలో 6 వికెట్లకు)** 233. **వికెట్ల పతనం:** 1-64, 2-77, 3-165, 4-171, 5-184, 6-191, **బౌలింగ్:** హర్షిత్ రాణా 6-0-39-0; అర్ష్‌దీప్ సింగ్ 9-1-37-1; సారాంశ్ జైన్ 22-2-92-4; అక్షర్ పటేల్ 22-6-54-1; ఆదిత్య 2-0-6-0.

అంతర్జాతీయ క్రికెట్‌కు మొయిన్ అలీ వీడ్కోలు



లండన్: ఇంగ్లండ్ స్పిన్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. వన్డే, టి20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడైన మొయిన్ అలీ... కొత్త తరానికి అవకాశం ఇవ్వడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఇంగ్లండ్ తరఫున 68 టెస్టులు, 138 వన్డేలు, 92 టి20లు ఆడిన 37 ఏళ్ల మొయిన్ అలీ... అటు బంతితో, ఇటు బ్యాట్‌తో ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. టెస్టుల్లో 3094 పరుగులు చేయడంతోపాటు 204 వికెట్లు పడగొట్టిన మొయిన్ అలీ వన్డేల్లో 2355 పరుగులు సాధించి 111 వికెట్లు తీసుకున్నాడు. ఇక అంతర్జాతీయ టి20ల్లో 1229 పరుగులు చేయడంతో పాటు 51 వికెట్లు తీశాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా... తనలో ఇంకా చాలా క్రికెట్ మిగిలే ఉందని, ఫ్రాంచైజీ క్రికెట్‌లో మరి కొన్నాళ్లు కొనసాగుతానని మొయిన్ అలీ వెల్లడించాడు. 'ముందుకు సాగాల్సిన సమయం వచ్చేసింది. నా బాధ్యత సక్రమంగా నిర్వర్తించానని అనుకుంటున్నా. ఇక రాబోయే కాలం కొత్త తరానిది' అని మొయిన్ అలీ పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఇంగ్లండ్ జట్టు ప్రస్తుతం సంధి దశలో ఉంది. వన్డే, టి20 ప్రపంచకప్‌లలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయింది. దీంతో కోచ్ మాథ్యూ మాట్‌పై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వేటు వేయగా... ఇప్పుడు సీనియర్లు ఒక్కొక్కరిగా జట్టుకు దూరమవుతున్నారు.

హృతిక్-శౌర్య జోడీకి డబుల్స్ టైటిల్


విన్నర్స్ ట్రోఫీలతో హృతిక్, శౌర్య

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్30 టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ కటకం హృతిక్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. బెంగళూరులో జరిగిన ఈ టోర్నీ బాలుర డబుల్స్ ఫైనల్లో హృతిక్-శౌర్య భరద్వాజ్ (భారత్) ద్వయం 6-2, 6-4తో ఆరవ్ చావ్లా (భారత్)-హర్ అబీర్ సెఖో (ఆస్ట్రేలియా) జంటను ఓడించింది. అంతకుముందు తొలి రౌండ్‌లో హృతిక్-శౌర్య 3-6, 7-6 (10/8), 10-5తో టాప్ సీడ్ ఓజస్ మెహ్లావత్-అధిరాజ్ ఠాకూర్ (భారత్)లపై... క్వార్టర్ ఫైనల్లో 6-4, 6-2తో అక్షత్ ధుల్-అన్‌హద్ సింగ్ ఒబెరాయ్ (భారత్)లపై... సెమీఫైనల్లో 6-4, 6-4తో పార్థ్-ఓం వర్మ (భారత్)లపై గెలిచారు.

పోరాడి ఓడిన రష్మిక-వైదేహి జోడీ


రన్నరప్ ట్రోఫీలతో రష్మిక, వైదేహి

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. థాయ్‌లాండ్‌లోని నఖోన్ సి థమారత్ పట్టణంలో ఈ టోర్నీ జరిగింది. మహిళల డబుల్స్ ఫైనల్లో రష్మిక-వైదేహి చౌదరీ (భారత్) ద్వయం 3-6, 6-2, 8-10తో 'సూపర్ టైబ్రేక్'లో కనకో మొరిసాకి-హికారు సాటో (జపాన్) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. రష్మిక-వైదేహి జోడీకి 719 డాలర్లు (రూ. 60 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధ్యక్షుడిగా రణ్‌ధీర్ సింగ్

ఈ పదవి చేపట్టిన తొలి భారతీయుడిగా ఘనత



న్యూఢిల్లీ: భారత సీనియర్ షూటర్ రణ్‌ధీర్ సింగ్ ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన 44వ ఓసీఏ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తద్వారా ఈ పదవి చేపట్టిన తొలి భారతీయుడిగా రణ్‌ధీర్ సింగ్ నిలిచారు. 2028 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఐదు ఒలింపిక్స్ క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన 77 ఏళ్ల రణ్‌ధీర్ సింగ్ గతంలో కొన్నాళ్లపాటు ఓసీఏ తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆసియాలోని 45 దేశాల ప్రతినిధుల్లో 44 మంది రణ్‌ధీర్‌కు మద్దతిచ్చారు. రణ్‌ధీర్ సింగ్ 2001 నుంచి 2014 వరకు ఐఓసీలో సభ్యుడిగా వ్యవహరించారు. 'ఓసీఏ జనరల్ అసెంబ్లీ సమావేశం భారత్‌లో జరగడం సంతోషాన్నిచ్చింది. అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. దేశంలో క్రీడా సంస్కృతి పెరుగుతోంది. మౌలిక సదుపాయాల కల్పన బాగుండటం వల్లే అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి' అని రణ్‌ధీర్ పేర్కొన్నారు.

2030 యూత్ ఒలింపిక్స్‌కు బిడ్ వేయనున్న భారత్


కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్

న్యూఢిల్లీ: 2030 యూత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా వెల్లడించారు. 2036 ఒలింపిక్స్ నిర్వహణ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని... ఆ క్రమంలో 2030 యూత్ ఒలింపిక్స్‌కు బిడ్ వేయనున్నట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గనిర్దేశకత్వంలో 2030 యూత్ ఒలింపిక్స్ నిర్వహణ కోసం బిడ్ వేయనున్నాం. మా ప్రధాన దృష్టి మాత్రం 2036 ఒలింపిక్స్ నిర్వహణపైనే ఉంది' అని ఆదివారం ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో మాండవియా పేర్కొన్నారు. కాగా, 2030 యూత్ ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం పెరూ, కొలంబియా, మెక్సికో, థాయ్‌లాండ్, మంగోలియా, రష్యా, ఉక్రెయిన్, బోస్నియా హెర్జిగోవినాలతో భారత్ పోటీ పడాల్సి ఉంటుంది.

2026 ఆసియా క్రీడల్లో ప్రదర్శన క్రీడగా 'యోగాసన'



న్యూఢిల్లీ: భారత దేశ ప్రాచీన వ్యాయామ పద్ధతి 'యోగాసన'కు ఆసియా క్రీడల్లో చోటు దక్కింది. 2026లో జపాన్‌లోని ఐచీ-నగోయాలో జరగనున్న ఆసియా క్రీడల్లో యోగాసనను ప్రదర్శన ఈవెంట్‌గా చేర్చుతున్నట్లు ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) ప్రకటించింది. ఆదివారం జరిగిన 44వ ఓసీఏ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఓసీఏ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రణ్‌ధీర్ సింగ్ మాట్లాడుతూ... '2026 ఆసియా క్రీడల్లో యోగా భాగం కానుంది. దీనికి అందరి ఆమోదం లభించింది. అన్ని సభ్య దేశాలను ఒప్పించేందుకు పది రోజుల సమయం పట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేసేందుకు విశేష కృషి చేస్తున్నారు. ఆ దిశగా ఇది మరో ముందడుగు వంటింది. 2030 ఆసియా క్రీడల వరకు యోగాను పతక క్రీడల్లో భాగం చేసేలా చూస్తాం' అని అన్నారు.

రన్నరప్ రిత్విక్ జంట


రన్నరప్ ట్రోఫీలతో రిత్విక్, అర్జున్ ఖడే

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాలని ఆశించిన హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరికి నిరాశ ఎదురైంది. చైనాలో జరిగిన షాంఘై ఓపెన్ ఏటీపీ-100 టోర్నీలో రిత్విక్-అర్జున్ ఖడే (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. గంటా 43 నిమిషాలపాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్ రిత్విక్-అర్జున్ ద్వయం 6-7 (4/7), 6-1, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ క్రిస్టియన్ రొడ్రిగెజ్ (కొలంబియా)-మాథ్యూ క్రిస్టోఫర్ రొమియోస్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. రిత్విక్-అర్జున్ జోడీకి 4,400 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 లక్షల 69 వేలు)తో పాటు 60 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది రిత్విక్ సాన్ లూయిస్ ఓపెన్ (మెక్సికో), అకాపుల్కో ఓపెన్ (మెక్సికో) టోర్నీల్లో డబుల్స్ టైటిల్స్ గెలిచి... లిటిల్‌రాక్ ఓపెన్ (అమెరికా), చెన్నై ఓపెన్ (భారత్), నొంతాబురి ఓపెన్ (థాయ్‌లాండ్) టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

సాయికార్తీక్‌కు నిరాశ




రన్నరప్ ట్రోఫీ, చెక్‌తో చాపెల్, సాయికార్తీక్

సాక్షి, హైదరాబాద్: వరుసగా రెండో టోర్నీలోనూ హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డికి నిరాశ ఎదురైంది. థాయ్‌లాండ్‌లోని నఖోన్ సి థమారత్ పట్టణంలో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఎం25 పురుషుల టోర్నీలో సాయికార్తీక్ (భారత్)-నిక్ చాపెల్ (అమెరికా) జంట రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సాయికార్తీక్-నిక్ చాపెల్ జోడీ 6-7 (4/7), 6-7 (3/7)తో జేక్ డెలానీ-జెస్సీ డెలానీ (ఆస్ట్రేలియా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది. సాయికార్తీక్-నిక్ చాపెల్‌లకు 900 డాలర్లు (రూ. 75 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. గంటా 44 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను కాపాడుకోగా... టైబ్రేక్‌లో ఇండో-అమెరికన్ జంట తడబడి మూల్యం చెల్లించుకుంది. గతవారం ఇదే వేదికపై జరిగిన టోర్నీ ఫైనల్లోనూ ఆసీస్ జోడీ చేతిలోనే సాయికార్తీక్-నిక్ చాపెల్ జంట కు ఓటమి ఎదురైంది.

విజయం దిశగా శ్రీలంక

- లక్ష్యం 219; ప్రస్తుతం 94/1
- ఇంగ్లండ్‌తో మూడో టెస్టు


నిసాంక

లండన్: ఇంగ్లండ్ గడ్డపై వరుసగా రెండు టెస్టులు ఓడిన శ్రీలంక... మూడో మ్యాచ్‌లో విజయం దిశగా సాగుతోంది. ఓవల్ వేదికగా జరుగుతున్న ఆఖరి టెస్టులో 219 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక... మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. దిముత్ కరుణరత్నే (8) విఫలం కాగా... నిసాంక (44 బంతుల్లో 53 బ్యాటింగ్; 7 ఫోర్లు), కుశాల్ మెండిస్ (25 బంతుల్లో 30 బ్యాటింగ్; 6 ఫోర్లు) రాణించారు. చేతిలో తొమ్మిది వికెట్లున్న శ్రీలంక... విజయానికి మరో 125 పరుగులు చేయాల్సి ఉంది. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ ఒక వికెట్ పడగొట్టాడు. ఓవర్‌నైట్ స్కోరు 211/5తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 61.2 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (69), కమిందు మెండిస్ (64) హాఫ్ సెంచరీలు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ స్టోన్, జోష్ హల్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ టాపార్డర్ విఫలమవడంతో... ఆ జట్టు 34 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌటైంది. జేమీ స్మిత్ (50 బంతుల్లో 67; 10 ఫోర్లు, ఒక సిక్సర్) ఒక్కడే ధాటిగా ఆడగా... బెన్ డకెట్ (7), ఓలీ పోప్ (7), జో రూట్ (12), హ్యారీ బ్రూక్ (3), అట్కిన్సన్ (1) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో లహిరు కుమార 4, విశ్వ ఫెర్నాండో మూడు వికెట్లు పడగొట్టారు.

భారత్ శుభారంభం



హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. ఆతిథ్య చైనా జట్టుతో ఆదివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 3-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ (14వ ని.లో), ఉత్తమ్ సింగ్ (27వ ని.లో), అభిషేక్ (32వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మలేసియా, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ 2-2తో... జపాన్, దక్షిణ కొరియా మధ్య మ్యాచ్ 5-5తో 'డ్రా'గా ముగిశాయి. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ తలపడుతుంది. తొలి విజయంతో భారత్ మూడు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈనెల 17 వరకు మొత్తం ఆరు జట్ల మధ్య లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి.

ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

- చివరిదైన మూడో టి20లోనూ స్కాట్లాండ్‌పై విజయం
- కామెరూన్ గ్రీన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన



ఎడిన్‌బరో: కామెరూన్ గ్రీన్ (3/35; 39 బంతుల్లో 62 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) అటు బంతితో ఇటు బ్యాట్‌తో విజృంభించడంతో స్కాట్లాండ్‌తో జరిగిన చివరిదైన మూడో టి20లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. బ్రాండన్ మెక్‌ములన్ (39 బంతుల్లో 56; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో గ్రీన్ 3... సీన్ అబాట్, ఆరోన్ హార్డీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసి గెలిచింది. కామెరూన్ గ్రీన్ అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకోగా... కెప్టెన్ మిషెల్ మార్ష్ (23 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (14 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపులు మెరిపించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ క్యూరీ రెండు వికెట్లు తీశాడు. కామెరూన్ గ్రీన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

స్పెయిన్‌కు పరారైన...
వెనిజులా విపక్ష నేత

వెనిజులాలో నికొలస్ మదురో నియంత పాలనకు ముగింపు ఖాయమని ఆశించిన ఆ దేశ ప్రజలకు మరింత నిరాశ కలిగించే పరిణామమిది. అధ్యక్ష ఎన్నికల్లో విపక్షాల సంయుక్త అభ్యర్థిగా మదురోతో తలపడ్డ ఎడ్మండో గొంజాలెజ్ తాజాగా దేశం వీడి స్పెయిన్‌లో ఆశ్రయం పొందారు. జూలైలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వాస్తవ విజేత గొంజాలెజేనని విపక్షాలతోపాటు పలు విదేశీ ప్రభుత్వాలు కూడా పేర్కొనడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. గొంజాలెజ్‌కు ఆశ్రయం కల్పించేందుకు స్పెయిన్ అంగీకరించిందని వెనిజులా ఉపాధ్యక్షుడు డెల్సీ రొడ్రిగెజ్ ప్రకటించారు. దీనిపై గొంజాలెజ్ గానీ ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో గానీ స్పందించలేదు. ఎన్నికల్లో పోటీ చేయకుండా మచాడోపై మదురో ప్రభుత్వం నిషేధం ప్రకటించడంతో ఆఖరి దశలో గొంజాలెజ్ రంగంలోకి దిగడం తెలిసిందే. అయితే, వెనిజులా వీడాలన్నది గొంజాలెజ్ నిర్ణయం మాత్రమేనని, తాము పంపిన ఎయిర్‌ఫోర్స్ విమానంలో తమ దేశం చేరుకున్నారని స్పెయిన్ ప్రభుత్వం తెలిపింది. ఆయన వినతి మేరకే ఆశ్రయం కల్పించామని స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బారెస్ చెప్పారు. 'వెనిజులా ప్రజల హక్కుల కాపాడటానికి కట్టుబడి ఉన్నాం. గొంజాలెజ్ వెనిజులా హీరో. ఆయన భద్రత బాధ్యతను స్పెయిన్ తీసుకుంటుంది' అని స్పష్టం చేశారు. వెనిజులాకు రావడానికి కొద్ది రోజుల ముందే రాజధాని కారకాస్‌లోని తమ రాయబార కార్యాలయంలో గొంజాలెజ్ తలదాచుకున్నారని వెల్లడించారు. ఓటరు జాబితాను ఫోర్జరీ చేశారంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు రావాలంటూ మూడు పర్యాయాలు సమన్లు పంపినా హాజరు కాలేదని దేశ ఆటార్నీ జనరల్ గొంజాలెజ్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో, ఆయన స్పెయిన్ రాయబార కార్యాలయంలో తలదాచుకోవాల్సి వచ్చింది. మదురో నిరంకుశ విధానాలతో ఇప్పటికే పలువురు ప్రతిపక్ష నేతలు స్పెయిన్‌లో ఆశ్రయం పొందారు. ఈ ఏడాదిలో మొదటి ఆరు నెలల్లోనే దాదాపు 45 వేల మంది వెనిజులా నుంచి స్పెయిన్‌కు వలస వెళ్లారు. 2022 గణాంకాల ప్రకారం వెనిజులా వాసులు కనీసం 2.12 లక్షల మంది స్పెయిన్‌లో ఉంటున్నారు.

- కారకాస్



ఎడ్మండో గొంజాలెజ్

రెండో ప్రపంచయుద్ధవీరుడికి
ఘనంగా పుట్టినరోజు వేడుకలు

కేక్ కట్ చేయించి సంబరాలు జరిపిన సైన్యం



సైనికుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న రిటైర్డ్ లాన్స్ నాయక్ చరణ్ సింగ్



ఆర్మీలో ఉన్నప్పటి చరణ్ (ఫైల్)

రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొన్న సైనికుడు, ప్రతిష్టాత్మక 'బర్మా స్టార్ అవార్డ్' గ్రహీత రిటైర్డ్ లాన్స్ నాయక్ చరణ్ సింగ్ 100వ పుట్టినరోజు వేడుకలను భారత సైన్యం ఘనంగా నిర్వహించింది. శనివారం హిమాచల్ ప్రదేశ్‌లోని స్వగృహంలో ఆయనతో కేక్ కట్‌చేయించి జన్మదిన వేడుకలను ఆరంభించారు. ఆర్మీ తరఫున సైతం బ్రిగేడియర్ అధికారి, సైనికులు పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా మారింది. 1924 సెప్టెంబర్ ఏడో తేదీన జన్మించిన చరణ్‌సింగ్ 1942 ఆగస్ట్ 26వ తేదీన భారత్‌లో బ్రిటిష్ సైన్యం ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్ యూనిట్‌లో చేరారు. రెండో ప్రపంచ యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. సింగపూర్ నుంచి లాహోర్ దాకా పలు దేశాల్లో యుద్ధక్షేత్రాల్లో తన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. తర్వాత హిమాచల్‌ప్రదేశ్‌లోని యోల్ కంటోన్మెంట్‌లోనూ పనిచేశారు. '' 17 ఏళ్లపాటు సైన్యంలో చూపిన ప్రతిభకు బర్మా స్టార్ అవార్డ్‌ను, ఇండియన్ ఇండిపెండెన్స్ మెడల్‌ను ఆయన పొందారు. 1959 మే 17న పదవీవిరమణ చేశారు. తర్వాత ప్రస్తుతం తన శేషజీవితాన్ని రోపార్ జిల్లాలోని దేక్‌వాలా గ్రామంలో గడుపుతున్నారు. ఆయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. సొంతింట్లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో బ్రిగేడియర్ అధికారి, సైనికులు పాల్గొన్నారు. దేశసేవలో తరించిన మాజీ సైనికులను గుర్తుపెట్టుకుని వారిని తగు సందర్భంలో గౌరవిస్తూ భారతసైన్యం పలు కార్యక్రమాలు చేస్తున్న విషయం విదితమే. ఇందులోభాగంగానే శనివారం చరణ్‌సింగ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్లు సైన్యాధికారి ఒకరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. '' దశాబ్దాల క్రితం సైన్యంలో పనిచేసినా సరే ఆర్మీ దృష్టిలో అతను ఎప్పటికీ సైనికుడే. సైన్యంలో భాగమే. సైన్యానికి, పౌరులకు స్ఫూర్తిప్రదాతలుగా వారిని సదా స్మరించుకోవాలి. వారి నుంచి నేటి సైనికులు ఎంతో నేర్చుకోవాలి' అని సైన్యం పేర్కొంది. - న్యూఢిల్లీ

అతి పలుచని వాచీ

రష్యన్ వాచ్ మేకర్ తయారీ

ప్రపంచంలోనే అతి పలుచని చేతి గడియారాన్ని తయారు చేయడానికి యూరోపియన్ హోరాలజీ దిగ్గజాలన్నీ తెగ పోటీ పడుతుంటే రష్యాకు చెందిన ఓ స్వతంత్ర వాచ్ మేకర్ ఆ అద్భుతాన్ని సాధించేశాడు. ప్రతిష్టాత్మక అకాడెమీ హోర్లోగెర్ డెస్ క్రిటిపెండెంట్స్ ఇండిపెండెంట్స్‌లో ఏకైక రష్యన్ సభ్యుడైన కాన్‌స్టాంటిన్ చైకిన్ అనే వ్యక్తి అత్యంత పలుచనైన చేతి గడియారాన్ని రూపొందించారు. దీని మందం కేవలం 1.65 మిల్లీమీటర్లు. బరువైతే 13.3 గ్రాములే! ఆ లెక్కన ప్రపంచంలోనే అతి తేలికైన గడియారమూ ఇదే. గత వారం స్విట్జర్లాండ్‌లో జరిగిన 'జెనీవా వాచ్ డేస్ ఫెయిర్'లో ఈ వాచీని ప్రదర్శించారు. స్టెయిన్లెస్ స్టీల్, టంగ్‌స్టన్ కార్బైడ్ వాడటంతో ఇది తేలిగ్గా ఉన్నా చాలా దృఢంగా ఉంటుంది.

పాకెట్ వాచ్ ప్రేరణతో...

2003లో తన పేరుతోనే వాచ్ మేకింగ్ బ్రాండ్ స్థాపించిన చైకిన్ 20 ఏళ్ల క్రితం 19వ శతాబ్దానికి చెందిన బాగ్నోలెట్ పాకెట్ వాచ్‌ను చూసి పలుచని వాచీలపై ఆసక్తి పెంచుకున్నాడట. సొంతంగా అల్ట్రాథిన్ వాచ్ డిజైన్ చేయాలని ఒక క్లయింట్ సవాలు చేయడంతో రంగంలోకి దిగాడు. ఇప్పుడు తయారు చేసిన బుల్లి వాచీకి ముందు ముందు నీలమణి లేదా వజ్రాలను పొదిగే ఆలోచన ఉందట! అనేక పేటెంట్లకు దరఖాస్తులు చేసినా ఇంకా ఏదీ ఖరారు కాలేదని చెప్పుకొచ్చాడు. వచ్చే ఏప్రిల్లో జెనీవాలో జరిగే వాచ్స్ అండ్ వండర్స్ ట్రేడ్ షోలో తన డిజైన్ తుది వెర్షన్‌ను సమర్పిస్తానని చెబుతున్నాడు. అప్పటికల్లా తన డిజైన్ మరింత కచ్చితత్వం, పవర్ సంతరించుకుంటుందని చెప్పాడు. ఈ వాచీకి ఇంకా ధర నిర్ణయించలేదు.



కాగితం ముక్కంత పలుచన..

విశ్వసనీయమైన, ఖచ్చితమైన, ధరించేంత మన్నికైన అల్ట్రా-స్లిమ్ గడియారాలను ఉత్పత్తి చేయడం ప్రపంచంలోని గడియారాల తయారీదారులకు ఓ సవాలుగా ఉండేది. కానీ ఇటీవలి కాలంలో పలుచని గడియారాల తయారీ పోటీ ఊపందుకుంది. స్విస్ బ్రాండ్ పియాజెట్ 2018లో 2 మిల్లీమీటర్ల మందం కలిగిన గడియారాన్ని తయారు చేసింది. ఇది రెండేళ్ల తరువాత ఉత్పత్తిలోకి వచ్చింది. లగ్జరీ దిగ్గజం బుల్గారి కేవలం 1.8 మిల్లీమీటర్ల మందంతో వాచీని తెచ్చింది.

వీటిని తలదన్నుతూ వాచ్ మేకర్ రిచర్డ్ మిల్లే 2022లో కాగితం ముక్కంత పలుచనైన గడియారాన్ని తయారు చేసింది. దాని ఖరీదు 500,000 డాలర్లకు పై చిలుకే!

- సాక్షి, నేషనల్ డెస్క్



మట్టి పలకల నుంచి... మైక్రోచిప్పల దాకా...!
పాస్‌పోర్ట్ ప్రస్థానం

మైక్రోచిప్పులు, హోలోగ్రామ్‌లు, బయోమెట్రిక్ ఫోటోలు, బార్ కోడ్లతో నిండిన నేటి పాస్‌పోర్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన అద్భుతాలు. ఇప్పుడు మనం చూస్తున్న పాస్‌పోర్ట్ మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో తయారైంది. చరిత్రలో ఓ కొత్త అధ్యాయానికి తెరతీసింది. కానీ దాని మూలాలు సహస్రాబ్దాల నాటివి. మానవ చరిత్ర ప్రారంభ యుగాల్లో ఎలాంటి సరిహద్దులు లేవు. స్వేచ్ఛా వలసలు ఉండేవి. తర్వాత ఉద్భవించిన నాగరికతలు భూమిని విభజించడమే గాక అన్వేషణ, పరిశోధనల సారాన్ని మార్చేశాయి. ఆ క్రమంలో సురక్షితంగా దేశాలు దాటేందుకు అధికారిక పత్రంగా పాస్‌పోర్టు పుట్టుకొచ్చింది. - సాక్షి, నేషనల్ డెస్క్



క్రీస్తుపూర్వం 2000 ప్రాంతంలో మెసపొటేమియాలో ప్రయాణ అనుమతులకు మట్టి పలకలు వాడారు. ఒకరకంగా వీటిని అత్యంత పురాతన పాస్‌పోర్టులుగా చెప్పవచ్చు. పురాతన ఈజిప్టులో ప్రయాణికులు, వ్యాపారుల భద్రత కోసం అధికారిక లేఖలను ఉపయోగించారు. భారత ఉపఖండంలో ప్రయాణాలను మౌర్య సామ్రాజ్య కాలం నుంచి డాక్యుమెంట్ చేసినట్టు ఆనవాళ్లున్నాయి. అవి నేటి ప్రయాణ అనుమతుల వంటివి కావు. కేవలం ప్రయాణికుల ప్రవర్తన తదితరాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలుగా మన్నన పొందేవి. క్రీస్తుపూర్వం 3వ శతాబ్దంలో అశోకుని పాలనలో ప్రయాణాలను సులభతరం చేయడానికి, రక్షణ, అధికారిక ఆమోదాన్ని తెలపడానికి శాసనాలు జారీ చేశారు.

మొదటి ప్రపంచ యుద్ధంతో..

యూరప్ వలసవాదులు ప్రస్తుత పాస్‌పోర్ట్ వ్యవస్థ రూపశిల్పులని చెప్పవచ్చు. అన్వేషణలో భాగంగా వారు ప్రపంచవ్యాప్తంగా కలియదిరిగి భూభాగాలను ఆక్రమించుకుంటూ వెళ్లారు. 20వ శతాబ్దపు తొలినాళ్ల ప్రయాణాల్లో కొన్ని పద్ధతులు వచ్చి చేరాయి. ఆరోగ్య పరీక్షలు, కొన్ని ప్రశ్నలతో సరిహద్దులు దాటనిచ్చేవారు. అప్పటికి ప్రయాణ పత్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఏకీకృత ప్రమాణమంటూ లేదు. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో పాస్‌పోర్ట్ నియంత్రణ స్వరూపం నాటకీయంగా మారింది. సంఘర్షణ నేపథ్యం నుంచి పుట్టిన నానాజాతి సమితి శాంతి, సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రపంచ ప్రయాణానికి ప్రామాణిక వ్యవస్థను రూపొందించింది. 1921 నాటికి కఠినమైన వలస నియంత్రణలను విధించడానికి అమెరికా నాటి రాజకీయ అవకాశాలను ఉపయోగించుకుంది. ఎమర్జెన్సీ కోటా చట్టం, 1924 ఇమ్మిగ్రేషన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇవి వలసల ప్రవాహాన్ని తగ్గించాయి. ఒకప్పుడు స్వేచ్ఛకు చిహ్నంగా ఉన్న పాస్‌పోర్టు ఆ తరువాత పాశ్చాత్య కేంద్రీకృత శక్తులు ఆధిపత్యం చెలాయించడానికి ఉపయోగించే నియంత్రణ సాధనంగా మారింది.



మొగలుల కాలంలో..

మధ్యయుగానికి వచ్చే నాటికి ప్రయాణ డాక్యుమెంటేషన్ ప్రగతి సాధించింది. ప్రయాణాల పర్యవేక్షణ, నియంత్రణకు భారత ఉపఖండమంతటా పలు రకాల చట్టబద్ధత, ఆమోదంతో కూడిన పత్రాలు జారీ చేసేవారు. మొగల్ చక్రవర్తులతోపాటు ప్రాంతీయ పాలకులుం కూడా ప్రయాణికులకు, వ్యాపారులకు, యాత్రికులకు, దౌత్యవేత్తలకు 'సనద్'లు, సురక్షిత ప్రవర్తన లేఖలు జారీ చేశారు. వాణిజ్య, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించి వారు సురక్షితంగా ప్రయాణించేలా చూశారు. శతాబ్దాల క్రితం వెలుగు చూసిన 'సాఫ్ కండక్ట్' (సేఫ్ కండక్ట్) పాస్‌ను ప్రాథమిక ప్రయాణ పత్రంగా చెప్పవచ్చు. అయితే ఇది ప్రధానంగా పాలకుల మధ్య లిఖితపూర్వక ప్రతిజ్ఞ. యుద్ధ భయం లేకుండా సరిహద్దులు దాటి సురక్షితంగా ప్రయాణించేలా చేసుకున్న పెద్దమనుషుల ఒప్పందం వంటిది.



1815లో అమెరికా పాస్‌పోర్టు

మహిళలకు నో పాస్‌పోర్ట్!

1920 నాటి 'పాస్‌పోర్ట్ తీర్మానం' అంతర్జాతీయ ప్రయాణాల్లో కొత్త శకానికి నాంది పలుకుతూనే, అసమానతలకు పునాది వేసిందంటారు. ఎందుకంటే అప్పట్లో అమెరికాలో కూడా మహిళలకు ప్రత్యేకంగా పాస్‌పోర్ట్ ఉండేది కాదు. భర్తల పాస్‌పోర్టులోనే ఫుట్‌నోట్సులో భార్య పేరు పేర్కొనేవారు. దాంతో వారు స్వతంత్రంగా సరిహద్దులను దాటలేకపోయారు. ఇవన్నీ నాటి సమాజ లింగ అసమానత, మహిళలపై వివక్షకు అద్దం పట్టేవే. ఇటీవలి దశాబ్దాల్లో పాస్‌పోర్ట్ ప్రపంచ రాజకీయాలు, మార్కెట్ శక్తుల ఇష్టాలకు లోబడి డిమాండ్ ఉన్న వస్తువుగా మారిపోయింది. 2016లో అమెరికాలోనే ఏకంగా 1.86 కోట్ల పాస్‌పోర్టులు జారీ అయ్యాయంటే వాటి డిమాండ్ ఎంతటిదో అర్థమవుతోంది. ప్రపంచానికి ప్రవేశ ద్వారమైన పాస్‌పోర్ట్ కొందరికి అధికార చిహ్నం. మరికొందరికి మినహాయింపులకు సాధనం. మనం పుట్టిన దేశాన్ని బట్టి, పాస్ పోర్ట్ మనకు అత్యంత సౌలభ్యాన్ని ఇవ్వొచ్చు. లేదా విపరీతమైన బాధను కలిగించవచ్చు.

అద్భుత ఫీచర్లతో ఐఫోన్ 16 !

నేడు అమెరికాలోని కుపర్టినో సిటీలో ఆవిష్కరణ



పుస్తకం హస్తభూషణం అనేది పాత మాట. చేతికో చక్కని స్మార్ట్‌ఫోన్ అనేది నవతరం మాట. మెరుపువేగంతో ఇంటర్నెట్, స్పష్టమైన తెరలు, అదిరిపోయే సౌండ్, వేగంగా పనికానిచ్చే చిప్, రామ్‌లుండే కొత్త మోడల్ స్మార్ట్‌ఫోన్ కోసం జనం ఎగబడటం సర్వసాధారణమైంది. మార్కెట్లోకి కొత్త ఫోన్ వస్తోందంటే చాలా మంది దాని కోసం వెయిట్ చేస్తారు. అందులోనూ యాపిల్ కంపెనీ వారి ప్రపంచ ప్రఖ్యాత ఐఫోన్ సిరీస్‌లో కొత్త మోడల్ వస్తోందంటే టెక్ ప్రియులంతా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తారు. వారి నిరీక్షణకు శుభం పలుకుతూ నేడు అమెరికాలోని కుపర్‌టినో నగరంలో ఐఫోన్ 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను యాపిల్ ఆవిష్కరిస్తోంది. తమ సంస్థ కొత్త ఉత్పత్తులు, వాటి ఫీచర్లకు సంబంధించి యాపిల్ ఏటా యాపిల్ ఈవెంట్‌ను నిర్వహిస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా దీనికి విశేషమైన క్రేజ్ ఉంది. ఏటా సెప్టెంబర్ రెండో వారంలో యాపిల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం తెల్సిందే. యాపిల్ ఇన్నేళ్లలో వందల కోట్ల ఐఫోన్లను విక్రయించింది. అయితే కొత్త మోడల్ తెచ్చినప్పుడు దాంట్లో చాలా స్వల్ప స్థాయిలో మార్పులు చేసి కొత్తగా విడుదలచేసింది. దాంతో పెద్దగా మార్పులు లేవని తెలిసి ఇటీవలి కాలంలో యాపిల్ ఫోన్ల విక్రయాలు ప్రపంచవ్యాప్తంగా స్వల్పంగా తగ్గాయి. దీంతో యాపిల్ ఈసారి కృత్రిమ మేథ మంత్రం జపించింది. కొత్త సిరీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎక్కువగా వాడినట్లు వార్తలొచ్చాయి. దీంతో 17 ఏళ్లలో తొలిసారిగా ఐఫోన్‌లో విప్లవాత్మక మార్పులు చేసుకోబో తున్నట్లు తెలుస్తోంది. కాలిఫోర్నియాలోని స్టీవ్ జాబ్స్ థియేటర్‌లో జరిగే యాపిల్ ఈవెంట్ యూట్యూబ్‌లో ప్రత్యక్షప్రసారంకానుంది. ఐఫోన్ 16, ఐఫోన్ ప్లస్, ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్రో మాక్స్ మోడళ్లను ఆవిష్కరించే అవకాశం ఉంది. ఐఓస్ 18తో పాటు ఇతర సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ ఇచ్చే ఛాన్సుంది. 16 సిరీస్ మోడళ్లలో యాక్షన్ బటన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రో మోడల్స్‌లో మాత్రమే యాక్షన్ బటన్ ఇచ్చారు. కొత్త తరం హార్డ్‌వేర్, ఏఐతో రూపొందిన ఐఫోన్లు యూజర్లను తెగ ఆకట్టుకుంటాయని యాపిల్ సంస్థ భావిస్తోంది. కొత్త ఏఐ ఆధారిత ఫోన్లతో ఫోన్ల విక్రయాలు ఊపందుకోవచ్చు. ఈ వార్తలతో ఇప్పటికే జూన్‌నుంచి చూస్తే కంపెనీ షేర్ విలువ స్టాక్‌మార్కెట్లో 13 శాతం పైకి ఎగసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ మరో 400 బిలియన్ డాలర్లు పెరిగింది.

- వాషింగ్టన్

అమెరికాలో రాహుల్
మూడు రోజులపాటు పర్యటన

అమెరికాలో మూడు రోజుల పర్యటన కోసం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆదివారం హ్యూస్టన్ చేరుకున్నారు. టెక్సాస్ రాష్ట్రం డాలస్‌లోని ఫోర్ట్ వర్త్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఆయనకు భారత సంతతి అమెరికన్లు, ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన సందర్భంగా అర్థవంతమైన చర్చలు, సంభాషణల ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని రాహుల్ ఆదివారం ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. పర్యటనకు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. వ్యక్తిగతమని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ శామ్ పిట్రోడా పేర్కొన్నారు. నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం, మేధావులతో చర్చాగోష్టి, ప్రఖ్యాత జార్జిటౌన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లలో విద్యార్థులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలు 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే రాహుల్ పర్యటనలో ఉన్నాయని పిట్రోడా వివరించారు.

- హ్యూస్టన్

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే జైలుకే : ట్రంప్

ఎన్నికల్లో ఎవరైనా అవినీతికి, అక్రమాలకు పాల్పడితే తాను అధికారంలోకి వచ్చిన తర్వాత జైలు పంపిస్తానని అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ అన్నారు. ఓటింగ్‌లో అనైతికంగా వ్యవహరించే దుర్మార్గులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. లాయర్లు, రాజకీయ నిపుణులు, విశ్లేషకులు, దాతలు, చట్ట విరుద్ధమైన ఓటర్లు, అవినీతి ఎన్నికల అధికారులు.. ఎవరైనా సరే తప్పుడు పనులు చేస్తే జైలుకెళ్తారని స్పష్టంచేశారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై ట్రంప్ అనుమానం వ్యక్తం చేశారు. 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో కొందరు వ్యక్తులు తనకు వ్యతిరేకంగా పనిచేశారని, అందుకే తాను ఓడిపోయానని అప్పట్లో ట్రంప్ ఆరోపించారు.

- వాషింగ్టన్

రష్యాలో బ్రిక్స్ భేటీకి ఎన్ఎస్ఏ దోవల్

ఉక్రెయిన్ సంక్షోభంపై చర్చకు అవకాశం



జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ వచ్చే వారం రష్యా వెళ్లనున్నారు. ఆ దేశ రాజధాని మాస్కోలో ఈ నెల 10–12 తేదీల మధ్య జరిగే బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో ఆయన పాల్గొంటారు. ప్రధాని మోదీ ఇటీవల రష్యా, ఉక్రెయిన్‌లలో పర్యటించడం, ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం కనుగొనే సత్తా భారత్‌కు ఉందన్న అభిప్రాయం ప్రపంచ నేతలు వ్యక్తం చేస్తున్న వేళ దోవల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. దోవల్ బ్రిక్స్‌లోని బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల ఎన్ఎస్ఏలతో మాస్కోలో సమావేశం కానున్నారు. అదే సమయంలో, రష్యా జాతీయ భద్రతా సలహాదారుతో ప్రత్యేకంగా సమావేశమై ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంపై చర్చలు జరుపుతారని అధికార వర్గాలు తెలిపాయి. - న్యూఢిల్లీ

ఒకే కేడర్‌కు ఒకే వేతనం అమలు చేయాలి

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఫెడరేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: వైద్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని ఎన్‌హెచ్ ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. దయామని ఆదివారం కోరారు. ఏఎన్‌ఎంలకు న్యాయం చేసే క్రమంలో తమకు అన్యాయం చేయవద్దని ప్రభుత్వానికి విన్నవించారు. జీవో 115 ద్వారా ఇంటెన్సిఫైడ్ జీఎన్‌ఎంలను 2112 డైరెక్ట్ ఖాళీలలో సర్దుబాటు చేస్తే, దశాబ్దన్నర కాలంగా రెగ్యులర్ అవ్వలేక, కనీసం రెగ్యులర్ ఖాళీలోకి మారే అవకాశం లేని తాము నష్టపోతున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, ఒకే కేడర్‌కు ఒకే వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ నర్సు పోస్టులు అన్ని శాశ్వత ప్రాతిపదికన మాత్రమే నియమించాలన్నారు. 16 ఏళ్లుగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా సేవలు అందిస్తున్న తమకు ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితి దాటి పోయిందన్నారు. ఏనాటికైనా రెగ్యులర్ అవుతామని ఆశలు పెట్టుకున్నామని పేర్కొన్నారు.

వరదల్లో చిక్కుకున్న దివ్యాంగులపై ఉదారత చూపండి

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ రాజ్



భవానీపురం (విజయవాడ పశ్చిమ): వరదల్లో చిక్కుకుని దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న దివ్యాంగులపై ఉదారత చూపి వెంటనే ప్రత్యేక మెరుగైన వసతులు కలిగిన పునరావాస కేంద్రాలకు తరలించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద వచ్చి వారం గడుస్తున్న నేపథ్యంలో దివ్యాంగులు ఎక్కడెక్కడ చిక్కుకుపోయారో, వారి అవసరాలు ఏమిటో గుర్తించటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. సింగ్‌నగర్, ప్రకాష్‌నగర్, కండ్రిక, పాయకాపురం, రాజీవ్‌నగర్ తదితర ముంపు ప్రాంతాల్లో చిక్కుకుపోయి నడవలేని స్థితిలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించేవారి కోసం ఎదురు చూస్తూ ఆకలి బాధతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ కష్ట కాలంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం దివ్యాంగులకు అందించిన సేవలను గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండికూడా వైఎస్సార్‌సీపీ వరద బాధితులకు సాయం అందిస్తుందని, అందులో భాగంగా దివ్యాంగుల విభాగం తరుపున అందుబాటులో ఉన్న దివ్యాంగులకు సహాయం అందిస్తున్నామని వివరించారు. విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో ఐదు వేల మంది వరకు దివ్యాంగులు ఉంటారని, వారిలో చాలా మంది అనారోగ్యంతో అవస్థలు పడటమే కాకుండా ట్రైసైకిల్ వీల్ చైర్స్, బడ్డీ కొట్లతోపాటు ఇళ్లనుకూడా కోల్పోయి నిరాశ్రయులయ్యారని చెప్పారు. ఈ నెల పెన్షన్ అందుకోలేని కొందరు దివ్యాంగులకు వచ్చే నెల పెన్షన్‌కూడా కలిపి చెల్లించటమే కాకుండా మరికొంత ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి కల్పించి అందజేయాలని కోరారు.

తెల్లారేసరికే విజయవాడలో ఉండాలి

- వినాయకచవితి రోజు రాత్రి అధికారులకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాలు
- ఐదుగురు ఎస్‌డీసీలు, 12 మంది తహసీల్దార్లు అర్ధరాత్రి పరుగులు
- మరో 55 మంది డీటీలు, 55 మంది ఉద్యోగులు కూడా...

బి.కొత్తకోట: వినాయక చవితి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా చేసుకుంటున్న అధికారులు, ఉద్యోగులకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నుంచి శనివారం రాత్రి అందిన ఆదేశాలతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. 'మీరు వెంటనే బయలుదేరి విజయవాడ వెళ్లండి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో హాజరుకావాలి. లేకపోతే చర్యలు తప్పవు...' అంటూ కలెక్టర్ నుంచి అందిన ఉత్తర్వులతో అధికారులు, ఉద్యోగుల్లో పండుగ ఆనందం ఆవిరైంది. వెంటనే బ్యాగులు సర్దుకుని బైకులు, బస్సుల్లో తిరుపతి చేరుకున్నారు. అక్కడి నుంచి బస్సులు, రైళ్లలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో ఐదు రోజులు విధులు నిర్వర్తించేందుకు ఎంపిక చేసిన వారి జాబితాలతో కలెక్టర్ శ్రీధర్ మూడు ఉత్తర్వులు జారీచేశారు. అందులో జిల్లాలో పని చేస్తున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు(ఎస్‌డీసీలు) ఎస్.రాఘవేంద్ర, ఎం.రామసుబ్బయ్య, ఎస్.రాము, యు.రంగస్వామి, బి.లీలారాణి, జిల్లాలో నందలూరు, టి.సుండుపల్లె, రాయచోటి, చిన్నమండెం, గుర్రంకొండ, పీలేరు, బి.కొత్తకోట, నిమ్మనపల్లె, పీటీఎం, ములకలచెరువు, వాల్మీకిపురం, కేవీ పల్లె మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లను విజయవాడకు వెళ్లాలని ఆదేశించారు. వీరితోపాటు 55 మంది డిప్యూటీ తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, ఆర్‌ఎస్‌డీటీలు, 24 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు స్పెషల్ ఆర్‌ఐలు, 15 మంది ఎంఆర్‌ఐలు, ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్, 37 మంది వీఆర్‌వోలు ఉన్నారు. వీఆర్‌వోలలో అత్యధికంగా మదనపల్లె నుంచి తొమ్మిది మంది, బి.కొత్తకోట మండలం నుంచి ఏడుగురిని పంపించారు.


కొలువుదీరిన గణనాథులు



కర్నూలులో తుంగభద్ర తీరాన దత్తాత్రేయ రూపంలో ఏర్పాటుచేసిన 63 అడుగుల భారీ మట్టి గణపతి



తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో తమలపాకులతో ఏర్పాటుచేసిన గణనాథుడు



విశాఖ బీచ్‌రోడ్‌లో కుమ్మరి వేషధారణలో గణనాథుడు



విజయనగరంలో ఎస్ఆర్ షాపింగ్‌మాల్ వద్ద ఏర్పాటుచేసిన రుద్రాక్షల వినాయికుడు

కొల్లేరు.. గుండె చెరువు

ముంపు ముంగిట్లోకి మరిన్ని గ్రామాలు.. బుడమేరు నీటితో పాటు భారీ వర్షాలతో పరిస్థితి విషమం

- కైకలూరు మండలంలోని మరికొన్ని గ్రామాల్లోకి వరద
- మునిగిపోయిన చేపలు, రొయ్యల చెరువులు
- ఎన్‌డీఆర్ఆఫ్ బృందాల రాక

కై కలూరు: ఏలూరు జిల్లా కొల్లేరు గ్రామాలు నాలుగు రోజులుగా ముంపులోనే నానుతున్నాయి. బుడమేరు నుంచి ఉధృతంగా వస్తున్న నీటికి భారీగా కురుస్తున్న వర్షం నీరు తోడవడంతో పరిస్థితి విషయమించింది. దీంతో కైకలూరుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు చేరాయి. కొల్లేరుకు చేరే నీటిని దిగువకు పంపే పెద ఎడ్లగాడి వంతెన వద్ద నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 3.5 మీటర్లుగా నమోదైంది. దీనికి 18 కిలోమీటర్ల దూరంలోని ఉప్పుటేరు ముఖ ద్వారం వద్ద నీటి మట్టం 2.5 మీటర్లుగా ఉంది. ఎగువ నుంచి నీటి ప్రవాహం మరింతగా పెరిగితే భారీ నష్టం సంభవించడం ఖాయం. ఇప్పటికే మండవల్లి మండలం కొవ్వాడలంక, పులపర్రు, నుచ్చిమిల్లి, తక్కెళ్లపాడు, ఆనందపురం, నాగభూషణపురం, మూలపేట, సుబ్బారావుపేట, ఉనికిలి, పుట్లచెరువు, కానుకొల్లు గ్రామాలు పూర్తిగా నీటిలో మునిగాయి. ప్రభుత్వ సాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. కై కలూరు మండలంలో చటాకాయి, నత్తగుళ్లపాడు, పెంచికలమర్రు, శృంగవరప్పాడు, కొట్టాడ గ్రామాలకు నీరు చేరింది. ఇప్పటికే శృంగవరప్పాడు నుంచి పైడిచింతపాడు మీదుగా ఏలూరు చేరే రహదారిలో అనేక చోట్ల గండ్లు పడ్డాయి. రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టిన కళ్లెదుటే కొట్టుకుపోతున్న చేపలు, రొయ్యలను చూసి ఆక్వా రైతులు కన్నీళ్లపర్యంతమవుతున్నారు. ఆటపాక పక్షుల కేంద్రం ముంపునకు గురైంది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పక్షులకు వేట సాగించడం కష్టమవుతోంది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి. మరోవైపు పక్షులకు ఆహారంగా ఉండే చెరువుల్లోని చేపలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. పక్షుల కేంద్రం మ్యూజియం, చిల్డ్రన్ పార్కు సైతం మునిగాయి.



మండవల్లి మండలం కొవ్వాడలంకలో గ్రామస్తుల పరిస్థితి



మండవల్లి మండలం నుచ్చిమిల్లి దారిలో కూరుకుపోయిన లారీ



పూర్తిగా నీటిలో మునిగిన నుచ్చిమిల్లి సచివాలయం



మండవల్లి మండలం తక్కెళ్ళపాడు వద్ద చర్చిపై ప్రజలు

ఆక్రమణలే అసలు కారణం


ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 12 మండలాల పరిధిలో 2,22,300 ఎకరాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. సరస్సులోకి 9 లక్షల ఎకరాల మెట్ట ప్రాంతాల నుంచి, మూడున్నర లక్షల ఎకరాల మాగాణి నుంచి నీరు చేరుతోంది. వరదల సమయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ప్రధానంగా బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, గుండేరు, చంద్రయ్య, పోల్‌రాజ్, తోకలపల్లి, పెదపాడు వంటి 67 డ్రెయిన్ల వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతోంది. ఈ నీటిని పంపే ఏకైక మార్గం ఉప్పుటేరు మాత్రమే. కొల్లేరు ఆక్రమణల వల్ల దీని డిశ్చార్జింగ్ కెపాసిటీ 12,000 వేల క్యూసెక్కులకు మాత్రమే పరిమితం అవుతోంది. ప్రస్తుతం పెద ఎడ్లగాడి వద్ద 3.5 మీటర్ల నీరు ఉంది. సముద్రానికి పంపించే ఉప్పుటేరు వద్ద 2 మీటర్లు ఉంది. అంటే ఆక్రమణల వల్ల నీరు వెనక్కి మళ్లుతోందన్నది సుస్పష్టం. ప్రతిసారీ వరదలు వచ్చినప్పుడు కొల్లేరులో ఆక్రమిత చేపల చెరువుల అంశం తెరపైకొస్తోంది. అక్రమ చేపల చెరువుల వల్ల సమీప పంట పొలాలు నీటి పాలవడంతో 2006 కొల్లేరు ఆపరేషన్ చేసి అక్రమ చేపల చెరువులను ధ్వంసం చేశారు. అభయారణ్యంగా ప్రకటించిన 77,138 వేల ఎకరాల్లో.. 65 వేల ఎకరాలు, 5–10 కాంటూరు మధ్య గల ప్రభుత్వ భూమి 48 వేల ఎకరాల్లో.. 45 వేల ఎకరాలు, మొత్తం లక్షా 10 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గుర్తించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఇరు జిల్లాల్లో 25,142 ఎకరాల విస్తీర్ణంలో చేపల చెరువులను ధ్వంసం చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో కొల్లేరులో తిరిగి ఆక్రమణల పర్వం కొనసాగింది. అదే నేడు ముంపు సమస్యకు ప్రధాన కారణమైంది.

వరద ప్రాంతాల్లో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

విజయవాడ స్పోర్ట్స్: వరద ప్రభావిత ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ అత్యంత ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మధ్యలో ఉన్న పలు మ్యాన్‌హోల్స్ చుట్టూ గుంతలు ఏర్పడటం, కొన్నింటి మూతలు తెరుచుకున్న నేపథ్యంలో వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న ఆయా ప్రాంతాల్లోని ప్రజలు గాయాలపాలవుతున్నారు. ముంపునకు గురైన ఇళ్లలో నుంచి బయటపడి, ఎగువ ప్రాంతాల్లో 5 రోజుల పాటు తలదాచుకున్న ప్రజలు తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. మోకాలు లోతు నీళ్లలో నందమూరినగర్‌లోని వల్లభ, లక్ష్మీ దంపతులు ఇలాగే ప్రమాదానికి గురయ్యారు. నందమూరినగర్ ప్రధాన రహదారి మధ్యలోని మ్యాన్‌హోల్ చుట్టూ ఏర్పడిన గుంతలో లక్ష్మీ కాలుపడి గాయపడ్డారు.

బ్రహ్మాజీ ఓ బఫూన్

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ బెన్నీ



గుడ్లవల్లేరు: హాస్య నటుడు బ్రహ్మాజీ ఒక బఫూన్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఉపాధ్యక్షుడు లింగం జాన్‌బెన్నీ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తమ అధినేత వైఎస్ జగన్‌పై మాట్లాడే స్థాయి ఆ బఫూన్‌కు లేదన్నారు. ప్రపంచమంతా అల్లకల్లోలం అవుతున్న కరోనా సంక్షోభంలో ఒంటి చేత్తో అప్పట్లో సీఎంగా వైఎస్ జగన్ ఏపీ ప్రజలను కాపాడిన విషయం పొరుగు రాష్ట్రంలో ఉండే బ్రహ్మాజీకి ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 83,960 మంది స్వామివారిని దర్శించుకోగా 32,342 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

సింహగిరిపై విశేషంగా స్వాతి హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడషోపచారపూజలు నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. కాగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ద్వారకాతిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ సాధరణంగా ఉంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భక్తుల సంఖ్య తగ్గింది. ప్రతి శని, ఆదివారాల్లో వేలాదిగా భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారు. ఈ శనివారం వినాయక చవితి పండుగ కావడం, ఆదివారం వర్షం కావడంతో ఈ రెండు రోజులూ క్షేత్రంలో భక్తుల రద్దీ నామమాత్రంగానే ఉంది.

వైభవంగా స్వాతి మహోత్సవం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం భక్త జనసంద్రంగా మారింది. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి, కొలువుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతితో ఈ కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీశైలంలో గణపతి నవరాత్రోత్సవాలు ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు, దేవస్థాన ఈఓ సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం వేదపండితులు వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు. అలాగే లోక కల్యాణాన్ని కాంక్షిస్తు నవరాత్రోత్సవ సంకల్పాన్ని పఠించారు. సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ నవరాత్రోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భ గణపతి స్వామివారికి విశేషంగా అభిషేకం, అర్చనలు, జరిపిస్తారు.



పేరంటాలమ్మ ఊరేగింపు


యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో పరంపేట గ్రామంలో కొలువైన వందలాది ఏళ్ల చరిత్ర కలిగిన పేరంటాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం వినాయకచవితి రోజున పురవీధుల్లో పేరంటాలమ్మను ఊరేగించారు. ఈ సందర్భంగా సంప్రదాయంగా వస్తున్న పేరంటాలమ్మ కావిడిలను మోస్తూ భక్తులు పరంపేట నుంచి యానాం పట్టణం, నీలపల్లి, జార్జిపేట, కురసాంపేట తదితర ప్రాంతాల మీదుగా మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు సాగింది.

కన్యకాపరమేశ్వరి గుడిలో పెన్నుల పూజ

మండపేట: కోనసీమ జిల్లా మండపేట పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పెన్నుల పూజ నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వాసవీ యూత్ ఆధ్వర్యంలో ఆలయంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెండో రోజు ఆదివారం ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో గరిక పూజ నిర్వహించారు. విద్యార్థులకు సరస్వతీ కటాక్షం కలగాలని కోరుతూ పెన్నుల పూజ చేశారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: కాకినాడ జిల్లా పెదపూడి మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మినీ, సాంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రేపు పుంగనూరులో ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా పుంగనూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యోగ ఉపాధి అధికారిణి పద్మజ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఇనోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తామన్నారు. ఆ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తారని తెలిపారు. పది నుంచి డిగ్రీ వరకు పాస్, ఫెయిల్ అయిన వారు (18 నుంచి 35 సంవత్సరాలు) మధ్య వయస్సు ఉన్న వారు ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 77805 99208, 96761 80056 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులకు జపనీస్ భాష ఎన్–5, ఎన్, ఎన్ 3 స్థాయిలో నేర్పించనున్నట్లు వివరించారు. అనంతరం సంబంధిత అభ్యర్థులకు జపాన్‌లో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు 32 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు 93811 09098, 99888 53335లో సంప్రదించాలని కోరారు.


హైదరాబాద్ చైతన్యపురి కమలానగర్‌లో ఏర్పాటు చేసిన 31 అడుగుల విజయ మహా గణపతి


భువనగిరి జిల్లా కేంద్రంలోని తారకరామనగర్‌లో మణికంఠ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినూత్నమైన వినాయకుడి విగ్రహం


సరూర్‌నగర్ చెరువు కట్టపై శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 27 అడుగుల భారీ గణపయ్య


వనస్థలిపురంలో ఉన్నితో తయారు చేసిన గణపతి

హరీశ్‌రావుపై క్రిమినల్ కేసు పెట్టండి: చామల

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్‌లో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్యపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడిన తీరు రైతులను రెచ్చగొట్టేలా ఉందని.. అందువల్ల ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్‌కు వినతిపత్రం పంపించినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన విధివిధానాలను ప్రాతిపదికగా తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించిందన్నారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాకుండానే రైతులను రెచ్చగొట్టేలా హరీశ్‌రావు మాట్లాడుతున్నారని చామల ఆరోపించారు. రైతు సురేందర్ రెడ్డి తల్లికి రూ. లక్షన్నర రుణమాఫీ జరిగిందని... రుణమాఫీ కాని వారి వివరాలను సేకరించి వారికి రుణమాఫీ జరిగేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కాగా, మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియాలో పోస్టులు చేసే ముందు నిజాలు తెలుసుకోవాలని చామల సూచించారు. కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రభుత్వం గురించి తప్పుడు పోస్ట్ చేశారని ఆరోపిస్తూ ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

కేకే కుమారుడు వెంకటేశ్వరరావుకు హరీశ్‌రావు పరామర్శ

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ మాజీ సభ్యుడు కేశవరావు పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు అస్వస్థతకు గురై అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు ఆయన్ను పరామర్శించారు. వెంకటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. హరీశ్‌రావు వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఉన్నారు.

తెలంగాణకు కట్టుబడ్డ నేత పాల్వాయి: హరీశ్‌రావు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అధికార పార్టీలో ఉంటూ బలమైన వాదన వినిపించిన నాయకుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మాజీ మంత్రి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి దంపతుల స్మారక సమావేశానికి ఆదివారం ఆయన హాజరయ్యారు.

సెల్‌లో సొల్లు ముచ్చట్లు!

స్పామ్, పెస్కీ కాల్స్‌తో తప్పని చిక్కులు

- రోజుకు సరాసరిన మూడు ప్రమోషన్ కాల్స్
- మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న టెలీ ప్రమోషన్లు
- 88 శాతం మొబైల్ యూజర్లకు ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్‌ఎస్టేట్ కంపెనీల నుంచే కాల్స్
- ఆరు నెలల్లో 96 శాతం పెరిగిన ఈ తరహా ప్రమోషన్ కాల్స్ జంజాటం
- వెల్లడించిన లోకల్ సర్కిల్స్ సర్వే



సాక్షి, హైదరాబాద్: మొబైల్ ఫోన్ వినియోగం అనేది నిత్య జీవితంలో ఒక భాగమైంది. ఎక్కడున్నా ఇతరులతో మనం ఎప్పుడూ 'హలో' దూరంలోనే ఉండొచ్చు. అయితే ఈ మొబైల్ ఫోన్లలో ఇప్పుడు సొల్లు ముచ్చట్లు ఎక్కువయ్యాయి. మనకు అవసరం లేని విషయాలు చెప్పి విసిగించే వారు ఎక్కువవుతున్నారు. బిజినెస్ ప్రమోషన్లు, ఆర్థికపరమైన ఆఫర్లు, అంశాలు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరిట ప్రతి నిత్యం ఏదో ఒక అపరిచిత నంబర్ నుంచి మన మొబైల్ ఫోన్‌కు ఫోన్‌కాల్స్ లేదా ఎస్ఎంఎస్‌లు రావడం పరిపాటిగా మారింది. మొబైల్ వినియోగదారుల చెవిలో మోతగా మారిన ఈ పెస్కీ (ఇబ్బందికరమైన) కాల్స్‌తో మొబైల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించింది. మొత్తం 18,173 మంది నుంచి అభిప్రాయాలు సేకరించగా వీరిలో 95 శాతం మంది ఈ తరహా ఫోన్‌కాల్స్ వస్తున్నట్టు తెలిపారు. రోజుకు సరాసరిన 3 కాల్స్ పైనే వచ్చినట్టు సర్వేలో పాల్గొన్న 77 శాతం మంది వెల్లడించారు. డీఎన్‌డీ (డు నాట్ డిస్ట్రబ్–అనవసర ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు రావొద్దు అని పెట్టుకునే ఆప్షన్) వాడుతున్న వారికి ఈ స్పామ్ కాల్స్ బెడద తప్పడం లేదు. మొబైల్ వినియోగదారులకు తలనొప్పిగా మారిన ఈ తరహా ఫోన్‌కాల్స్‌కు సంబంధించి మొబైల్ వినియోగదారులు లోకల్ సర్కిల్స్ సర్వేలో పంచుకున్న అంశాలు ఇలా..

గత ఆరు నెలల్లో మరింత పెరిగిన బెడద

ఇలాంటి అనవసర, వ్యాపార ప్రమోషన్లకు సంబంధించిన ఫోన్‌కాల్స్ బెడద మొబైల్ వినియోగదారులు గత ఆరు నెలల్లో మరింత పెరిగినట్టు సర్వే నివేదిక వెల్లడించింది. ఆరు నెలల కిందట 90 శాతం నుంచి 95 శాతానికి ఇది పెరిగినట్టు తెలిపింది. ఆరు నెలల కిందట రోజుకు పదికి పైగా స్పామ్‌కాల్స్ వచ్చే వారి సంఖ్య 3 శాతం ఉండగా.. ఇది ఆరు నెలల్లో 23 శాతానికి పెరిగినట్టు సర్వే పేర్కొంది. అయితే, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ స్పామ్‌కాల్స్, మెసేజ్‌లను అరికట్టేందుకు ట్రాయ్ (టెలీకమ్యూనికేషన్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) చర్యలకు ఉపక్రమించినట్టు లోకల్ సర్కిల్స్ సంస్థ వెల్లడించింది.

గత 12 నెలల్లో రోజుకు ఎన్ని సేల్స్, ప్రమోషన్, అనవసర ఫోన్‌కాల్స్ వచ్చాయి?

రోజుకు వచ్చిన కాల్స్ సంఖ్య	కాల్స్ రిసీవ్ చేసుకున్న వారు (శాతంలో)
1-2	18 శాతం
3-5	34 శాతం
6-10	20 శాతం
10కి పైగా	23 శాతం
చెప్పలేం	3 శాతం
అలాంటి కాల్స్ రాలేదు	2 శాతం

ఏ అంశాలకు సంబంధించిన కాల్స్, ఎస్ఎంఎస్‌లు ఎక్కువగా వస్తున్నాయి?

అంశం	శాతం
రియల్ ఎస్టేట్‌వి	22%
జాబ్ ఆఫర్లు, సంపాదనవి	4%
ఫైనాన్షియల్ సర్వీసెస్‌వి	66%
ఆర్ఓ రిపేర్, స్పా, బ్యూటీ, తదితర..	01%
ఇతర అంశాలకు సంబంధించి	4%
ఆ తరహా కాల్స్ రాలేదు	3%

డీఎన్‌డీ (డు నాట్ డిస్ట్రబ్) ఆప్షన్ వాడుతున్నా స్పామ్‌కాల్స్ వస్తున్నాయా?

సమాధానం	శాతం
అవును, ఇంకా అలాంటి కాల్స్ వస్తున్నాయి..	96 శాతం
లేదు, మాకు రావడం లేదు	2 శాతం
ఏమో.. చెప్పలేం	2 శాతం


వినాయక చవితి సందర్భంగా శనివారం రాజ్‌భవన్‌లో గణపతి పూజ చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఆగ్రాకు మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మేధో మథనానికి (చింత శివిర్) రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంచాయతీ, మహిళా సంక్షేమ శాఖమంత్రి సీతక్క హాజరుకానున్నారు. సోమ, మంగళవారాల్లో జరగనున్న ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆదివారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయం నుంచి సీతక్క ఆగ్రా బయల్దేరారు. ఈ సందర్భంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ ద్వారా అమలవుతున్న చట్టాలు, సంక్షేమ పథకాలపై సమీక్షించనున్నారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య మరింత సమన్వయం పెంచే అంశంపై చర్చలు జరుపుతారు. కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ఆహ్వానం మేరకు సీతక్క చింత శివిర్‌కు హాజరవుతున్నారు. అన్ని రాష్ట్రాలు పాల్గొనే మేధో మథనంలో ఆయా రాష్ట్రాల అభిప్రాయాలకు అనుగుణంగా అణగారిన వర్గాలకు సంబంధించిన చట్టాలు, సంక్షేమాలను పకడ్బందీగా అమలు చేసే దిశగా కార్యాచరణను రూపొందించనున్నారు.


ఎక్సైజ్ అండ్ టీజీ న్యాబ్ జాయింట్ ఆపరేషన్

5 ప్రధాన పబ్‌లపై ఏకకాలంలో దాడులు

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ వినియోగదారులు, సరఫరాదారులపై వరుస దాడులు నిర్వహిస్తున్న టీఎస్ న్యాబ్.. పబ్‌లలో విచ్చలవిడిగా సాగుతున్న మత్తు పదార్థాల విక్రయంపై దృష్టి పెట్టింది. హైదరాబాద్‌లోని ఐదు ప్రధాన పబ్‌లలో నార్కోటిక్స్ బ్యూరో, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి నేతృత్వంలో టీఎస్ నార్కోటిక్స్ బ్యూరో ఉన్నతాధికారులు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్ గచ్చిబౌలిలోని పబ్‌లలో దాడులు నిర్వహించారు. ఐదు పబ్‌లలో 33 మందిని డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా, అందులో నలుగురు డ్రగ్స్ సేవించినట్టు తేలిందని ఎక్సైజ్‌శాఖ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూబ్లీహిల్స్‌లోని నికాస్, బేబీలాన్, ఇల్యూజన్, మాదాపూర్‌లోని విస్కీ, నాలెడ్జ్ సిటీలోని కోరంక్లబ్‌లపై ఈ దాడులు నిర్వహించినట్టు పేర్కొంది. ఐదింటిలో దాడులు నిర్వహించగా..బేబీలాన్, కోరంక్లబ్‌లలో ఇద్దరేసి లెక్కన నలుగురు డ్రగ్స్ సేవించినట్టు తేలింది. ఇందులో ఓ మైనర్ పట్టుపడ్డారు.

రైతుల సంతోషం హరీశ్ చూడలేకపోతున్నారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉంటే హరీశ్‌రావు చూడలేక దుఃఖం లో మునిగిపోయారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీ అవుతోందన్న బెంగతో మాజీ మంత్రికి కన్నీళ్లు ఆగడం లేదన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారన్న ఉక్రోశంతో హరీశ్‌రావు ఉన్నారని, రైతులను రెచ్చగొట్టడమే ఆయన పనిగా మారిందని మండిపడ్డారు. మామ ఫామ్‌హౌస్‌లో, బామ్మర్ది అమెరికాలో జల్సా చేస్తుంటే.. హరీశ్‌రావు హైదరాబాద్‌లో విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. రైతుల పైన అంత ప్రేమ ఉంటే కేసీఆర్‌తో హరీశ్‌రావు ఎందుకు ఒక ప్రకటన కూడా చేయించలేదని శ్రీనివాస్ ప్రశ్నించారు. వర్షాల కారణంగా నష్టపోయిన ఒక్క రైతును కూడా ఎందుకు కేసీఆర్ పరామర్శించలేదో చెప్పాలన్నారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నప్పటికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందని, ఈ విషయాన్ని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీకి అనుసరించిన విధానాలనే తమ ప్రభుత్వం అనుసరిస్తోందని శ్రీనివాస్ తెలిపారు. తమ ప్రభుత్వం కొత్తగా ఎలాంటి నిబంధనలు పెట్టలేదని, రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ అయి తీరుతుందన్నారు.

రిజిస్ట్రేషన్లు తగ్గినా..పెరిగిన ఆదాయం

2023లో ఆగస్టు వరకు రూ.6,068 కోట్ల రాబడి... 2024లో వచ్చింది రూ. 6,433 కోట్లు

ఆగస్టులో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుదలకు హైడ్రా ప్రభావం కూడా ఉందంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: గతేడాదితో పోలిస్తే...ఈ ఏడాది ఆగస్టు వరకు సంఖ్యాపరంగా రిజిస్ట్రేషన్లు తగ్గినా, ఆదాయం మాత్రం పెరిగింది. 2023లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.6,068 కోట్ల ఆదాయం రాగా, 2024లో రూ.6,433 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే, ఏప్రిల్, మే, ఆగస్టు నెలల్లో డాక్యుమెంట్ల సంఖ్య తగ్గగా, జూన్‌లో 1,133, జూలైలో 31,883 డాక్యుమెంట్ల పెరుగుదలతో రిజిస్ట్రేషన్ల శాఖ ఊపిరి పీల్చుకుంది.

ఆదుకున్న జూలై మాసం

గత ఐదునెలల రిజిస్ట్రేషన్ లావాదేవీల గణాంకాలను పరిశీలిస్తే జూలై నెల ఆదుకుందని అర్థమవుతోంది. ఈ నెలలో జరిగిన అధిక రిజిస్ట్రేషన్ల కారణంగానే మొత్తం ఐదు నెలల్లో అటు డాక్యుమెంట్ల సంఖ్యలోనూ, ఇటు ఆదాయంలోనూ భారీ నష్టం తప్పింది. గత ఏడాదితో పోలిస్తే ఈ నెలలో 31వేలకు పైగా ఎక్కువ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, రూ.452 కోట్ల అధిక ఆదాయం సమకూరింది. ఈ నెలలో వచ్చిన ఆదాయం కారణంగానే ఐదు నెలల మొత్తం కలిపినా గత ఏడాది కంటే రూ.365 కోట్ల ఆదాయం ఎక్కువగా రావడం గమనార్హం. ఇక, ఆగస్టు మాసంలో డాక్యుమెంట్లు తగ్గేందుకు హైడ్రా కూడా ఒక కారణమని రిజిస్ట్రేషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చెరువులు, కుంటలు, నాలాలకు సమీపంలోని భూముల క్రయవిక్రయాలు, ప్లాట్ల అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాయని, దీంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఆగస్టు మాసంలో ఏకంగా 23వేల రిజిస్ట్రేషన్లు తగ్గాయని అంటున్నాయి. ఇక, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పార్లమెంటు ఎన్నికల కారణంగా లావాదేవీలు మందగించాయని, జూలై నెలలో పుంజుకునేలోపు హైడ్రా రూపంలో దెబ్బతగిలిందని అభిప్రాయపడుతున్నాయి. ఈ ఏడాదిలో మరికొన్ని నెలలు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని కూడా ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

గత ఐదు నెలల్లో రాష్ట్రంలో జరిగిన రిజిస్ట్రేషన్ లావాదేవీల వివరాలివి

నెల	2023	2024	వృద్ధి
ఏప్రిల్	1,55,565	1,22,114	- 33,451
మే	1,74,998	1,46,361	- 28,637
జూన్	1,66,022	1,67,155	+1,133
జూలై	1,72,893	2,04,776	+31,883
ఆగస్టు	1,71,958	1,48,643	- 23,315
మొత్తం	8,41,436	7,89,049	- 52,387

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రెండేళ్ల ఆదాయ గణాంకాలు(రూ.లలో) ఇలా..

నెల	2023	2024
ఏప్రిల్	1,087	1,115
మే	1,317	1,079
జూన్	1,180	1,293
జూలై	1,187	1,639
ఆగస్టు	1,297	1,307
మొత్తం	6,068	6,433

సాక్షి ప్లస్
సోమవారం । 9-9-2024

ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే 'జీవ వైవిధ్యం'గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్‌మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త 'జీవ వైవిధ్యం'(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు. జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (IUCN) ప్రకారం.. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. **జన్యు వైవిధ్యం (Genetic Diversity):** ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
   ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.
2. **జాతి వైవిధ్యం (Species Diversity):** ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని 'జాతి వైవిధ్యం'గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.
3. **ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity):** విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని 'ఆవరణ వ్యవస్థ వైవిధ్యం' అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. **α - జీవ వైవిధ్యం:** దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. **β - వైవిధ్యం:** రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. **γ - వైవిధ్యం:** ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని 'గామా వైవిధ్యం'గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వెడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా 9. మడగాస్కర్
10. మలేషియా 11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ 14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను 'బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్'గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985-90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్‌లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్‌తో ఏకీభవించింది.

ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానిక) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయిర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Ecoregion" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని 'నేచర్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సెల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ



హాట్‌స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా
1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్‌లాండ్స్
3. మిసో అమెరికా 4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా
1. టంబెస్ చోకో మ్యాగ్డెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్‌ఫాల్ వాల్డివియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా
1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా
1. పశ్చిమ ఆఫ్రికా - గినియా అడవులు
2. సక్యులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ - పాండో లాండ్ ఆల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్ట్రన్ అఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్ - హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్
1. పశ్చిమ కనుమలు - శ్రీలంక
2. హిమాలయాలు 3. ఇండో బర్మా
4. నైరుతి చైనా 5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్ 7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్ 12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా
14. తూర్పు ఆస్ట్రేలియా

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి 'జీవ వైవిధ్య దశాబ్దం'గా దేన్ని ప్రకటించింది?
   ఎ) 2001-10 బి) 2011- 20
   సి) 2021-30 డి) 1991-2000
2. 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం' ఏ రోజు నిర్వహిస్తారు?
   ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
   సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
   ఎ) యునెస్కో బి) యూఎన్ఈపీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్‌లోని ఏ ప్రాంతంలో 'లయన్ టెయిల్డ్ మకాక్' అనే కోతి కనిపిస్తుంది?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) ఈశాన్య హిమాలయాలు
   సి) తూర్పు కనుమలు
   డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
   ఎ) మెక్సికో బి) నైరోబి
   సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
   ఎ) శ్రీలంక బి) వెనిజులా
   సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
   ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   ఎ) 1993 బి) 1994
   సి) 1995 డి) 1996
9. 'నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ' ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై బి) బెంగళూరు
   సి) తిరువనంతపురం డి) గాంగ్‌టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
    సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. 'వరల్డ్ ఎర్త్ డే'ను ఎప్పుడు నిర్వహిస్తారు?
    ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
    సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్‌లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
    ఎ) వింధ్య పర్వతాలు
    బి) పశ్చిమ కనుమలు
    సి) పశ్చిమ హిమాలయాలు
    డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
    ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
    సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
    ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్‌ఫ్యూమ్‌ల తయారీలో ఉపయోగిస్తారు?
    ఎ) చింకారా బి) కృష్ణజింక
    సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' చిహ్నం ఏది?
    ఎ) ధ్రువ ఎలుగుబంటి
    బి) పాండా
    సి) నీలి తిమింగలం డి) ఏదీకాదు
17. 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' ఎక్కడ ఉంది?
    ఎ) బెంగళూరు బి) గౌహతి
    సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
    ఎ) గిర్ అడవులు
    బి) వేనాడ్ అభయారణ్యం
    సి) పెంచ్ జాతీయ పార్కు
    డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ.

పదేపదే ఆలోచనలు చేసే విద్యార్థి మానసిక రుగ్మత?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సైకాలజీ

మూర్తిమత్వం

1. తోలు బొమ్మలాటలు ఆడించే కుటుంబానికి చెందిన కోటేశ్ పాఠశాలకు వెళ్లి చదువుకోవాలనుకున్నాడు. కానీ, పాఠశాలకు వెళ్లి చదువుకోవడానికి మన కుటుంబ కట్టుబాట్లు, వంశాచారాలు ఒప్పుకోవు అని అతడి తండ్రి వద్దన్నాడు. ఈ సందర్భంలో కోటేశ్‌కు ఎదురైన ఆటంకం?
   1) శారీరక 2) మానసిక
   3) భౌతిక పరిసర 4) సాంఘిక పరిసర
2. ఆరో తరగతి చదువుతున్న శ్రావణి గృహ సర్దుబాటును తెలుసుకోవడానికి టీచరు గృహసర్దుబాటుకు చెందిన అనేక ప్రవచనాలు, వాటి పక్కన అవును/కాదు/ చెప్పలేం అనే ఐచ్ఛికాలను ఇచ్చింది. వాటిని సూచించిన విధానాన్ని బట్టి శ్రావణి సర్దుబాటు గుణాన్ని తెలుసుకోవాలనుకుంది. ఇది ఏ మూర్తిమత్వ మాపనికి చెందుతుంది?
   1) నిర్ధారణ మాపని 2) పరిపృచ్ఛ
   3) శోధనా సూచిక 4) మూర్తిమత్వ శోధిక
3. ఎనిమిదో తరగతి చదువుతున్న రాజేశ్‌లో సహకార గుణం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి ఉపయోగపడే మూర్తిమత్వ మాపని?
   1) నిర్ధారణ మాపని 2) మూర్తిమత్వ శోధిక
   3) ప్రశ్నావళి 4) శోధనా సూచిక
4. ఆర్థికంగా నష్టపోవడం, ప్రేమించే వ్యక్తిని కోల్పోవడం, హఠాత్తుగా సంభవించే పరిణామాలు తదితర అంశాలను మానసిక అనారోగ్యానికి సంబంధించిన ఏ కారకాలుగా పేర్కొనవచ్చు?
   1) ప్రోత్సహించే కారకం
   2) పోగుచేసే కారకం
   3) ప్రోత్సహించే కారకం, పోగుచేసే కారకం
   4) ఏదీకాదు
5. పాఠశాలకు వచ్చిన తర్వాత ఇంట్లో గ్యాస్‌స్టవ్ సరిగ్గా ఆర్పేశానో లేదో, ఇంటికి తాళం సరిగా వేశానో లేదో అని పదేపదే ఆలోచనలు చేసే విద్యార్థి మానసిక రుగ్మత?
   1) మనోనిక్షిప్తులు
   2) దౌర్బల్య ప్రతిచర్యలు
   3) సామాన్య వ్యాకులత
   4) అనియంత్రిత - నిర్బంధ నాడీ రుగ్మత
6. మూర్తిమత్వం వ్యక్తి ఏ స్వభావం వల్ల ముఖ్యంగా ప్రభావితమవుతుంది?
   1) అభిరుచులు 2) వైఖరులు
   3) అవసరాలు 4) అలవాట్లు
7. దమనం చేసిన అచేతనంలోని భావాలను వెలికితీయడానికి సిగ్మండ్ ఫ్రాయిడ్ పేర్కొన్న టెక్నిక్ కానిది ఏది?
   1) స్వేచ్ఛా సంసర్గం 2) స్వప్న విశ్లేషణం
   3) సమ్మోహనం 4) సమగ్రాకృతి
8. రక్షకతంత్రాలు అనే భావనకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) మూర్తిమత్వం చిన్నాభిన్నం కాకుండా కాపాడుతాయి
   2) వ్యక్తి అహాన్ని పరిరక్షిస్తాయి
   3) ఇందులో ఆత్మవంచన భావన దాగి ఉంది
   4) వ్యక్తి ఉద్రిక్త పరిస్థితులకు లోనయ్యేలా చూస్తుంది
9. రక్షకతంత్రాలకు సంబంధించి కింది వాటిలో సరైంది?
   ఎ) డీఎస్సీ ఫలితాలు విడుదలైన తర్వాత ఆశించిన మార్కుల కంటే తక్కువ మార్కులు రావడం వల్ల నాగరాజు కోపంతో హాల్‌టికెట్ విసిరివేయడం
   బి) ఐపీఎస్ సాధించలేకపోయిన రమేశ్ తన కుమారుడు చెర్రీని ఐపీఎస్ చేయడం
   సి) స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించలేకపోయిన మురళి తన స్నేహితుడు సాధించిన ఉద్యోగాన్ని తాను సాధించినట్లుగా తృప్తి చెందడం
   డి) ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించలేకపోయిన రవి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ బాగా లేనందువల్ల ఉద్యోగం పొందలేకపోయాను అని తెలపడం
   1) ప్రక్షేపణం - తదాత్మీకరణం - పరిహారం - విస్థాపనం
   2) విస్థాపనం - ప్రక్షేపణం - తదాత్మీకరణం - పరిహారం
   3) ప్రతిగమనం - పరిహారం - తదాత్మీకరణం - ప్రక్షేపణం
   4) విస్థాపనం - పరిహారం - తదాత్మీకరణం - ప్రక్షేపణం
10. రీడింగ్ రూమ్‌లో మ్యాథ్స్ చేస్తున్న శివానికి ఒక్కసారిగా గదిలోని దీపం ఆరిపోయి, చీకటి ఏర్పడటం వల్ల భయపడటం, ఒళ్లంతా చెమటలు పట్టడం జరిగింది. దీనికి కారణమయ్యే హార్మోన్?
    1) పెరుగుదల హార్మోన్
    2) థైరాక్సిన్
    3) పారాథైరాక్సిన్ 4) అడ్రినలిన్
11. శశి శారీరకంగా బలంగా ఉన్నప్పటికీ ఉద్వేగపరంగా కోపాన్ని, చికాకు స్వభావాన్ని కలిగి ఉన్నాడు. అయితే హిప్పోక్రైటిస్ ప్రకారం అతడు ఏ రకానికి చెందుతాడు?
    1) ఔత్సాహికుడు
    2) పైత్య ప్రవృత్తి ఉన్నవాడు
    3) శ్లేష్మ ప్రవృత్తి ఉన్నవాడు
    4) విషణ్ణువు
12. 10వ తరగతి చదువుతున్న సుప్రియ తాను కోరుకున్న స్థాయిలో ఫేస్‌బుక్‌లో పోస్టులకు లైక్‌లు రావట్లేదని, వాట్సాప్‌లో స్టేటస్‌కు కామెంట్స్ రావట్లేదని కుంఠనానికి లోనైంది. ఇక్కడ కుంఠనానికి కారణం?
    1) శారీరకమైంది 2) మానసికమైంది
    3) భౌతిక పరిసర సంబంధమైంది
    4) సాంఘిక పరిసర సంబంధమైంది
13. ఐదో తరగతి చదువుతున్న రూప మూర్తిమత్వాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడే



అప్రక్షేపక పరీక్ష?
    1) TAT 2) CAT
    3) RIBT
    4) ది వినిలాండ్ సోషల్ మెచ్యూరిటీ స్కేల్
14. డీఎస్సీకి సన్నద్ధమవుతున్న చందన వాట్సాప్‌లో క్రియేట్ చేసిన స్టూడెంట్స్ గ్రూప్‌లో ఉపయోగకర విషయాలతోపాటు అనవసర విషయాలు పోస్ట్ కావడం వల్ల గ్రూప్‌లో కొనసాగాలా వద్దా అని నిర్ణయించుకోలేకపోవడం ఏ సంఘర్షణ?
    1) ఉపగమ - ఉపగమ
    2) పరిహార - పరిహార
    3) ఉపగమ - పరిహార
    4) ద్వి ఉపగమ - పరిహార
15. ప్రశాంత్‌లో సహకారగుణం చాలా బాగుందని అంచనా వేసిన ఉపాధ్యాయుడు అతడి నిజాయతీని పరిశీలించకుండానే చాలా బాగుంటుంది అని తెలపడాన్ని నిర్ధారణ మాపనిలోని ఏ దోషంగా పేర్కొనవచ్చు?
    1) హాలో ప్రభావం
    2) కేంద్రీయ ప్రవృత్తి దోషం
    3) ఔదార్య దోషం
    4) దమన దోషం
16. ఇతరుల దగ్గర నుంచి ఒక వ్యక్తి సమాచారాన్ని రాబట్టడానికి ఉపయోగపడే పద్ధతి?
    1) మూర్తిమత్వ శోధిక
    2) నిర్ధారణ మాపని
    3) ప్రక్షేపక విధానం
    4) స్థితి పరీక్ష
17. ఒక ఉపాధ్యాయుడు Rhodes test & Rotter Test ద్వారా విద్యార్థుల మూర్తిమత్వాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. అయితే ఇక్కడ ఆ ఉపాధ్యాయుడు ఉపయోగించిన మూర్తిమత్వ మాపని?
    1) కథాపూరణ పరీక్షలు
    2) స్థితి పరీక్ష
    3) పద సంసర్గ పరీక్ష
    4) వాక్యపూరణ పరీక్ష
18. ప్రక్షేపక పరీక్షలకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
    1) వ్యక్తి అంతర్గత భావాలను, ఆలోచనలను వెలికి తీయవచ్చు
    2) కాలపరిమితి లేదు కానీ కాలాన్ని పరిగణలోకి తీసుకుంటాం
    3) ఉద్దీపన అస్పష్టంగా, అర్థరహితంగా ఉంటుంది
    4) చేతన అంశాలను మాత్రమే తెలుసుకోగలం
19. మూర్తిమత్వ అంచనా పరీక్షల్లో మిక్కిలి తరచుగా ఉపయోగించేది?
    1) నిర్ధారణ మాపని
    2) మూర్తిమత్వ శోధిక
    3) ప్రశ్నావళి 4) శోధనా సూచిక
20. విద్యార్థులు సాధారణంగా పరీక్షకు ముందు జ్ఞాపకం ఉంచుకోవడంలో సమస్యల గురించి ఫిర్యాదు చేస్తుంటారు. దీనికి కారణం?
    1) సంఘర్షణ 2) వ్యాకులత
    3) ఏకాగ్రత లోపించడం
    4) ఆసక్తి లోపించడం
21. కింది వాటిలో మూర్తిమత్వ లక్షణం కానిది ఏది?
    1) మూర్తిమత్వాన్ని కలిగి ఉండటంలో వైయక్తిక భేదాలు ఉన్నాయి
    2) మూర్తిమత్వం జీవులందరికి చెందింది
    3) మూర్తిమత్వం వ్యక్తి శారీరక, మానసిక, ఉద్వేగ, సాంఘిక, నైతిక మొదలైన అన్ని అంశాలకు చెందింది
    4) మూర్తిమత్వం గమ్య నిర్దేశకమైంది
22. ఏ రకమైన గృహ వాతావరణంలో పెరిగిన పిల్లలు భద్రతా భావన, స్వావలంబన ప్రవర్తన లాంటి లక్షణాలు కలిగి ఉంటారు?
    1) లొంగి ఉండే తల్లిదండ్రులు
    2) తార్కిక - శాస్త్రీయ దృక్పథం
    3) అతి గారాభం 4) తిరస్కరణ
23. సురేశ్ తరగతి గదిలోనే కాకుండా పరిసరాల్లో కూడా సోమరితనంగా, మందబుద్ధి ఉన్నవాడిగా ప్రవర్తిస్తున్నాడు. ఈ లక్షణానికి కారణం?
    1) థైరాక్సిన్ తీవ్రమవడం
    2) థైరాక్సిన్ లోపించడం
    3) ఎడ్రినలిన్ అధికమవడం
    4) ఎడ్రినలిన్ లోపించడం
24. క్రెటినిజమ్‌కు కారణం?
    1) యవ్వన దశలో థైరాక్సిన్ లోపించడం
    2) యవ్వన దశలో థైరాక్సిన్ అధికమవడం
    3) వయోజన దశలో థైరాక్సిన్ లోపించడం
    4) వయోజన దశలో థైరాక్సిన్ అధికమవడం
25. నిబంధన సహిత, నిబంధన రహిత ప్రతిచర్యలు దేని ఆధీనంలో జరుగుతాయి?
    1) కేంద్రీయ నాడీ వ్యవస్థ
    2) ప్రత్యక్ష నాడీ వ్యవస్థ
    3) స్వయం చోదిత నాడీ వ్యవస్థ
    4) పరిధీయ నాడీ వ్యవస్థ
26. కింది వాటిలో మూర్తిమత్వాన్ని ప్రభావితం చేసే సాంఘిక, సాంస్కృతిక కారకాలకు సంబంధించనిది ఏది?
    1) సామాజిక నియమ నిబంధనలు
    2) వ్యక్తి పెరిగే సమాజంలో ఉపయోగించే భాష
    3) తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల వైఖరులు
    4) నాడీ వ్యవస్థ పనితీరు
27. కింది వాటిలో మూర్తిమత్వ లక్షణం కానిది ఏది?
    1) స్థిరంగా ఉంటుంది
    2) అద్వితీయమైంది, నిరంతరమైంది
    3) జ్ఞానాత్మక, భావవేశ, మానసిక చలనాత్మక అంశాలను కలిగి ఉంటుంది
    4) పొందికైంది, నిరంతరమైంది
28. మానవ మూర్తిమత్వానికి సంబంధించి కింది వాటిలో సరైంది?
    1) అనువంశికత కంటే పరిసరాల ప్రభావం అధికం
    2) పరిసరాల కంటే అనువంశికత ప్రభావం అధికం
    3) అనువంశికత, పరిసరాల ప్రభావం సమానం
    4) అనువంశికత, పరిసరాలతో సంబంధం లేకుండా యాదృచ్ఛికంగా వ్యక్తమవుతుంది
29. కుమార్ అనే ఉపాధ్యాయుడు అలసట కారణంగా విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాడు. కానీ 10వ తరగతి పరీక్షలు దగ్గరపడటం వల్ల పాఠశాలకు హాజరు కావాలనుకుంటున్నాడు. అతడు ఎదుర్కొంటున్న సమస్య?
    1) ఉపగమ - ఉపగమ
    2) ఉపగమ - పరిహార
    3) పరిహార - పరిహార
    4) ద్వి ఉపగమ - పరిహార
30. ఫ్రాయిడ్ పేర్కొన్న ఏ మనో లైంగిక వికాస దశలో తదాత్మీకరణం, అంతర్లీకరణం అనే లక్షణాలు ప్రారంభమవుతాయి?
    1) మౌఖిక దశ 2) ఆసన దశ
    3) శిశ్న దశ 4) గుప్త దశ
31. వ్యక్తిలో సంఘర్షణ ఎప్పుడు ఏర్పడుతుంది?
    1) ఉద్వేగాలకు నిష్క్రియాత్మకంగా ఉన్నప్పుడు
    2) తన లక్ష్యాలతో రాజీపడలేక పోయినప్పుడు
    3) కృత్యాన్ని చేయడానికి సరిపోయే సామర్థ్యం లేనప్పుడు
    4) జీవితంలో అభద్రతను భావించినప్పుడు
32. మానసిక అనారోగ్యం ఉన్న విద్యార్థి లక్షణానికి చెందనిది?
    1) ఆశాజీవనాన్ని కలిగి ఉండటం
    2) మూర్తిమత్వ సంధాన లోపం
    3) సామాజిక అపరిపక్వత
    4) భావోద్రేక అసమతుల్యత
33. వ్యాకులత, కుంఠనాల నుంచి అహాన్ని రక్షించుకోవడానికి ఉపయోగించే వ్యూహాన్ని ఏమంటారు?
    1) అనుగుణ్యత 2) మానసిక ఆరోగ్యం
    3) హేతుకీకరణ 4) రక్షకతంత్రం
34. సర్దుబాటు సామాన్య సంభావ్యత క్రమం ప్రకారం ప్రతి 100 మందిలో:
    1) 33.3% సాధారణ సర్దుబాటు, 33.3% అధిక సర్దుబాటు, 33.3% తక్కువ సర్దుబాటు కలిగి ఉంటారు
    2) 60% సాధారణ సర్దుబాటు, 20% అధిక సర్దుబాటు, 20% తక్కువ సర్దుబాటు కలిగి ఉంటారు
    3) 68% సాధారణ సర్దుబాటు, 16% అధిక సర్దుబాటు, 16% తక్కువ సర్దుబాటు కలిగి ఉంటారు
    4) 50% సాధారణ సర్దుబాటు, 25% అధిక సర్దుబాటు, 25% తక్కువ సర్దుబాటు కలిగి ఉంటారు
35. ఒక సంఘటనకు, ఒక మార్పునకు, ఒక సవాలుకు వ్యక్తి శారీరకంగా, మానసికంగా స్పందించడం?
    1) సంఘర్షణ 2) కుంఠనం
    3) వ్యాకులత 4) ఒత్తిడి
36. రక్షకతంత్రాలకు సంబంధించి సరైంది?
    ఎ) ఎస్ఐ ఉద్యోగం సాధించలేకపోయిన నరేశ్ రీజనింగ్‌ని బోధిస్తూ అనేక మందిని ఎస్ఐలుగా తీర్చిదిద్దడం
    బి) రెవెన్యూలో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ పనిభారం తట్టుకోలేక చిన్న పిల్లవాడిలా ఏడవడం
    సి) విద్యార్థులందరి ముందు ప్రధానోపాధ్యాయుడితో నిందించబడిన కుమార్ ఆ బాధాకర విషయాన్ని మరిచిపోవడం
    1) ప్రక్షేపణం - విస్థాపనం - పరిహారం
    2) విస్థాపనం - ప్రక్షేపణం - దమనం
    3) పరిహారం - ప్రతిగమనం - దమనం
    4) ప్రక్షేపణం - ప్రతిగమనం - దమనం
37. ఉపాధ్యాయుడు దండించిన తర్వాత విద్యార్థిని పిలిచి నీవు బాధపడుతున్నావా అంటే లోపల బాధగా ఉన్న పైకి లేదు అని తెలపడం ఏ రక్షక తంత్రం?
    1) ప్రక్షేపణం 2) దమనం
    3) ఉపసంహరణ 4) ప్రతిచర్యా నిర్మితి
38. ఉపాధ్యాయ బదిలీలో పాల్గొన్న వెంకట నారాయణ ఇంటికి దూరమైనా ఇష్టమైన ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు వెళ్లాలా లేదా ఇంటికి దగ్గర ఉన్న ఇష్టం లేని తెలుగు మాధ్యమ పాఠశాలకు వెళ్లాలా నిర్ణయించుకోలేని పరిస్థితి. ఈ సంఘర్షణ?
    1) ఉపగమ-ఉపగమ సంఘర్షణ
    2) పరిహార - పరిహార సంఘర్షణ
    3) ఉపగమ - పరిహార సంఘర్షణ
    4) ద్వి ఉపగమ - పరిహార సంఘర్షణ

సమాధానాలు

1) 4	2) 4	3) 1	4) 2	5) 4
6) 2	7) 4	8) 4	9) 4	10) 4
11) 2	12) 2	13) 4	14) 3	15) 1
16) 2	17) 4	18) 4	19) 3	20) 2
21) 2	22) 2	23) 2	24) 1	25) 3
26) 4	27) 1	28) 1	29) 2	30) 4
31) 2	32) 1	33) 4	34) 3	35) 4
36) 3	37) 4	38) 4		

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ-మెయిల్ sakshieducation@gmail.com

ఏది ముందుగా భూమిని చేరుతుంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం



ద్రవ పదార్థాలు

పీడనం (PRESSURE)

ప్రమాణ వైశాల్యంపై ప్రయోగించే బలాన్ని పీడనం అంటారు.

పీడనం $P = \frac{F}{A}$

ప్రమాణాలు:

1. డైన్ / సెం.మీ.^{2}
2. న్యూటన్ / మీ^{2}
3. 1 పాస్కల్
4. BAR
5. TORR

- ఒక ప్రవాహిని వల్ల (ద్రవాలు, వాయువులు) కలిగే పీడనం P = hdg
  - h → ప్రవాహి ఎత్తు
  - d → ప్రవాహి సాంద్రత
  - g → భూమి గురుత్వ త్వరణం
- ఒక వస్తువుతో కలిగించే పీడనం, దాని వైశాల్యాని(అడ్డుకోత వైశాల్యం)కి విలోమానుపాతంలో ఉంటుంది.

$P \propto \frac{1}{A}$

కాబట్టి వస్తువుల అడ్డుకోత వైశాల్యం తగ్గితే వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.

ఉదాహరణ:

- కత్తి, కత్తెరల అంచులను సునుపుగా తయారు చేయడం వల్ల వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.
- సూది, దబ్బనం, గడ్డపార, మేకు, మొదలైన వాటి అడ్డుకోత వైశాల్యాలను తగ్గించడం వల్ల వీటి వలన కలిగే పీడనం ఎక్కువగా ఉంటుంది.
- మానవుడు నేల మీద నిలుచున్నప్పుడు అధిక పీడనాన్ని కలుగజేస్తాడు.
- వెడల్పైన పాత్రలో ఉండే ద్రవాన్ని పొడవైన, తక్కువ వ్యాసం ఉన్న పాత్రలో పోసినప్పుడు ద్రవస్తంభ పొడవు పెరగడంతో ఆ ద్రవం వల్ల కలిగే పీడనం కూడా పెరుగుతుంది.
- సమాన ఘనపరిమాణం ఉన్న మూడు భిన్న పాత్రల్లో వరసగా పాదరసం (Hg), నీరు (H_2O), ఆల్కహాల్ నింపారు. వీటిలో పాదరస సాంద్రత, నీటిసాంద్రత కంటే ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటి సాంద్రతలు ఆల్కహాల్ సాంద్రత కంటే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పాదరసం వల్ల కలిగే పీడనం ఎక్కువగా, నీటి పీడనం తక్కువగా, ఆల్కహాల్ పీడనం కనిష్ఠంగా ఉంటాయి.

భారమితి

ఒక ప్రదేశంలో ఉండే వాతావరణ పీడనాన్ని కొలవడానికి భారమితిని ఉపయోగిస్తారు. దీన్ని టారిసెల్లీ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

పనిచేసే విధానం:

భారమితి ఎత్తు 100 సెం.మీ., వ్యాసం 1 సెం.మీ. దీనిలో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

- సాధారణ వాతావరణ పీడనం పాదరస మట్టం 76 సెం.మీ. లేదా 760 మి.మీ.

ఫలితాలు:

- ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే రాబోయే తుపాన్‌ను, క్రమక్రమంగా తగ్గితే రాబోయే వర్షాన్ని సూచిస్తుంది.
- భారమితిలో తగ్గిన పాదరస మట్టం క్రమక్రమంగా పెరిగితే అక్కడ మారిన వాతావరణ పరిస్థితులు తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయని అర్థం.
- భారమితి ఎత్తు, దానిలో ఉపయోగించే ద్రవ సాంద్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.

P = hdg

$\frac{P}{d} = hg \quad \therefore h \propto \frac{1}{d}$

- ద్రవ సాంద్రత తగ్గితే భారమితిలోని ద్రవ మట్టం పెరుగుతుంది.

నోట్: ఇంక్ ఫిల్లర్స్, గాలిపంపులు, స్ట్రాలు వాతావరణ పీడనాన్ని అనుసరించి పనిచేస్తాయి.

1. పర్వతాలు ఎక్కినప్పుడు ముక్కు నుంచి రక్తం కారడం, వాంతులు కావడానికి ప్రధాన కారణం.. వాతావరణ పీడనం కంటే రక్తపీడనం ఎక్కువగా ఉండటం.
2. విమానాల్లో ప్రయాణించేటప్పుడు బాల్‌పెన్‌లోని ఇంక్ బయటకి రావడానికి కారణం- వాతావరణ పీడనం కంటే పెన్నులోని పీడనం ఎక్కువగా ఉండటం.

నోట్:

1. పాదరసం సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల దానితో పనిచేసే భారమితి ఎత్తు 1 మీ. ఉంటుంది.
2. నీటితో పనిచేసే భారమితి ఎత్తు నీటి సాంద్రతను బట్టి 10 మీ. నుంచి 11 మీ. ఉంటుంది. ఆల్కహాల్‌తో పనిచేసే భారమితి ఎత్తు 13.6 మీటర్లు.
3. ప్రయోగశాలలో ఉపయోగించే ఫోర్టీన్ (FORTINE) భారమితి ఎత్తు 80 సెం.మీ., దీనిలో పాదరసం వాడతారు.
4. అనార్ద్ర భారమితిలో ఉండే వివిధ పరికరాలన్నీ ఘన స్థితిలో మాత్రమే ఉంటాయి.

బాయిల్ నియమం

స్థిరమైన ఉష్ణోగ్రత వద్ద నియమిత ద్రవ్యరాశి ఉన్న వాయువు ఘనపరిమాణం, దానిపై ప్రయోగించిన పీడనానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$V \propto \frac{1}{P}$

ఉదాహరణ:

1. నీటి అడుగు భాగంలో ఉండే గాలి బుడగ ఉపరితలం పైకి చేరినప్పుడు గాలిపై నీటి వల్ల కలిగే పీడనం ఉండదు. కాబట్టి గాలి బుడగపై పనిచేస్తున్న పీడనం తగ్గడం వల్ల దాని ఘనపరిమాణం పెరుగుతుంది.
2. భూమి ఉపరితలం నుంచి పైకి వెళ్లే బెలూన్‌పై ఉండే వాతావరణ పీడనం తగ్గడం వల్ల ఆ బెలూన్ పరిమాణం పెరుగుతుంది.
3. చంద్రుడిపై ఎలాంటి వాతావరణం లేదు. కాబట్టి అక్కడ బెలూన్ పైకి ఎగరదు.

పాస్కల్ నియమం

ఒక ప్రవాహినిపై కలిగించే పీడనం అన్ని వైపులా సమానంగా విభజితమవుతుంది.

అనువర్తనాలు:

1. బట్టలు, కాగితాలను అదిమి పట్టడానికి ఉపయోగించే 'బ్రామాప్రెస్' సాధనం పాస్కల్ నియమం ఆధారంగా పనిచేస్తుంది.
2. వ్యవసాయ రంగంలో ఉపయోగించే స్ప్రేయర్ ఈ నియమం ఆధారంగా పనిచేస్తుంది. ఈ సాధనాన్ని ఉపయోగించి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తారు.
3. హైడ్రాలిక్ బ్రేకులు, హైడ్రాలిక్ పంపులు, హైడ్రాలిక్ క్రేన్లు, టిప్పర్లు, సాధనాలు, ఎయిర్ బ్రేక్‌లు పాస్కల్ నియమం ఆధారంగానే పనిచేస్తాయి.

స్నిగ్ధత వివరణ

- సమాన ద్రవ్యరాశులు ఉన్న పక్షి ఈక, ఒక రాయిని ఒకే ఎత్తు నుంచి జారవిడిచినప్పుడు, ఆ రాయి వాతావరణంలోని స్నిగ్ధతా బలాలను తొందరగా అధిగమించడం వల్ల ఈక కంటే ముందుగా భూమిని చేరుతుంది. ఒకవేళ ఈ రెండు వస్తువులను ఒకే ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు అవి రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి. కారణం.. శూన్యంలో ఎలాంటి స్నిగ్ధతా బలాలు ఉండవు.
- అన్ని ద్రవ పదార్థాల కంటే గ్రీజు స్నిగ్ధత స్థానం ఎక్కువగా ఉంటుంది. తేనె స్నిగ్ధత కూడా ఎక్కువగా ఉంటుంది.

నోట్ :

1. స్నిగ్ధత.. పీడనంపై ఆధారపడుతుంది.
2. ఉష్ణోగ్రత పెరిగితే వాయువుల స్నిగ్ధత పెరుగుతుంది.
3. ఉష్ణోగ్రత పెరిగితే ద్రవాల స్నిగ్ధత తగ్గుతుంది.
4. గాలిలో ఉన్న స్నిగ్ధతా బలాల కంటే నీటిలోని స్నిగ్ధతా బలాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఒక వస్తువు భారం గాలిలో కంటే నీటిలో తక్కువగా ఉంటుంది.

స్నిగ్ధత మారడానికి కారణాలు

- ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు ద్రవాణువుల మధ్య ఉండే సంసంజన బలాలు బలహీనపడి స్నిగ్ధత తగ్గిపోతుంది.
- వాయువులను వేడిచేసినప్పుడు వాటి అనుచలనం పెరిగి అవి పరస్పరం ఒకదానికి మరొకటి దగ్గరగా రావడంతో స్నిగ్ధత బలం పెరుగుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జతపరచండి.

i. బలం	1. పాయిజ్
ii. ప్రచోదనం	2. పాస్కల్
iii. స్నిగ్ధత	3. న్యూటన్
iv. పీడనం	4. న్యూటన్ - సెకన్

	i	ii	iii	iv
ఎ)	1	2	3	4
బి)	3	4	1	2
సి)	2	1	4	3
డి)	4	3	2	1

2. తలతన్యత అనువర్తనం.
   1. వేడి ఆహారం చల్లని ఆహారం కంటే రుచిగా ఉండడం
   2. వర్షం చినుకులు, సబ్బు బుడగ, పాదరస బిందువులు గోళాకారంలో ఉండడం
   3. రంగులు, ల్యూబ్రికెంట్ సులభంగా విస్తరించడానికి అవసరం
   4. నిలకడగా ఉన్న నీటిపై దోమలు స్వేచ్ఛగా చలించడం

   ఎ) 2, 4 బి) 2 మాత్రమే సి) 2, 3, 4 డి) అన్నీ
3. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈక, 100 గ్రాముల రాయిని భూమికి 200 మీటర్లు ఎత్తు నుంచి ఒకేసారి జారవిడిచినప్పుడు వాతావరణ పొరలోని స్నిగ్ధతా బలాల వల్ల అవి....
   ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
   బి) రాయి ముందుగా భూమి చేరుతుంది
   సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
   డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు
4. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈకను 100 గ్రా. రాయిని 200 మీ. ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు...
   ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
   బి) రాయి ముందుగా చేరుతుంది
   సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
   డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు
5. కింది వాటిలో సరైనది.
   1. ద్రవాల తలతన్యత ఉష్ణోగ్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.
   2. సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ప్రతి ద్రవం తలతలన్యత శూన్యం.

   ఎ) 1 సరైనది, 2 తప్పు
   బి) 1 తప్పు, 2 సరైనది
   సి) రెండూ సరికావు డి) రెండూ సరైనవే
6. నిలకడగా ఉన్న నీటిపై కిరోసిన్‌ను వెదజల్లినప్పుడు దేనిలో మార్పు జరిగి దోమల గుడ్లు, లార్వాలు మునుగుతాయి.
   ఎ) నీటి తలతన్యత తగ్గడం
   బి) నీటి తలతన్యత పెరగడం
   సి) నీటి స్నిగ్ధత పెరగడం
   డి) నీటి స్నిగ్ధత తగ్గడం
7. కేశనాళికీయత అనువర్తనం కానిది
   ఎ) కిరోసిన్ స్టవ్, దీపం, మైనం క్యాండిల్ పనిచేయడం
   బి) ఇసుక నేలలు తేమగా ఉండడం
   సి) ఎడారుల్లో ఒయాసిస్‌లు ఏర్పడటం
   డి) మొక్కలు దారువు ద్వారా పీల్చుకున్న నీరు పైకి ఎగబాకడం
8. జతపరచండి. (పదార్థాలు- స్పర్శకోణం)

i. పాదరసం	1. 0°
ii. స్వచ్ఛమైన నీరు	2. 8° - 9°
iii. వెండితో నీరు	3. 90°
iv. సాధారణ నీరు	4. 135° - 140°

	i	ii	iii	iv
ఎ)	2	3	4	1
బి)	4	1	3	2
సి)	1	4	2	3
డి)	3	2	1	4

9. 1. ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే అది తుపాను రాకను సూచిస్తుంది.
   2. పాదరస మట్టం క్రమంగా తగ్గితే రాబోయే వర్షసూచనను తెలుపుతుంది.

   ఎ) 1, 2 సరైనవి బి) రెండూ తప్పు
   సి) 1 సరైనది, 2 తప్పు
   డి) 1తప్పు, 2 సరైనది
10. జలాంతర్గామి పనిచేయడంలో ఉపయోగించే సూత్రం?
    ఎ) బాయిల్ నియమం
    బి) పాస్కల్ నియమం
    సి) బెర్నౌలీ నియమం
    డి) ఆర్కిమిడిస్ ప్లవన సూత్రం
11. నదిలో ప్రయాణిస్తున్న ఓడ సముద్రజలాల్లోకి ప్రవేశించినప్పుడు ఓడ మట్టం పెరుగుతుంది. కారణం?
    ఎ) సముద్ర నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
    బి) నది నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
    సి) నది నీటి సాంద్రత తక్కువగా ఉండటం
    డి) సముద్ర నీటి సాంద్రత తక్కువగా ఉండటం
12. టారిసెల్లీ కనుగొన్న భారమితి దేన్ని కొలుస్తుంది?
    ఎ) సాంద్రత బి) వాతావరణ పీడనం
    సి) స్నిగ్ధత డి) నీటి అసంగత వ్యాకోచం
13. నీటిలో తేలే మంచు కరిగితే, నీటిమట్టం?
    ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
    సి) పెరిగి తగ్గుతుంది డి) మారదు
14. ప్రెషర్ కుక్కర్‌లో పదార్థాలు త్వరగా ఉడుకుతాయి. ఎందుకు?
    ఎ) ఉష్ణం తగ్గడం వల్ల
    బి) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
    సి) నీటి బాష్పీభవన స్థానం పెరగడం వల్ల
    డి) నీటి బాష్పీభవన స్థానం తగ్గడం వల్ల

సమాధానాలు

1) బి 2) డి 3) బి 4) ఎ 5) డి 6) ఎ 7) బి 8) బి 9) ఎ 10) డి 11) డి 12) బి 13) డి 14) సి

MODEL QUESTIONS

What is the FIRST sentence after rearrangement?



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q.No.1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Entrepreneurs, who have dealt with multiple government agencies, (1)/ also felt that there are too many government bodies that play an active role in the journey of a company and, (2)/ more often than not, it only complicates the operations of the company (3)/ while increasing the compliance costs manifold. (4)/ No error (5)
2. The Comptroller and Auditor General (CAG), in its first ever audit of the Goods and Services Tax, (1)/ has said the government had failed (2)/ to trying out the system before its rollout, (3)/ leading to inadequate compliance mechanisms, and lower tax revenues. (4)/ No error (5)
3. The accumulated toxins in our body (1)/ did not just affect our physical being (2)/ but also have adverse effect (3)/ on our mental faculties. (4)/ No error (5)
4. One needs to acquire many talent (1)/ and master plenty of disciplines (2)/ to make a profitable (3)/ and reputed business. (4)/ No error (5)
5. Hundreds of doctors and medicos staged dharnas (1)/ and taking out rallies in Andhra Pradesh (2)/ to register their protest (3)/ against the National Medical Council Bill. (4)/ No error (5)

Directions: (Q.No. 06-10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The appropriate atmospheric conditions made it feasible for the astronomers to see the stars <u>and they could even distinguish the sizes.</u>
   1) and even distinguish the sizes
   2) and they were even distinguishing the sizes
   3) and he could even distinguish the size
   4) and even distinguishing the sizes
   5) no correction required
7. Get out of the building! <u>It sound like the generator is going to explode.</u>
   1) It is sounding like the generator is going to explode
   2) It sounds like the generator is going to explode
   3) It sounds like generator exploded
   4) it sounded like generator explosion
   5) no correction required
8. <u>A belief in superstitious people is that</u> birth marks are the signs of influence on the mother before childbirth.
   1) A belief in superstitious people that
   2) Superstitious people beliefs are that
   3) Among superstitious people the beliefs is that
   4) Superstitious people believe that
   5) no correction required
9. Tonight I am going to check that <u>Ramesh will do his homework correctly.</u>
   1) Ramesh must be doing his homework correctly
   2) Ramesh shall do his homework correctly
   3) Ramesh does his homework correctly
   4) Ramesh did his homework correct
   5) no correction required
10. People working in high position in companies <u>tend to shifting their work</u> burden by delegating tasks to their subordinates.
    1) tend for shifting their work
    2) tend to shift their work
    3) tend as to shifting their work
    4) tended to shift his work
    5) no correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences(A), (B), (C),(D),(E) and(F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) There are about four hundred old stone bridges joining the island of Venice.
B) Venice is a strange and beautiful city in the north of Italy.
C) It is not an island but a hundred and seventeen islands.
D) These small islands are near one another.
E) This is because Venice has no streets.
F) In this city there are no motor cars, no horses and no buses.

11. What is the FIRST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
12. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
13. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
14. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E

Directions (Q.No.16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Countries which_____ still undergoing the economic processes ____ known as developing countries.
    1) were, are 2) are, were
    3) are, are 4) is, are 5) are, is
17. There are many textile producing mills in the market that _____ with each _____ to gain the largest share of the market.
    1) fight, person 2) compete, other
    3) Compare, contestants
    4) Clash, individual
    5) Struggle, another
18. As per the recent ethical rules _____ down by National Institute of Health, diseases which cannot be treated _____ would qualify for treatment involving human gene manipulation.
    1) Lay, dangerous
    2) Produced, similar
    3) Laid, alternatively
    4) Identified, uncommon
    5) Framed, fast
19. In the first ten years after the____ of the UGC Act, eight institutions were granted deemed university status.
    1) implification 2) enactment
    3) Statement 4) Forming 5) issue
20. But each attempt ended in _____ failure, just as such attempts have _____ all over the world including Britain and the US.
    1) gloomy, ended
    2) Spectacular, tremendous
    3) Intense, intensified
    4) Dismal, failed
    5) Abysmal, aroused

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The most **avid** users of social-networking websites may be exhibitionist teenagers, but when it comes to more grown-up use by business people, such sites have a surprisingly long **pedigree**. LinkedIn, an online network for professionals that signed up its ten-millionth user this week, was launched in 2003, a few months before MySpace, the biggest of the social sites. Consumer adoption of social networking has grabbed most attention since then. But interest in the business uses of the technology is rising. Many companies are attracted by the marketing opportunities offered by community sites. But the results can be painful. Pizza Hut has a profile on MySpace devoted to a pizza-delivery driver called Ted, who helpfully lets friends in on the chain's latest promotional offers ("Dude, I just heard some scoop from the Hut," ran one recent post). Wal-Mart started up and rapidly closed down a much-derided teenage site called The Hub last year. Reuters hopes to do better with its forthcoming site for those in the financial-services industry. Social networking has proved to be of greatest value to companies in recruitment. Unlike a simple jobs board,social networks enable members to pass suitable vacancies on to people they know, and to refer potential candidates back to the recruiter. So employers reach not only active jobseekers but also a much larger pool of passive candidates through referrals. LinkedIn has over 350 corporate customers which pay up to $250,000 each to advertise jobs to its expanding network. Having lots of people in a network increases its value in a "super-linear" fashion, says Reid Hoffman, LinkedIn's founder. He says corporate use of his service is now spreading beyond recruiters: hedge funds use it to identify and contact experts, for example. This technique is also gathering momentum in "knowledge management". IBM recently unveiled a social-software platform called Lotus Connections, due out in the next few weeks, that lets company employees post detailed profiles of themselves, team up on projects and share bookmarks.

21. Why does the author call "Lotus Connections" a social software platform?
    1) Because it is used for knowledge management
    2) It has a feature to allow employees to interact and cooperate with each other
    3. Because IBM developed it
    4. Because the service team can get in touch with the right engineers using it
22. What meaning of avid could you infer from the passage?
    1) Dormant 2) Unprincipled
    3) Unwanted 4) Enthusiastic
    5) Hibernate
23. What is the most probable context in which the author is talking about Pizza Hut?
    1) Social Networking did not benefit it
    2) Social Networking was a big success for it
    3) Social Networking created problems for it
    4) any of the above
    5) none of the above
24. Which of the following statement is true?
    1) LinkedIn's rich pool of corporate customers scarcely add weightage to its expanding network.
    2) Social networks enable members to pass suitable vacancies on to people they know, and to prefer potential candidates back to the recruiter.
    3) Employers have a ready to use database of selected candidates.
    4) Social networks help the recruiters in providing the information about potential candidates.
    5) Interest in the business uses of the technology is alarming
25. The meaning of pedigree in this context is
    1) It is a rare breed
    2) It is a food used for pet animals
    3) It means full of rage
    4) To derive something
    5) A lineage

Directions (Q.No. 26-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropria-tely. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Although foetal sex determination and sex selection is ____(26) offence in India, the practice is _____(27). Private clinics with ultrasound machines are doing _____ (28) business. Everywhere, people are paying to _____ (29) the sex of the unborn child, and paying more to abort the female child. The technology has reached even remote places through mobile clinics. Dr. Puneet Bedi obstetrician and specialist in foetal medicine, says these days he _____ (30) sees a family with two daughters. People are getting the sex determination even for the first child, he says.

26. 1) an 2) a 3) purely 4) truly 5) the
27. 1) vibrant 2) rampant 3) colorful 4) animated 5) alive
28. 1) brisk 2) hurry 3) slow 4) rare 5) vital
29. 1) understand 2) estimate 3) alter 4) know 5) change
30. 1) rare 2) scare 3) hard 4) hardly 5) almost

KEY

1) 2 2) 3 3) 5 4) 1 5) 2
6) 2 7) 2 8) 4 9) 5 10) 2
11) 2 12) 3 13) 3 14) 1 15) 5
16) 3 17) 2 18) 3 19) 1 20) 4
21) 2 22) 4 23) 2 24) 4 25) 5
26) 1 27) 2 28) 1 29) 4 30) 4

సాక్షి ప్లస్
సోమవారం । 9-9-2024



సింగ్‌నగర్‌లోని ఒక వీధిలో నీటిలో తేలియాడుతున్న పరుపులు, ఇతర వ్యర్థాలు



వాంబేకాలనీ యార్డు రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం



సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ పక్క రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం

మట్టి మేటల తొలగింపునకు పాట్లు

- కూలీలతో శుభ్రం చేయించుకుంటున్న వరద బాధితులు
- ఒక్కో ఇంటికి రూ.15 వేల చొప్పున చెల్లింపు
- ఒక్కో ఇంటికి గంటల కొద్దీ సమయం తీసుకుంటున్న ఫైరింజన్లు
- వాటితో లాభం లేదని కూలీలనాశ్రయిస్తున్న ఇళ్ల యజమానులు



వరద నీటిలోని చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తున్న స్థానికులు

విజయవాడస్పోర్ట్స్/కృష్ణలంక(విజయవాడ తూర్పు): వరద ప్రభావంతో ఇళ్లల్లో మేటలు వేసిన మట్టిని తొలగించేందుకు వరద బాధితులు నానా కష్టాలుపడుతున్నారు. అగ్నిమాపక వాహనాలు అందరికీ అందుబాటులోకి రాకపోవడంతో ఇళ్ల యజమానులు కూలీలను ఆశ్రయిస్తున్నారు. వరద నీటిలో తడిసి ముద్దయిన సామాన్లను బయట పడేసేందుకు, ఇంట్లోని మేటను పూర్తిగా తొలగించి శుభ్రం చేసేందుకు రూ.15 వేలు దాకా చెల్లించాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. అగ్నిమాపక వాహనాలు కేటాయించిన ప్రాంతాల్లోని ఇంటి యజమానులు కూడా నగదు చెల్లించి ఇళ్లను శుభ్రం చేయించుకుంటున్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లలో మేట వేసిన మట్టిని తొలగించేందుకు 120 అగ్నిమాపక వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. ముందుగా విజయవాడ వెస్ట్, సెంట్రల్ నియోజకవర్గాల 32 డివిజన్లలోని ఇళ్లలోని మేటను తొలగించేందుకు.. డివిజన్‌కు నాలుగు చొప్పున కేటాయించారు. ఒక్కో ఇంటిని శుభ్రం చేసేందుకు సుమారు మూడు గంటలకు పైనే సమయం పడుతోంది. రోజుకు నాలుగైదు ఇళ్లను మాత్రమే శుభ్రం చేయగలుగుతున్నారు. ఇలాగైతే నెల రోజులైనా పని పూర్తికాదని సిబ్బంది చెబుతున్నారు. విజయవాడ రూరల్‌లోని మైలవరం, గన్నవరం నియోజకవర్గాల్లోని పంచాయతీలకు ప్రభుత్వం అగ్నిమాపక వాహనాలను కేటాయించలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ఇళ్ల యజమానులు కూలీల కోసం ఎదురు చూస్తున్నారు.

నత్తనడకన పారిశుద్ధ్య పనులు

వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏ వీధిలో చూసినా ఇళ్ల ముందు చెత్తాచెదారం, వ్యర్థాలు పెద్ద ఎత్తున కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య పనుల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బందికి ఎక్కడ పనిచేయాలో తెలియక తికమకపడుతున్నారు. వారికి దిశానిర్దేశం చేయాల్సిన స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఎక్కడికక్కడ పారిశుద్ధ్యం క్షీణిస్తుండటంతో స్థానికులే తమ ఇళ్ల ముందు నిలిచిన చెత్త, వ్యర్థాలను తొలగించుకుంటున్నారు. సింగ్‌నగర్‌లోని లూనా సెంటర్, వాంబే కాలనీలోని పలు వీధుల్లో వరద నీటికి యూజీడీ మురుగునీరు తోడవడంతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. రోడ్లపై బురద, మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



భరతమాతకాలనీలో ఓ ఇంటిని శుభ్రంచేసేందుకు వచ్చిన ఫైర్ ఇంజన్

రూ.15 వేలు అడిగారు



మా ఇంటి సందులోనే ఓ ఇంటిని ఫైర్ ఇంజన్ శుభ్రం చేస్తోంది. ఆ ఇల్లు అయిన తర్వాత మా ఇంటిని శుభ్రం చేయాలని కోరాం. రెండు రోజుల టైం పడుతుందని చెబితే.. వెంటనే కూలీలను పిలిపించాం. సమాన్లు మొత్తం బయటకు తేవడానికి రూ.7 వేలు అడిగారు. ఆ తర్వాత ఇంటిని శుభ్రం చేయడానికి రూ.8 వేలు అడిగారు.

– చారుహాసిని, ఖుశ్వంత్(అన్నాచెల్లెలు), నందమూరినగర్

ఫైర్ ఇంజన్ రావడం లేదు



ఇంటిని శుభ్రం చేసేందుకు ఫైర్ ఇంజన్ రావడం లేదు. కూలీల ఖర్చు భరించలేక మేమే రోజుకో గది చొప్పున శుభ్రం చేసుకుంటున్నాం. వస్తువులన్నీ నీటిలో తడిసిపోవడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. ఇంటి ముందున్న రోడ్డుపై ప్రవహించే మురికి నీటితోనే శుభ్రం చేయడంతో గదులన్నీ మళ్లీ మురికిగానే కనిపిస్తున్నాయి.

– వెంకటనారాయణరావు, కృష్ణవేణి దంపతులు, భరతమాతకాలనీ

అంటువ్యాధులు ప్రబలుతాయి



నేను లూనా సెంటర్‌లో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నా. వరదలు రాకముందే ఈ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపించాయి. వారం రోజులుగా ఈ ప్రాంతమంతా వరదకు మునిగిపోయింది. వరద ప్రవాహానికి చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు, యూజీడీ మురుగునీరు వచ్చి ఇళ్ల ముందు నిలిచిపోయాయి. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో భరించలేనంత దుర్వాసన వెదజల్లుతోంది. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి త్వరగా పారిశుద్ధ్య పనులు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.

– సురేష్, లూనా సెంటర్, సింగ్‌నగర్

శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదు



వరద ప్రవాహానికి చెత్తాచెదారం కొట్టుకువచ్చి మా ఇంటి ముందు నిలిచిపోయింది. శానిటేషన్ సిబ్బంది పూర్తిగా నీరు లేని ప్రాంతాల్లో మాత్రమే పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. నీటిలో తేలుతున్న వ్యర్థాలను తొలగించడం లేదు. రెండు రోజులుగా మా ఇంటి ముందే పరుపులు, ఇతర వ్యర్థాలు ఉన్నా వాటిని తొలగించేందుకు ఎవరూ రాలేదు. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో భరించలేకపోతున్నాం. ఎవరికీ చెప్పాలో అర్థంకాక చివరికి మేమే తొలగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బి.గిరిబాబు, గంగానమ్మగుడి రోడ్డు, సింగ్‌నగర్

వీడని వరద.. తప్పని తిప్పలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని పాయకాపురం, రాధానగర్, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో ఎనిమిది రోజులు గడిచినా వరద వీడకపోవటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ మోకాలిలోతు నీటిలో తాగునీరు, ఆహారం కోసం అలమటిస్తున్నారు. ప్రధాన రోడ్లపై తాగునీరు, ఆహారం అందిస్తున్నారనే సమాచారంతో తాము వరద నీటిలో అక్కడికి చేరుకునే సరికే వారూ వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కట్టుబట్టలతో మిగిలాం

స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వరద నీరు మా ఇంటి మీదుగా ప్రవహించటంతో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాం. ఒక్కసారిగా వచ్చిన వరదతో మా ఇంటికి సమీపంలోని స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ మా ఇళ్లమీదుగా ప్రవహించింది. నీటి ప్రవాహానికి ఇంట్లోని వస్తువులు, తలుపులు కొట్టుకుపోయాయి. కనీసం తాగేందుకు నీరు, తినేందుకు తిండి లేక నానా యాతన పడ్డాం. స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు సక్రమంగా పూర్తి చేసి ఉంటే మా ఇంటికి ఈ దుస్థితి కలిగేది కాదు. ఎప్పుడు వరద నీరు తగ్గుతుందా అని కాలం వెళ్లదీస్తున్నాం.

– ఆర్.రోహిణీ దేవి, రాధానగర్

తాగునీరు కూడా ఇవ్వడం లేదు



రాజీవ్‌నగర్‌లో ఇప్పటికీ మోకాలి లోతు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మా వద్దకు వచ్చి కనీసం తాగునీరు కూడా అందించటంలేదు. మేమే వరద నీటిలో కట్టమీదకు వచ్చి తాగునీరు, ఆహారం తీసుకుంటున్నాం. మరోవైపు వరద నీటిలో విషసర్పాల సంచారం అధికంగా ఉంది. రాత్రి నేను రెండు పాములను కొట్టాను. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాం.

– ఎస్‌కే ఘనీ, రాజీవ్‌నగర్

దొంగల భయం అధికం



వారం రోజులుగా వరద నీటిలో అవస్థలు పడుతున్నాం. మరో వైపు మాకు దొంగల భయం అధికంగా ఉంది. రాత్రి పూట తలుపులు కొడుతున్నారు. అలాగే అందిన కాడికి పట్టుకుపోతున్నారు. ఇక్కడంతా చీకటిగా ఉండటంతో భయంగా ఉంటోంది.

– పి.నాగరాజు, రాజీవ్‌నగర్

వారం రోజులుగా గుడారంలోనే ఉన్నాం



రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబం, ఆదివారం ఒక్కసారిగా వచ్చిన వరదతో ఏం చేయాలో పాలుపోలేదు. దీంతో డాబాపై గుడారం వేసుకుని పిల్లలతో కలిసి ఉన్న కొద్దిపాటి నీరు, ఆహార పదార్థాలతో గడిపాం. రెండ్రోజుల పాటు మా వద్దకు ఎవరూ రాలేదు. మూడో రోజు నుంచి తాగునీరు, ఆహారం వచ్చింది. ఇప్పటికీ వరద నీరు పూర్తిగా తగ్గలేదు. దీంతో గుడారంలోనే కాలం వెళ్లదీస్తున్నాం. తాగునీరు ఆహారం కోసం వరద నీటిలో వెళ్లేసరికి వెళ్లిపోతున్నారు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాగే ఇప్పుడు కురుస్తున్న వర్షం వల్ల మరింత భయంగా ఉంది.

– దేవర సత్యవతి, ప్రజాశక్తినగర్, పాయకాపురం

వారం రోజులుగా నీటిలోనే..



వారం రోజులుగా వరద నీటిలోనే ఉన్నాం. నీరు తగ్గలేదు. దీంతో సామాన్లు ఎత్తుగా ఉన్న ప్రదేశంలో పెట్టుకుని నీటిలోనే నివసిస్తున్నాం. ఇంకా ఈ కష్టాలు ఎన్నాళ్లో అర్థం కావడంలేదు. కనీసం మమ్మల్ని పట్టించుకున్న వారే కరువయ్యారు.

– సూర్యనారాయణ, సత్యవతి కుటుంబ సభ్యులు, రాధానగర్

ఇన్ని కష్టాలు పడలేం



వారం రోజులుగా వరద నీటిలో అల్లాడుతున్నాం. వరదలోనే అంట్లు తోముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇన్ని కష్టాలు పడటం కన్నా వరదలో కొట్టుకుపోయినా బాగుండేదని అనిపిస్తుంది. వరద నీరు కొంత తగ్గుముఖం పట్టింది. ఇప్పుడు ఇళ్లు శుభ్రం చేసుకోవాలంటే తలప్రాణం తోకకు వస్తుంది..

– కళ్యాణి, రాధానగర్

తెలంగాణ

నిజమైన పాత్రికేయులకు అండగా ఉంటాం

- పేట్ బషీరాబాద్‌లోని స్థలపత్రాలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి
- వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జర్నలిస్టులకు 70 ఎకరాల భూమి కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: నిజమైన పాత్రికేయులను అగౌరవపరిచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని.. వారికి అన్నివేళలా అండగా ఉంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ (జేఎన్‌జే) సొసైటీకి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కేటాయించిన భూపత్రాలను ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన 'ప్రజాప్రభుత్వంలో పాత్రికేయులు' కార్యక్రమంలో సొసైటీకి సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జేఎన్‌జే సొసైటీలో సభ్యులు కాని ఇతర జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో న్యాయం చేస్తామని చెప్పారు. మీడియా అకాడమీకి ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రకటించారు.

వైఎస్ హయాంలోనే కేటాయింపు

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జేఎన్‌జే సొసైటీకి ఇళ్ల స్థలాల కోసం 70 ఎకరాల భూమిని కేటాయించారు. 2008 మార్చి 25న నిజాంపేట్‌లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాలను జర్నలిస్టుల ఇళ్ల కోసం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. సొసైటీ ఏర్పాటైనప్పుడు మొత్తం 1,105 మంది సభ్యులుగా ఉన్నారు. ఇదివరకే నిజాంపేటలోని 32 ఎకరాల స్థలం సొసైటీ ఆధీనంలో ఉండగా.. పేట్ బషీరాబాద్ స్థలానికి సంబంధించి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పగింత పత్రాలు అందజేశారు. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ స్థలాన్ని కేటాయించడం వల్లనే.. ఇప్పుడు తమకు స్థలాలు వచ్చాయన్న ఆనందాన్ని సమావేశానికి వచ్చిన జర్నలిస్టులు వ్యక్తం చేశారు. వైఎస్ మంచి మనసుతో స్థలాలు కేటాయించినా.. కొందరు జర్నలిస్టుల కారణంగా కోర్టు కేసులతో ఇంతకాలం జాప్యం జరిగిందని వారు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, జేఎన్‌జే నాయకులు కిరణ్‌కుమార్, రవికాంత్‌రెడ్డి, వంశీశ్రీనివాస్, రమణారావు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశమంతా ఉపయోగపడేలా.. పాఠాలు రూపొందిస్తా

- పాఠ్యాంశాలను దీర్ఘకాలం గుర్తుపెట్టుకోవడానికే డిజిటల్ బోధన
- సాంఘిక శాస్త్రంపై అభిరుచిని పెంచేందుకు ఆడియో, వీడియో పాఠాలు
- ఏపీ ఓపెన్ స్కూల్‌కి డిజిటల్ కంటెంట్ సైతం అందించా
- 'సాక్షి' తో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేశ్

గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు తెస్తా..



గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగులకు..

రేణిగుంట (తిరుపతి జిల్లా): సామాజిక అంశాల సంగమమైన సాంఘిక శాస్త్రం బోధనలో విప్లవాత్మక మార్పులకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు కూనాటి సురేశ్ శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ ఎడ్యుకేషన్‌ను అందిపుచ్చుకున్న ఆయన బోధనాభ్యసన ప్రక్రియల్లో కొత్త మార్గానికి బాటలు వేశారు. డిజిటల్ బోధనలో ఆయన అనుసరిస్తున్న పద్ధతులకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందారు. సెప్టెంబర్ 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఇప్పటివరకు ఆయన సేవలకు 18 అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా బోధనాభ్యసన ప్రక్రియలు, డిజిటల్ కంటెంట్, తదితర అంశాలపై కూనాటి సురేశ్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు.. ఆయన మాటల్లోనే..

మాది తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి. అమ్మానాన్న.. పద్మావతమ్మ, మీరయ్య చిరుద్యోగులు కావడంతో నా విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగింది. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చాను కాబట్టి గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించుకున్నాను. దీనికి ఉపాధ్యాయ వృత్తే సరిపోతుందని దీన్ని ఎంచుకున్నాను. ఇదే పట్టుదలతో డీఎస్సీలో ఉద్యోగం సాధించి 2002లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా చేరాను.

గ్రాఫికల్ చిత్రాలతో ఆడియో, వీడియో పాఠాలు

సాంఘిక శాస్త్రంపై విద్యార్థుల్లో అభిరుచిని పెంచేందుకు గ్రాఫికల్ చిత్రాలతో కూడిన ఆడియో, వీడియో పాఠాలను అందరికీ అందుబాటులోకి తెచ్చాను. విద్యార్థులకు ఉపయోగపడుతుందని 2009లోనే http://gurudeva.weebly.com/ను రూపొందించా. అప్పట్లోనే సాంఘిక శాస్త్ర ఇతివృత్త నేపథ్యాలన్నింటినీ పరిశోధించాను. పాఠ్యాంశాలను విద్యార్థులు దీర్ఘకాలం పాటు గుర్తుంచుకునేలా అప్పట్లోనే డిజిటల్ బోధనకు బీజం వేశాను.

మంచి కంటెంట్‌తో పాఠ్యపుస్తకాలు..

నాకు సాంఘిక శాస్త్రంపై ఉన్న పట్టును గుర్తించిన రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) మంచి కంటెంట్‌తో కూడిన పాఠ్యపుస్తకాలను అందించేందుకు అవకాశం ఇచ్చింది. అలాగే ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనలో అనుసరించాల్సిన విధానాలతో కూడిన పాఠ్యాంశ ప్రణాళికలను కూడా రూపొందించాను. కేంద్ర ప్రభుత్వానికి చెందిన దీక్ష వెబ్‌సైట్‌లో కంటెంట్ క్రియేటర్‌గా వ్యవహరిస్తూ దేశంలోని విద్యార్థులందరికీ సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలను సులువైన పద్ధతిలో అందిస్తున్నా. అలాగే అంధ విద్యార్థుల కోసం ఆడియో పాఠాలను సైతం రూపొందించా. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠానికి టెన్త్, ఇంటర్ పాఠ్యపుస్తకాలను తయారుచేసి ఇవ్వడమే కాకుండా డిజిటల్ కంటెంట్‌ను కూడా సిద్ధం చేశా.

ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది..

ప్రతిష్టాత్మక జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడం గొప్ప అనుభూతినిచ్చింది. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. రెండు దశాబ్దాల పాటు నేను పడిన కష్టానికి తగిన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో వీడియో పాఠాలు రూపొందిస్తా. సాంఘిక శాస్త్ర బోధనాభ్యసన ప్రక్రియ దేశంలో గొప్ప స్థాయి రావడానికి కృషి చేస్తా.



మొత్తం 18 అవార్డులు అందుకున్నా..

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఇప్పటివరకు అందించిన సేవలకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొత్తం 18 అవార్డులు అందుకున్నా. 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ ఉత్తమ ఐసీటీ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. ఇంకా ఆంధ్ర రత్నం, గ్లోబల్ బెస్ట్ టీచర్, గురుమిత్ర, జిల్లా స్థాయిలో రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం అందుకున్నా.

సైన్స్ ఉపాధ్యాయురాలైన నా భార్య ప్రోత్సాహంతోనే..

నేను పనిచేస్తున్న హైస్కూల్లోనే నా భార్య శాంతి సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమె అన్ని సమయాల్లోనూ నాకు తోడుగా నిలిచింది. ఆమెతోపాటు అధికారులు, తోటి ఉపాధ్యాయులు నన్ను ప్రోత్సహించారు.